

ఈనాడు



విజయవాడ 12-2-2026 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 183
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru

పునరుద్ధరణ దశ దాటి..


ప్రగతి వైపు పరుగులు

పేదలకు ఏటా రూ.33 వేల కోట్ల నగదు బదిలీ

- అమరావతి శాశ్వత రాజధానిగా కేంద్రం చట్టం
- ఏఐ, క్వాంటమ్‌తో రాష్ట్రానికి ప్రపంచస్థాయి గుర్తింపు
- విద్యుత్ ఛార్జీలు తగ్గించాం
- విశ్వవిపణిలోకి మన ఎగుమతులు
- గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉద్ఘాటన
- ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగం

విధ్వంసం నుంచి వికాసం దిశగా..

> ఎన్టీఆర్ భరోసా కింద 63.12 లక్షల మంది పింఛన్‌దారులు లబ్ధి పొందుతున్నారు. పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన పీ4 కింద లక్ష మందికి పైగా మార్గదర్శులు 10.30 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. స్వయం ఉపాధి చర్యల ద్వారా ఈ ఏడాది లక్ష మంది మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తున్నాం. 1990లలో ఐటీ ద్వారా హైదరాబాద్‌ను గ్లోబల్ హబ్‌గా మార్చినట్లే ఇప్పుడు ఏఐ, క్వాంటమ్ సాంకేతికతతో అమరావతిని ఆ స్థాయికి తీసుకెళ్తున్నాం.



బడ్జెట్ సమావేశాల సందర్భంగా ఉభయ సభలను ఉద్దేశించి మాట్లాడుతున్న గవర్నర్ అబ్దుల్ నజీర్. చిత్రంలో మండలి ఛైర్మన్ మోషేనురాజు, సభాపతి అయ్యన్నపాత్రుడు


ఈనాడు, అమరావతి: 'రాష్ట్ర విభజన విసిరిన సవాళ్లను ఎదుర్కొంటూ పురోగతి వైపు వేస్తున్న అడుగులకు 2019లో ప్రభుత్వ మార్పు ద్వారా విఘాతం కలిగింది. గత ప్రభుత్వ చర్యలతో రాష్ట్రంలో సంక్షోభం ఏర్పడింది. మళ్లీ అధికారంలోకి వచ్చిన ఎన్డీయే.. విధ్వంసం నుంచి ఏపీని పునరుద్ధరించే చర్యలు చేపట్టింది. ఇప్పుడు ఆ దశ కూడా దాటి పురోగతి వైపు స్పష్టమైన, దృఢమైన ప్రయాణాన్ని ప్రారంభించింది. పునర్నిర్మాణం, పునరుద్ధరణ, అభ్యుదయం అనే సంకల్పంతో ముందుకు సాగుతున్నాం' అని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ ఉద్ఘాటించారు. సూపర్ సిక్స్ హామీల అమలు ద్వారా ఏటా రూ.33 వేల కోట్ల నగదును (మిగతా 2లో)

సూటిగా.. సుత్తిలేకుండా..

ఆవు కథలొద్దు.. పూర్తిగా సిద్ధమైరండి

ఎవరేం మాట్లాడుతున్నారో సభలోనే ఉండి గమనిస్తా

ఎన్డీయే శాసనసభాపక్ష భేటీలో సీఎం చంద్రబాబు





కూటమిలో చిచ్చుకు వైకాపా ప్రయత్నం..
అప్రమత్తంగా ఉండాలి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

6లో

11..11..11.. ఇదే వైకాపా లెక్క!

సభలో ఉన్న ఆ కొద్ది నిమిషాలూ రచ్చే

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోడియం వద్దకు పంపిన జగన్, బొత్స

ప్లకార్డులు చింపి గవర్నర్ పైకి విసిరిన పెద్దిరెడ్డి, ఇతర సభ్యులు

సభ ప్రారంభమైన 11 నిమిషాలకే వెనక్కి పిలిపించి నిష్క్రమణ

గవర్నర్ ప్రసంగానికి ఆటంకం.. తొలి రోజు వైకాపా తీరిదీ 6లో

అమెరికాకు పూర్తిగా లొంగిపోయారు

రైతు ప్రయోజనాల పరిరక్షణలో రాజీపడ్డారు




ప్రసంగిస్తున్న రాహుల్ గాంధీ

వాణిజ్య ఒప్పందంపై రాహుల్ నిప్పులు

దేశాన్ని అమ్మింది కాంగ్రెస్: నిర్మలా సీతారామన్

దిల్లీ: మధ్యంతర వాణిజ్య ఒప్పందం ద్వారా కేంద్ర సర్కారు అమెరికాకు పూర్తిగా లొంగిపోయిందని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. భారత ఇంధన భద్రతను టోకుగా అప్పగించేశారని (హోల్‌సేల్‌గా సరెండర్ చేశారని), రైతు ప్రయోజనాల పరిరక్షణలో రాజీపడ్డారని ధ్వజమెత్తారు. అమెరికా మన పీక పట్టుకుని ఉండకపోతే తప్ప.. నరేంద్రమోదీ సహా భారత ప్రధానమంత్రుల్లో ఎవరైనా ఇలాంటి దానికి ఒప్పుకోరని చెప్పారు. మోదీ పీకను వారు (అమెరికా) పట్టుకోవడం వల్లనే ఆయన ఈ వాణిజ్య ఒప్పందంలో భారత ప్రయోజనాలను పణంగా పెట్టి లొంగిపోయారని విమర్శించారు. యుద్ధవిద్యల్లో ముందుగా ఇలాగే పట్టుసాధించి, ఆ తర్వాత మెడ బిగించి, ప్రత్యర్థి చేతులెత్తేసేలా చేస్తారని వివరించారు. లోక్‌సభలో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై చర్చలో రాహుల్ పాల్గొని ప్రసంగించారు. "అమెరికాతో వాణిజ్య ఒప్పందం అమల్లోకి వస్తే, (మిగతా 2లో)

గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలపై సిట్



రాష్ట్రానికి వెలుపల ఉన్న ఫోరెన్సిక్ ల్యాబ్ నిపుణుల సహకారం తీసుకోండి


జవాబుపత్రాలు తారుమారు చేశారో.. లేదో తేల్చండి

మార్చి 16లోపు నివేదిక ఇవ్వాలని సిట్‌కు హైకోర్టు స్పష్టీకరణ

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో ఏపీపీఎస్సీ నిర్వహించిన గ్రూప్-1 ప్రధాన పరీక్ష మూల్యాంకనంలో అవకతవకలు, అక్రమాల నిగ్గు తేల్చేలా హైకోర్టు కీలక ఉత్తర్వులు జారీచేసింది. వాస్తవాలను తేల్చేందుకు ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని(సిట్) ఏర్పాటుచేయాలని రాష్ట్రప్రభుత్వాన్ని ఆదేశించింది. లేదా ఇప్పటికే ఉన్న సిట్‌ను పునర్నిర్మించాలని స్పష్టం చేసింది. అదనపు డైరెక్టర్ జనరల్(డీజీ) హోదాకు తగ్గని అధికారి సిట్‌కు నేతృత్వం వహించాలని తేల్చిచెప్పింది. సిట్ సభ్యుల వివరాలను మూడు రోజుల్లో రిజిస్ట్రార్ జ్యుడిషియల్‌కు అందజేయాలని అడ్వొకేట్ జనరల్(ఏజీ)కి తెలిపింది. సిట్‌ను ప్రతివాదిగా చేర్చాలని (మిగతా 2లో)

లోపలి పేజీల్లో

ఇదీ సంగతి!




సరే అయితే! గతంలో కంటే కాస్త తగ్గించి ఇవ్వు!!

కొరియర్ వ్యాపారి, ఆఫీస్ బాయ్, ఎలక్ట్రికల్ దుకాణం సేల్స్‌మన్, కిరాణా షాపు వ్యక్తి

వీరంతా డైరెక్టర్లు

పదుల కొద్దీ డొల్ల కంపెనీలు



- వాటిలోకి మద్యం ముడుపుల సొమ్ము మళ్లింపు
- రూ.77.55 కోట్లు జమచేసిన అదాన్, లీలా, ఎస్‌పీవై డిస్టిలరీలు
- బహుళ అంచెల్లో అందజేత
- అనుబంధ అభియోగపత్రంలో వెల్లడించిన సిట్

ఈనాడు, అమరావతి: ఒకరేమో ఎలక్ట్రికల్ దుకాణంలో సేల్స్‌మన్.. మరొకరేమో కిరాణా కొట్టులో పనిచేసుకునే వ్యక్తి... ఇంకో ఇద్దరు ఫ్యాన్సీ, స్టేషనరీ షాపుల నిర్వాహకులు.. ఓ కొరియర్ వ్యాపారి, మరో ఆఫీస్ బాయ్.. వీరంతా ఎవరనుకుంటున్నారా? వైకాపా హయాంలో జరిగిన రూ.వేలకోట్ల మద్యం కుంభకోణంలో కొల్లగొట్టిన ముడుపుల సొమ్ము మళ్లించేందుకు ఆ ముఠా నెలకొల్పిన పదులకొద్దీ డొల్ల కంపెనీల్లో డైరెక్టర్లు. అలా ఉన్నట్లు వారికి తెలీదు. ఆర్థికంగా వెనకబడ్డ ఇలాంటి వారి గుర్తింపు పత్రాలు దొంగిలించటం, వేరే అవసరాల పేరిట వాటిని తీసుకుని దుర్వినియోగం చేసి.. వైకాపా మద్యం ముఠా ఈ డొల్ల కంపెనీలు ఏర్పాటుచేయించింది. ముంబయికి చెందిన అనిల్ చోఖ్రాను (ఏ-49) ముందు పెట్టి ఈ డొల్ల కంపెనీల ఏర్పాటు. (మిగతా 3లో)

అమెరికాకు పూర్తిగా లొంగిపోయారు

(మొదటి పేజీ తరువాయి)

అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ధాటికి భారత రైతులు విలవిలలాడాల్సి వస్తుంది. వస్త్ర పరిశ్రమ పని అయిపోయినట్టే. ఇకపై భారత్ ఎవరి నుంచి చమురు కొనాలో అమెరికాయే చెబుతుంది. దేశాన్ని ఇలా చేస్తున్నందుకు మీకు సిగ్గుగా లేదా?" అని విరుచుకుపడ్డారు.

ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రభావం మోదీపై పడి ఉండొచ్చు

"అంత సులభంగా భారత్‌ను మోదీ అమ్మేస్తారంటే నేను నమ్మను. బహుశా, ఆయనపై ఏదో బయటి ఒత్తిడి ప్రభావం పడి ఉండొచ్చు. ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదలయ్యాయని తెలిసినప్పటి నుంచి ఆయన కళ్లలో భయం స్పష్టంగా కనిపిస్తోంది. ఆ ఒత్తిడి ప్రభావం ఆయనపై పడిందేమో. వాళ్లు ప్రధానిని ఉక్కిరిబిక్కిరి చేసి ఉండొచ్చు. బెదిరించి ఉండొచ్చు. తదుపరి విడతల్లో ఇంకో 30 లక్షలకుపైగా ఎప్‌స్టీన్ ఫైల్స్ విడుదల కావాల్సి ఉంది. గతంలో భారత వస్తు, ఉత్పత్తులపై అమెరికా 3% సుంకాన్నే విధించేది. ఇక నుంచి 18% విధిస్తుందట. అమెరికా సరుకులపై భారత్ విధించే 16% సుంకాన్ని సున్నాకు తగ్గిస్తారట. మోదీ ఇలాంటివన్నీ ఎందుకని ఒప్పుకొన్నారు? ప్రస్తుతం అమెరికా నుంచి భారత్ ఏటా 46 బిలియన్ డాలర్ల ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. దీన్ని ఏకంగా 146 బిలియన్ డాలర్లు దాటిస్తామని అమెరికాకు ఎందుకు హామీ ఇచ్చారు?" అని రాహుల్ ప్రశ్నలు సంధించారు.

డాలరు పెత్తనాన్ని సవాల్ చేయాలి

"అమెరికా ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని సవాల్ చేయాలి. ఒకే సూపర్ పవర్ ఉండాలనేదానికి అంగీకరించకూడదు. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి భారత్‌పైకి ప్రయోగించే అవకాశాన్ని అమెరికాకు మోదీ సర్కారు ఇచ్చింది. భారత్ ఎవరి నుంచి ముడి చమురును కొనాలనేది, మరో దేశం నిర్ణయించాలా? భారత ప్రయోజనాలను దెబ్బతీసే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నందుకు సిగ్గుగా లేదా? మేమైతే ఇలా చేయం. దీనిపై సభకు వచ్చి ఎలా సమర్థించుకుంటారు?" అని రాహుల్ మండిపడ్డారు.

అమ్మింది మోదీ కాదు కాంగ్రెస్సే: ఆర్థిక మంత్రి

బడ్జెట్‌పై దిగువసభలో చర్చకు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ స్పందిస్తూ.. దేశాన్ని అమ్మింది కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీయే సర్కారే తప్పిస్తే మోదీ కాదని చెప్పారు. ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) వంటివాటికి పేదల, రైతుల ప్రయోజనాలను అమ్మేసింది కూడా ఆ పార్టీయే నన్నారు. "దేశాన్ని అమ్మడానికి, కొనడానికి ఎవరూ సాహసం చేయలేరు. అలాంటివారు ఇంతవరకు పుట్టలేదు. ప్రధాని అలాంటిది ఎప్పుడూ చేయబోరు" అని స్పష్టంచేశారు. బడ్జెట్లో కేటాయింపులను చదవకుండా ఆయా రంగాలపై ఆరోపణలు చేస్తున్నారంటూ గణాంకాలతో తిప్పికొట్టారు.

నా మాట వినిఉంటే విపక్షంలో కూర్చొనేవారు కాదన్న పాల్

ఎప్‌స్టీన్ ఫైల్స్ గురించి రాహుల్ ప్రస్తావించడంపై స్పీకర్ స్థానంలో ఉన్న జగదాంబికా పాల్ అభ్యంతరం వ్యక్తంచేశారు. 'మీరు నా మాట వినిఉంటే విపక్షంలో కూర్చొనేవారు కాదు. బడ్జెట్‌తో సంబంధం లేనివాటిని లేవనెత్తరాదు. సరైన ట్రాకులో ఉన్నప్పుడు పట్టాలు తప్పకండి. మీకు ఇంకా సమయం ఉంది. సరైన ట్రాకుకు వెళ్లండి' అని రాహుల్‌కు సూచించారు. పాల్ తమ పార్టీ మాజీ సభ్యుడైనందువల్ల తాను ఈరోజు దూకుడుగా వెళ్లనని రాహుల్ చెప్పారు. అదానీ, అనిల్ అంబానీ, హర్దీప్‌సింగ్ పురీ పేర్లను రాహుల్ ప్రస్తావించడంపై రవిశంకర్ ప్రసాద్ పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తారు. దీంతో రాహుల్ వ్యాఖ్యల్లో కొన్నింటిని రికార్డుల నుంచి తొలగించారు.

రాహుల్‌పై సభా హక్కుల తీర్మానం

దేశం అభివృద్ధిపథంలో ఉండడాన్ని కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని.. అందువల్లే ఆ పార్టీ నేతలు ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని కేంద్రమంత్రి కిరణ్ రిజిజు విమర్శించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి స్థానానికి తగిన నేత కాంగ్రెస్‌లో లేకపోవడం దురదృష్టకరమన్నారు. సభను తప్పుదోవ పట్టిస్తున్నందుకు, నిరాధార ఆరోపణలు చేస్తున్నందుకు విపక్ష నేతపై సభా హక్కుల తీర్మానం ప్రవేశపెడతామని చెప్పారు.

◆ పారిశ్రామిక సంబంధాల నియమావళి-2020 స్థానంలో కొత్త చట్టాన్ని తీసుకువచ్చే బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ◆ వివిధ అంశాలపై విపక్షాల నిరసనల మధ్యనే లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సమయం కొనసాగింది. నిరసనల తర్వాత విపక్ష సభ్యులు వాకౌట్ చేశారు.

ప్రగతి వైపు పరుగులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రత్యక్షంగా లబ్ధిదారులకు బదిలీ చేస్తున్నామని, ఇది అతిపెద్ద నగదు బదిలీ కార్యక్రమంగా నిలిచిందని వెల్లడించారు. రాష్ట్రానికి శాశ్వత రాజధానిగా అమరావతిని గుర్తించేందుకు చట్టం తెచ్చే ప్రక్రియను ప్రారంభించడంతో పాటు నిర్మాణ పనులకు కేంద్రం ఆర్థికంగా సహకరిస్తోందని తెలిపారు. బుధవారం రాష్ట్ర ఉభయ చట్టసభల సంయుక్త సమావేశంలో గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగించారు. ఆయన మాటల్లోనే..



గవర్నర్ ప్రసంగం వింటున్న ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, ఇతర సభ్యులు

రాష్ట్రాన్ని ఇలా నిలబెట్టాం..

వ్యవస్థాగత పాలనా వైఫల్యాలు, సామాజిక విధ్వంసం, తీవ్ర ఆర్థిక ఒత్తిడి, శాంతి భద్రతల క్షీణత, అరాచకత్వం, సెక్షన్ 22ఏ దుర్వినియోగం వంటి విపరిణామాలు గత ప్రభుత్వంలో చోటు చేసుకున్నాయి. మౌలిక సదుపాయాలు, విద్యుత్, సాగునీటి పారుదల రంగాలు తిరోగమనంలోకి వెళ్లాయి. 2024లో ప్రజలు ఎన్డీయే ప్రభుత్వానికి పట్టం కట్టడంతో పునరుద్ధరణ నుంచి ప్రగతిపథం వైపు ప్రభుత్వం క్రమబద్ధమైన మార్గంలో పయనిస్తోంది. సంక్షేమం, అభివృద్ధి, భావి అవసరాల దృష్ట్యా ప్రణాళికలు రచించి అమలు చేస్తోంది. 2047 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ రూ.308 లక్షల కోట్లకు ఎదుగుతుంది. ప్రజల తలసరి ఆదాయం రూ.55 లక్షలు లక్ష్యంగా స్వర్ణాంధ్ర విజన్ రూపొందించుకున్నాం. పథకాల అమల్లో జవాబుదారీతనానికి మంత్రులు, కార్యదర్శులు, జిల్లాల కలెక్టర్లతో తరచూ సమావేశాలు నిర్వహిస్తూ పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేశాం.

పేదలకు ఆర్థిక చేయూత

ఎన్టీఆర్ భరోసా కింద 63.12 లక్షల మంది పింఛన్‌దారులు లబ్ధి పొందుతున్నారు. తల్లికి వందనం కింద 66 లక్షలకు పైగా విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం. మహిళలు, ట్రాన్స్‌జెండర్లకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించగా, ఇప్పటికే 37.8 కోట్ల ప్రయాణాలు నమోదయ్యాయి. అన్నదాత సుఖీభవ కింద 46.86 లక్షల మంది రైతులకు ఏటా రూ.22 వేల కోట్ల ఆర్థిక సాయం చేస్తున్నాం. దీపం 2.0 కింద 1.08 కోట్ల పేద కుటుంబాలకు ఏటా మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం.

◆ 2.90 లక్షల మంది ఆటో, ట్యాక్సీ, మ్యాక్సీ క్యాబ్ డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల ఆర్థిక సాయం అందిస్తున్నాం. 1.2 లక్షల మత్స్యకార కుటుంబాలకు వేట నిషేధ భృతిని రూ.20 వేలకు పెంచాం. లక్షకు పైగా చేనేత కుటుంబాలకు 200 యూనిట్ల వరకు, మరమగ్గాలపై పనిచేసే కుటుంబాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. ప్రభుత్వ పథకాల లబ్ధి, అర్హతలు తెలుసుకునేలా ఫ్యామిలీ కార్డు ప్రవేశపెడుతున్నాం.

◆ పేదరిక నిర్మూలనకు ఉద్దేశించిన పీ4 కింద లక్ష మందికి పైగా మార్గదర్శులు 10.30 లక్షల బంగారు కుటుంబాలను దత్తత తీసుకున్నారు. స్వయం ఉపాధి చర్యల ద్వారా ఈ ఏడాది లక్ష మంది మహిళా వ్యాపారవేత్తలను ప్రోత్సహిస్తున్నాం. అన్న క్యాంటీన్లలో పేదలకు తక్కువ ధరకే పౌష్టికాహారం అందిస్తున్నాం. 'అందరికీ ఇల్లు' లక్ష్యంతో గృహాలు నిర్మిస్తున్నాం. మెగా డీఎస్సీ ద్వారా 15,941 మంది ఉపాధ్యాయులను నియమించాం. 5,757 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశాం.



జగన్‌తో పాటు సభకు హాజరైన వైకాపా సభ్యులు

ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు

పౌరుల డిజిటల్ ఆరోగ్య రికార్డులు సురక్షితంగా పొందేందుకు ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డ్ వ్యవస్థను ఏర్పాటు చేశాం. రోగులకు చికిత్సతో పాటు సంపూర్ణ ఆరోగ్యం, రోగ నిరోధక శక్తిపై దృష్టి సారించేలా సంజీవని కార్యక్రమాన్ని రూపొందించాం. ప్రతి వ్యక్తికి రూ.25 లక్షల సమగ్ర ఆరోగ్య బీమా కల్పిస్తున్నాం.

◆ నాటుసారాను నిర్మూలించగా, గంజాయి కట్టడిలో గణనీయ పురోగతి సాధించాం. ఏపీని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మారుస్తాం.

నదుల అనుసంధానానికి ప్రాధాన్యం

పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌కు ముందే పూర్తి చేయాలనే సంకల్పంతో ఉన్నాం. నదుల అనుసంధానం చేపడతాం. 2027 గోదావరి పుష్కరాలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. అమరావతి, తిరుపతి, విశాఖ కేంద్రాలుగా సమీకృత వృద్ధి ప్రాంతాలను మెరుగు పరుస్తాం.

పెట్టుబడులకు అనుకూలం

బకాయి పడిన రూ.4,498 కోట్ల విద్యుత్ బిల్లుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తోంది. యూనిట్‌కు 13 పైసల మేర ఛార్జీలు తగ్గించాం. ఇటీవల విశాఖలో నిర్వహించిన సీఐఐ సదస్సులో రూ.13.25 లక్షల కోట్ల పెట్టుబడులు, 16.13 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు కుదుర్చుకున్నాం. రాష్ట్ర పెట్టుబడి ప్రోత్సాహక మండలి సమావేశాల్లో 8.36 లక్షల ఉద్యోగాలు కల్పించేలా రూ.8.74 లక్షల కోట్ల పెట్టుబడులకు అనుమతులిచ్చాం. పెట్టుబడిదారులకు అనువైన విధానాలు ప్రవేశపెట్టాం. యూరోపియన్ యూనియన్, అమెరికాతో భారత ప్రభుత్వం కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందాలతో మనకు కొత్త మార్కెట్లు తెరుచుకున్నాయి. దేశంలోనే అతి పెద్ద పండ్ల ఉత్పత్తిదారుగా ఏపీ అవతరించింది.

విజయవాడ-గుంటూరు-అమరావతి క్లస్టర్.. రవాణా పరంగా నైపుణ్యాల కేంద్రంగా, మెరుగైన టైర్-2 పట్టణ సముదాయంగా ఆవిర్భవిస్తోంది. విశాఖ ఆర్థిక నడవా పనులు ప్రారంభమయ్యాయి. విశాఖ, విజయవాడ మెట్రో రైలు వ్యవస్థల అభివృద్ధిని వేగవంతం చేశాం.

అమరావతికి అరుదైన గుర్తింపు

అమరావతి క్వాంటమ్ వ్యాలీ ద్వారా ఏడాది పొడవునా క్వాంటమ్ కంప్యూటింగ్ వ్యవస్థలు అందుబాటులో ఉంటాయి. ప్రపంచంలో క్వాంటమ్ సేవలు అందించే అతికొద్ది ప్రాంతాల్లో ఒకటిగా అమరావతి నిలుస్తుంది.

గవర్నర్‌కు ఘన స్వాగతం

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలిరోజు ఉభయ సభలనుద్దేశించి ప్రసంగించేందుకు వచ్చిన గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు శాసనసభ ప్రాంగణంలో ఘన స్వాగతం లభించింది. సీఎం చంద్రబాబు, శాసనమండలి ఛైర్మన్ మోషేను రాజు, శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు పోర్టికో వరకు వచ్చి గవర్నర్‌కు స్వాగతం పలికారు. శాసన వ్యవహారాలశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ సూర్యదేవర ప్రసన్నకుమార్ కూడా వారితో ఉన్నారు. సభలో ప్రసంగం ముగిశాక, మళ్లీ వీరంతా బయట పోర్టికో వద్ద వాహనం వరకూ వచ్చి గవర్నర్‌కు వీడ్కోలు పలికారు.

మార్చి 7 వరకు అసెంబ్లీ సమావేశాలు

- మొత్తం 17 పనిదినాలు
- 6 ఆర్డినెన్స్‌ల స్థానంలో బిల్లులు
- 24, 25, 26 తేదీల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు
- శాసనసభ వ్యవహారాల సలహామండలి సమావేశంలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు వచ్చే నెల 7వరకు కొనసాగనున్నాయి. మొత్తం 17 పనిదినాలు సభా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఆరు ఆర్డినెన్స్‌ల స్థానంలో బిల్లులను ఈ సమావేశంలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఒకవేళ ఈ మధ్యలో అదనంగా కొత్త బిల్లులను ప్రభుత్వం తీసుకువస్తే ఆమేరకు మార్చి 7 తర్వాత సమావేశాలను కొనసాగించాలని బుధవారం స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన నిర్వహించిన శాసనసభ వ్యవహారాల సలహా మండలి (బీఏసీ) సమావేశంలో నిర్ణయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, జనసేన తరపున మంత్రి నాదెండ్ల మనోహర్, భాజపా శాసనసభాపక్ష నేత పి.విష్ణుకుమార్ రాజు, శాసనసభలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఈ సమావేశంలో పాల్గొని బడ్జెట్ సమావేశాల ఎజెండాను ఖరారు చేశారు.

సమయపాలన పాటించాలి: చంద్రబాబు

"సభలో ప్రశ్నలు అడిగేటప్పుడు, జీరో అవర్‌లో మాట్లాడేటప్పుడూ సభ్యులు సబ్జెక్టు వరకే పరిమితమై అది కూడా క్లుప్తంగా, సూటిగా అంశంపైనే మాట్లాడాలి. సాగతీత వద్దు.. సభ్యులు లేవనెత్తే అంశాలకు మంత్రులు ఇచ్చే సమాధానాలు కూడా సూటిగానే ఉండాలి. ఎవరూ ప్రసంగాలు చేయడం సరికాదు. సభలో కచ్చితంగా సమయపాలన పాటించాలి. ఎజెండా సక్రమంగా, సజావుగా సాగాలంటే ఎవరికివారే స్వీయ నియంత్రణ పాటించాలి" అని సీఎం చంద్రబాబు సూచించారు. బీఏసీలోని మిగిలిన సభ్యులు కూడా సీఎం అభిప్రాయంతో ఏకీభవించారు. అందుకు అనుగుణంగా రోజువారీ సమావేశాల ప్రణాళికను ఖరారు చేశారు. శూన్య గంటలోనూ రోజూ కచ్చితమైన సమయాన్నే ఇవ్వాలని సీఎం చెప్పగా.. ఒక్కో సభ్యుడికి 2 నిమిషాల చొప్పున ఇస్తే బాగుంటుందని కమిటీలోని ఇతర సభ్యులు అభిప్రాయపడ్డారు.. చివరకు 2 నిమిషాల చొప్పున సమయమివ్వాలని నిర్ణయించారు. ఇందులో సభ్యులు లేవనెత్తే అంశాలను కచ్చితంగా రాసుకుని, వారికి త్వరితగతిన సమాధానాలు పంపేలా ఏర్పాట్లు చేయాలని బీఏసీ అభిప్రాయపడింది. సారూప్యత ఉన్నశాఖలను కలిపి ఒక గ్రూప్‌గా చేసి వాటికి సంబంధించిన గ్రాంట్లు, డిమాండ్లపై చర్చ ఒకే రోజున చేపట్టాలని బీఏసీ నిర్ణయించింది. దీనివల్ల రిపిటీషన్ తగ్గుతుందని అభిప్రాయపడింది.



స్పీకర్ అయ్యన్న పాత్రుడు అధ్యక్షతన నిర్వహించిన బీఏసీ సమావేశంలో సీఎం చంద్రబాబు, మంత్రులు పయ్యావుల కేశవ్, నాదెండ్ల మనోహర్, చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు అధికారులు

9 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు

- ప్రతీ రోజూ శాసనసభలో ఉదయం 9 నుంచి 10 గంటల వరకు ప్రశ్నోత్తరాలు
- 10 నుంచి 10:30 వరకు శూన్యగంట
- 10:30 నుంచి 11 వరకు విరామం
- 11 నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు ప్రభుత్వ ఎజెండాపై చర్చ. అవసరాన్ని 2 గంటల వరకు కొనసాగవచ్చు.
- ప్రశ్నోత్తరాల్లో రోజూ పది ప్రశ్నలు ఉంటాయి. కేటాయించిన గంట సమయంలోపే వీటిని పూర్తి చేయాలి. కాని పక్షంలో మిగిలిపోయిన ప్రశ్నలపై చర్చించకుండా, సమాధానాలు ఇచ్చినట్లుగా (డీమ్డ్ టు బి ఆన్సర్డ్) స్పీకర్ ప్రకటిస్తారు.

సమావేశాల ఎజెండా

- ఫిబ్రవరి 12, 13 రెండు రోజులు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ.. చివర్లో ముఖ్యమంత్రి సమాధానం.
- ఫిబ్రవరి 14న బడ్జెట్, వ్యవసాయ బడ్జెట్‌లను ప్రవేశపెడతారు.
- ఫిబ్రవరి 17న బడ్జెట్‌పై సాధారణ చర్చ.
- ఫిబ్రవరి 18న చర్చ కొనసాగింపు, చివర్లో ఆర్థిక మంత్రి సమాధానం.
- ఫిబ్రవరి 19 నుంచి 28 వరకు (మధ్యలో కొన్ని సెలవులు పోగా 8 రోజులు) శాఖల వారీగా డిమాండ్లు, గ్రాంట్లపై చర్చ, ఆమోదం.
- ఫిబ్రవరి 24, 25, 26 మూడు రోజులు మధ్యాహ్నం తర్వాత విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు క్రీడా పోటీలు.
- మార్చి 4, 5 సప్లిమెంటరీ అంచనాలు, ద్రవ్య వినిమయ బిల్లుపై చర్చ.
- మార్చి 6, 7 రెండు రోజులు ప్రభుత్వ బిజినెస్ కోసం రిజర్వు.

సెలవులు

ఫిబ్రవరిలో 15, 16, 21, 22, మార్చిలో 1, 2, 3

అమరావతి పరేడ్ మైదానంలో సాంస్కృతిక సంధ్య

మార్చి 6న సాయంత్రం అమరావతిలోని పరేడ్ మైదానంలో 'సాంస్కృతిక సంధ్య' కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. కార్యక్రమానికి సభ్యులు వారి కుటుంబసభ్యులతో రావాలని కోరనున్నట్లు స్పీకర్ అయ్యన్న పాత్రుడు తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ఇప్పుడు రైట్‌ట్రాక్‌లో ఉంది

- గత ప్రభుత్వం కారణంగా విశాఖలో నేషనల్ ఓషన్ ఇన్‌స్టిట్యూట్ బ్లాక్ నిర్మాణం ఆగిపోయింది
- డబుల్ ఇంజిన్ సర్కార్ వచ్చిన 6 నెలల్లోనే పూర్తయింది



ఈనాడు, దిల్లీ: డబుల్ ఇంజిన్ సర్కార్ కారణంగా ఆంధ్రప్రదేశ్ రైట్ ట్రాక్‌లో సాగుతోందని కేంద్ర శాస్త్ర, సాంకేతికశాఖ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు. బుధవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో సైన్స్ టెక్నాలజీ, ఇన్నోవేషన్ హబ్‌ల ఏర్పాటు గురించి తెదేపా సభ్యుడు జీహెచ్‌ఎం బాలయోగి, అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌లు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. "ఎస్‌టీఐ హబ్స్ ఏర్పాటు విషయంలో ఆంధ్రప్రదేశ్ ముందుంది. గత వారం అమరావతిలో దేశంలోనే తొలి క్వాంటమ్ కేంద్రానికి శంకుస్థాపన జరిగింది. దానికి వారం ముందు విశాఖపట్నంలో నేషనల్ ఓషన్ ఇన్‌స్టిట్యూట్ బ్లాక్ ప్రారంభమైంది. ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలో శాస్త్ర, సాంకేతిక రంగాలకు ఊతమిస్తున్నాం. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కార్ రాకముందు ఆ ప్రాజెక్టు నెమ్మదించింది. నేషనల్ ఓషన్ ఇన్‌స్టిట్యూట్ బ్లాక్ ఏర్పాటుకు రెండు దశాబ్దాల క్రితం పునాది పడింది. 2005లో శంకుస్థాపన జరిగితే 2015లో నిర్మాణం ప్రారంభమైంది. రాష్ట్రంలో గత ప్రభుత్వం అనుమతులు, ఇతర విషయాల్లో అంతగా సహకరించలేదు. రాష్ట్రంలో రెండేళ్ల క్రితం కొత్త ప్రభుత్వం వచ్చాక డబుల్ ఇంజిన్ వేగం పుంజుకోవడంతో ఆ ఇన్‌స్టిట్యూట్ నిర్మాణాన్ని 5-6 నెలల్లోనే పూర్తిచేశాం. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రైట్‌ట్రాక్‌లో ఉంది. ఎస్‌టీఐ హబ్‌లు రాష్ట్రంలో గరిష్ఠ సంఖ్యలో ఉన్నాయి. ప్రస్తుతం అక్కడ ఉన్న 8 హబ్‌లు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 15 విద్య, శాస్త్రసాంకేతిక సంస్థల అవసరాలను తీరుస్తున్నాయి. వచ్చే మార్చిలో మరికొన్ని హబ్‌లను కేటాయించబోతున్నాం. అప్పుడూ ఏపీకి కొత్తవి కేటాయించే అంశాన్ని పరిశీలిస్తాం" అని జితేంద్ర సింగ్ వెల్లడించారు.

గ్రూప్-1 మూల్యాంకనంలో అక్రమాలపై సిట్

(మొదటి పేజీ తరువాయి)

రిజిస్ట్రార్ జ్యుడిషియల్‌ను ఆదేశించింది.

రాష్ట్రానికి వెలుపల ఉన్న ఏదైనా సెంట్రల్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ నిపుణుల సహాయం తీసుకోవాలని సిట్‌ను ఆదేశించింది. 'ఉద్యోగాలకు ఎంపికైనవారందరి జవాబుపత్రాలు సక్రమంగా ఉన్నాయా? ఏమైనా తారుమారు చేశారా? పరిశీలించాలి. వారి జవాబుపత్రాలపై ఉన్న బార్‌కోడ్‌లు, ఒరిజినల్ ఓఎంఆర్ షీట్లు.. విజయవాడలో మూల్యాంకనంలో ఉపయోగించిన ఓఎంఆర్ షీట్లపై ఉన్న బార్‌కోడ్‌లు ఒకేలా ఉన్నాయో లేవో పరిశీలించాలి. కోర్టును ఆశ్రయించి, ఎంపిక కాని అభ్యర్థుల జవాబుపత్రాలనూ పరిశీలించాలి. ఎంపికైన చివరి అభ్యర్థికి దిగువన ఉన్న వందమంది అభ్యర్థుల జవాబుపత్రాలనూ పరిశీలించాలి' అని సిట్‌కు స్పష్టం చేసింది. ఇప్పటికే ఏర్పడిన సిట్ సేకరించిన సమాచారాన్ని కొత్త సిట్ వినియోగించుకోవచ్చని తెలిపింది. మార్చి 16లోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది.

◆ ఎంపికై ఉద్యోగాలు చేస్తున్న అభ్యర్థులు ప్రాధాన్య పోస్టుల్లో ఉన్నందున దర్యాప్తును ప్రభావితం చేసే ప్రమాదం ఉందని.. అందువల్ల వారందరినీ తదుపరి ఉత్తర్వులిచ్చేవరకూ అప్రాధాన్య పోస్టులకు బదిలీచేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)ను ఆదేశించింది. తీసుకున్న చర్యల నివేదికను వారంలో రిజిస్ట్రార్ జ్యుడిషియల్ ముందుంచాలని సీఎస్‌కు స్పష్టంచేసింది. అనుబంధ పిటిషన్లలో ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. రిట్ అప్పీళ్లపై తదుపరి విచారణను మార్చి 16కు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరిహరనాథశర్మలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు కీలక ఉత్తర్వులిచ్చింది.

◆ 169 గ్రూప్-1 పోస్టుల భర్తీ నిమిత్తం 2018 డిసెంబరు 31న ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చింది. ప్రధాన పరీక్ష జవాబుపత్రాల మాన్యువల్ మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయన్న కారణంతో పరీక్షను రద్దుచేసి, తాజాగా నిర్వహించాలని హైకోర్టు సింగిల్ జడ్జి 2024 మార్చి 13న తీర్పు ఇచ్చారు. ఈ తీర్పును సవాలు చేస్తూ ఏపీపీఎస్సీ, ఉద్యోగాలు పొందినవారు, పొందనివారు ధర్మాసనం ముందు అప్పీళ్లు వేశారు. ఇటీవల వాదనలు ముగిసి తీర్పును వాయిదా వేసిన ధర్మాసనం. . ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థుల అభ్యర్థన మేరకు అప్పీళ్లపై పునర్విచారణ చేస్తోంది. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు కొందరు తాజాగా అనుబంధ పిటిషన్లు వేశారు. కాలేజ్ ఎడ్యుకేషన్ కమిషనర్‌ను ప్రతివాదిగా చేర్చాలని, 2021 నవంబరు నుంచి 2022 జూన్ మధ్యలో జవాబుపత్రాలను దిద్దేందుకు అధ్యాపకుల జాబితా పంపితే ఆ వివరాలను అఫిడవిట్ రూపంలో కోర్టు ముందు ఉంచాలని, ఓఎంఆర్ షీట్లు, కంట్రోల్ బండిల్ స్లిప్పుల ఫోరెన్సిక్ నివేదికలను కోర్టు ముందు ఉంచేలా సిట్‌ను ఆదేశించాలని, కోర్టు నియమించిన కమిటీ గుర్తించిన, పరిశీలించిన ఓఎంఆర్ షీట్లు, కంట్రోల్ బండిల్స్‌పై ఉన్న సంతకాలు, చేతిరాతపై ఫోరెన్సిక్ పరిశీలనకు ఆదేశించాలని కోరారు. అనుబంధ పిటిషన్లపై ఇటీవల వాదనలు ముగియడంతో తీర్పును వాయిదా వేసిన ధర్మాసనం.. బుధవారం నిర్ణయాన్ని ప్రకటించింది.

ప్రాథమికంగా ఆధారాలున్నాయి: ధర్మాసనం

'కోర్టు ముందున్న ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటే ఒరిజినల్ జవాబుపత్రాలను అనుమతి లేకుండా అప్పటి ఏపీపీఎస్సీ కార్యదర్శి పీఎస్సార్ ఆంజనేయులు హాయ్‌ల్యాండ్‌లోని ఆవాస రిసార్ట్స్‌కు తరలించారు. ఆ తరలింపు, వాటిని 65 రోజులు అక్కడే ఉంచాలని ఎవరు నిర్ణయించారో నిరూపించే ఆధారాలు ఏపీపీఎస్సీ వద్ద లేవని ఏజీ చెప్పారు. హాయ్‌ల్యాండ్‌లో మూల్యాంకనం జరగలేదని ఏపీపీఎస్సీ చెబుతోంది. అందుకు భిన్నంగా ఒరిజినల్ ఓఎంఆర్ షీట్లపై మార్కులు కేటాయించారని కోర్టు నియమించిన హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలోని కమిటీ నివేదిక ఇచ్చింది. విజయవాడలో మూల్యాంకనానికి ఓఎంఆర్ షీట్లు, కంట్రోల్ బండిల్స్ తాజాగా ముద్రించారు. ఇలాంటి విషయాలు ఏపీపీఎస్సీ విశ్వసనీయత, నిబద్ధతపై సందేహాలు రేకెత్తిస్తున్నాయి. మూల్యాంకనంలో అక్రమాలు న్నాయని ఎంపిక కాని అభ్యర్థులు చేస్తున్న వాదనకు ప్రాథమికంగా ఆధారాలున్నాయి. గ్రూప్-1 పోస్టులు రాష్ట్ర పాలనలో కీలకమైనవి. ఎంపికైన అభ్యర్థులు తాము నిర్దోషులమని చెబుతున్నా.. మూల్యాంకన విధానం, పేపర్లు దిద్దిన ప్రదేశాలను మార్చడం, ఎంపికైనవారి జాబితా నుంచి కొందరి పేర్లు మాయమవడం, సమాచారాన్ని కోర్టు ముందు ఉంచడంలో ఏపీపీఎస్సీ నిస్సహాయత వ్యక్తంచేయడం చూస్తుంటే మూల్యాంకన విధానంపై సందేహం కలుగుతోంది. ఎంపికైన, ఎంపిక కాని అభ్యర్థుల జవాబు పత్రాలను ఫోరెన్సిక్ నిపుణులు పోల్చిచూస్తే పేపర్ల వయసు, సిరా వయసు, బార్‌కోడ్‌లలో సరిపోలిక, కొట్టివేతలు, రాతల్లో వ్యత్యాసాలపై స్పష్టత వస్తుంది. కొంతమంది ఎంపికైన అభ్యర్థుల నిజాయతీని కారణంగా చూపుతూ ఇతరుల విషయంలో జరిగిన అక్రమాలను విస్మరించలేం. ఒక చుక్క విషం మొత్తం పాలనే విషపూరితం చేస్తుందనే విషయాన్ని గుర్తుంచుకోవాలి. నిధుల దుర్వినియోగం, మూల్యాంకన నిర్వహణ లోపం, అక్రమాలు జరిగినట్లు తీవ్ర ఆరోపణల నేపథ్యంలో ఈ వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు అవసరం. ఈ నేపథ్యంలో సిట్ ఏర్పాటుకు ఆదేశిస్తున్నాం' అని ధర్మాసనం ఉత్తర్వుల్లో పేర్కొంది.

గ్రహం అనుగ్రహం

12-2-2026 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; ఉత్తరాయణం; శిశిర రుతువు, మాఘ మాసం, బహుళ పక్షం
దశమి: ఉ. 11-45 తదుపరి ఏకాదశి
జ్యేష్ఠ: మ. 1-27 తదుపరి మూల
వర్జ్యం: రా. 10-15 నుంచి 12-01 వరకు
అమృత ఘడియలు: లేవు
దుర్ముహూర్తం: ఉ. 10-20 నుంచి 11-06 వరకు
తిరిగి మ. 2-53 నుంచి 3-39 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.6.33; సూర్యాస్తమయం: సా.5.56

చలి పులి

ప్రాంతం	కనిష్ఠ	గరిష్ఠ
మెదక్	12.8	32.0
విజయనగరం	15.0	29.0
అనంతపురం	15.5	34.0
కడప	16.0	31.0
హైదరాబాద్	17.2	29.8
శ్రీకాకుళం	18.0	29.0
విశాఖపట్నం	18.0	29.6
తిరుపతి	18.0	30.7
నరసాపురం	18.0	32.0
తాడేపల్లిగూడెం	19.0	32.0
గుంటూరు	19.0	32.0
రాజమహేంద్రవరం	19.0	35.0
కర్నూలు	19.1	33.0
విజయవాడ	20.0	30.5
ఒంగోలు	21.2	30.7
నెల్లూరు	21.5	31.2



మయూర వాహనంపై మహేశ్వరుడు

- శ్రీగిరికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలం ఆలయం, నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే: నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నాలుగో రోజు బుధవారం శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి మయూర వాహనంపై దర్శనమిచ్చారు. ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో శ్రీస్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులకుఉభయ దేవాలయాల అర్చకులు పూజలు చేసి మంగళహారతులు సమర్పించారు. అనంతరం శ్రీగిరి పురవీధుల్లో శ్రీస్వామిఅమ్మవార్లకు శోభాయమానంగా గ్రామోత్సవం నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం తరఫున తితిదే డీఈవో పార్థసారథి, అర్చకులతో కలిసి శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించారు.
✦ మహాశివరాత్రి పర్వదినం దగ్గరపడుతున్న కొద్దీ శ్రీశైలం క్షేత్రానికి భక్తుల రాక పెరుగుతోంది. వెంకటాపురం, బైర్లూటీ క్షేత్రాల మీదుగా పెద్ద సంఖ్యలో భక్తులు నడిచి వస్తున్నారు.



ఆలయం ప్రధాన ద్వారం వెలుపల భక్తుల దీపారాధనలు

ఆదివారం నుంచి ఇప్పటి వరకు 1,95,555 మంది స్వామిని దర్శించుకున్నారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ప్రశాంత వాతావరణంలో శ్రీభ్రమరాంబ మల్లికార్జునస్వామి దర్శనాలు కల్పిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ సునీల్ షొరాణ్ బుధవారం తెలిపారు. గతేడాది కన్నా నాలుగు రెట్లు అధికంగా భక్తులు శ్రీశైలానికి వచ్చారన్నారు.

ముక్కంటి ఆలయంలో ధ్వజారోహణం



వృషభ ధ్వజాన్ని ధ్వజస్తంభం మీదకు తీసుకొస్తున్న అర్చకులు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి ముక్కంటి ఆలయంలో శివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వృషభ ధ్వజంతో వాయులింగేశ్వరుని ధ్వజారోహణం వైభవంగా నిర్వహించారు. ధ్వజస్తంభానికి ఓ వైపు వినాయకుడు, మరో వైపు శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి, భక్తకన్నప్ప, చండికేశ్వరుని ఉత్సవమూర్తులను ఉంచారు. శ్రీజ్ఞానప్రసూనాంబిక సమేత సోమస్కందమూర్తి ఉత్సవమూర్తులతో పాటు ఉమాదేవి సమేత చంద్రశేఖరస్వామి కొలువుదీరిన త్రిశూలాన్ని ఏర్పాటు చేశారు. భక్తుల శివనామస్మరణలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ఆలయ ప్రధాన అర్చకులు వృషభ ధ్వజాన్ని ధ్వజస్తంభం అధిరోహింపజేశారు.

పేదల గూడుకు ప్రభుత్వం అండ

- గ్రామాల్లో ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు అందించేందుకు నిర్ణయం
- డ్వాక్రా మహిళలకు బ్యాంకుల ద్వారా రుణం
- దానిపై వడ్డీని రాయితీగా చెల్లించనున్న ప్రభుత్వం
- ఉపాధ్యాయులకు ఉచితంగా ఏఐ టీచింగ్ కిట్స్ అందించేందుకు ఏఐ లివింగ్ ల్యాబ్స్
- కృష్ణా తీరంలో 'అమరావతి మెరీనా' పేరిట ప్రత్యేక ప్రాజెక్టు
- మంత్రివర్గ సమావేశంలో కీలక ప్రతిపాదనలకు ఆమోదం



ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో మంత్రులు, అధికారులు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో గ్రామీణ పేదలకు శాశ్వత గృహ వసతి కల్పించేందుకు రాష్ట్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన్ మంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 పథకం కింద ఇంటి నిర్మాణానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి ఇచ్చే సాయాన్ని (యూనిట్ వ్యయం) రూ.2.39 లక్షలుగా నిర్ణయించింది. ఇందులో కేంద్రం వాటా రూ.95,400, రాష్ట్రం వాటా రూ.63,600, జీరామ్‌జీ పథకం కింద రూ.27 వేలు, స్వచ్ఛభారత్ మిషన్ కింద రూ.12 వేలు ఉంటుంది. దీనికి అదనంగా డ్వాక్రా సంఘాల సభ్యులకిచ్చే రుణంపై వడ్డీని ప్రభుత్వమే రాయితీగా చెల్లించనుంది. ఈ పథకం అమలుకుగాను రూ.4,279.33 కోట్లు వ్యయం కానున్నట్లు అంచనా. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీంతోపాటు పలు కీలక నిర్ణయాల్ని ఆమోదించారు.

అమరావతిలో ఏఐ లివింగ్ ల్యాబ్స్

రాష్ట్రంలోని ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికైనా ఏఐ శిక్షణ ఇవ్వాలనే లక్ష్యానికి అనుగుణంగా ఏపీ ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. దీనికిగాను అమరావతి కేంద్రంగా ఏఐ లివింగ్ ల్యాబ్స్ ఫౌండేషన్ అనే లాభాపేక్ష లేని సంస్థను ప్రభుత్వం ఏర్పాటు చేయనుంది. వీటి కోసం మెమొరాండమ్ ఆఫ్ అసోసియేషన్, ఆర్టికల్స్ ఆఫ్ అసోసియేషన్‌ను రూపొందించడానికి, ఎన్విడియాతో అవగాహనా ఒప్పందాన్ని సవరించడానికి, విద్యార్థుల విద్యా అవసరాల కోసం ఏఐ హార్డ్‌వేర్ సేకరణ చేయడానికి అనుమతిచ్చింది. రాష్ట్రంలోని ఉపాధ్యాయులకు ఎన్విడియా నుంచి ఉచిత ఏఐ టీచింగ్ కిట్స్ అందించడానికి, ఏఐ శిక్షణ వ్యవస్థను అభివృద్ధి చేయడంలో ఇతర మద్దతు అందించడానికి అనుమతి ఇచ్చింది. ఈ సంస్థకు వచ్చే లాభాలను తిరిగి ఏఐ అభివృద్ధి, పరిశోధనల కోసమే వినియోగిస్తారు.

తిరుపతిలో డిజాస్టర్ రికవరీ సెంటర్

తిరుపతిలోని ఐఐడీటీ క్యాంపస్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో డిజాస్టర్ రికవరీ (డీఆర్) సెంటర్ ఏర్పాటు ప్రతిపాదనకు ఆమోదం తెలిపింది. 'బూట్' విధానంలో అమలు చేయనున్న ఈ ప్రాజెక్టుకు మూలధన వ్యయాన్ని సాస్కీ పథకం కింద సమకూర్చనున్నారు. రాష్ట్రంలో ఈ-గవర్నెన్స్‌కు కేంద్ర బిందువుగా ఉండి, వివిధ శాఖలు 500కి పైగా కీలక అప్లికేషన్లు, పౌరసేవలను నిర్వహిస్తున్నాయి. ప్రస్తుతం అమరావతిలో ఉన్న ప్రధాన డేటా సెంటర్‌కు పూర్తి స్థాయి డీఆర్ సదుపాయం లేకపోవడం వలన ప్రకృతి విపత్తులు, సైబర్ దాడులు లేదా అత్యవసర పరిస్థితుల్లో నిరంతర సేవలందకపోవడం అనే సమస్య ఉత్పన్నమయ్యే అవకాశముంది. దీన్ని భర్తీ చేసేందుకు డిజాస్టర్ రికవరీ సెంటర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది.
✦ కృష్ణా నదీ తీరంలోని ఎకరా స్థలంలో 'అమరావతి మెరీనా' అభివృద్ధి ప్రాజెక్టు చేపట్టేందుకు ఆమోదం. దీన్ని 33 ఏళ్ల లీజు ప్రాతిపదికన పీపీపీ విధానంలో చేపట్టనున్నారు. నదీ తీర ప్రాంతంలో ఆధునిక మెరీనా సౌకర్యాలు, వినోద, ప్రజా వసతులు అభివృద్ధి చేస్తారు. ప్రైవేట్ డెవలపర్/ ఆపరేటర్ ఎంపిక కోసం టెండర్లు పిలిచేందుకు అనుమతిచ్చింది. మరిన్ని వివరాలు https://epaper.eenadu.net లో..

అంబటిపై మరో పీటీ వారెంట్

- సంక్రాంతి సంబరాల పేరిట వసూళ్ల కేసులో జారీ
- పోలీసులపై దౌర్జన్యం కేసులో బెయిల్

గుంటూరు లీగల్, న్యూస్‌టుడే: వైకాపా నేత అంబటి రాంబాబు మెడకు మరో కేసు చుట్టుకుంది. వైకాపా హయాంలో మంత్రి హోదాలో సత్తెనపల్లి నియోజకవర్గంలో సంక్రాంతి సంబరాల పేరిట సాగించిన అక్రమ వసూళ్లపై నమోదైన కేసులో గుంటూరు ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎం.కుముదిని బుధవారం పీటీ వారెంట్ జారీ చేశారు. ఈ నెల 18లోగా కోర్టులో హాజరుపరచాలని ఆదేశించారు. పోలీసులపై దౌర్జన్యం చేశారంటూ గుంటూరులో నమోదైన కేసులో ఆయనకు బుధవారం బెయిల్ లభించింది. దీంతో బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటున్న అంబటి రాంబాబు కుటుంబసభ్యులు, కార్యకర్తలు మరో కేసులో పీటీ వారెంట్ విషయం తెలిసి నీరసపడ్డారు. ముఖ్యమంత్రి చంద్రబాబుపై తీవ్ర దుర్భాషలకు పాల్పడిన కేసులో అంబటికి ఇటీవల బెయిల్ లభించగా పట్టాభిపురం పోలీసుస్టేషన్ పరిధిలో పోలీసులపై దౌర్జన్యానికి పాల్పడిన కేసులో ఎక్సైజ్ కోర్టు ఈ నెల 20 వరకు రిమాండ్ విధించింది. దీంతో మళ్లీ ఆయన్ను రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి తరలించిన సంగతి తెలిసిందే. ఈ కేసులో బుధవారం ఎక్సైజ్ కోర్టు జూనియర్ సివిల్ జడ్జి బెయిల్ మంజూరు చేశారు. ఈ బెయిల్ పత్రాలు తీసుకుని ఆయన తరఫు న్యాయవాదులు రాజమహేంద్రవరం కేంద్ర కారాగారానికి వెళ్లారు. ఈలోగా సంక్రాంతి సంబరాల వసూళ్ల కేసులో కోర్టు ఇచ్చిన పీటీ వారెంట్‌తో పోలీసులూ అక్కడికే చేరుకున్నారు. దీంతో రాంబాబును విడుదల చేయలేదు.
ఇదీ కేసు: 2023 జనవరిలో అంబటి రాంబాబు మంత్రి హోదాలో సత్తెనపల్లిలో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఇందుకోసం అక్కడి వాలంటీర్ల ద్వారా పింఛనుదారులకు నెలవారీగా ఇచ్చే పింఛను మొత్తం నుంచి రూ.200 చొప్పున మినహాయించుకుని రెండేసి లాటరీ టికెట్లు ఇచ్చారు. సంక్రాంతి రోజు లాటరీ తీసి బహుమతులు పంచారు. ఇది చట్టవిరుద్ధమని గుంటూరు జిల్లా జనసేన అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు గుంటూరు ప్రధాన సీనియర్ సివిల్ కోర్టులో ఫిర్యాదు చేశారు. ఆయన ఫిర్యాదు మేరకు అప్పట్లో సత్తెనపల్లి పట్టణ పోలీసులు రాంబాబుతోపాటు మరికొందరిపై కేసు నమోదు చేశారు.

ఏమరుపాటుగా ఉంటే పెట్టుబడులు పలాయనమే..

నెల్లూరుకు ఏరోస్పేస్ పరిశ్రమ తరలిపోవడమే ఉదాహరణ

ఈనాడు, అమరావతి: పెట్టుబడుల ఆకర్షణకు వేగంగా స్పందించడం ఎంత అవసరమనే దానికి ఇటీవల రాష్ట్రంలో చోటు చేసుకున్న ఉదంతమే నిదర్శనం. 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ గవర్నెన్స్' విధానాలు ఎంత కీలకమనేది అధికారులు గుర్తించడానికి ఇదొక మంచి ఉదాహరణ. రాష్ట్రంలో ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్స్ అనే సంస్థ ఏరోస్పేస్ రంగంలో రూ.1,000 కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ)లో ప్రతిపాదనకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ప్రకాశం జిల్లా దొనకొండలో పరిశ్రమ ఏర్పాటు చేయాలన్నది ఆ సంస్థ ఆలోచన. ఇందుకు 300 ఎకరాల భూములు కేటాయించాలని కోరుతూ.. జిల్లా యంత్రాంగాన్ని 15 నెలలుగా సంప్రదిస్తోంది. కానీ, అక్కడి అధికారుల నుంచి ఆశించినస్థాయిలో స్పందన రాలేదు. ఇది తెలిసిన పొరుగునే ఉన్న నెల్లూరు జిల్లా కలెక్టర్.. సంస్థ ప్రతినిధులతో ఫోన్‌లో సంప్రదింపులు జరిపారు. అవసరమైన భూములు కేటాయించేందుకు హామీ ఇచ్చారు. జిల్లాలో రెండు ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న భూములను సంస్థకు చూపారు. దుత్తలూరు మండలంలో పరిశ్రమ ఏర్పాటుకు ప్రీమియర్ సంస్థ అంగీకరించింది. ఆ వెంటనే ప్రతిపాదన ఏపీఐఐసీకి పంపడం.. అక్కడి నుంచి అనుమతులు రావడంతో.. నెల్లూరు జిల్లాలో పరిశ్రమ ఏర్పాటుకు సంస్థ సిద్ధమైంది. ఇదంతా కేవలం వారం రోజుల్లోనే పూర్తయింది. అంతే.. వెనకబడిన ప్రకాశం జిల్లాలో ఏర్పాటు కావాల్సిన పరిశ్రమ.. నెల్లూరుకు తరలిపోయింది. అదృష్టవశాత్తు రాష్ట్రంలోనే మరో జిల్లా కాబట్టి సరిపోయింది. అదే పొరుగు రాష్ట్రానికి పెట్టుబడులు తరలిపోతే పరిస్థితి ఏంటి? అదే జరిగితే 500 మంది ఉపాధి, ఆదాయ పరంగా నష్టపోవాల్సి వచ్చేది.

మంత్రులు సాయంత్రం వరకు అందుబాటులో ఉండాలి

- అమరావతిలో హెల్త్‌సిటీ, ఎడ్యుకేషన్ సిటీ
- జల్‌జీవన్ మిషన్‌కు రూ.12 వేల కోట్లు
- మంత్రివర్గ సమావేశంలో సీఎం వెల్లడి

ఈనాడు, అమరావతి: శాసనసభ సమావేశాలు జరిగినన్ని రోజులూ మంత్రులు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సభలో ఉండాలని, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం వరకు సచివాలయంలోని వారి పేషీల్లో విధిగా ఎమ్మెల్యేలకు అందుబాటులో ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించారు. ఎమ్మెల్యేలు వారి నియోజకవర్గాలకు చెందిన పనులపై విజ్ఞప్తులు అందిస్తే, తగిన రీతిలో స్పందించాలని సూచించారు. బుధవారం శాసనసభ సమావేశాలు ముగిశాక నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో సీఎం పలు సూచనలు చేశారు. 'మంత్రులు బాధ్యతగా ఉండాలి. ఏది పడితే అది మాట్లాడొద్దు. అంశాల వారీగా పూర్తిగా సిద్ధమై సభకు రండి' అని సూచించారు. సభ్యుల ప్రశ్నలకు మంత్రులు క్లుప్తంగా, అర్థమయ్యేలా సమాధానాలు చెప్పాలన్నారు. కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో ప్రకటించిన హెల్త్‌సిటీ, ఎడ్యుకేషన్ సిటీలను అమరావతిలో ఏర్పాటు చేస్తామని సీఎం పేర్కొన్నారు. జల్‌జీవన్ మిషన్ కింద రాష్ట్రానికి రూ.12 వేల కోట్లు విడుదల చేసేందుకు కేంద్రం అంగీకరించిందని, దాన్ని మూడేళ్లలో ఖర్చు చేయాలని ఆదేశించారు. ఇన్‌ఛార్జి మంత్రులు వారికి కేటాయించిన జిల్లాల్లో అభివృద్ధి ప్రాజెక్టులు, పరిశ్రమలపై నిరంతరం పర్యవేక్షిస్తూ, అవి వేగంగా సాకారమయ్యేలా చూడాలని సీఎం పేర్కొన్నారు. సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు తయారు చేసేటప్పుడు అధికారులు కొందరు.. 'అవును, కాదు' అని ముక్తసరిగా బదులిస్తున్నారని మంత్రి అచ్చెన్నాయుడు సీఎం దృష్టికి తెచ్చారు. అధికారులు సమాధానాలు సరిగా ఇచ్చారో లేదో సభకు వెళ్లే ముందే మంత్రులు చెక్ చేసుకోవాలని సీఎం తెలిపారు. గ్రామ, వార్డు సచివాలయాల పేర్లను స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాలుగా మార్చే బిల్లును ఈ సమావేశాల్లో ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు.

శ్రీశైలంలో పోలీసుల తీరుపై అసంతృప్తి

శ్రీశైలంలో భక్తులతో పోలీసులు సరిగ్గా వ్యవహరించలేదని సీఎం అసంతృప్తి వ్యక్తంచేశారు. క్యూలైన్లలో ఉన్న వృద్ధులు కొందరు ఊపిరాడక ఇబ్బంది పడుతుంటే, వైద్య సహాయం అందించేందుకు బయటకు తీసుకొచ్చారని, ఆ విషయం తెలియని మిగతా భక్తులు వారిని వేరే మార్గంలో దర్శనానికి తీసుకెళ్తున్నారన్న అపోహతో ఆందోళనకు దిగారని హోం మంత్రి అనిత వివరించారు. అదే విషయాన్ని భక్తులకు అర్థమయ్యేలా పోలీసులు మైక్‌లో ప్రకటించి ఉంటే ఇబ్బంది వచ్చేది కాదన్నారు.

జేఈఈ మెయిన్ తొలి విడత ఫలితాలు 16లోపు!

ఈనాడు, హైదరాబాద్: జేఈఈ మెయిన్ తొలి విడత పేపర్-1 ఫలితాలను ఈ నెల 16 లోపు వెల్లడిస్తామని జాతీయ పరీక్షల సంస్థ (ఎన్‌టీఏ) గురువారం ఎక్స్‌లో వెల్లడించింది. జనవరి 21 నుంచి 28 వరకు జేఈఈ మెయిన్ తొలివిడత పరీక్షలు ఆన్‌లైన్‌లో నిర్వహించారు. పరీక్షల స్కోర్‌ను ఈ నెల 12 లోపు వెల్లడిస్తామని ఎన్‌టీఏ గతంలోనే ప్రకటించింది. ఈ క్రమంలో లక్షల మంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారు. ఈ సమయంలో 16లోపు వెల్లడిస్తామని.. 11వ తేదీ అర్ధరాత్రి వెబ్‌సైట్‌లో కాకుండా.. ఎక్స్ ఖాతాలో వెల్లడించడం గమనార్హం.

ఆరు నెలల సూత్రం



ఓ కొత్త విషయాన్ని నేర్చుకునేందుకు ప్రతీరోజూ రెండు గంటల సమయాన్ని ఆరు నెలలపాటు కేటాయించండి. ఆ అంశంలో మీరు తిరుగులేని నైపుణ్యం సాధిస్తారు. ఇందుకోసం ఆచరణసాధ్యమైన లక్ష్యాలను ఎంచుకోవడం ముఖ్యం.
– గ్రే హ్యాట్, ఇన్‌ఫ్లుయెన్సర్

వీరంతా డైరెక్టర్లు

(మొదటి పేజీ తరువాయి)

వాటి పేరిట లావాదేవీల నిర్వహణ వంటివన్నీ చేయించింది. తొలి అంచెలో 4, రెండు, మూడు అంచెల్లో 32 డొల్ల కంపెనీల ద్వారా రూ.77.55 కోట్లు సొత్తు మళ్లించింది. సిట్ దర్యాప్తులో ఈ వివరాలు బయటపడ్డాయి. మద్యం కుంభకోణం కేసులో సిట్ అధికారులు విజయవాడలోని ఏసీబీ కోర్టులో బుధవారం 63 పేజీల అనుబంధ అభియోగపత్రం దాఖలు చేశారు. మద్యం ముడుపుల సొత్తు మనీ ట్రయల్‌ను ఈ అభియోగపత్రంలో వివరించారు.
✦ వైకాపా మద్యం ముఠాకు లంచాలు చెల్లించేందుకు... అదాన్ డిస్టిలరీస్ (ఏ-25), లీలా డిస్టిలరీస్ (ఏ-26), ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్‌లు ముంబయికి చెందిన నాలుగు డొల్ల కంపెనీల ఖాతాల్లోకి రూ.77.55 కోట్లు మళ్లించాయి. తొలుత ఓల్విక్ మల్టీవెంచర్స్ (ఏ-11), క్రిపటి ఎంటర్‌ప్రైజెస్ (ఏ-12), నైస్నా మల్టీవెంచర్స్ (ఏ-13), విశాల్ ఎంటర్‌ప్రైజెస్ (ఏ-19) ఖాతాల్లోకి డబ్బు జమచేశాయి. ఆ సంస్థల నుంచి మరో 32కు పైగా డొల్ల కంపెనీల ఖాతాల్లోకి ఈ నిధులు వెళ్లాయి. వాటినుంచి చివరిగా మద్యం ముఠా సభ్యులకు సొమ్ము చేరింది.
✦ అదాన్ డిస్టిలరీస్ నుంచి రూ.18.20 కోట్లు, లీలా డిస్టిలరీస్ నుంచి రూ.20.28 కోట్లు, ఎస్పీవై ఆగ్రో ఇండస్ట్రీస్ నుంచి రూ.39 కోట్లు ఓల్విక్, క్రిపటి, నైస్నా, విశాల్ ఎంటర్‌ప్రైజెస్ వంటి డొల్ల కంపెనీల ఖాతాల్లోకి జమచేశారు. ఓల్విక్ నుంచి 14 కంపెనీల్లోకి రూ.31.33 కోట్లు, క్రిపటి నుంచి 22 కంపెనీల్లోకి రూ.31.51 కోట్లు, నైస్నా నుంచి 3 కంపెనీల్లోకి రూ.10.58 కోట్లు, విశాల్ నుంచి 4 కంపెనీల్లోకి రూ.4.08 కోట్లు మళ్లించారు.
✦ ఆయా కంపెనీలు పేర్కొన్న చిరునామాలు పరిశీలించగా... అసలు అక్కడ అలాంటి కంపెనీలే లేవని తేలింది. భవనాల యజమానులను ప్రశ్నిస్తే తామెప్పుడూ అలాంటి కంపెనీలకు అద్దెకు ఇవ్వలేదని చెప్పారు. వైట్‌ను బ్లాక్‌లోకి మార్చి సంబంధిత వ్యక్తులకు అందజేసేందుకు అనిల్ చోఖ్రాయే ఈ డొల్ల కంపెనీలు ఏర్పాటుచేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది.
✦ బహుళ అంచెల్లో నిధులు రూటింగ్ చేయటంలో అనిల్ చోఖ్రా కీలకపాత్ర పోషించారు. లంచాల సొమ్ము రూటింగ్, మనీలాండరింగ్‌కు పాల్పడ్డారు.

అక్రమ నగదు లావాదేవీల కోసం డొల్ల కంపెనీలు

ముంబయి పరిసర ప్రాంతాల్లో తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నవారిని గుర్తించి, వారికి డబ్బులిచ్చి ఆధార్, ఇతర గుర్తింపుకార్డులను అనిల్‌చోఖ్రా సేకరించారు. వాటి ఆధారంగా డొల్ల కంపెనీలు ఏర్పాటుచేసి, బ్యాంకు ఖాతాలు తెరిచారు. వీటిని అడ్డం పెట్టుకుని వైట్‌ను బ్లాక్‌లోకి, బ్లాక్‌ను వైట్‌లోకి మార్చారు. తన పేరిట ఏ కంపెనీ లేకుండా జాగ్రత్తలు తీసుకున్నారు.
✦ పోలీసులకు, దర్యాప్తు సంస్థలకు చిక్కకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు సిమ్‌లు మార్చేశారు. దుస్తుల కొనుగోల పేరిట నకిలీ ఇన్వాయిస్‌లు, నకిలీ ఈ-వే బిల్లులు సృష్టించి మోసానికి పాల్పడ్డారు. దీనికోసం 10 సిమ్‌కార్డులను మార్చారు.
✦ 2020-21 నుంచి 2022-23 మధ్య ఆయా కంపెనీల జీఎస్టీ ఫైలింగ్ వివరాలు పరిశీలించగా.. 36 డొల్ల కంపెనీలకు 20 ఇన్‌యాక్టివ్‌గా ఉన్నట్లు తేలింది. మద్యం కుంభకోణం కేసులో ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి తరఫున ఈ దందా నడిపించారు.

చెవిరెడ్డి భాస్కరరెడ్డితో బంధం బట్టబయలు

ఈ డొల్ల కంపెనీల నిర్వహణ, లంచాల సొమ్ము మళ్లింపు కోసం అనిల్ చోఖ్రా అనేక సిమ్‌కార్డులు వినియోగించారు. ఈ క్రమంలో వివిధ డొల్ల కంపెనీల ప్రతినిధులతో 174 సార్లు ఒకే చోట ఉన్నట్లు సిట్ దర్యాప్తులో తేలింది. కేసులో కీలక నిందితుడైన వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డితో కలిసి ఒకసారి ఒకే లొకేషన్‌లో ఉన్నట్లు వెల్లడైంది. వీరి మధ్యనున్న సంబంధాన్ని ఇది బట్టబయలు చేసింది.

ఆ నాలుగు డొల్ల కంపెనీల నుంచి రెండు, మూడో అంచెల్లో మొత్తం 32 డొల్ల కంపెనీలను అడ్డం పెట్టుకుని మళ్లించిన తీరు

డొల్ల కంపెనీ	రెండు, మూడో అంచెల్లో ఎన్ని కంపెనీల్లోకి మళ్లించింది	మళ్లించిన సొమ్ము (రూ.కోట్లలో)
ఓల్విక్ మల్టీవెంచర్స్	14	31.33
క్రిపటి ఎంటర్‌ప్రైజెస్	22	31.51
నైస్నా మల్టీవెంచర్స్	3	10.57
విశాల్ ఎంటర్‌ప్రైజెస్	4	4.08
మొత్తం	–	77.55

డొల్ల కంపెనీ డైరెక్టర్ పేరు (వృత్తి) - ఏయే డొల్ల కంపెనీల్లో డైరెక్టర్‌గా ఉన్నారంటే..

1. **రమేష్‌కుమార్ తేజాయ్ రామ్ సరోజ్ (కొరియర్ వ్యాపారి)** - 1.ఓల్విక్ మల్టీవెంచర్స్, 2.కేరాజ్ ఎంటర్‌ప్రైజెస్, 3.న్యూమోంట్ గోల్డ్ అండ్ జ్యూయలరీ, 4.మలిష్క గోల్డ్ అండ్ జ్యూయలరీ
2. **సాగర్ లఖాజీ మోర్ (ఎలక్ట్రికల్ దుకాణంలో సేల్స్‌మన్)** - క్రిపాటి ఎంటర్‌ప్రైజెస్
3. **భన్వర్‌లాల్ జైన్ (కిరాణా దుకాణంలో పనిచేసే వ్యక్తి)** - 1.ట్రిఫ్పెర్ ఎంటర్‌ప్రైజెస్, 2.కేరాజ్ ఎంటర్‌ప్రైజెస్, 3.న్యూమోంట్ గోల్డ్ అండ్ జ్యూయలరీ, 4.మలిష్క గోల్డ్ అండ్ జ్యూయలరీ
4. **రాజేష్ టైలర్ (ఫ్యాన్సీ స్టోర్ యజమాని)** - కేరాజ్ ఎంటర్‌ప్రైజెస్
5. **శంభులాల్ టైలర్ (స్టేషనరీ స్టోర్ యజమాని)** - కేరాజ్ ఎంటర్‌ప్రైజెస్
6. **సంతోష్ రామ్ లఖన్ శుక్లా (కొరియర్ బాయ్)** - వాగ్నర్ షిప్పింగ్ ప్రైవేట్ లిమిటెడ్

వైకాపా మద్యం ముఠాకు ముడుపులు చెల్లించేందుకు.. వివిధ డిస్టిలరీల నుంచి డొల్ల కంపెనీల్లోకే మళ్లించిన సొమ్ము రూ.కోట్లలో

డిస్టిలరీ	ఓల్విక్ మల్టీవెంచర్స్	క్రిపటి ఎంటర్‌ప్రైజెస్	నైస్నా మల్టీవెంచర్స్	విశాల్ ఎంటర్‌ప్రైజెస్	మొత్తం
అదాన్	7.84	-	8.46	1.97	18.27
లీలా	10.16	10.12	-	-	20.28
ఎస్పీవై ఆగ్రో	13.33	21.42	2.12	2.13	39.00
మొత్తం	31.33	31.54	10.58	4.10	77.55

ఈనాడు

ఏఐ దుర్వినియోగానికి అడ్డుకట్ట!

అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకోసమే వినియోగిస్తే- విద్యుదుత్పాదన నుంచి అంతరిక్ష రహస్యాల అన్వేషణ వరకు ఎన్నో రంగాల్లో మానవాళికి మేలు జరుగుతుంది. దాన్నే ఆయుధంగా మారిస్తే- ఎంతటి వినాశనం సంభవిస్తుందో చరిత్రలో ఇప్పటికే నమోదైంది. ఉత్పాదక సామర్థ్యాన్ని ఇనుమడింపజేసి అభివృద్ధికి ఆలంబనగా నిలిచే అద్భుత సాంకేతికతగా వెలుగులోకి వచ్చిన కృత్రిమమేధకూ ఇలాంటి చీకటి కోణముంది. వాయిస్ క్లోనింగ్ కాల్స్, డీప్‌ఫేక్ వీడియోలు, ఏఐతో పుట్టుకొస్తున్న మోసపూరిత ఈమెయిళ్లు, అసభ్య చిత్రాలు ఇప్పుడు సమాజానికి పెద్ద బెడదగా తయారయ్యాయి. కృత్రిమమేధను స్వార్థానికి వాడుకుంటున్న సైబర్ నేరముఠాలు జనాన్ని ఏమార్చి కోట్ల రూపాయలను కాజేస్తున్నాయి. సామాజిక మాధ్యమాల్లోని వికృత మూకలేమో అశ్లీల ఫొటోలూ వీడియోలను తామరతంపరగా సృష్టిస్తూ వ్యక్తుల పరువుప్రతిష్ఠలను మంటగలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో కృత్రిమమేధలోంచి ఊపిరిపోసుకుని సోషల్ మీడియాలో చక్కర్లుకొట్టే కంటెంట్‌లో అవాంఛనీయమైన వాటిని నిరోధించేందుకు కేంద్రం తాజాగా ఐటీ నిబంధనలను సవరించింది. ఏఐ ఆధారిత దృశ్యశ్రవణ సమాచారాన్ని స్పష్టంగా సులువుగా గుర్తించేందుకు లేబుళ్ల ప్రదర్శనను తప్పనిసరి చేయడం, అభ్యంతరకర కంటెంట్‌ను రెండు మూడు గంటల్లో తొలగించాలని నిర్దేశించడం వంటివి ప్రజాశ్రేయస్సు దృష్ట్యా అత్యవసర చర్యలే. వచ్చే ఇరవయ్యో తేదీనుంచి అమలులోకి రానున్న ఈ నిబంధనలకు సామాజిక మాధ్యమాలు పూర్తిగా కట్టుబడి ఉండేలా చూడటం ఇక యంత్రాంగం వంతు!

'ఫలానా చోట పెట్టుబడులు పెట్టండి... అధిక రాబడులు పొందండి' అంటూ ప్రముఖులు చెబుతున్నట్లుగా ఉండే వీడియోలు సోషల్ మీడియాలో తెగ ప్రచారంలోకి వస్తున్నాయి. ఏఐతో తన డీప్‌ఫేక్ వీడియోలనూ ఇలాగే తయారు చేసి నెట్‌లో పెట్టారని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఇటీవల ఆందోళన వ్యక్తంజేశారు. అలాంటి వీడియోల్లో ఒకదాన్ని చూసిన ఓ హైదరాబాదీ మహిళ నిజంగా మంత్రే సలహా ఇస్తున్నారనుకుని రూ.20 లక్షలు పోగొట్టుకున్నారు. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎంపీ సుధామూర్తి తదితరుల డీప్‌ఫేక్ వీడియోలూ ఈమధ్యకాలంలోనే వెలుగుచూశాయి. నిరుడు 7136 కోట్ల డాలర్లుగా ఉన్న జనరేటివ్ ఏఐ మార్కెట్ విలువ- 2032 నాటికి 89వేల కోట్ల డాలర్లకు పైబడుతుందని ఒక అంచనా. అంతకంటే ఎక్కువగా 1.3 లక్షల కోట్ల డాలర్లకు చేరుతుందని మరో అధ్యయనం లెక్కగడుతోంది. ఇదే సమయంలో కట్టుతప్పుతున్న ఏఐ ఉపకరణాల దుర్వినియోగం- ఒక్క ఇండియాకే 2024లో సుమారు రూ.23వేల కోట్ల మేర నష్టం కలిగించింది. ఈ నేపథ్యంలో ఆధునిక సాంకేతికతను చట్ట వ్యతిరేక పనులకు వాడేవాళ్లను కఠినంగా శిక్షించడమెంత అవసరమో- లాభాలకోసం అనుచిత కార్యకలాపాలకు అవకాశం కల్పించే టెక్ కంపెనీలకు కళ్లెలు వేయడమూ అంతే ప్రధానం!

'ఎక్స్' వంటి వేదికల్లో మహిళల చిత్రాలను ఏఐతో అశ్లీలంగా మార్చి పెడుతున్న ఉన్మాద పోకడలపై ఇప్పటికే ఆందోళనలు రేగుతున్నాయి. ఏఐ చాట్‌బోట్లు మైనర్లను ఆత్మహత్యలకు ఉసిగొలిపిన ఉదంతాలు అమెరికా, ఆస్ట్రేలియాల్లో గగ్గోలురేపాయి. పిల్లలతో సున్నిత శృంగార సంభాషణలు జరపడానికి కొన్ని సంస్థలు చాట్‌బోట్లను అనుమతిస్తున్నట్లు వెలువడుతున్న కథనాలు- ఆయా కంపెనీల నైతికతను ప్రశ్నార్థకం చేస్తున్నాయి. ఇలాంటి దుష్ట వ్యాపార పోకడలను, సాంకేతిక దుష్ప్రభావాలను నియంత్రించడానికి ప్రధాని మోదీ ఇటీవల సూచించినట్లుగా అంతర్జాతీయ కార్యాచరణ అత్యావశ్యకం. తగిన పర్యవేక్షణ, పారదర్శకత, భద్రతలతో కూడిన బాధ్యతాయుత ఏఐకోసం దేశాలన్నీ కలిసికట్టుగా పరిశ్రమించాలిప్పుడు!



ఎంతసేపూ మన ప్రయోజనాలే కాదు- ముందు తరాలకు, మన పిల్లలకు, సమాజానికి, వినియోగదారులకు ఏమిస్తున్నామన్నదీ ఆలోచించాలి. సంపద ఏదీ మన సొంతం కాదని మా నాన్న చెప్పేవారు. భవిష్యత్ తరాల సంపదకు మనం ధర్మకర్తలమనీ, దాన్ని వారికి భద్రంగా అందించాలనీ అనేవారు.

– నిసా గోద్రెజ్, వ్యాపారవేత్త

వనరులన్నీ పాక్‌కు... వెతలన్నీ బలూచిస్థాన్‌కు!

"బలూచిస్థాన్ తీవ్రవాదుల దగ్గర పాకిస్థాన్ సైన్యం కంటే అత్యాధునిక ఆయుధాలు ఉన్నాయి" అని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ ఇటీవల తమ పార్లమెంటులో వెల్లడించడం తీవ్ర సంచలనం సృష్టించింది. బలూచ్‌లోని అరుదైన వనరులను వినియోగించుకుంటున్న పాకిస్థాన్ ప్రభుత్వం, అభివృద్ధిలో మాత్రం ఆ ప్రావిన్స్‌కు అన్యాయం చేస్తోంది. దీనికి తోడు చైనా, అమెరికాల జోక్యంతో ఆ ప్రాంతం ఉక్కిరిబిక్కిరవుతోంది.

పాకిస్థాన్ ప్రత్యేక దేశంగా అవతరించిన క్రమంలో అప్పటి కలాత్ రాజ్యాన్ని బలవంతంగా విలీనం చేసుకుంది. దాన్ని వ్యతిరేకిస్తూ అనేక సాయుధ పోరాటాలు జరిగాయి. 2006లో బలోచ్ నాయకుడు నవాబ్ అక్బర్ ఖాన్ బుగ్తీ హత్యతో అవి మరింత తీవ్రమయ్యాయి. నాటి నుంచి కిందటి నెలవరకు జరిగిన సుమారు 3,795 హింసాత్మక ఘటనల్లో 8వేల మందికి పైగా ప్రజలు, భద్రతా సిబ్బంది మరణించారు. ఒక్క 2025లోనే అత్యధికంగా 482 దుర్ఘటనలు చోటుచేసుకుని, 347 మంది పౌరులతో పాటు 751 మంది భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ఈ హింస అంతకంతకూ పెరుగుతూ అక్కడి సామాజిక స్థిరత్వానికి, ప్రజాభద్రతకూ పెను ముప్పుగా మారింది.



అభివృద్ధిలో అన్యాయం

పాకిస్థాన్‌లో సగభాగానికి పైగా భూభాగం కలిగి ఉన్న బలూచిస్థాన్‌లో అత్యంత విలువైన ఖనిజాలు, సహజ వనరులు ఉన్నాయి. కానీ అభివృద్ధి, రాజకీయ భాగస్వామ్యం, మానవ హక్కుల విషయంలో మాత్రం ఆది నుంచి తీవ్రంగా వెనకబడిపోయింది. అక్కడి తలసరి ఆదాయం పాకిస్థాన్ జాతీయ సగటుకన్నా సుమారు 38శాతం తక్కువ. పేదరికంలోనూ ఆ దేశ సగటు (40శాతం జనాభా) కంటే ఎక్కువగా సుమారు 70శాతం మంది బలూచ్ వాసులు బహుముఖ దారిద్ర్యంలో మగ్గిపోతున్నారు. అక్షరాస్యత కేవలం 45 శాతమే. మొత్తం శ్రామికశక్తిలో 40శాతం మందికే పనులు దొరుకుతుండగా, యువతలో నిరుద్యోగిత 62శాతంగా ఉంది. అందునా, బలూచ్ మహిళల్లో 11శాతం మందికే ఉపాధి దొరుకుతోంది. ఇలాంటి దుస్థితిలో బలూచ్ యువత ఇతర ప్రాంతాలకు వలస పోతోంది. పాకిస్థాన్ నుంచి ఉత్పత్తి అవుతున్న ఖనిజాల్లో సుమారు 21శాతం, పంప్డు సహజవాయువుల్లో 25శాతం, ఐరన్ వనరుల ఉత్పత్తిలో 40శాతం బలూచిస్థాన్ నుంచే వస్తున్నాయి. కానీ, జాతీయ ఆర్థిక కమిషన్ ప్రావిన్సులకు పంపిణీ చేసే మొత్తం నిధుల నుంచి బలూచిస్థాన్‌కు కేవలం 9.09శాతమే లభిస్తోంది. ఇలాంటి అసమానతలు బలూచిస్థాన్‌లో తిరుగుబాటు ఉద్యమాలకూ, వేర్పాటువాద భావాలకూ, పాకిస్థాన్ పట్ల తీవ్రమైన అవిశ్వాసానికీ దారితీశాయి. ఇటీవల చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవా(సీపెక్) ప్రాజెక్టుతో బలూచ్ సమస్య మరింత సంక్లిష్టంగా మారింది. ఇస్లామాబాద్ దీన్ని గ్వాదర్ పోర్ట్ తదితర ప్రాంతాల అభివృద్ధికి అవకాశంగా చూపుతున్నా... బలూచ్ వర్గాలు దీన్ని ఆర్థిక వలసవాదమంటున్నాయి. స్థానికుల సమ్మతి లేకుండానే సీపెక్ కోసం భూముల్ని స్వాధీనం చేసుకోవడం, భద్రత పేరుతో సైనికీకరణ పెరగడం వంటివి ఈ ప్రాజెక్టుపై వ్యతిరేకతను పెంచాయి.

నిజానికి, బలూచిస్థాన్ సమస్య పాకిస్థాన్ దేశ నిర్మాణంలో జరిగిన వైఫల్యానికి ప్రతీక. 1948లో కలాత్ రాజ్యాన్ని బలవంతంగా విలీనం చేసుకున్నారన్న భావన బలూచ్ జాతీయవాదానికి దారితీసింది. ఈ ప్రతిఘటనను దేశం పట్ల అవిధేయతగానే కాకుండా, అసంపూర్ణ జాతీయ సమీకరణగానూ విశ్లేషించాలి. పాకిస్థాన్ రాజ్యాంగం సమాఖ్య రాజ్య వ్యవస్థ నిర్మాణాన్ని ప్రతిపాదించినప్పటికీ, ఆచరణలో అధికారమంతా కేంద్రీకృతమైంది. బలూచిస్థాన్ విషయంలో ఈ కేంద్రీకరణ మరింత తీవ్రంగా ఉంది. వనరులపై నియంత్రణ, ఆర్థిక పంపిణీ, భద్రతా నిర్ణయాలన్నీ ఇస్లామాబాద్ చేతుల్లోనే ఉన్నాయి. దాంతో స్థానిక ప్రావిన్సియల్‌కు స్వయం ప్రతిపత్తి లేకుండా పోయింది.

చైనా, అమెరికాల కన్ను

పాకిస్థాన్‌లో సైనిక పాలన ఉన్నా, ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఉన్నా... బలూచిస్థాన్ సమస్యను తిరుగుబాటుగా, భద్రతా సమస్యగానే చూస్తూ వచ్చాయి. అక్కడ సైన్యాన్ని మోహరించి, తిరుగుబాటుదారుల్ని అణచివేయడం వల్ల తాత్కాలికంగా శాంతి నెలకొల్పినట్లుగా కనిపించినా, దీర్ఘకాలంలో సంఘర్షణల ఉద్ధృతిని సృష్టించింది. సైనిక చర్యలు తిరుగుబాటులను అణచివేయడానికి బదులు, కొత్త తరంలో మరింతగా అసంతృప్తిని రాజేస్తున్నాయి. మానవ హక్కుల ఉల్లంఘనలు బలూచ్ ప్రజల్లో పాకిస్థాన్‌పై ఉన్న నమ్మకాన్ని పూర్తిగా ధ్వంసం చేశాయి. బలూచ్ సమస్యను ఇక పాకిస్థాన్‌లోని అంతర్గత తిరుగుబాటుగానో, అక్కడి జాతీయ సమైక్యత సమస్యగానో చూస్తే సరిపోదు. ఎందుకంటే, ఇటీవలి కాలంలో ఇది అమెరికా-చైనా భౌగోళిక రాజకీయ పోటీలో కీలక ప్రాంతంగా మారింది. గ్వాదర్ పోర్ట్, చైనా-పాకిస్థాన్ ఆర్థిక నడవాలపై డ్రాగన్ పెట్టుబడులు పెడుతోంది. మరోవైపు బంగారం, లిథియం, గ్రీన్‌ఎనర్జీ, హైటెక్ పరిశ్రమలకు అవసరమైన అరుదైన నిక్షేపాలు వెలికితీసి ఎగుమతి చేసేందుకు గ్వాదర్ పోర్ట్‌కు సమీపంలోని ప్రస్ని పోర్ట్ అభివృద్ధిపై అమెరికా ఆసక్తి చూపిస్తోంది. ఇటు అరుదైన ఖనిజాల ఉత్పత్తిలో డ్రాగన్ ఆధిపత్యాన్ని తగ్గించడం కాకుండా, అటు దక్షిణాసియాతో పాటు పశ్చిమాసియాలోనూ చైనా ప్రభావాన్ని తగ్గించడానికి ప్రస్ని పోర్ట్ ఉపకరిస్తుందని అమెరికా భావిస్తోంది.

ఈ విదేశీ జోక్యం బలూచ్ ప్రజల సమ్మతి లేకుండా జరుగుతున్నాయి. దాంతో వారిలో అసంతృప్తి పెరుగుతోంది. ఫలితంగా ఘర్షణలు, ప్రతిఘటనలు, సైనికీకరణ మరింతగా పెరిగిపోతున్నాయి. మొత్తానికి బలూచిస్థాన్ అభివృద్ధికి, ఆకాంక్షలకు అనువైన ప్రాంతంగా కాకుండా... ఆధిపత్య పోరాటంలో నలిగిపోతున్న భూభాగంగా మారింది. దక్షిణాసియాలో బలూచిస్థాన్ భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలకు కేంద్రంగా మారే ప్రమాదం స్పష్టంగా కనిపిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అఫ్గానిస్థాన్‌లోని తాలిబన్ సర్కారుతో పాటు బలోచ్ నాయకులతో భారత్ స్నేహబంధాన్ని ఏర్పాటు చేసుకోవడం కీలక పరిణామం. బలూచిస్థాన్ కేంద్రంగా జరుగుతున్న ప్రపంచ రాజకీయ క్రీడలో ఇండియా కీలక పాత్ర పోషించే అవకాశముంది.



డాక్టర్ గద్దె ఓంప్రసాద్
అసోసియేట్ ప్రొఫెసర్, దక్షిణాసియా వ్యవహారాల అధ్యయన కేంద్రం, స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ స్టడీస్, జేఎన్‌యూ



అలాంటి చెవి... మీకుందా?

'మిమ్మల్ని మీరు ఒక బస్సు డ్రైవర్‌గా ఊహించుకోండి. ఒక రోజు మీ బస్సు హైదరాబాద్ నుంచి విజయవాడకు ఉదయం ఆరింటికి పాతిక మంది ప్రయాణికులతో బయలుదేరింది. సూర్యాపేటలో అయిదుగురు బస్సు దిగితే, పదిహేనుమంది ఎక్కారు. కోదాడలో ముగ్గురు దిగి, అయిదుగురు ఎక్కారు. నందిగామలో ఇద్దరు దిగితే, పదిమంది బస్సెక్కారు. చివరికి విజయవాడ చేరుకునేసరికి బస్సులో 40 మంది ప్రయాణికులు మిగిలారు. ఆ బస్సు డ్రైవర్ వయసెంత?'

ఓ కార్పొరేట్ సంస్థలో వర్క్‌షాపు నిర్వహిస్తూ, వ్యక్తిత్వ వికాస శిక్షకురాలు పై ప్రశ్న వేశారు. అది విన్నవారంతా ఒక క్షణం తికమక పడ్డారు. కొందరు డ్రైవర్ వయసుకూ, ప్రయాణికుల సంఖ్యకీ ఉన్న లింక్ అర్థంకాక ఆలోచనలో పడితే, మరి కొందరు పెన్నూ పేపర్ తీసుకుని బస్సు ఎక్కి, దిగిన ప్రయాణికుల సంఖ్య, సమయాలతో లెక్కలు వేయసాగారు. చివరికి ఎవరూ సరైన సమాధానం చెప్పలేకపోయారు. అప్పుడా ట్రెయినర్ చిరునవ్వుతో 'మిమ్మల్ని మీరు బస్సు డ్రైవర్ స్థానంలో ఊహించుకోమని మొదటే చెప్పానుగా... అంటే మీ వయసే ఆ డ్రైవర్ వయసు' అన్నారు. అది విని అందరూ తెల్లమొహం వేశారు. ప్రయాణికుల సంఖ్యలు రాగానే వాటి మీద ధ్యాస పెట్టి మొదట చెప్పిన మాట మర్చిపోయారు.

మనలో చాలామంది పలు సందర్భాలలో ఇలాగే ప్రవర్తిస్తారు. ఎదుటివారు చెప్పింది సరిగ్గా వినకుండా, అర్థం చేసుకోకుండా సమాధానం చెప్పేస్తారు. ఏ విషయాన్నయినా ఆసాంతం ఏకాగ్రతతో విన్నప్పుడే తగిన పరిష్కారం లభిస్తుంది. ముఖ్యంగా వివిధ రంగాల్లో కౌన్సెలర్లుగా పనిచేసేవారికి మరిన్ని జాగ్రత్తలు అవసరం. తమ సమస్యలను, కష్టాలను విని సరైన సలహా ఇస్తారని ఆశించి వచ్చేవారికి ముందుగా కావాల్సింది నేనున్నానంటూ భుజం తట్టే చెయ్యి, ఓపిగ్గా వినే చెవి. నిజానికి చాలా సమస్యలకు ఇదీ పరిష్కారం అంటూ కచ్చితంగా ఎవరూ చెప్పలేరు. అటువంటప్పుడు కౌన్సెలింగ్ ఎందుకూ అంటే- ఆ క్రమంలో సమస్యగా భావిస్తున్న విషయాన్ని పూర్తిగా విడమరచి చెప్పడం వల్ల చెబుతున్న వ్యక్తికే అందులోని కొత్త కోణాలు తెలుస్తాయి. కొత్త ఆలోచనలు వస్తాయి. అలా వచ్చేలా చేయడమే కౌన్సెలర్ పని. శ్రద్ధగా, ఓపిగ్గా వింటూ లోతుగా ప్రశ్నలు వేస్తూ ఇంకా ఇంకా మాట్లాడిస్తారు. అయితే చాలామంది వృత్తినిపుణుల దగ్గరికి వెళ్లలేక ఏ స్నేహితుణ్నో ఆశ్రయిస్తుంటారు. అలాంటి ఫ్రెండ్ మీరైనప్పుడు... కొన్ని జాగ్రత్తలు తీసుకోండి. మీకు తీరుబడిగా ఉన్నప్పుడే కలవండి. ఫోను అవతల పెట్టి, పక్కనే కూర్చుని, చేతులు పట్టుకుని, కళ్లలోకి చూస్తూ పూర్తిగా వినండి. అలా ఎందుకు చేశావ్, ఇలా చేయాల్సింది కదా అంటూ నిలదీయవద్దు. వెంటనే పరిష్కారం చెప్పాల్సిన అవసరమూ లేదు. ఆలోచిద్దాం, ధైర్యంగా ఉండమని చెప్పి అప్పటికి సెలవు తీసుకోవచ్చు. ఆ మాత్రం భరోసా ఇస్తే చాలు, అవతలివాళ్లకు భారమంతా దిగిపోతుంది. తేలికైన మనసుతో ఆలోచించి తమంతట తామే సమస్య నుంచి బయటపడగలుగుతారు.

– పోలిశెట్టి

మహోన్నత సంస్కర్త

ప్రథమ స్వాతంత్ర్య సమరానికి అజ్ఞాతంగా బీజావాపన చేసిన యోధ, భారతీయులు పరపీడన నుంచి బయటపడి ఉజ్వల భవిష్యత్తు గల జాతిగా నిలవడానికి సహస్ర విధాలుగా పరిశ్రమించిన మహామనీషి, సంఘంలోని దురాచారాలను ఖండించి జనంలో ఆత్మవిశ్వాసానికి పాదుకొల్పిన తపస్వి స్వామి దయానందులు. హిందూ ధర్మ, సంస్కృతుల పునరుద్ధారకుడిగా, వైదిక ధర్మ ప్రచారకుడిగా, ఆధునిక సంస్కర్తగా దేశ చరిత్రలో చిరస్మరణీయమైన స్థానం సంపాదించుకున్నారు దయానంద సరస్వతి. నేడు ఆయన జయంతి.

దయానంద సరస్వతి గుజరాత్‌లోని కథియవాడ్ ప్రాంతానికి చెందిన టంకారాలో 1824లో జన్మించారు. ఆయన అసలు పేరు మూల శంకర్. బాల్యం నుంచీ చురుకైన బుద్ధి, అద్భుతమైన జ్ఞాపక శక్తి కలిగి ఉండేవారు. పద్నాలుగేళ్ల పిన్నవయసు నుంచే భక్తిలో ఉత్తమ పద్ధతి మానసికమైన ఆరాధనే అని నమ్మారు. పందొమ్మిదో ఏట ఇంటిని విడిచిపెట్టి బ్రహ్మచర్య దీక్షను పొందారు. పదిహేనేళ్లపాటు హిమాలయాల్లో, తీర్థక్షేత్రాల్లో పర్యటించి సాధువులతో చర్చలు జరిపారు. వేదాధ్యయనం చేయదలచి, మధురలో స్వామి విరజానందుల శిష్యులై, సన్యాసం స్వీకరించి దయానంద సరస్వతిగా ప్రసిద్ధులయ్యారు. గురువుకు ఇష్టమని అర్ధశేరు లవంగాలు దక్షిణగా సమర్పిస్తే విరజానందుడు 'నీ జీవిత పర్యంతం ఆర్య గ్రంథ మహిమను ప్రతిష్ఠిస్తూ వైదిక ధర్మ రక్షణకు జీవితాన్ని సమర్పించు, అదే నాకు గురుదక్షిణ' అని చెప్పారు. నాటి నుంచి దయానందుడు సమాజకార్యానికి అంకితమయ్యారు. వైదిక ధర్మ వైశిష్ట్యాన్ని నిరూపించారు. మూఢవిశ్వాసాల్ని విమర్శించి నిర్మూలించే ప్రయత్నం చేశారు. జ్ఞాన భాండాగారాలైన వేదాలకు భాష్యంతోపాటు వైదిక ధర్మానికి అద్దంపట్టే 'సత్యార్థ ప్రకాశిక'ను రచించారు. 'సంస్కార విధి' అనే గ్రంథాన్నీ రాశారు. 1875 ఏప్రిల్ 10న ఆర్య సమాజాన్ని స్థాపించారు.



అంతర్యామి


దయానందుడు జాతీయవాది. దైవభక్తితో పాటు సేవాదృక్పథం పెంచుకోవాలని, సోమరితనం, ఉదాసీనత విడిచిపెట్టి నైతిక నిష్ఠ, కార్యశూరత్వం, సమైక్య భావన, నిరాడంబర జీవనం అలవర్చుకోవాలని ఉద్బోధించారు. ఐకమత్యంగా ఉంటేనే దేశం అభివృద్ధి చెందుతుందన్నది ఆయన విశ్వాసం. అనాథలకు, పేదలకు మంచి విద్య లభించాలని, పాలకులు ఆధ్యాత్మిక నైతికశక్తులకు వశులై ఉండాలని, సర్వమానవ ప్రేమయే ప్రభుత్వ లక్ష్యం కావాలని దయానందులు బోధించారు. 'వేద కాలానికి మళ్లండి' అన్నది దయానందుడి నినాదం. అలా అని ఆయన ఛాందసుడు కాదు. స్త్రీవిద్య, స్వాతంత్ర్యాల విషయంలో ఆనాటికి ఆయనవి అభ్యుదయ భావాలు. పరదా పద్ధతిని వ్యతిరేకిస్తూ వితంతు పునర్వివాహాలను సమర్థించారు. అంటరానితనం మహా జాడ్యమన్నారు.

ఆర్యసమాజం నాటి చారిత్రక అవసరం. రాజారామ్మోహన్ రాయ్, మహాత్మాగాంధీల మధ్య కాలంలో భారతీయ ధర్మ సంస్కృతుల పరిరక్షణకు కృషిచేసిన మహోన్నత మనిషి దయానందులు. 1883లో ఆ మహా సంస్కర్త ఈ లోకాన్ని వీడారు.

– దామెర వెంకట సూర్యారావు

చక్కటి ఆరోగ్యం కోసం...

కృత్రిమ ఎరువులు, పురుగు మందుల విచ్చలవిడి వాడకం వల్ల గాలి, నీరు, నేల విషతుల్యం అవుతున్నాయి. ముఖ్యంగా ప్రమాదకర రసాయనాలు పంటల్లోకి, అనంతరం మానవ దేహాల్లోకి చేరి క్యాన్సర్లతో పాటు ఎన్నో రకాల వ్యాధులకు కారణమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులకు గిరాకీ పెరుగుతోంది. ఆసియా, ఓషియానియా వంటి వాటితో పోలిస్తే ఇతర ప్రాంతాల్లో అది ఎక్కువగా ఉంటోంది. 2023లో ఆయా ప్రాంతాల్లో జరిగిన విక్రయాల్లో ఆర్గానిక్ ఆహార ఉత్పత్తుల వాటా (శాతాల్లో)...



ఉత్తర అమెరికా	46.9
ఐరోపా	40.1
ఆసియా	11.3
ఓషియానియా	1.1

(ఆధారం: ది వరల్డ్ ఆఫ్ ఆర్గానిక్ అగ్రికల్చర్ నివేదిక-2025)

చేసిన పాపం సరిపోలేదన్నట్లు...

'ఇదిగో బాబూ... ఒక నాన్‌వెజ్ లేని లడ్డూ ఇవ్వు'

'మీరా సార్! ఏంటి మా స్వీట్ షాపులోకి ఇలా దయచేశారు. పాపాల భైరవుడు అని చిన్నప్పటి నుంచి వింటున్నాను. ఇన్నాళ్లూ టీవీలో.. ఇప్పుడు ప్రత్యక్షంగా చూస్తున్నాను. రేపే వెళ్లి గంగలో మునిగితేగానీ మిమ్మల్ని చూసిన దోషం పోదేమో'

'ఏయ్.. ఏం మాట్లాడుతున్నావ్. ఒక నాన్‌వెజ్ లేని లడ్డూ ఇవ్వు'

'నాన్‌వెజ్ లేకపోవడం ఏంటి సార్? అసలు మీరు ఏం మాట్లాడతారో.. ఎప్పుడు ఎందుకు ఎలా స్పందిస్తారో.. వాటన్నింటినీ అర్థం చేసుకోవాలంటే ఏదైనా ప్రత్యేక పీహెచ్‌డీ ఉందా చెప్పండి! అయినా మైకుల ముందు మీ హావభావాలు చూసి... మీ మాటలు విని కామెడీ యాక్టర్లు భయపడిపోతున్నారంటే నమ్మండి... ఎక్కడ మీరు వాళ్లకి పోటీ వస్తారో అని'

'ఏయ్.. ఆపు ఇక. అది అది అది... యానిమల్ ఫ్యాట్... ఆ.. ఆ.. ఆ.. జంతుకొవ్వు లేని లడ్డూ ఇవ్వు'

'ఊరుకోండి సర్, కోట్ల మంది దర్శించుకునే వేంకటేశ్వరుడన్నా, ఆయన భక్తులన్నా బొత్తిగా భయం లేకుండా పవిత్ర లడ్డూలో నానా పాపాలూ కలిపేశారు మీవాళ్లు. నేను మీలాగ కాదండీ. నాకు పాప పుణ్యాల మీద కాస్త నమ్మకం ఉంది. ముఖ్యంగా పాపభీతి ఉంది. అయినా, మీరూ మీ బ్యాచ్ అంతలా ఎలా బరితెగించారండీ బాబూ. అసలు వెంకన్నతో ఆడుకోవాలంటే మీకెన్ని గుండెలుండాలి!'

'ఏయ్... ఆపాపాపాపు.. మొన్నమొన్నమొన్న రిపోర్ట్ వచ్చింది చూడలేదా. నాన్‌వెజ్... అదే యాని.. యాని.. యానిమల్ ఫ్యాట్ లేదని'

'భలేవారే.. అసలు పాలు, వెన్న, నెయ్యే లేవని తేల్చిచెప్పారుగా. అంతకన్నా ఏం కావాలీ'

'ఏయ్ ఏంటి నోరు పెగులుతోంది... అమ్మోరుకు మేకపోతును బలిచ్చినట్లు 2029లో రప్పా రప్పా...'

'ఛ ఊరుకోండి సర్. అనేవన్నీ అంటారు. మళ్లీ సినిమా డైలాగ్ అని రాగాలు తీస్తారు?

'ఇంతకీ నాన్‌వెజ్ లేని... ఆ.. యానిమల్ ఫ్యాట్ లేని లడ్డూ ఇవ్వు చాలు. అదొక్కటి లేకపోతే చాలు. ఇక నువ్వు లడ్డూ ఎలా చేసినా నాకేం ఫర్వాలేదు. అందులో బాత్‌రూమ్‌లు కడిగే యాసిడ్ కలుపు, కావాలంటే యూరియా, బట్టలుతికే డిటర్జెంట్, శవాల్ని నిల్వ ఉంచే రసాయనాలు అన్నీ పొయ్యి.. నాకవన్నీ డోంట్ కేర్. నాన్‌వెజ్... అదే.. యానిమల్ ఫ్యాట్ లేకపోతే చాలు.. అంతా ప్యూర్. మొత్తం స్వచ్ఛం. వెరీ హెల్దీ. మావాళ్లతో గుప్పిళ్లు గుప్పిళ్లు తినిపిస్తా'



'మీకేం సార్, గనుల్నే మింగిన ఘనులు అని లోకం కోడైకూస్తోంది. దేన్నయినా అరాయించుకుంటారు. పాపం... మిగిలిన వాళ్ల సంగతేంటి! పైగా తిరుమలలో అంత పాపం చేసి మళ్లీ వెంకన్నకి మిమ్మల్ని మించిన గొప్ప భక్తుడు లేడని ప్రచారాలు చేసుకుంటున్నారు. అసలు మీది గుండెనా.. గుండ్రాయా సార్?'

'ఏయ్.. గుర్తు పెట్టుకో. మేము మళ్లీ అధికారంలోకి వస్తాం. అప్పుడు సప్త సముద్రాల అవతల దాగున్నా లాక్కొచ్చి రప్పారప్పా...'

'హహ్హహ్హా కనండి. పగటి కలలు బాగా కనండి'

'ఏంటి కలలా... సరేగానీ, నాన్‌వెజ్ లేని లడ్డూ ఇస్తావా లేదా?'

'ఇందాకే చెప్పాను కదా సార్. మీ అంతలా బరితెగించడం ప్రపంచంలో ఎవరివల్లా కాదని. మా షాపులో లడ్డూ శుద్ధంగా ఉంటుంది. ఇదిగో తీసుకోండి. అయ్యో అదేంటి సార్. బొటనవేలు, చూపుడువేలు మడిచి.. తీర్థం తాగినట్లు లడ్డూ తింటున్నారు. నేనెక్కడా చూళ్లేదు ఇది'

'నేనింతే, నా రూటే సపరేటు'

'అందుకేగా.. 11 దగ్గరికి వచ్చి పడ్డారు!'

'ఏయ్... ఇక మూడేళ్లు.. నువ్వే చూడు'

సరే చూస్తానుగా.. ఇంతకీ ఇలా దయచేశారేంటి? ఓ... మీ వాళ్లతోనే ప్లాన్డ్‌గా గొడవ చేయించి, నానా బూతులూ తిట్టించి ఇప్పుడు తీరిగ్గా పరామర్శకు వచ్చారా?'

'కొత్తగా ప్లాన్ చేయాల్సిన ఖర్మ మాకేంటి? మావాళ్లంటే ఏమనుకున్నావు... చూసిరమ్మంటే కాల్చొస్తారు'

'అదే కదండీ మా ఖర్మ. అయినా, ఆ బూతులు ఏంటి సర్. ఇంటిల్లిపాదీ వార్తలు చూద్దామంటేనే భయం వేస్తోంది'

'ఏయ్.. ఎక్కువ మాట్లాడుతున్నావ్. మావాళ్లని ఒకసారి నీ షాపుపైకి వదలమంటావా?'

'అలా వదలబట్టే... అచ్చోసిన ఆంబోతుల్లా మీ గుంపు చెలరేగిపోబట్టే కదా.. ఆకాశం నుంచి మురికికాలవలోకి అన్నట్లు అయిపోయింది మీ పార్టీ పరిస్థితి. అయినా, పరామర్శకు వెళ్లేవాడు ఎవడైనా రోడ్ షోలు చేస్తాడా సార్? ట్రాఫిక్ జామయ్యి జనాలకు ఎంత ఇబ్బంది? అసలు మీ ఉద్దేశం పరామర్శా.. లేకపోతే డబ్బిచ్చి మరీ జనాల్ని పోగేసి జిందాబాద్‌లు కొట్టించుకోవడమా?'

'చెబుతా.. నీ సంగతి తరవాత చెబుతా.. రేపు నేను అధికారంలోకి వచ్చాక...'

'హహ్హహ్హహ్హా...'


'అలా విరగబడి నవ్వుతావేంటి?'

'మీ కామెడీ టైమింగ్‌కి ఆమాత్రం నవ్వురాదా ఏంటి సార్. అయినా ఒకసారి నమ్మి అయిదేళ్లూ ఏడ్చింది చాలదా. మళ్లీ తెచ్చుకోవడానికి మేమేమన్నా పిచ్చివాళ్లమా! అసలూ దేవుడికే ద్రోహం తలపెట్టిన మీ ముఠా సామాన్య జనాలకు మాత్రం మంచి చేస్తుందా? ఆ మాత్రం మాకు అర్థమవదనుకుంటున్నారా?'

– వెంకీ

అర్థం చేసుకోవాలి!

బొమ్మలు: శ్రీనివాస్ కథ: రాజు



ఐసీఏఐ అధ్యక్షుడిగా విశాఖ వాసి ప్రసన్నకుమార్

నేడు దిల్లీలో బాధ్యతల స్వీకరణ


ప్రసన్నకుమార్

ఈనాడు, విశాఖపట్నం: 'ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఛార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) అధ్యక్షుడిగా విశాఖకు చెందిన ఛార్టర్డ్ అకౌంటెంట్ డి.ప్రసన్నకుమార్ ఎన్నికయ్యారు. ఆయన ఇప్పటి వరకు ఐసీఏఐ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఏపీ నుంచి ఐసీఏఐ అధ్యక్షుడిగా ఎన్నికైన తొలి వ్యక్తి ఆయనే కావడం గమనార్హం. గురువారం దిల్లీలో బాధ్యతలు చేపట్టనున్నారు. తమిళనాడులోని తిరువళ్లూరు జిల్లా నెడంబరం గ్రామం ఆయన స్వస్థలం. సీఏలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత 1985లో విశాఖలో స్థిరపడ్డారు. ఇక్కడి 'శ్రీరామమూర్తి అండ్ కో'లో వృత్తి జీవితం ప్రారంభించారు. విద్యార్థి దశలోనే దక్షిణ భారత సీఏ విద్యార్థి సంఘంలో ఉపాధ్యక్షుడిగా పనిచేశారు.

పురపాలికలకు ఆర్థిక సంఘం నిధుల విడుదల

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 95 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు రూ.334 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు బుధవారం ప్రభుత్వం విడుదల చేసింది. 2025-26 సంవత్సరానికి తొలి విడతగా టైడ్, అన్‌టైడ్ గ్రాంట్ల కింద వీటిని కేటాయించారు. వివిధ కారణాలతో ఎన్నికలు నిర్వహించని పురపాలక, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు ఆర్థిక సంఘం నిధులు కేంద్రం నిలిపివేసింది.

కొండల్లో బజ్జుందాం పదరా గున్నా!



ప్రశాంతంగా రోడ్డు దాటుతున్న ఈ ఏనుగుల గుంపునకు పార్వతీపురం మన్యం జిల్లా పరిధిలోని అర్తాం కొండలే అడ్డా. ఎనిమిదేళ్ల కిందట శ్రీకాకుళం వైపు నుంచి వచ్చిన ఇవి మన్యం జిల్లా రైతులకు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. స్థానిక కొండల్లో తలదాచుకోవడం.. ఆకలైతే పంట పొలాలపైకి దండెత్తడం వీటికి సాధారణమై పోయింది. పంటల్లేని సమయంలో ధాన్యం మిల్లుల్లోని నిల్వలపై దాడులు చేస్తుంటాయని స్థానికులు తెలిపారు. రెండు రోజుల కిందట గున్న ఏనుగులతో పాటు కొండ దిగిన గజాలు.. బుధవారం ఉదయం కొమరాడ మండలంలోని కుమ్మరిగుంట రహదారి దాటి అర్తాం కొండల్లోకి వెళ్లాయి. అవి మళ్లీ వచ్చే అవకాశం ఉంది.. రాత్రి సమయాల్లో ఎవరూ ఒంటరిగా బయటకు రావద్దని అటవీ శాఖ అధికారులు సమీప గ్రామస్థులను అప్రమత్తం చేస్తున్నారు.

– న్యూస్‌టుడే, కొమరాడ

పెన్నా గ్రూపునకు చుక్కెదురు

- పయనీర్ పిటిషన్‌ను కొట్టివేసిన తెలంగాణ హైకోర్టు
- రాకియా పిటిషన్‌పై కింది కోర్టు విచారణ సబబే

ఈనాడు, హైదరాబాద్: వాటాల బదలాయింపునకు సంబంధించిన రస్ అల్ ఖైమా ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (రాకియా)తో వివాదంపై పెన్నా గ్రూపునకు బుధవారం తెలంగాణ హైకోర్టులో చుక్కెదురైంది. వాటాల బదలాయింపు వ్యవహారంపై రాకియా వేసిన సూట్‌ను కింది కోర్టు అనుమతించడంపై పయనీర్ అల్యూమినియం ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆన్‌రాక్) దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. రాకియా భాగస్వామ్యంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్రమాస్తుల కేసులో నిందితుల జాబితాలో ఉన్న పెన్నా సిమెంట్స్, పెన్నా ప్రతాప్‌రెడ్డిలు ప్రధాన వాటాదారులుగా ఆన్‌రాక్ అల్యూమినియం ఫ్యాక్టరీని ఏర్పాటు చేశారు. ఇందులో రాకియా రూ.192.35 కోట్ల పెట్టుబడులు పెట్టింది. పెన్నా గ్రూపునకు వైఎస్ ప్రభుత్వం ప్రయోజనాలు కల్పించినందున జగన్ కంపెనీల్లో రూ.68 కోట్లు పెట్టుబడులు పెట్టగా అందులో రూ.58 కోట్లు పెన్నా గ్రూపు, దాని అనుబంధ కంపెనీల నుంచి, మిగిలిన రూ.10 కోట్లు ఆన్‌రాక్ అల్యూమినియం లిమిటెడ్ సీఈఓ కె.రామమోహన్‌రావు పెట్టుబడి పెట్టినట్లు ఆర్వోసీ దర్యాప్తులో వెల్లడైంది. ఆన్‌రాక్ ప్రాజెక్టు వ్యయంగా పేర్కొంటూ రూ.20 కోట్ల మొత్తాన్ని పి.ఆర్.ఎనర్జీ హోల్డింగ్ ద్వారా జగన్ కంపెనీల్లో పెట్టుబడులు పెట్టిందని పేర్కొంది. అయితే ఈ పెట్టుబడులను ఆన్‌రాక్ ఆస్తిఅప్పుల పట్టీలో ప్రాజెక్ట్ వ్యయంగా ప్రస్తావించింది. విశాఖరూరల్‌లో బాక్సైట్ నిల్వల కేటాయింపులు రద్దు కావడంతో ఆన్‌రాక్ భవితవ్యం ప్రశ్నార్థకమైంది. ఈ నేపథ్యంలో అల్యూమినియం కంపెనీలోని వాటాలను పెన్నా గ్రూపు విక్రయించాలని భావించింది. వాటాల విక్రయాలకు సంబంధించిన ఒప్పందాలను కొనసాగించరాదంటూ రాకియా వాణిజ్య కోర్టులో సూట్ దాఖలు చేసింది. రెండు కంపెనీల మధ్య ఏదైనా వివాదం ఉన్నప్పుడు మధ్యవర్తిత్వం లేకుండా సివిల్ కోర్టులో నేరుగా సూట్ వేయడానికి వీల్లేదంటూ పయనీర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టి మంగళవారం తీర్పు వెలువరించింది. రాకియా హక్కుల కోసం సూట్ దాఖలు చేసిందని పేర్కొంది. వాణిజ్య కోర్టుల చట్టంలోని సెక్షన్ 12ఎ ప్రకారం మధ్యవర్తిత్వం తప్పనిసరన్న పయనీర్ వాదన ఈ సూట్ విచారణను జాప్యం చేయడానికేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. రాకియా సూట్ వేయడాన్ని సమర్థిస్తూ పయనీర్ పిటిషన్‌ను కొట్టివేస్తూ తీర్పు వెలువరించింది. రాకియా తరపున సీనియర్ న్యాయవాది ఎస్.రవి, న్యాయవాది జి.వంశీకృష్ణ వాదనలు వినిపించారు.

చైన్, పెడల్స్ లేకుండానే సైకిల్ సవారీ

- రూపొందించిన తెలుగు విద్యార్థులు
- ఆలోచనకు ప్రధాని మన్ననలు


ఈ–సైకిల్‌తో సంజీవ్‌రత్నం, లోకేష్, మహదేవ్, మనీష్

అనంతపురం, న్యూస్‌టుడే: సైకిల్ అనగానే గుర్తొచ్చేది చైన్, పెడల్.. ఆ రెండూ లేకుండానే సామాన్యుడి సవారీని రూపొందించారు తెలుగు కుర్రాళ్లు. అయినా దీనిపై ఎంచక్కా ప్రయాణించవచ్చు. బ్యాటరీ సాయంతో నడిచే ఈ ట్రెండీ సైకిల్ అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని అటల్ ఇంక్యుబేషన్ కేంద్రంలో రూపుదిద్దుకుంది. పశ్చిమగోదావరి జిల్లా వీరవాసరం మండలవాసి సంజీవ్‌రత్నం, విజయవాడ, భట్టిప్రోలు, పామర్రుకు చెందిన లోకేశ్, మహదేవ్, మనీష్ అనే నలుగురు యువకులు దీన్ని తయారుచేశారు. సివిల్ ఇంజినీరింగ్ పూర్తిచేసిన వీరు తమ ఆలోచనను ఇంక్యుబేషన్ కేంద్రంలోని నిపుణులతో పంచుకోగా వారు సలహాలు ఇచ్చి ప్రోత్సహించారు. కేంద్ర ప్రభుత్వం, ఇంక్యుబేషన్ కేంద్ర సహకారం, ఇతర సంస్థలతో చేసుకున్న ఒప్పందంతో ఇప్పటి వరకు రూ.23 లక్షల నిధులను సమకూర్చుకున్నారు. వాటితో సైకిల్ డిజైన్‌ను మరింత మెరుగుపరుస్తున్నారు.

ఎలా పనిచేస్తుందంటే..

ఈ సైకిల్‌కి ఛార్జింగ్ బ్యాటరీ అమర్చి, దాని నుంచి వెనుక చక్రానికి వైర్‌తో అనుసంధానం చేశారు. రోడ్డుపై విద్యుత్తు సరఫరాతో పరుగులు తీస్తుంది. అవసరమనుకుంటే పెడల్స్ అమర్చుకొని తొక్కచ్చు. సైకిల్ తొక్కినప్పుడు విద్యుదుత్పత్తి అయ్యేలా తగిన పరికరాలు అమర్చారు. అవసరానికి తగ్గట్లు సైకిల్, ద్విచక్ర వాహనంలా పనిచేస్తుంది. గంటకు 25 కి.మీ. వేగంతో ప్రయాణించే దీనిని 'పెడల్ బై వైర్ బైస్కిల్'గా పిలుస్తున్నారు. గత ఏడాది దిల్లీలో జరిగిన ఓ సదస్సులో ప్రధాని నరేంద్ర మోదీ ఎదుట ఈ సైకిల్‌ను ప్రదర్శించగా ఎంతగానో మెచ్చుకున్నారు. ఎక్కడ తయారు చేశారు, మార్కెట్‌లోకి ఎప్పుడొస్తుందని ఆరా తీశారు.


సైకిల్‌ను పరిశీలిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

అమరావతిలో 'అరణ్యారామం'

- అటవీ సంబంధిత సంస్థలన్నీ అక్కడే
- తాడేపల్లి రక్షిత అటవీ ప్రాంతంలో ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం రాజధాని అమరావతిలో 'అరణ్యారామం' పేరిట అటవీ, వన్యప్రాణుల సంరక్షణ, నిర్వహణకు సంబంధించి రాష్ట్రస్థాయిలో ప్రతిష్ఠాత్మక కేంద్రాన్ని (ప్రీమియర్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ఫర్ ఫారెస్ట్రీ అండ్ వైల్డ్‌లైఫ్ మేనేజ్‌మెంట్) ఏర్పాటు చేయనుంది. తాడేపల్లి రక్షిత అటవీ ప్రాంతంలోని 132వ కంపార్ట్‌మెంట్‌లో హెక్టార్ విస్తీర్ణంలో దీన్ని నెలకొల్పనుంది. రూ.24 కోట్ల వ్యయంతో 48 వేల చదరపు అడుగుల నిర్మిత ప్రాంతంలో భవనాలు నిర్మించనుంది. ఈ మేరకు అటవీ దళాల అధిపతి నుంచి అందిన ప్రతిపాదనలను ఆమోదిస్తూ అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులిచ్చారు.

అరణ్యారామంలో అంతర్భాగంగా ఉండే ప్రధాన సంస్థలు, కేంద్రాలివే..

1. రాష్ట్ర అటవీ పరిశోధన, శిక్షణ సదుపాయం (ఎస్ఎఫ్ఆర్అండ్ టీఎఫ్)
2. కమ్యూనిటీ ఆధారిత పర్యావరణ హిత పర్యాటకం (ఎకో టూరిజం) కోసం అత్యుత్తమ శిక్షణ సదుపాయ కేంద్రం (సీబీఈటీ)
3. మానవ- వన్యప్రాణి సంఘర్షణ నివారణ కేంద్రం (హనుమాన్)
4. రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (ఎస్ఎఫ్‌డీఏ)
5. మహా హరిత కుడ్యం (గ్రేట్ గ్రీన్‌వాల్) పర్యవేక్షణ కేంద్రం
6. పులుల రాష్ట్ర స్థాయి పర్యవేక్షణ కేంద్రం
7. అడవుల్లో అగ్ని ప్రమాదాలు, జియోమాటిక్స్, వన్యప్రాణులపై జరిగే నేరాల పర్యవేక్షణకు కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్

తెలంగాణ పుర ఎన్నికల్లో 73% పోలింగు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పుర ఎన్నికలు ముగిశాయి. చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. బుధవారం రాష్ట్రంలో జరిగిన పుర ఎన్నికల్లో దాదాపు 73.01 శాతం పోలింగ్ నమోదైంది. 13న 138 కేంద్రాల్లో ఓట్లు లెక్కించనున్నారు. 16న కార్పొరేషన్ల మేయర్లు, ఉపమేయర్లు, మున్సిపాలిటీల ఛైర్‌పర్సన్లు, వైస్ ఛైర్‌పర్సన్ల పదవులకు పరోక్ష ఎన్నికలు జరగనున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఏడు నగరపాలక సంస్థల్లోని 412 డివిజన్లు, 116 పురపాలక సంఘాల్లోని 2,569 వార్డుల్లో ఎన్నికలు జరిగాయి. మొత్తం 52,17,413 మందిలో 38,09,406 మంది ఓటేశారు. పురపాలికల్లో 75.88 శాతం, నగరపాలక సంస్థల్లో 66.05 శాతం మంది ఓటేశారు. అత్యధికంగా 26,67,025 మంది మహిళల్లో 19,57,226 మంది (73.39%).. 25,49,750 మంది పురుషుల్లో 18,51,829 (72.63%) మంది.. 638 మంది ఇతరుల్లో 351 మంది (55.02%) ఓటింగ్‌లో పాల్గొన్నారు.

విజయవాడ నార్త్ జోన్ పరిధిలో రూ.167 కోట్ల నాలా పన్ను బకాయిలా?

- విస్మయం వ్యక్తంచేసిన హైకోర్టు
- వసూళ్లకు కమిటీ ఏర్పాటు చేయండి
- సీఎస్‌ను ఆదేశించిన సీజే నేతృత్వంలోని ధర్మాసనం

ఈనాడు, అమరావతి: వ్యవసాయ భూమిని వ్యవసాయేతర అవసరాలకు మార్చే క్రమంలో చెల్లించాల్సిన పన్ను(నాలా ట్యాక్స్) బకాయిలు వసూళ్ల చేసే విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు కీలక ఆదేశాలిచ్చింది. విజయవాడ నార్త్ జోన్ పరిధిలో రూ.167 కోట్ల బకాయిలు ఉండటంపై ధర్మాసనం విస్మయం వ్యక్తంచేసింది. రాష్ట్ర వ్యాప్తంగా భారీ స్థాయిలో బకాయిలుండే అవకాశం ఉందని పేర్కొంది. బకాయిల వసూళ్లకు రెవెన్యూశాఖ ముఖ్య కార్యదర్శి నేతృత్వంలో ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)ను ఆదేశించింది. నిబంధనల ప్రకారం బకాయిల వసూళ్లకు చర్యలు తీసుకోవాలని, మినహాయింపులు ఇచ్చే విషయంలో నిబంధనల ప్రకారం వ్యవహరించాలని తేల్చిచెప్పింది. ఈ మొత్తం వ్యవహారంపై తీసుకున్న చర్యలపై నివేదికను కోర్టు ముందు ఉంచాలని సీఎస్‌ను ఆదేశించింది. తదుపరి విచారణను 3 నెలలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈమేరకు ఉత్తర్వులిచ్చింది.

విజయవాడ-గుణదల పరిధిలోని కార్మెల్ నగర్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన 90 ప్లాట్లకు విజయవాడ నగరపాలక సంస్థ అధికారులు ఆక్యుపెన్సీ ధ్రువపత్రం ఇచ్చారని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏపీ యునైటెడ్ ఫోరం ఫర్ ఆర్‌టీఐ క్యాంపెయిన్ అధ్యక్షుడు ఎన్.సత్యనారాయణ హైకోర్టులో పిల్ వేశారు. బుధవారం విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. వ్యవసాయ భూమిని కన్వర్షన్ చేయకుండా ప్లాట్లు నిర్మించారన్నారు. నాలా ట్యాక్స్ చెల్లించలేదన్నారు విజయవాడ నార్త్ జోన్ పరిధిలో పన్ను బకాయిలు రూ.167 కోట్లు ఉన్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కువ మొత్తంలో బకాయిలు ఉన్నాయని కోర్టు దృష్టికి తెచ్చారు.

అమరావతి చరిత్ర అద్భుతం

జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖల్ హాస్పర్


అమరావతిలోని మహాస్తూపం వద్ద కాన్సుల్ జనరల్ మైఖల్ హాస్పర్ తదితరులు

అమరావతి, న్యూస్‌టుడే: అమరావతిలోని శిల్ప సంపద, ఇక్కడి చరిత్ర తెలుసుకుంటుంటే అద్భుతంగా ఉందని, వీటిని తిలకించడం ఆనందంగా ఉందని జర్మనీ కాన్సుల్ జనరల్ మైఖల్ హాస్పర్ తెలిపారు. పల్నాడు జిల్లా అమరావతిలోని పురావస్తు ప్రదర్శనశాల, మహాస్తూపం, ధ్యానబుద్ధ ప్రాజెక్టు, అమరేశ్వరాలయాన్ని బుధవారం ఆయన సందర్శించారు. బౌద్ధుల కాలం నాటి చారిత్రక ఆధారాలు పరిశీలించారు. ధ్యానబుద్ధ విగ్రహం రూపశిల్పి, కల్చరల్ సీఈవో మల్లికార్జునరావు అక్కడి విశేషాలను తెలియజేశారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

గంజాయి కేసుల్లో 157 మందికి శిక్షలు: డీజీపీ

ఈనాడు, అమరావతి: గంజాయి, మాదకద్రవ్యాలకు సంబంధించి గతేడాది జనవరి నుంచి ఇప్పటివరకూ 72 కేసుల్లో 157 మందికి శిక్షలు పడ్డాయని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా చెప్పారు. అత్యధికంగా అనకాపల్లి జిల్లాలో 21, అల్లూరి సీతారామరాజు-11, విజయనగరం-7, విశాఖపట్నం-6, గుంటూరు జిల్లాలో 6 కేసుల్లో శిక్షలు పడ్డాయని తెలిపారు. ఈ మేరకు డీజీపీ బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. గంజాయి, డ్రగ్స్‌కు సంబంధించి ఈగల్ టోల్‌ఫ్రీ నంబర్ 1972కు కాల్ చేసి సమాచారమివ్వాలని సూచించారు.



సభా సమయం

గత ప్రభుత్వ విధ్వంసాన్ని వివరిస్తుంటే ఓర్చుకోలేక వైకాపా వాకౌట్

మంత్రి సత్యకుమార్ యాదవ్



ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 2019-24 మధ్య వైకాపా ప్రభుత్వం సృష్టించిన విధ్వంసాన్ని, దాని పరిణామాలను గవర్నర్ వివరించడాన్ని జీర్ణించుకోలేక.. మాజీ సీఎం జగన్, వైకాపా నాయకులు సభ నుంచి వాకౌట్ చేశారని మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. 'రాష్ట్ర విభజనతో మొదలైన సమస్యలతో పాటు గత ప్రభుత్వ విధ్వంసకర పాలనతో ఎదురైన పెను సవాళ్లను అధిగమిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. దీనికి అద్దం పట్టేలా గవర్నర్ చేసిన ప్రసంగం ఉంది. ప్రతి పదంలో రాష్ట్ర భవిష్యత్తు గురించి కూటమి ప్రభుత్వ ఆరాటం, శ్రమ ప్రతిబింబించాయి' అని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

సభ్యుల యోగక్షేమాలు తెలుసుకున్న పవన్, లోకేశ్

- ఉదయం 10 గంటలకు సభ మొదలైనా అర గంట ముందుగానే పలువురు కూటమి పార్టీల సభ్యులు సభలోకి వచ్చారు. మహిళా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు.
- 9.51 గంటలకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ వేర్వేరుగా సభలోకి వచ్చారు. వారు రాగానే తెదేపా, జనసేన, భాజపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు వారి చుట్టూ చేరారు. పరస్పరం పలకరించుకున్నారు. వారిద్దరూ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకున్నారు. తర్వాత ఇరువురూ పలకరించుకున్నారు.
- వైకాపా సీనియర్ ఎమ్మెల్సీ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును లోకేశ్ పలకరించారు.
- భాజపా శాసనసభాపక్షనేత విష్ణుకుమార్‌రాజు, ఆ పార్టీ ఎమ్మెల్యే సుజనాచౌదరికి జగన్ అభివాదం చేశారు. వారూ తిరిగి అభివాదం చేశారు.
- జనసేన ఎమ్మెల్సీ నాగబాబు పంచకట్టుతో సభకు హాజరయ్యారు.

ఇలా వచ్చి.. అలా వెళ్లారు

'ప్రతిపక్ష హోదా' నినాదాలతోనే వైకాపా సభ్యుల రాక



ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ప్లకార్డులు ప్రదర్శిస్తూ సభకు వస్తున్న వైకాపా అధ్యక్షుడు జగన్, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ఈనాడు, అమరావతి: 'ప్రతిపక్ష హోదా ఇవ్వండి' అంటూ వైకాపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ అసెంబ్లీకి హాజరయ్యారు. బడ్జెట్ సమావేశాల తొలి రోజు వైకాపా అధ్యక్షుడు జగన్, పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పార్కింగ్ ప్రాంతం నుంచి నడుచుకుంటూ అసెంబ్లీ గేట్-4 వరకు వచ్చారు. ప్లకార్డులు లోపలికి తీసుకువెళ్లరాదని, అనుమతి లేదని అక్కడ భద్రతా సిబ్బంది వారించగా వైకాపా సభ్యులు కాసేపు వాగ్వాదానికి దిగారు. వారి వెంట వచ్చిన పార్టీ కార్యకర్తలు కొందరు గేటు దగ్గరగా వచ్చి జై జగన్ అంటూ గట్టిగా కేకలు పెడుతూ హడావుడి చేశారు. వైకాపా సభ్యుల వద్ద ఉన్న చాలావరకు ప్లకార్డులను భద్రతా సిబ్బంది తీసేసుకుని, వారిని లోపలకు అనుమతించారు. జగన్‌తో సహా సభ్యులంతా గేటులోపలికి ప్రవేశించారు. అప్పుడే ముఖ్యమంత్రి చంద్రబాబు కాన్వాయ్ సీఎం కార్యాలయం వైపు వెళుతుండడంతో.. కొద్దిగా ఆగాలని వైకాపా సభ్యులను భద్రతా సిబ్బంది ఆపారు. కాన్వాయ్ వెళ్లిపోగానే మీరు వెళ్లండని చెప్పినా వినిపించుకోకుండా గట్టిగా నినాదాలు చేస్తూ ముందుకు వెళ్లే ప్రయత్నం చేశారు. ఇంతలో సీఎం కాన్వాయ్ వెళ్లిపోవడంతో వైకాపా సభ్యులు అసెంబ్లీలోకి వెళ్లారు. గవర్నర్ ప్రసంగం మొదలైన కాసేపటికే వారంతా బయటకొచ్చేశారు.

వాట్.. శీనూ ది గ్రేట్!

ఎమ్మెల్సీ దువ్వాడకు జగన్ పలకరింపు

వైకాపా సభ్యులతో కలిసి జగన్ బయటకొస్తున్నపుడు.. ఆ పార్టీ నుంచి సస్పెండయిన ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ లాబీల్లో తారసపడ్డారు. 'వాట్.. శీనూ ది గ్రేట్' అని జగన్ ఆయన్ను పలకరించారు. దగ్గరకు వచ్చిన దువ్వాడ.. జగన్ కాళ్లకు నమస్కారం చేయగా ఆయన భుజం తట్టారు. 'ఇంకా సినిమా హీరోలాగే చేస్తున్నావా? బిజినెస్‌లు అవీ బానే ఉన్నాయా? ఫ్యామిలీ రచ్చ ఎందుకు చేసుకుంటున్నావు' అని జగన్ అడగ్గా.. 'పర్సనల్ ఇష్యూస్ అన్నీ సెటిల్ చేసుకుంటున్నా' అని శ్రీనివాస్ సమాధానం చెప్పారు. 'తర్వాతేం చేద్దామనుకుంటున్నావ్' అని జగన్ అడగ్గా.. 'నేనెక్కడికి వెళతాను, మీరేం చెబితే అదే. ఒకసారి మిమ్మల్ని కలిసి మాట్లాడతా' అని దువ్వాడ అడిగారు. సరే చూద్దాం అంటూ జగన్ ముందుకు సాగారు. తర్వాత లాబీల్లో దువ్వాడ శ్రీనివాస్ విలేకరులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి అంశంలో తాను భక్తుల వైపే ఉంటానని చెప్పారు. సస్పెన్షన్ ఎత్తేయకపోతే ఏం చేస్తారని అడగ్గా.. 'ఎన్నికలకు ఇంకా సమయం ఉంది. అప్పుడు జగన్ అవకాశం ఇవ్వకపోతే సొంతంగానే పోటీ చేస్తా' అని ఆయన చెప్పారు.

20 నెలల్లో 60 విజయాలు

ప్రతి రంగంలోనూ వృద్ధి సాధించాం

- కూటమి పాలనపై సీఎం చంద్రబాబు
- 'తల్లికి వందనం'తో 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం
- కోటి కుటుంబాలకు మూడు ఉచిత సిలిండర్ల పంపిణీ
- ఎన్డీయే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించిన సీఎం




అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన ఎన్డీయేపక్ష సమావేశంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు ★ హాజరైన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

ఈనాడు, అమరావతి: కూటమి ప్రభుత్వ 20 నెలల పాలనలో 60 విజయాలు సాధించామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ప్రతి రంగంలోనూ వృద్ధి నమోదైందని.. రాష్ట్రం విధ్వంసం నుంచి వికాసం వైపు పురోగమిస్తోందని చెప్పారు. అతి తక్కువ కాలంలో ప్రజలు మెచ్చే పాలన అందించామని, ప్రజావసరాల్ని గుర్తించి నిర్ణయాలు తీసుకున్నామని వెల్లడించారు. అసెంబ్లీ కమిటీ హాల్‌లో నిర్వహించిన ఎన్డీయేపక్ష సమావేశంలో సీఎం ప్రసంగించారు. రాష్ట్ర ప్రభుత్వం సాధించిన విజయాలు, అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్ని మంత్రులు, కూటమి పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వివరించారు. క్షేత్రస్థాయిలో ఈ విజయాల్ని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.

సీఎం చెప్పిన 60 విజయాల్లో కొన్ని..

- తల్లికి వందనం ద్వారా 67.27 లక్షల మంది విద్యార్థులకు సాయం. తల్లుల ఖాతాల్లో ఇప్పటి వరకూ రూ.10,090 కోట్లు జమ చేశాం.
- స్త్రీశక్తి పథకం ద్వారా మహిళలు 43.51 కోట్లకు పైగా ఉచిత బస్సు ప్రయాణాలు చేశారు. ఇందుకు రూ.1,532 కోట్లు ఖర్చు పెట్టాం.
- 1.08 కోట్ల కుటుంబాలకు దీపం-2 పథకం కింద ఏడాదికి మూడు చొప్పున ఉచిత వంటగ్యాస్ సిలిండర్లు పంపిణీ చేస్తున్నాం.
- 'అన్నదాత సుఖీభవ' ద్వారా 46 లక్షల మంది రైతుల ఖాతాల్లో రెండు విడతల్లో రూ.6,310 కోట్లు జమ చేశాం.
- ప్రతి నెలా 63 లక్షల మందికి పింఛన్లు ఇస్తున్నాం. దీనికి ఇప్పటి వరకూ రూ.58,654 కోట్లు ఖర్చు చేశాం. దేశంలోనే అత్యధిక మొత్తంలో, అత్యధిక మందికి పింఛన్లు ఇస్తున్న ఏకైక రాష్ట్రంగా రికార్డు సృష్టించాం.
- రాష్ట్రవ్యాప్తంగా రూ.వెయ్యి కోట్లతో రహదారుల మరమ్మతులు, మరో రూ.3 వేల కోట్లతో కొత్త రహదారులు వేశాం. పల్లె పండగ ద్వారా గ్రామాల్లో 4వేల కి.మీ రోడ్ల నిర్మాణం చేపట్టాం.
- మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ద్వారా గిన్నిస్ రికార్డు నెలకొల్పాం. రూ.2,600 కోట్ల బోధనారుసుములు చెల్లించాం.
- ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా 13,326 గ్రామసభలు నిర్వహించాం. దాదాపు మూడు వేల పనులకు శ్రీకారం చుట్టాం.
- 1.21 కోట్ల మంది దాహార్తి తీర్చేందుకు అమరజీవి జలధార పేరుతో రూ.3,050 కోట్లతో ప్రాజెక్టుకు రూపకల్పన చేశాం.
- తొలిసారి ట్రూడౌన్ ద్వారా యూనిట్‌కు 13 పైసల విద్యుత్తు ఛార్జీలు తగ్గించాం. రూ.4,494 కోట్ల విద్యుత్తు బకాయిల్ని ప్రభుత్వమే భరిస్తోంది.
- విశాఖలో రూ.1.25 లక్షల కోట్లతో గూగుల్ ఏఐ డేటా సెంటర్ ఏర్పాటు చేయనున్నాం. అమరావతిలో క్వాంటం వ్యాలీ భవనాలకు శంకుస్థాపన చేశాం.
- ఆర్థిక ఇబ్బందులున్నా ప్రభుత్వ ఉద్యోగులకు బకాయిలు, డీఏ, టీఏ, సరెండర్ లీవ్స్, బెనిఫిట్స్ చెల్లిస్తున్నాం.
- సాగునీటి ప్రాజెక్టుల కోసం రూ.23,793 కోట్లు ఖర్చు పెట్టాం.
- 1.25 లక్షల మంది మత్స్యకారులకు ఏడాదికి రూ.20 వేల చొప్పున ఆర్థిక సాయం అందిస్తున్నాం.

సూటిగా.. సుత్తిలేకుండా..

- 3-7 నిమిషాల్లో ప్రసంగం ముగించాలి
- ఎన్డీయే శాసనసభాపక్ష భేటీలో సీఎం చంద్రబాబు



సమావేశంలో మాట్లాడుతున్న చంద్రబాబు. చిత్రంలో పవన్ కల్యాణ్, విష్ణుకుమార్ రాజు, లోకేశ్

ఈనాడు, అమరావతి: ఎమ్మెల్యేలు తాము మాట్లాడదలుచుకున్న అంశంపై పూర్తిస్థాయిలో సిద్ధమై శాసనసభ సమావేశాలకు రావాలని, 3 నుంచి గరిష్ఠంగా 7 నిమిషాల్లోనే ప్రసంగం ముగించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్దేశించారు. ప్రశ్నోత్తరాల్లో ఒక్కో ప్రశ్న, దానికి సమాధానం 6 నిమిషాల్లో ముగించాలని సూచించారు. సరిగా సిద్ధమై రానివాళ్లే విషయాన్ని సాగదీస్తారని, సభలో ఆవు కథలు చెప్పకుండా, సూటిగా మాట్లాడాలని స్పష్టంచేశారు. ప్రతి సభ్యుడు విధిగా ఉదయం 9 గంటలకే సభలో ఉండాలని, విప్‌లు ఈ బాధ్యత తీసుకోవాలని ఆదేశించారు. ప్రశ్నోత్తరాలు, జీరో అవర్, ముగిశాక.. ఉదయం 11 నుంచి చివరి వరకు తాను సభలోనే ఉంటానని, ఎవరేం మాట్లాడుతున్నారో గమనిస్తానని స్పష్టం చేశారు. వ్యక్తిగత కక్షలు, విభేదాలకు సభను వేదికగా చేయడానికి వీల్లేదన్నారు. బుధవారం శాసనసభ కమిటీ హాల్లో ఎన్డీయే పార్టీల శాసనసభాపక్ష సమావేశంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఉద్దేశించి చంద్రబాబు మాట్లాడారు. 'సమావేశాలు అర్థవంతంగా జరగాలి. సభ్యులు లేవనెత్తిన అంశాలపై మంత్రులు విధిగా స్పందించాలి. సరైన సమాధానం చెప్పాలి. మా సమస్యల్ని మా ఎమ్మెల్యే ప్రస్తావించారు, మంత్రులు స్పందించారని ప్రజలు అనుకోవాలి. మీరు ఐదు కోట్ల జనాభాకు జవాబిస్తున్నట్లు గుర్తుంచుకోండి' అని సీఎం దిశానిర్దేశం చేశారు. 'సభలో నోరు జారొద్దు. ఎదుటివారు తిట్టారని మనమూ దూషించొద్దు. నిర్మాణాత్మకంగా వ్యవహరించాల'ని పేర్కొన్నారు. పనితీరు బాగాలేని, ఆరోపణలు ఎదుర్కొంటున్న 40 మంది తెదేపా ఎమ్మెల్యేలతో విడిగా మాట్లాడనున్నట్లు సీఎం చంద్రబాబు చెప్పారు.

గుజరాత్‌లో మాదిరిగా గెలుస్తూనే ఉండాలి

రాష్ట్రంలో మరో 15 ఏళ్ల పాటు కూటమి ఐక్యత కొనసాగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. 'కూటమి పార్టీల అగ్రనేతల్లో పూర్తిస్థాయిలో ఐక్యత ఉంది. నియోజకవర్గాల స్థాయిలోనూ ఐక్యత సాధించాలి. గుజరాత్‌లో భాజపా వరుసగా గెలుస్తోంది. ఏపీలోనూ అలాంటి ఫలితాలు సాధించాలి' అని సీఎం సూచించారు.

క్వాంటమ్ కోర్సుకు అధిక దరఖాస్తులు

ప్రజాప్రతినిధులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సీఎం సూచించారు. 'నేను క్వాంటమ్ టెక్నాలజీ నిపుణుడిని కాదు. కానీ దాని ప్రయోజనాలు తెలుసు కాబట్టే, ఆ రంగంలో రాష్ట్రం ముందుండాలని చొరవ తీసుకున్నా. మద్రాస్ ఐఐటీకి క్వాంటమ్ కోర్సులో శిక్షణకు 2.50 లక్షల దరఖాస్తులు వస్తే, వాటిలో 1.10 లక్షలు ఏపీ నుంచే ఉన్నాయి. మనం రాష్ట్రంలో ఒక కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తే 1.60 లక్షలు వచ్చాయి. దీన్నిబట్టి రాష్ట్రంలో ఎంత టాలెంట్ ఉందో అర్థం చేసుకోండి' అని సీఎం ఉదహరించారు.

కేంద్రం సాయాన్ని అందిపుచ్చుకోవాలి

'రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తోంది. ఎన్నికల హామీలు అమలు చేస్తున్నామంటే కేంద్రం అండగా ఉండబట్టే. కేంద్రం నిధులివ్వకపోతే అమరావతి, పోలవరం ప్రాజెక్టులు ప్రారంభమయ్యేవి కాదు. విశాఖ స్టీల్‌ప్లాంట్‌పై కేంద్రం తన పాలసీ మార్చుకొని మరీ సాయం చేసింది. అందుకే ఆ పరిశ్రమ తాజాగా రూ.54 కోట్ల లాభాలు గడించింది. కేంద్రం సహకారాన్ని అందిపుచ్చుకోవాలి' అని సీఎం ఎమ్మెల్యేలకు సూచించారు. విజయవాడ-విశాఖ మధ్య హైస్పీడ్ రైలు అడుగుతున్నటు తెలిపారు.

వైకాపా హయాంలో మతవిశ్వాసాలపై దాడి

వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమలలో నెయ్యి కల్తీ కుంభకోణం ఒక్కటే కాదని, అనేక దేవాలయాల్లో అపచారాలు జరిగాయని సీఎం గుర్తుచేశారు. దేవాలయాలపై దాడులు, రామతీర్థంలో రాముడి విగ్రహం తల తొలగించడం, అంతర్వేదిలో రథం దహనం వంటి ఘటనలను ప్రస్తావించారు. 'ఈ సమావేశంలో పాల్గొన్న వారిలో 90 శాతం నాటి వైకాపా ప్రభుత్వ బాధితులే. ఇప్పుడు నీతులు చెబుతున్న వైకాపా నేతలు.. వారు అధికారంలో ఉన్నప్పుడు చేసిన అరాచకాల్ని మర్చిపోయార'ని చంద్రబాబు గుర్తు చేశారు.

రాష్ట్రం కోసం కలిసే ఉంటాం: పవన్

రాష్ట్ర అభివృద్ధి కోసం కూటమి పార్టీలు మరో పదిహేనేళ్లపాటు కలిసే ఉంటాయని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'రాష్ట్ర భవిష్యత్తు కోసం కలిశాం. దుర్మార్గుడిపై ఉమ్మడిగా పోరాడి గెలిచాం. ఐదేళ్ల వైకాపా పాలనలో సృష్టించిన విధ్వంసాన్ని అధిగమించి, రాష్ట్రాన్ని ప్రగతిపథంలో నడిపిస్తున్నాం. మనం నిర్దేశించుకున్న లక్ష్యాలను చేరుకునే దిశగా ప్రయాణం కొనసాగాలి' అని పేర్కొన్నారు. 'వైకాపా ఓ దుర్మార్గమైన పార్టీ. కులాల మధ్య చిచ్చుపెట్టి, కూటమిలో విభేదాలు సృష్టించాలని చూస్తోంది. మత విద్వేషాలు రేకెత్తించాలనుకుంటోంది. మనం తప్పు చేస్తే వారికి అవకాశం ఇచ్చినట్టవుతుంది. అందరూ అప్రమత్తంగా ఉండాలి' అని పవన్ పిలుపునిచ్చారు.

11. 11. 11. ఇదే వైకాపా లెక్క!

- సభలో ఉన్న ఆ కొద్ది నిమిషాలూ రచ్చే
- సమావేశాల తొలి రోజు వైకాపా తీరిదీ

ఈనాడు, అమరావతి: 11 మంది.. 11వ తేదీ.. 11 నిమిషాలు ఇదేంటనుకుంటున్నారా? వైకాపా ఎమ్మెల్యేలు బుధవారం సభలో ఉన్న సమయం. గతేడాది బడ్జెట్ సమావేశాల సందర్భంగా గవర్నర్ ప్రసంగం రోజునా 11 నిమిషాలే సభలో ఉన్న ఆ పార్టీసభ్యులు ఈసారీ అలాగే చేశారు. మిగతా రోజుల్లో ఎమ్మెల్యేలెవరూ సభకు రావట్లేదు. ఎమ్మెల్సీలు మండలికి వస్తున్నా... జగన్‌మోహన్‌రెడ్డి సైగలతో వారూ ఎమ్మెల్యేల్ని అనుసరించి బుధవారం సభ నుంచి బయటికి వెళ్లిపోయారు. ఉన్న ఆ కాస్త సమయమూ వైకాపా సభ్యులు గవర్నర్ ప్రసంగానికి అడ్డు తగులుతూ ఆందోళన చేశారు. వైకాపా సభ్యులతో కలిసి ఉదయం సభలోకి వచ్చిన జగన్.. సభ ప్రారంభమైన 10 నిమిషాలకు బయటకు వెళ్లారు. మిగతా సభ్యులందరూ ఆయన వెంట బయటికి వెళ్లేసరికి 10:11 గంటలు అయింది.

ఆందోళన చేయాలంటూ పురమాయింపు

బడ్జెట్ సమావేశాల తొలిరోజున బుధవారం గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభమైంది. ఆయన ప్రసంగం ప్రారంభమైన రెండు నిమిషాలకు ప్లకార్డులు పట్టుకుని వెళ్లి ఆందోళన చేయాలంటూ పార్టీ సభ్యులకు జగన్, ఆయన పక్కన కూర్చున్న బొత్స సత్యనారాయణ సైగలతో ఆదేశాలిచ్చి వెల్‌లోకి, పోడియం వద్దకు పంపారు. దాంతో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహా వైకాపా సభ్యులు పోడియంను చుట్టుముట్టారు. ప్లకార్డులు ప్రదర్శిస్తూ 'ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం.. దొంగల రాజ్యం దోపిడీ రాజ్యం, రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడాలి, వైద్య కళాశాలల ప్రైవేటీకరణను రద్దుచేయాలి' అని నినాదాలు చేస్తూ గవర్నర్ ప్రసంగానికి ఆటంకం కలిగించే ప్రయత్నం చేశారు. ఇవేమీ లెక్కచేయకుండా గవర్నర్ తన ప్రసంగాన్ని కొనసాగించారు. బొత్స సత్యనారాయణ తన స్థానంలోనే నిల్చుని ప్లకార్డు పట్టుకుని నిరసన తెలిపారు. జగన్, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మినహా మిగతా సభ్యులంతా వెల్, పోడియం వద్ద ఆందోళనలో పాల్గొన్నారు.

తొలుత ప్లకార్డు చింపి గవర్నర్ పైకి విసిరింది పెద్దిరెడ్డి

పోడియం వద్ద ఆందోళన కొనసాగుతుండగా.. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తొలుత ప్లకార్డును చింపి కాగితం ముక్కల్ని గవర్నర్ పైకి విసిరారు. మరికొందరు సభ్యులు ఆయన్ని అనుసరించారు. వాటిని మార్షల్స్ అడ్డుకున్నారు. 7 నిమిషాల పాటు నినాదాలు చేశాక, 'వెనక్కి వచ్చేయండి వెళ్లిపోదాం' అన్నట్లు జగన్ సైగలు చేశారు. బొత్స ఏదో చెప్పబోయినా వినలేదు. అప్పటిదాకా కూర్చున్న జగన్.. కాస్త అసహనంతో నిల్చుని వచ్చేయండని వారికి మళ్లీ సైగ చేశారు. పలువురు సభ్యులు ఆయన దగ్గరికి రాగా వారితో కలిసి బయటికి వెళ్లిపోయారు. మిగతావారు ఆయన్ను అనుసరించారు. 10:11 గంటలకు వైకాపా సభ్యులు సభ నుంచి పూర్తిగా బయటికి వెళ్లిపోయారు.



గవర్నర్ ప్రసంగిస్తుండగా అసెంబ్లీ నుంచి వాకౌట్ చేసి, బయటకు వెళ్తున్న వైకాపా సభ్యులు

పవన్‌కల్యాణ్‌తో లోకేశ్ భేటీ

శాసనసభ బడ్జెట్ సమావేశాలపై చర్చ



ఈనాడు-అమరావతి: శాసనసభలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఐటీ, మానవ వనరులశాఖ మంత్రి నారా లోకేశ్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉప ముఖ్యమంత్రి పేషీలో ఈ సమావేశం జరిగింది. బడ్జెట్ సమావేశాల నిర్వహణతో పాటు వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం ఆర్థిక, శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, ఆహార పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌లు ఉప ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు.

గవర్నర్‌ను అవమానించేందుకే అసెంబ్లీకి వచ్చిన వైకాపా సభ్యులు

హోం మంత్రి అనిత



ఈనాడు-అమరావతి: వైకాపా నేతలు గవర్నర్‌ను అవమానించేందుకే అసెంబ్లీకి వచ్చి, వారి ఎజెండాను పూర్తి చేసుకొని వెళ్లిపోయారని హోం మంత్రి అనిత విమర్శించారు. ఏదైనా అన్యాయం జరిగితే గవర్నర్‌ను కలిసి తెలియజేస్తుంటామని చెప్పే పెద్ద మనుషులు, అసెంబ్లీలో ప్రసంగిస్తుంటే గవర్నర్‌పై కాగితాలు విసిరి అవమానించేలా వ్యవహరించడం ఎంత వరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. బుధవారం ఆమె సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. మూడు నెలల్లోపు సభకు హాజరుకాకపోతే సభ్యత్వం రద్దవుతుందనే కాన్సెప్ట్ నడుస్తోందని, ఈ విషయంలో స్పీకర్ కఠినంగా ఉన్నారని, ఆ సమస్య రాకుండా.. షో చేసేందుకు వైకాపా నేతలు అసెంబ్లీకి వచ్చినట్లు ఉందని హోం మంత్రి పేర్కొన్నారు.



సభకు హాజరైన జనసేన, భాజపా, వైకాపా సభ్యులు

శాసనసభలో సీసీ కెమెరాలు

డిజిటల్ అటెండెన్స్ నమోదు కోసం ఏర్పాటు

ఈనాడు, అమరావతి: శాసనసభలో సభ్యుల హాజరును డిజిటల్ విధానంలో రికార్డు చేసేందుకు నూతన సాంకేతిక విధానాన్ని శాసనవ్యవస్థ అందుబాటులోకి తెచ్చింది. ఇందుకోసం సభలో స్పీకర్ సీటు పైభాగంలో ఒక సెట్, ఆ స్థానానికి కుడి, ఎడమ వైపున మరో రెండు సెట్ల సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సెట్‌లో 3 చొప్పున మొత్తం 9 కెమెరాలు ఉంటాయి. సభ్యులు సభలోకొచ్చి వారికి కేటాయించిన సీట్లో కూర్చున్నప్పుడే ఈ కెమెరాలు వారి హాజరును రికార్డు చేసేలా 'సీట్ లింక్డ్ అటెండెన్స్' విధానాన్ని బుధవారం నుంచి ప్రారంభించారు. సభ్యుడు తన స్థానంలో కూర్చున్నాక ఈ కెమెరాలు వారిని ఫేషియల్ రికగ్నిషన్ ద్వారా గుర్తించి హాజరును నమోదు చేస్తాయి. గురువారం నుంచి దీన్ని పూర్తిస్థాయిలో అమలు చేయనున్నారు.

మంత్రిగారూ.. బెదిరింపు లేఖ వచ్చిందట!

- అసెంబ్లీ లాబీల్లో చర్చ
- మా కుటుంబసభ్యులు ఆందోళన చెందారు: మంత్రి దుర్గేష్

ఈనాడు, అమరావతి: మీ ప్రాణాలకు ముప్పు ఉందంటూ నలుగురు మంత్రుల (కందుల దుర్గేష్, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్)కు బెదిరింపు లేఖలు రావడంపై బుధవారం అసెంబ్లీ లాబీల్లో చర్చ జరిగింది. లాబీల్లో కనిపించిన మంత్రి దుర్గేష్‌ను ఒకరిద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు.. ఏంటీ మీకు లెటర్లు వచ్చాయంట అని అడగ్గా ఆయన సరదాగా స్పందించారు. తర్వాత లాబీల్లో తనను కలిసిన విలేకర్లతో మాట్లాడారు. 'మావోయిస్టుల నుంచి మీకు, మీ కుటుంబసభ్యులకు ముప్పు ఉందంటూ లేఖ మా ఆఫీస్‌కొచ్చింది. దీంతో మా కుటుంబసభ్యులు ఆందోళన చెందారు. సచివాలయంలో ఉన్న నాకు ఫోన్ చేసి మాట్లాడారు. బయట నుంచి కూడా చాలా మంది ఫోన్ చేశారు. కానీ, ఇది మావోయిస్టుల లేఖలా లేదు' అని వ్యాఖ్యానించారు. మావోయిస్టులు ఇంకా ఎక్కడున్నారు? ఉన్నా మీకెందుకు లేఖ రాస్తారని విలేకరులు ప్రశ్నించగా 'అదే కదా... టూరిజంలాంటి చిన్న శాఖ నాది. ఇక్కడ డబ్బులేముంటాయి? పోనీ డబ్బులున్నాయి ఏదో చేస్తున్నారని బెదిరించారని అనుకోవడానికి' అని దుర్గేష్ పేర్కొన్నారు.

లేఖలపై కేసు నమోదు

మంత్రులు కందుల దుర్గేష్, అనగాని సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, సత్యకుమార్‌లతో పాటు వారి కుటుంబసభ్యులకు మావోయిస్టుల నుంచి ముప్పు ఉందని లేఖలు రావడంపై తుళ్లూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 9న వచ్చిన లేఖలను 10వ తేదీన తెరిచిన సిబ్బంది అందులో హెచ్చరికలు ఉండడంతో మంత్రులకు చెప్పారు. మంత్రి కందుల దుర్గేష్ ఓఎస్డీ శ్రీనివాసులు మంగళవారం తుళ్లూరు పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. 'మీ లైఫ్ డేంజర్‌లో ఉంది. మీపైన, మీ కుటుంబసభ్యులపైన మావోయిస్టులు త్వరలో దాడి చేస్తారు. జాగ్రత్త' అని లేఖలో రాసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రాథమిక విచారణ అనంతరం పోలీసులు అది ఆకతాయిల పనిగా గుర్తించారు. లోతైన దర్యాప్తు కోసం కేసు నమోదు చేశారు. లేఖలో ఉన్న సెల్‌ఫోన్ నంబరుకు ఫోన్ చేసి విచారించగా ఎవరో తన నంబరును బెదిరింపు లేఖలో ఇచ్చారని తెలంగాణకు చెందిన వ్యక్తి తెలిపారు.

ఒక్క రోజు ముచ్చటకేనా ప్రజలు మిమ్మల్ని గెలిపించింది

జగన్‌పై షర్మిల మండిపాటు



ఈనాడు, అమరావతి: ప్రతిపక్ష హోదా ఇస్తేనే సభకు వస్తానని వైకాపా అధ్యక్షుడు జగన్ ఈసారి కూడా చెప్పడం అత్యంత సిగ్గుచేటని రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(ఏపీసీసీ) అధ్యక్షురాలు షర్మిల మండిపడ్డారు. ఒక్క రోజు మురిపానికి ప్రజలు మిమ్మల్ని ఓట్లేసి గెలిపించలేదని విమర్శించారు. మైకు ఇస్తేనే అసెంబ్లీకి వస్తానంటూ మారం చేయడం ఏంటని జగన్‌పై షర్మిల ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్ శాసనసభకు వెళ్లే దమ్ము, ధైర్యం లేకుంటే రాజీనామా చేసి.. పార్టీ ఎమ్మెల్యేలతోనూ చేయించాలి అని ఆమె డిమాండ్ చేశారు. 'అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగం పూర్తిగా అవాస్తవాలు, కల్పితాలతో సాగింది. రాష్ట్రాభివృద్ధిపై దశ-దిశ లేకుండా ఎన్నికల మేనిఫెస్టోకు మెరుగులద్ది చదివినట్లుగా ఉంది. రూ.33 వేల కోట్లతో సూపర్ సిక్స్ అమలు చేస్తున్నామనేది బూటకం. పోలవరం ఎత్తు తగ్గించి జీవనాడిలో జీవం తీశారు. వీబీ జీ రామ్ జీ పథకం గొప్పగా ఉందనడం కూటమి ప్రభుత్వ మూర్ఖత్వానికి నిదర్శనం' అని షర్మిల విమర్శించారు.

సత్యదూరంగా గవర్నర్ ప్రసంగం: సీపీఐ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగం సత్యదూరంగా, పొగడ్తలతో సాగిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. "గవర్నర్ ప్రసంగం వాస్తవాలకు విరుద్ధంగా ఉంది. సంక్షేమం, అభివృద్ధికి సమతుల్యం పాటించామని గవర్నర్‌తో సత్యదూరమైన అంశాలన్ని కూటమి ప్రభుత్వం చదివించింది. కూటమి ప్రభుత్వం రూ.3.27లక్షల కోట్ల అప్పులు చేసి, పతనం వైపు రాష్ట్రాన్ని నడిపిస్తూ అభివృద్ధి వైపు పరుగులు పెడుతున్నట్లు గవర్నర్‌తో చెప్పించడం హాస్యాస్పదంగా ఉంది" అని విమర్శించారు.





ముగిసిన ఉత్సవాలు.. పోటెత్తిన విశ్వాసులు

గుణదల మేరీ మాత ఉత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు భారీగా విశ్వాసులు తరలివచ్చారు. కార్యక్రమంలో భాగంగా దివ్య పూజాబలి ప్రసాదాన్ని చూపుతున్న బిషప్‌లు రాజారావు, షమీంద్ర జయవర్ధన. -గుణదల, న్యూస్‌టుడే

ఎన్‌హెచ్‌-65కి.. ఒక్కటే డీపీఆర్‌!

- హైదరాబాద్‌-విజయవాడ హైవే బెంజ్‌సర్కిల్‌ వరకు విస్తరణ
- 18న ఉమ్మడి జిల్లా స్టేక్‌హోల్డర్స్‌ సమావేశంలో స్పష్టతకు అవకాశం

ఈనాడు, అమరావతి

ఎన్‌హెచ్‌-65కి ఏకరూపకత తీసుకొచ్చేందుకు అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్‌-విజయవాడ హైవే ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలోని భువనగిరి జిల్లా మల్కాపురం నుంచి విజయవాడ పున్నమిఘాట్‌ వరకు విస్తరణకే డీపీఆర్‌ రూపొందించారు. తాజాగా బెంజ్‌సర్కిల్‌ వరకు విస్తరించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటి వరకు పున్నమిఘాట్‌ వరకు ఒక భాగం.. బెంజ్‌సర్కిల్‌ నుంచి మచిలీపట్నం వరకు మరో భాగంగా ఉన్న ఎన్‌హెచ్‌-65 ఇప్పుడు ఒకే రహదారిగా విస్తరించనున్నారు. వేరువేరుగా తయారు చేసిన డీపీఆర్‌లను అనుసంధానం చేసి ఒక్కటిగా రూపొందించనున్నారు. ఫిబ్రవరి 18న విజయవాడలో జరగనున్న భాగస్వాముల (స్టేక్‌ హోల్డర్స్‌) సదస్సులో దీనిపై స్పష్టత రానుంది.

రెండు పైవంతెనల నిర్మాణం..

- విజయవాడ నగరంలోని ట్రాఫిక్‌ రద్దీ నేపథ్యంలో రెండు పైవంతెనల నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నారు. కనకదుర్గ పై వంతెన నుంచి బెంజ్‌సర్కిల్‌ పైవంతెనకు అనుసంధానం చేస్తూ దాదాపు 5 కి.మీ మేర భారీ పైవంతెన నిర్మించాలని ప్రజాప్రతినిధులు అడుగుతున్నారు. బెంజ్‌సర్కిల్‌ నుంచి గోసాల వరకు ఎన్టీఆర్‌ సర్కిల్‌, ఆటోనగర్‌, కానూరు, తాడిగడప, పెనమలూరు కూడళ్లలో ట్రాఫిక్‌ రద్దీ ఎక్కువగా ఉండడంతో ఆ మధ్యలో ఓ భారీ పై వంతెన నిర్మాణం చేపట్టాలని గతంలో విజయవాడ, మచిలీపట్నంలో జరిగిన భాగస్వాముల సదస్సులో ప్రజాప్రతినిధులు డిమాండ్‌ చేశారు. ఈ రెండు అంశాలపై ప్రతిపాదనలు ఎన్‌హెచ్‌ఏఐ దృష్టికి తీసుకువెళ్లారు.

గతంలో కన్సల్టెన్సీ అభ్యంతరం

- బెంజ్‌సర్కిల్‌- గోసాల పరిధిలో వంతెన నిర్మాణానికి మెట్రో ప్రతిపాదనలు అడ్డంకిగా ఉన్నాయని గతంలో కన్సల్టెన్సీ అభ్యంతరం తెలిపింది. ఎన్‌హెచ్‌-65కి మెట్రోకి ముడి పెట్టవద్దని అది పట్టాలెక్కేలోగా ప్రజలకు ఇబ్బందులు పెరుగుతాయని.. డీపీఆర్‌ రివైజ్‌ చేయాలని ప్రజాప్రతినిధులు గట్టిగా చెప్పారు. ఈసారి ఆ ప్రతిపాదనలకు పరిగణనలోకి తీసుకుంటారని తెలుస్తోంది.

తెలంగాణ అధికారుల రాక

- హైదరాబాద్‌- విజయవాడ హైవేను తెలంగాణ ఎన్‌హెచ్‌ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. విజయవాడ-మచిలీపట్నం హైవే డీపీఆర్‌ విజయవాడ ఎన్‌హెచ్‌ అధికారుల ఆధ్వర్యంలో జరుగుతోంది. రెండు భాగాలను ఒకే డీపీఆర్‌ ద్వారా చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు భావిస్తున్నారు. దీంతో స్టేక్‌హోల్డర్ల సమావేశానికి తెలంగాణలో ఆ మార్గం పర్యవేక్షిస్తున్న ఎన్‌హెచ్‌ పీడీ, ఆర్వో కూడా సమావేశానికి హాజరుకానున్నారు. వీరితో పాటు జిల్లా ఎన్‌హెచ్‌ అధికారులు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు, కలెక్టర్లు, అధికారులు పాల్గొంటారు.

తవ్వింది లెక్కేసి.. కాసులు పోగేసి..

- కేవలం ఎన్‌వోసీలు తీసుకుని మట్టి దందా
- పరిశీలనలకే పరిమితమవుతున్న అధికారులు

ఈనాడు, అమరావతి

గత వైకాపా ప్రభుత్వంలో కొత్తూరు తాడేపల్లి పరిధిలో లక్షల క్యూబిక్‌ మీటర్ల మట్టిని అక్రమంగా తవ్వేశారు. వీరందరినీ గుర్తించి రూ.వందల కోట్ల డిమాండ్‌ నోటీసులను కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే అధికారులు ఇచ్చారు. కానీ ఒక్క రూపాయి వెనక్కి కట్టించింది లేదు. కేవలం నోటీసులు ఇచ్చి అక్రమార్కులతో కొందరు అధికారులు తెరవెనుక వ్యవహారం నడిపించారనే ఆరోపణలున్నాయి. ప్రస్తుతం మరో అడుగు ముందుకేసి గతంలో ఎక్కడైతే అక్రమాలు జరిగాయో.. మళ్లీ అక్కడే విచ్చలవిడిగా తవ్వేసి తరలించుకుపోతున్నారు. దీనిపై జిల్లా యంత్రాంగానికి గ్రామస్థులు ఫిర్యాదు చేస్తుంటే.. రావడం పరిశీలించి వెళ్లడం.. తప్ప చర్యలు శూన్యం. కొత్తూరు రెవెన్యూ పరిధిలోని ఆర్‌ఎస్‌ నంబరు.39లో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా.. కేవలం నిరభ్యంతర పత్రాలు(ఎన్‌వోసీ)లను చూపిస్తూ.. వాటినే మైనింగ్‌ అనుమతులుగా నమ్మిస్తూ.. విచ్చలవిడిగా మట్టి తవ్వకాలు చేస్తున్నారు. జిల్లా అధికార యంత్రాంగానికి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రెండు రోజుల కిందట కూడా స్పందనలో తెదేపా నేత, సామాజిక కార్యకర్త మెండెం జమలయ్య.. ఈ తవ్వకాలపై ఫిర్యాదు చేశారు. రోజుకు కనీసం 500 లారీలకు పైగానే తవ్వి తీసుకెళ్లిపోతున్నారంటూ ఆధారాలతో సహా సమర్పించారు.



ఆర్‌ఎస్‌ 39లో భారీగా తవ్వి లారీల్లో తరలింపు..

తాజాగా మైనింగ్‌ అధికారులొచ్చి..

మైనింగ్‌ ఆర్‌ఐ శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాన్ని బుధవారం పరిశీలించారు. ఎంత లోతుగా తవ్వకాలు జరిపారు, ఎన్ని క్యూబిక్‌ మీటర్ల మట్టిని తరలించుకుపోయారనే కొలతలు వేశారు. గతంలోనూ ఫిర్యాదులు వెల్లువెత్తిన సమయంలో మైనింగ్‌ సిబ్బంది వచ్చి ఇలాగే లెక్కలు వేసి వెళ్లిపోయారు. కానీ తవ్వకాలను అడ్డుకున్నది లేదు.

నెల కిందట ఇలాగే హడావుడి..

జనవరి 19న ఇలాగే తాడేపల్లి రెవెన్యూ పరిధిలోని ఆర్‌ఎస్‌ నంబరు 261/1ఎ ప్రవీణ్‌ అనే వ్యక్తి పేరుతో 1.32 ఎకరాల భూమికి రెవెన్యూ, అటవీశాఖల నుంచి ఎన్‌వోసీ తీసుకున్నారు. ఎన్‌వోసీలను మైనింగ్‌కు అనుమతుల కోసం పెట్టాలి. అనుమతి వస్తేనే తవ్వాలి. కానీ ఇవేవీ చేయకుండా కేవలం ఎన్‌వోసీలను చూపిస్తూ తవ్వేయడం ఆరంభించారు. దీనిపైనా స్థానికులు ఫిర్యాదు చేయడంతో అధికారులు వచ్చి హడావుడి చేసి ఆరు లారీలు, రెండు జేసీబీలను సీజ్‌ చేశారు. ఆ తర్వాత ఒక్కో వాహనానికి రూ.8వేలు కట్టించుకుని వదిలేశారు. ఒక లారీ లోడ్‌ రూ.10వేలకు అమ్ముతుంటే ఈ జరిమానాలు ఏమాత్రం? అందుకే అక్రమ తవ్వకాలు ఆగడం లేదు.

నిజాయతీ కలిగిన పార్టీ తెలుగుదేశం

క్రమశిక్షణకు మారు పేరు గద్దె కుటుంబం ✪ ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షురాలిగా అనురాధ ప్రమాణ స్వీకారోత్సవంలో మంత్రులు



మాట్లాడుతున్న మంత్రి కొలుసు పార్థసారథి

పటమట, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఎవరిని అడిగినా క్రమశిక్షణకు మారుపేరు గద్దె కుటుంబమని చెబుతారని, తెదేపా బలోపేతానికి కృషి చేసిన వారికి సరైన గుర్తింపు లభిస్తుందనడానికి గద్దె అనురాధను తెదేపా ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షురాలిగా నియమించడమే నిదర్శనమని మంత్రులు కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథి, ఎంపీ శివనాథ్‌ అన్నారు. నగరంలోని ఎన్‌ఏసీ కల్యాణ మండపంలో బుధవారం తెదేపా ఎన్టీఆర్‌ జిల్లా అధ్యక్షురాలిగా గద్దె అనురాధ, కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారం వైభవంగా నిర్వహించారు. తొలుత అశోక్‌నగర్‌లోని తన నివాసం నుంచి అనురాధ.. నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎన్టీఆర్‌ సర్కిల్‌కు ప్రదర్శనగా వచ్చారు. అక్కడ ఎన్టీఆర్‌ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అక్కడ నుంచి ఎన్‌ఏసీ కల్యాణ మండపానికి ప్రదర్శనగా చేరుకున్నారు. అనంతరం తెదేపా ఎన్టీఆర్‌ జిల్లా మాజీ అధ్యక్షుడు నెట్టెం రఘురామ్‌ నుంచి అనురాధ అధ్యక్షురాలిగా, ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు, కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. మంత్రి రవీంద్ర మాట్లాడుతూ.. నిజాయతీ, క్రమశిక్షణతో కూడిన పార్టీ తెదేపా ఒక్కటేనని అన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు కమిటీలున్న ఏకైక పార్టీ కూడా తెదేపా నేనని పేర్కొన్నారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి నాయకులు, కార్యకర్తలు తీసుకెళ్లాలని సూచించారు. ఎంపీ శివనాథ్‌ మాట్లాడుతూ.. తెదేపా పట్ల గద్దె రామ్మోహన్‌ కుటుంబానికి అంతులేని అభిమానం ఉందని అన్నారు. 11 సీట్లను నిలబెట్టుకోలేకపోయిన వైకాపా ఎమ్మెల్యేలు అసెంబ్లీకి వచ్చారని అన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌ మాట్లాడుతూ.. జిల్లా అధ్యక్ష పదవి నిర్వహణ చాలా కష్టమని, గతంలో తాను అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ఇబ్బందులు పడ్డానని గుర్తు చేశారు. అనురాధకు సహనం ఎక్కువని, ఆమె పార్టీని ముందుకు తీసుకెళ్తుందని అన్నారు. తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు వర్ల రామయ్య, ఎమ్మెల్యేలు తంగిరాల సౌమ్య, మండలి బుద్ధప్రసాద్‌, శ్రీరాంతాతయ్య, కొలికపూడి శ్రీనివాస్‌, తెదేపా కృష్ణా జిల్లా అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌ ఛైర్మన్‌ కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌, నాయకులు నన్నపనేని రాజకుమారి, నాగుల్‌మీరా, పరుచూరి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



అధ్యక్షురాలు, కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న నెట్టెం రఘురామ్‌

ఇగ్నో దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ వన్‌టౌన్‌, న్యూస్‌టుడే: ఇందిరా గాంధీ జాతీయ సార్వత్రిక విశ్వ విద్యాలయం (ఇగ్నో) నిర్వహించే బీఎడ్‌, బీఎస్సీ నర్సింగ్‌ కోర్సులకు జనవరి 2026కు, రిహాబిలిటేషన్‌ కౌన్సిల్‌ ఆఫ్‌ ఇండియా గుర్తింపు పొందిన పి.జి.డిప్లొమా ఇన్‌ రిహాబిలిటేషన్‌ సైకాలజీ కోర్సు జులై 2026కు నిర్వహించే ప్రవేశ పరీక్షకు ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇగ్నో ప్రాంతీయ కేంద్రం రీజనల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ కె.సుమలత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ ప్రాంతీయ కేంద్రం పరిధిలో విజయవాడలో మాత్రమే ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు వివరించారు. ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తు చేసుకోవడానికి బీఎడ్‌ ప్రవేశ పరీక్షకు ఫిబ్రవరి 27 ఆఖరు తేదీ. బీఎస్సీ నర్సింగ్‌, పి.జి.డిప్లొమా ఇన్‌ రిహాబిలిటేషన్‌ సైకాలజీ కోర్సుల ప్రవేశ పరీక్షకు మార్చి 05 ఆఖరు తేదీ అని చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఇగ్నో వెబ్‌సైట్‌ను సందర్శించి ఆన్‌లైన్‌ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు కొత్తపేట హిందూ హైస్కూల్‌ ప్రాంగణంలోని ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని, దగ్గరలోని ఇగ్నో అధ్యయన కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు. 0866-2565253 ఫోన్‌ నంబరు ద్వారా వివరాలు తెలుసుకోవచ్చని తెలిపారు.

పేద విద్యార్థులకు ఉచిత కార్పొరేట్‌ విద్య

ఒకటో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విజయవాడ సిటీ, ఉయ్యూరు గ్రామీణం న్యూస్‌టుడే

విద్యా హక్కు చట్టం - 2009 ప్రకారం పేద, మధ్య తరగతి కుటుంబాల విద్యార్థులు ఉచితంగా కార్పొరేట్‌ విద్య పొందవచ్చు. విద్యాసంస్థల్లో ఒకటో తరగతిలో 25 శాతం సీట్లు కేటాయిస్తారు. 2026-27 విద్యా సంవత్సరానికిగాను ఒకటో తరగతిలో ప్రవేశాలకు ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.

అర్హులు ఎవరు?.. దరఖాస్తు ఎలా?

★ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.20 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.1.44 లక్షలు ఉన్న తల్లిదండ్రుల పిల్లలు అర్హులు. ★ స్టేట్‌ సిలబస్‌ పాఠశాలలో చేరే విద్యార్థి 2 జూన్‌ 2020 నుంచి 31 మే 2021 మధ్య, సీబీఎస్‌ఈ, ఐసీఎస్‌ఈ సిలబస్‌ పాఠశాలలో చేరే విద్యార్థి 2 ఏప్రిల్‌ 2020 నుంచి 31 మార్చి 2021 మధ్య జన్మించాలి. ఐదేళ్లు నిండాలి. ★ www.cse.ap.gov.in వెబ్‌సైట్‌లో లేదా స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయాలు, ఎంఈవో కార్యాలయం, మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవచ్చు. ★ ఓటరు గుర్తింపు కార్డు, తెల్ల రేషన్‌ కార్డు, పాస్‌పోర్టు, ఉపాధి హామీ జాబ్‌కార్డ్‌, డ్రైవింగ్‌ లైసెన్సు, విద్యుత్తు బిల్లు, గ్యాస్‌ కనెక్షన్‌ పత్రాన్ని చిరునామా ధ్రువీకరణకు పరిగణనలోకి తీసుకుంటారు. ★ ఈ నెల 20 నుంచి మార్చి 10 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. మార్చి 25న లాటరీ తీసి విద్యార్థులను ఎంపిక చేస్తారు. ఏప్రిల్‌ 13 నుంచి 23 వరకు ప్రవేశాల నిర్ధారణ ఉంటుంది.

జత చేయాల్సిన పత్రాలు

★ విద్యార్థి జనన, కుల, వార్షిక ఆదాయం ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి. ★ వివరాల కోసం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు 1800-4258-599 టోల్‌ఫ్రీ నంబరులో సంప్రదించవచ్చు ★ ఎన్టీఆర్‌ జిల్లాలో 512, కృష్ణా జిల్లాలో 282 కార్పొరేట్‌, ప్రైవేట్‌, అన్‌ఎయిడెడ్‌ పాఠశాలలున్నాయి. గతేడాది ఎన్టీఆర్‌ జిల్లాలో వెయ్యి, కృష్ణా జిల్లాలో 505 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు. ★ అర్హులు ఉచిత కార్పొరేట్‌ విద్య పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సమగ్ర శిక్షా ఎన్టీఆర్‌, కృష్ణా జిల్లాల అదనపు కోఆర్డినేటర్లు ఎం.రజని, ఆర్‌.కుమిదిని సింగ్‌ తెలిపారు.

వదిలేస్తే ఇలా.. వదిలిస్తే మురిసేలా..



ఈ చిత్రంలో పచ్చగా కనిపిస్తున్నది పచ్చని మైదానం కాదు. కొండపల్లిలో పూర్తిగా నిర్వహణ కరవై పిచ్చిమొక్కలు, నాచు, గుర్రపుడెక్క పెరిగిపోయిన గజరాజు చెరువు. ఇబ్రహీంపట్నం నుంచి కొండపల్లికి వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఈ చెరువును బాగు చేస్తే ఆహ్లాదాన్ని పంచుతుంది. కొండపల్లి బొమ్మలు చూసేందుకు, కొనేందుకు దేశవిదేశాల నుంచి పర్యాటకులు వచ్చే ఈ ప్రాంతంలో చెరువును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. -ఈనాడు, అమరావతి

పవిత్ర సంగమం.. అవుతోంది శుభ్రం





ఇబ్రహీంపట్నంలోని పవిత్ర సంగమం వద్ద కృష్ణానది తీరాన్ని మహాశివరాత్రి భక్తుల పుణ్యస్నానాల కోసం శుభ్రం చేస్తున్నారు. నదితీరంలో ఉన్న చెత్తను అంతా తొలగించి, ఘాట్లలో పేరుకుపోయిన మట్టిని తొలగిస్తున్నారు. భక్తులకు ఎటువంటి ఆటంకం లేకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. -ఈనాడు అమరావతి



స్పీడ్‌ బ్రేకర్లుంటే.. హర్షవర్ధన్‌ బతికేవాడు..!

- అత్యంత ప్రమాదకరంగా మారిన కానూరు రోడ్డు
- మలుపులు, అనేక అంతర్గత దారులతో అనుసంధానం

ఈనాడు, అమరావతి, - కానూరు, తాడిగడప న్యూస్‌టుడే

తాడిగడప మున్సిపాలిటీలోని ప్రధాన రహదారుల్లో ఒకటైన కామయ్యతోపు నుంచి కానూరు వెళ్లే రోడ్డు అత్యంత ప్రమాదకరంగా మారింది. విజయవాడ నగరాన్ని ఆనుకుని ఉన్న కిలోమీటరున్నర పొడవైన ఈ రోడ్డులో కేవలం స్పీడ్‌ బ్రేకర్లు లేకపోవడం వల్లే శ్రీహర్షవర్ధన్‌ అనే పదో తరగతి విద్యార్థి సోమవారం బలైపోయాడు. చదువులో రాణిస్తున్న హర్ష భవిష్యత్తుపై తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ అర్ధంతరంగా మృత్యువు కబళిస్తుందని ఊహించలేకపోయారు. అత్యంత వేగంగా బైక్‌పై దూసుకొచ్చిన పదో తరగతి చదివే ముగ్గురు విద్యార్థులు రోడ్డుపై వెళ్తున్న హర్షవర్ధన్‌ను ఢీకొట్టి అతని మరణానికి కారణమయ్యారు. ఈ రోడ్డుపై ఒక్క స్పీడ్‌ బ్రేకరు కూడా లేకపోవడంతో విచ్చలవిడిగా ద్విచక్ర వాహనాలు, కార్లతో దూసుకుపోతూ అమాయకుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారు.



రహదారిపై ప్రమాదకర మలుపు

అధికారులు కళ్లు తెరవాలి..

ఈ రోడ్డుపై ఉన్న చర్చి ఎదురుగా ఆరేడు నెలల కిందట జరిగిన ప్రమాదంలో ఓ యువ ఉద్యోగి మృతి చెందాడు. ప్రస్తుతం ఓ విద్యార్థి బలైపోయాడు. నిత్యం ప్రమాదాలు ఏదో ఒక చోట జరుగుతూనే ఉన్నాయి. ఈ రోడ్డు పంట కాలువ జంక్షన్‌ నుంచి ఆరంభమై.. ప్రమాదకరమైన మలుపులు, కాలనీల్లోకి వెళ్లే అంతర్గత దారులతో అనుసంధానమై ఉంటుంది. ఎటునుంచి ఎవరు దూసుకొస్తారో కూడా ఊహించడం కష్టం. కనీసం ఓ ఐదారు ప్రాంతాల్లో స్పీడ్‌ బ్రేకర్లు ఉండాలి. కొత్తగా ఈ రహదారిని ఆరు నెలల కిందట వేసినప్పుడే స్పీడ్‌ బ్రేకర్లను వేయాలంటూ అన్ని వర్గాల నుంచి విజ్ఞప్తులు వచ్చినా అధికారులు ఒకరిపై ఒకరు నెపం నెట్టుకుంటూ.. పెడచెవిన పెట్టారు. ఇంత జరిగినా ఇప్పటికీ యంత్రాంగంలో చలనం లేకపోవడం బాధాకరం.

వందల విద్యా కేంద్రాలున్న ప్రాంతం..

కానూరు రోడ్డుకు ఆనుకుని చుట్టుపక్కల కనీసం 150కు పైగా విద్యాసంస్థలు, అకాడమీలు, కళాశాలలు ఉన్నాయి. నిత్యం 50వేల మంది విద్యార్థులు, లక్షల మంది ప్రజలు.. వేల సంఖ్యలో వాహనాల్లో తిరుగుతుంటారు. విజయవాడను ఆనుకుని ఉన్న ప్రాంతం కావడంతో.. నగరంలో కొలువులు చేసేవాళ్లంతా ఇక్కడే ఉంటారు. ఇంత కీలకమైన రహదారిపై స్పీడ్‌ బ్రేకర్లు అత్యవసరం. అప్పుడే వాహనాల వేగానికి.. పగ్గాలు పడి ప్రమాదాలను అరికట్టేందుకు వీలుంటుంది.

దుర్గమ్మ సేవకులకు సేవా యాప్‌ ప్రారంభం

ఇంద్రకీలాద్రి: కనకదుర్గమ్మ ఆలయ సేవకుల కోసం సేవా యాప్‌ ప్రారంభిస్తున్నట్లు ఈవో శీనానాయక్‌ తెలిపారు. తిరుమల తరహాలో స్వచ్ఛంద సేవ పట్ల ఆసక్తి ఉన్న వారి పేర్లు నమోదు చేసేందుకు సేవా యాప్‌ వినియోగించుకోవాలని సూచించారు. రిజిస్ట్రేషన్‌, హాజరు, పర్యవేక్షణ కోసం యాప్‌ను తీసుకు వచ్చినట్లు తెలిపారు. సాధారణ రోజుల్లో 30వేల నుంచి 40 వేలమంది, వారాంతాల్లో 50వేల నుంచి 70 వేలమంది భక్తులు అమ్మవారిని దర్శించుకుంటున్నారని చెప్పారు. క్యూలైన్లు, అన్నదానం, ఉచిత ప్రసాద పంపిణీ, తాగునీరు, పాలు అందజేయడానికి దేవస్థానం సిబ్బందితో పాటు స్వచ్ఛంద సేవకులను వినియోగిస్తున్నట్లు పేర్కొన్నారు. తిరుమల తరహాలో సేవకులను పారదర్శకంగా వినియోగించుకునేందుకు ప్రభుత్వ ఆదేశాల మేరకు అమరావతి సాఫ్ట్‌వేర్‌ ఇన్నోవేషన్స్‌ ఈ యాప్‌ రూపొందించిందని పేర్కొన్నారు.

చేనేత పరిశ్రమ పరిరక్షణకు మంత్రి కృషి

మంగళగిరి: చేనేత పరిశ్రమ పరిరక్షణకు మంత్రి నారా లోకేశ్‌ విశేష కృషి చేస్తున్నారని పద్మశాలీ వెల్ఫేర్‌ కార్పొరేషన్‌ ఛైర్మన్‌ నందం అబద్ధయ్య చెప్పారు. వస్త్రాలకు వినియోగించే నూలుకు రంగులు అద్దే కార్మికులకు నూతన పద్ధతులపై నైపుణ్య శిక్షణను కేంద్ర ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ, చేనేత అభివృద్ధి సంస్థ చేపట్టింది. మంగళగిరి రాజీవ్‌గృహకల్ప వద్ద ఉన్న రజక సామాజిక భవనంలో ఈ శిక్షణ తరగతులను బుధవారం అబద్ధయ్య ప్రారంభించారు. 20 మంది కార్మికులకు 15 రోజుల పాటు శిక్షణ ఇస్తారు. శిక్షణ పొందే కార్మికులకు రోజుకు రూ.300 చొప్పున ఇవ్వనున్నారు.



సెల్‌ఫోన్ల మధ్యలో.. స్వర్ణం తరలింపు

పట్టుకున్న పన్నుల అధికారులు ✪ 275గ్రా. బంగారం, 308 గ్రా. వెండి స్వాధీనం

ఈనాడు, అమరావతి: సెల్‌ఫోన్ల మధ్యలో బంగారం పెట్టి తరలిస్తుండగా రాష్ట్ర పన్నులశాఖ అధికారులు పట్టుకున్నారు. రూ.50లక్షల విలువైన 275గ్రాముల బంగారం, మరో 308గ్రాముల వెండి దొరికాయి. విజయవాడ వాణిజ్య పన్నుల మూడో డివిజన్‌ అధికారులకు పక్కా సమాచారం అందడంతో బుధవారం తెల్లవారుజామున గాంధీనగర్‌లో పహారా కాశారు. ఓ ద్విచక్ర వాహనదారుడిని తనిఖీ చేయగా.. అతని వద్ద ఉన్న బ్యాగులో సెల్‌ఫోన్ల పెట్టెలు కనిపించాయి. వాటి మధ్యలో రెండు ప్రత్యేక బాక్సులను గుర్తించారు. వాటిలో మందులు ఉన్నాయంటూ అతను చెప్పాడు. అనుమానం వచ్చి పరిశీలించగా పెట్టెల్లో బంగారం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే సత్యనారాయణపురం పోలీస్‌స్టేషన్‌కు బంగారం బాక్సులను తరలించారు. నగరంలోని నాలుగు బంగారు దుకాణాలకు వాటిని తరలిస్తున్నట్లు గుర్తించారు. వెంటనే వాటి యజమానులకు సమాచారం అందించి రప్పించారు. పోలీసులు, సదరు బంగారం యజమానుల సమక్షంలో వీడియో తీస్తూ బాక్సులను తెరిచారు. బంగారం, వెండి బయటపడ్డాయి. వాటికి ఎలాంటి బిల్లులు లేవు. హైదరాబాద్‌ నుంచి వీటిని తీసుకొచ్చినట్టు గుర్తించారు. డీసీటీవో కిరణ్‌ ఆధ్వర్యంలోని పన్నుల అధికారులు ఈ బిల్లులు లేని సరకును పట్టుకున్నారు. ప్రస్తుతం మూడు శాతం పన్ను, మరో మూడు శాతం జరిమానాతో కలిపి వాణిజ్య పన్నులశాఖకు వీటిపై ఆదాయం సమకూరుతుంది.

అందుబాటులో 2,908 టన్నుల యూరియా

ఎన్టీఆర్‌ కలెక్టరేట్‌, న్యూస్‌టుడే: రబీ పంటల సాగు నేపథ్యంలో ఈనెల 11వ తేదీ నుంచి రాబోవు 8 రోజులకు 1,576 మెట్రిక్‌ టన్నుల యూరియా అవసరం కాగా ప్రస్తుతం 2,908 మెట్రిక్‌ టన్నులు అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి డి.ఎం.ఎఫ్‌.విజయకుమారి బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని ఆమె వివరించారు.



రెవెన్యూ క్లినిక్‌లకు 259 అర్జీలు

❑ 26 పరిష్కారం ❑ 183 విచారణకు ఆదేశం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే

ప్రభుత్వ ఆదేశాల మేరకు గత ఏడాది డిసెంబరు 29 నుంచి కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం రెవెన్యూ క్లినిక్‌లు నిర్వహిస్తున్నారు. ఈ నెల 9వ తేదీ వరకు వీటి ద్వారా మొత్తం 259 అర్జీలు స్వీకరించినట్లు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియా బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. నిర్ణీత వ్యవధిలో పరిష్కారం చూపడానికి 50 అర్జీలను ఆమోదించి ఏపీ సేవా సర్వీసులో నమోదు చేసినట్లు వెల్లడించారు. ఆర్‌వోఆర్ అప్పీలు, భూ సర్వేకు సంబంధించిన మరో 183 అర్జీల విచారణకు ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు.

అర్జీదారుల్లో సంతృప్తి.. సంతోషం

రీ సర్వేలో జరిగిన పొరపాటుపై తిరువూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని గంపలగూడెం మండలం కనుమూరుకు చెందిన జంగా మనీషా రెడ్డి అర్జీ దాఖలు చేశారు. ఈక్రమంలో రెవెన్యూ రికార్డులను, ఎఫ్ఎల్ఆర్, రిజిస్టరు దస్తావేజులు, సరిహద్దులు, భూ స్థితిని సరిపోల్చారు. తప్పుగా నమోదైన సర్వే నంబరు, అనుభవ స్వభావం, భూమి స్వభావం, పట్టాదారు పేరు, అనుభవదారుని పేరును వెబ్ ల్యాండ్‌లో సరిచేసి, అడంగల్ నకలును అర్జీదారునికి అందజేశారు. వినతిపత్రం దాఖలు చేసిన రోజునే సమస్యను పరిష్కరించడంతో అర్జీదారు ఊరట చెందారు.



జేసీ ఇలక్కియా

◆ నందిగామ డివిజన్ పరిధి వత్సవాయి మండలం మంగొల్లుకు చెందిన అన్నేపాక మహేష్‌కుమార్‌రెడ్డికి ఆర్ఎస్ నంబరు 158/1లో 90 సెంట్ల భూమి ఉంది. వెబ్ ల్యాండ్‌లో 40 సెంట్లను తప్పుగా చూపుతోంది. దీనిపై ఈనెల రెండో తేదీన అర్జీ దాఖలు చేశారు. అధికారులు రెవెన్యూ రికార్డులు పరిశీలించి, సుమోటో సవరణ ద్వారా 90 సెంట్లుగా సాంకేతిక సమస్యను సరిచేసి అప్పటికప్పుడే పరిష్కారం చూపారు. మ్యుటేషన్ నమోదు చేయించారు. వచ్చిన రోజునే సమస్య పరిష్కరించడంతో అర్జీ దారుడు సంతృప్తి వ్యక్తం చేశారు.

◆ విజయవాడ రెవెన్యూ డివిజన్ పరిధిలోని విజయవాడ గ్రామీణ మండలం కొత్తూరు తాడేపల్లికి చెందిన తోటకూర శివకుమారి భర్త పుల్లయ్య ఈనెల 9వ తేదీన ఒక అర్జీ దాఖలు చేశారు. ఆర్ఎస్ నంబరు 33/4, 33/5లో 55 సెంట్ల భూమికి రీ సర్వే తర్వాత ఎల్పీఎం నంబరు 149నకు వారి కూతురు, కుమారుల పేర్లు నమోదై ఉన్నాయి. సరిచేయాలని కోరారు. రెవెన్యూ రికార్డులను, రిజిస్టరు పార్టిషన్ దస్తావేజులను పరిశీలించారు. వెబ్ ల్యాండ్‌లో తప్పుగా నమోదైన పేర్లను తొలగించి, శివకుమారి పేరిట అడంగల్ నకలు మంజూరు చేశారు. సమస్య తక్షణమే పరిష్కారం కావడంతో అర్జీ దారుడు ఆనందం వ్యక్తం చేశారు.

తెలుగు భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పాలి: ఎస్పీ



మాట్లాడుతున్న ఎస్పీ విద్యాసాగర్ నాయుడు, వేదికపై ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తదితరులు

శ్రీకాకుళం(ఘంటసాల), న్యూస్‌టుడే: తెలుగు భాష ఔన్నత్యాన్ని భావితరాలకు చాటి చెప్పాలని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అన్నారు. శ్రీకాకుళంలో ఆంధ్రమహావిష్ణువు సన్నిధిలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధ్యక్షతన శ్రీకృష్ణదేవరాయలు మహోత్సవాలు బుధవారం రాత్రి ముగిశాయి. ఎస్పీ మాట్లాడుతూ రాయలు మహోత్సవాలతో పోలీస్ శాఖ చేపట్టే సమాజహిత కార్యక్రమాలలో భాగంగా తెలుగు భాష పట్ల నేటి తరానికి ఆసక్తి పెంచే చర్యలు తీసుకుంటామన్నారు. సృజనాత్మక, సాంస్కృతిక మండలి ఛైర్మన్ పొడపాటి తేజస్వి మాట్లాడుతూ సంస్కృత భాష ప్రాచుర్యం ఉన్న కాలంలోనే తెలుగును రాజభాషగా చేసిన ఘనుడు శ్రీకృష్ణదేవరాయలు అని పేర్కొన్నారు. రాయలు వారు ఆముక్తమాల్యద గ్రంథ రచనను ప్రారంభించిన చారిత్రక స్థలాన్ని దర్శించడం అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ గత కృష్ణా పుష్కరాల్లో విజయవాడ తరువాత అత్యధిక భక్తులు స్నానాలు చేసిన ప్రాంతంగా శ్రీకాకుళం నిలవడం గొప్ప విశేషమన్నారు. కవులు, సంగీత విద్వాంసులు, ఎందరో చరిత్ర ప్రసిద్ధి చెందిన మహనీయులు శ్రీకాకుళం వాసులు కావడం గర్వకారణమన్నారు. అతిథులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ, సాహితీవేత్త అద్దంకి శ్రీనివాసరావు, నియోజకవర్గ ప్రత్యేక అధికారి పి.సాయిబాబు, ఆలయ ఏసీ దాసరి శ్రీరామవరప్రసాద్, ఈవో చెన్నకేశవరావు, ఎంపీడీవో డి.సుబ్బారావు, నాయకులు మండలి రాజా, తుమ్మల చౌదరిబాబు, తాడికొండ వెంకటేశ్వరరావు, రవిప్రసాద్, నాగశ్రీనివాసరావు, చిట్టిబాబు, సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు. ◆ పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. 'భువన విజయం' సాహితీ నృత్యరూపకం, కేవీ సత్యనారాయణ బృందం 'మోహినీ భస్మాసుర' నృత్య నాటకం అలరించాయి. కళాకారులను ఎమ్మెల్యే సత్కరించారు.



'మోహినీ భస్మాసుర' నృత్య నాటకంలో ఓ సన్నివేశం

మట్టిలో మాణిక్యాలను వెలికి తీయడమే శాప్ లీగ్స్ లక్ష్యం

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మట్టిలో మాణిక్యాలను వెలికితీయడమే శాప్ లీగ్స్ లక్ష్యమని ఛైర్మన్ అనిమిని రవినాయుడు పేర్కొన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో శాప్ లీగ్స్ అమలుపై బుధవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎండీ ఎస్.భరణితో కలిసి రవినాయుడు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ప్రతిభ గల క్రీడాకారులను గుర్తించి శిక్షణ, వనరులు అందించి ఒలింపిక్స్ స్థాయికి వెళ్లేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్పష్టం చేశారు. శాప్ లీగ్ కేవలం పోటీలే కాదని క్రీడా సంస్కృతిని బలోపేతం చేసే మహత్తర కార్యక్రమమని పేర్కొన్నారు. ప్రతిభ గల క్రీడాకారులను ఫిట్‌నెస్, పోషకాహారం, శారీరక సామర్థ్యాల ఆధారంగా ఎంపిక చేసి, వారికి స్పోర్ట్స్ కిట్స్, పరికరాలు, ఆర్థిక సహాయం అందించడమే కాకుండా ప్రముఖ క్రీడా అకాడమీలతో అనుసంధానం చేసి నిపుణుల పర్యవేక్షణలో శిక్షణ ఇప్పిస్తామని తెలిపారు. పీ4 మోడల్ ద్వారా ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, క్రీడా సంఘాలు, విద్యాసంస్థలు భాగస్వాములయ్యేలా సమన్వయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సంవత్సరం 32 క్రీడాంశాల్లో శాప్ లీగ్స్‌ను జిల్లాల వారీగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. శాప్ పరిపాలనాధికారి రమావత్ వెంకట రమణనాయక్, రాష్ట్రంలోని అన్ని జిల్లాల క్రీడాభివృద్ధి అధికారులు, స్కూల్ గేమ్స్ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

జీవన్మృతుడి అవయవాల దానం



విజయ్‌కుమార్ (పాత చిత్రం)

తాడేపల్లి: ఇంజినీరింగ్ విద్యార్థి జీవన్మృతుడు కావడంతో అతని అవయవాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. తాడేపల్లి మణిపాల్ వైద్యశాల ప్రతినిధులు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లా మధిరకు చెందిన కందిమళ్ల విజయ్‌కుమార్(20) కేఎల్‌యూలో బీటెక్ చివర సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 6న కుంచనపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ప్రమాదానికి గురయ్యాడు. దీంతో అతన్ని చికిత్స నిమిత్తం మణిపాల్ వైద్యశాలకు తీసుకొచ్చారు. అతని ఆరోగ్య పరిస్థితిని పరిశీలించిన వైద్యులు మెదడులో రక్తస్రావం అవుతుండటం గమనించి చికిత్స అందించారు. అయినప్పటికీ ఆరోగ్య పరిస్థితిలో మార్పు కనిపించ లేదు. వైద్య పరీక్షల అనంతరం ఈనెల 11న జీవన్మృతుడిగా నిర్ధారించారు. తండ్రి సైదేశ్వరరావు, కుటుంబ సభ్యుల అంగీకారంతో ఏపీ జీవన్‌దాన్ ఇన్‌ఛార్జి డాక్టర్ రాంబాబు, వైద్యశాల డైరెక్టర్ రామాంజనేయరెడ్డి ఆధ్వర్యంలో అవయవదానం జరిగింది. ఐదుగురికి గుండె, కాలేయాలను మణిపాల్ వైద్యశాల నుంచి విజయవాడలోని ఆసుపత్రికి వారికి అమర్చారు. ఊపిరితిత్తులను హైదరాబాద్ కిమ్స్‌కి, కిడ్నీలను గుంటూరు విధాత వైద్యశాలకు, కార్నియాలను విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు తరలించారు. అవయవదానానికి ముందుకొచ్చిన విజయ్‌కుమార్ కుటుంబానికి మణిపాల్ వైద్యశాల కృతజ్ఞతలు తెలిపింది.



వంకాయలు-20/22, టమాటా-13, బెండ-30, పచ్చిమిర్చి-38, కాకర-38, బీర-30/32, క్యాబేజీ-15/20, క్యాబేజీ-14, క్యారెట్-28, దొండ-42, బంగాళదుంప-21, ఉల్లిపాయలు-22, గోరుచిక్కుడు-32, దోస-20/30, సొర-12/14, పొట్ల-30, అరటికాయ-7/6, చామదుంప-22, చిలగడ-72, మునగ-10/8, ఆకు కూరలు(కట్ట)-2.50, కంద-38, బీట్‌రూట్-24, కీరదోస-46, చిక్కుడు-60/55, క్యాప్సికం-65, దొండకాయలు-65, నిమ్మ (డజను)-30/24, కొత్తిమీర-5/10, పుదీనా-5/15, ముల్లంగి-8, పచ్చిమామిడి-20/22 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (కిలో రూ.ల్లో) వర్తిస్తాయి. **- న్యూస్‌టుడే, విజయవాడ రైతుబజారు**



బ్రాయిలర్ ధరలు (కిలో రూ.ల్లో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -120 రిటైల్ ధర 147 చికెన్ విత్ స్కిన్ - 213 చికెన్ స్కిన్‌లెస్ - 243. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & బ్రీడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 137, 146, 157 చికెన్ విత్ స్కిన్ - 260 చికెన్ స్కిన్‌లెస్ - 270.

తెదేపాతోనే వడ్డెరల అభివృద్ధి సాధ్యం



సంఘీభావం తెలుపుతున్న కుల పెద్దలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: తెదేపాతోనే వడ్డెర అభివృద్ధి సాధ్యమని వడ్డెర కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ దేవళ్ల మురళి పేర్కొన్నారు. గురువారం గవర్నర్‌పేటలోని ఓ హోటల్లో రాష్ట్ర వడ్డెర సంఘం ఆత్మీయ సమావేశం జరిగింది. అన్ని జిల్లాల నుంచి వడ్డెర కుల పెద్దలు హాజరయ్యారు. వారి సమస్యలపై చర్చించారు. దేవళ్ల మురళి మాట్లాడుతూ గత ప్రభుత్వ అరాచకాలకు ఎదురు తిరిగి అనేకమంది వడ్డెర నాయకులు పోలీస్ కేసులు పెట్టించుకున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత కొన్ని జిల్లాల్లో వడ్డెరలకు పదవులు కేటాయించలేదని, న్యాయం జరగడం లేదన్న భావన ఉందని ఆ నిరసను తొలగించేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వడ్డెర కులస్థులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని వివరించారు. వడ్డెరలను ఎస్టీల్లో చేర్చాలన్న నిర్ణయం ప్రభుత్వ పరిశీలనలో ఉందన్నారు. వారికి నామినేటెడ్ పదవులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు తెలిపారు. దీనిపై చంద్రబాబు సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో తెదేపా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కలిసి వినతిపత్రం అందిస్తామని మురళి వివరించారు. అంజనప్ప, దేవళ్ల వెంకట్, రెడ్డిశేఖర్, కుంచపు వెంకటేష్, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జినేష్, శిబుకు బెయిల్ మంజూరు

నకిలీ మద్యం కేసులో ఉత్తర్వులిచ్చిన ఎక్సైజ్ కోర్టు

ఈనాడు, అమరావతి: నకిలీ మద్యం కేసులో ఇద్దరు నిందితులకు కోర్టు బెయిల్ ఇచ్చింది. తమకు బెయిల్ మంజూరు చేయాలని జినేష్ (ఏ24), శిబు (ఏ25) విజయవాడలోని ఎక్సైజ్ కోర్టులో గత నెలలో పిటిషన్లు దాఖలు చేసుకున్నారు. వీటిపై గత వారం ఇరుపక్షాల వాదనలు పూర్తి అయ్యాయి. బుధవారం ఎక్సైజ్ కోర్టు న్యాయాధికారి లెనిన్ బాబు తీర్పు వెలువరించారు. నిందితులు ఇద్దరికి బెయిల్ మంజూరు చేశారు. ఒక్కొక్కటి రూ.25వేలు చొప్పున రెండు పూచీకత్తులను సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. బాలాజీ గోవాలో వీరిద్దరు స్పిరిట్ సరఫరా చేశారు. కేరళలోని కొచ్చిన్ జిల్లా కాలడి గ్రామ ప్రాంతానికి చెందిన జినేష్.. ఎనిమిదేళ్లుగా గోవాలో లారీ క్లీనర్‌గా పనిచేస్తున్నాడు. కేరళకే చెందిన శిబు ద్వారా బాలాజీకి పలు సార్లు అందజేశాడు. గత ఏడాది డిసెంబరు 27న వీరిని పీటీ వారెంట్‌పై మదనపల్లి నుంచి తీసుకొచ్చి విజయవాడ కోర్టులో హాజరుపర్చారు. అప్పటి నుంచి విజయవాడ కారాగాంలో రిమాండ్‌లో ఉన్నారు.

మహాశివరాత్రి వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు



అధికారులకు దిశానిర్దేశం చేస్తున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై మహాశివరాత్రి వేడుకలకు పటిష్ఠ ఏర్పాట్లు చేస్తున్నట్లు దుర్గగుడి ఈవో శీనానాయక్ తెలిపారు. మల్లికార్జున మహామండపం నాలుగో అంతస్తులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈవో మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వేలాది భక్తులు దుర్గాఘాట్‌లో స్నానాలు చేసే అవకాశం ఉంటుందని.. మౌలిక వసతులపై ఇంజినీరింగ్, పారిశుద్ధ్యం విభాగ అధికారులు దృష్టి పెట్టాలని ఆదేశించారు. భక్తులు దుర్గమ్మ దర్శనం అనంతరం మల్లేశ్వరస్వామిని దర్శించుకుంటారని.. వారికి భక్తులకు ఇబ్బందులు లేకుండా ఫ్యాబ్రికేటెడ్ ఫ్రేమ్స్‌తో క్యూలైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఆన్‌లైన్లో దర్శనం, ఆర్జిత సేవలు, ఇతర సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. డిజిటల్ చెల్లింపులు క్యూలైన్లలో కౌంటర్ల వద్ద వచ్చే ఉండే సమయాన్ని తగ్గించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. కార్యక్రమంలో ఏసీ రంగారావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈ రవీంద్ర, ఏఈవోలు చంద్రశేఖర్, సుధారాణి పాల్గొన్నారు.

ధర్నా విజయవంతానికి పిలుపు

ఎన్టీఆర్ కలెక్టరేట్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కూటమి ప్రభుత్వాన్ని కోరుతూ.. రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) నేతృత్వంలో ఈనెల 13వ తేదీన విజయవాడలోని అలంకార్ కూడలిలో చేపట్టిన ధర్నా విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వేముల బిక్షమయ్య, జి.అనుగ్రహప్రసాదులు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

నేటి నుంచి అంతర్జాతీయ సదస్సు

మాచవరం: స్థానిక ఎస్సార్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల రసాయనశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 12, 13వ తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపల్ భాగ్యలక్ష్మి తెలిపారు. దీర్ఘకాలిక పర్యావరణ ప్రభావాలను పరిగణనలోకి తీసుకోకుండా జరిగే పరిశోధనకు బదులుగా సుస్థిరత విలువలను అనుసరించే 'ఈకో-అడాప్టివ్' పరిశోధన అవసరంపై ప్రసంగాలు సాగుతాయని వివరించారు. ఈ సదస్సుకు మొత్తం 200 మంది అధ్యాపకులు, పరిశోధకులు పాల్గొనేందుకు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. ఈ సదస్సుకు భారత ప్రభుత్వానికి చెందిన ఏఎన్ఆర్ఎఫ్/డీఎస్‌టీ-ఎస్ఈఆర్‌బీ, ఆరీస్ ఆగ్రో లిమిటెడ్ సంస్థలు ప్రాయోజకులుగా తమ సహకారం అందిస్తున్నాయన్నారు. రాష్ట్ర కళాశాల విద్య కమిషనర్ నారాయణ భరత్‌గుప్తా ముఖ్య అతిథిగా హాజరవుతారని పేర్కొన్నారు.

కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు భరోసా



లోకేశ్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రవినాయుడు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: యువగళం కార్యక్రమంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలుచేస్తూ ముందుకు సాగుతున్న విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌పై యువత, విద్యార్థుల్లో విశ్వాసం మరింత బలపడిందని శాప్ ఛైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.1,198 కోట్లు విడుదల చేయడంతో ఈట్ స్ట్రీట్ వద్ద విద్యార్థులతో కలిసి లోకేశ్ చిత్రపటానికి బుధవారం పాలాభిషేకం చేశారు. రవినాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా అమలుకాకపోవడంతో అనేకమంది విద్యార్థులు చదువుకు దూరమైన పరిస్థితులు చూశామని తెలిపారు. పేద విద్యార్థులను ఇబ్బందులకు గురిచేసేలా జగన్‌మోహన్‌రెడ్డి తెచ్చిన జీవోలను సరిదిద్దుతూ కూటమి ప్రభుత్వం రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడం ఒక కీలకమైన పరిణామమని కొనియాడారు. ఈ నిర్ణయం ద్వారా ఎంతోమంది పేద, బడుగు, బలహీనవర్గాల విద్యార్థులకు భరోసా ఏర్పడిందన్నారు. శాప్ బోర్డు సభ్యులు సంతోష్, విద్యార్థి సంఘాల నాయకులు పి.చరణ్‌సాయి యాదవ్, ఎస్కే నాగూర్, సోహెల్‌ఖాన్, శ్రీధర్, బాబి తదితరులు పాల్గొన్నారు.

తిరుపతమ్మ అమ్మవారి హుండీల ఆదాయం రూ.78.12 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న భక్తులు, ఈవో మహేశ్వరరెడ్డి, సభ్యుడు రమేష్‌బాబు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులోని తిరుపతమ్మ అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి నియమించిన సురేష్, ఆలయ ఈవో మహేశ్వరరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యుడు చుంచు రమేష్‌బాబు సమక్షంలో హుండీలను తెరిచారు. అనంతరం స్థానిక యూనియన్ బ్యాంకు, ఆలయ ఉద్యోగులు, సేవా సమితి సేవకులు కలిసి కానుకలను లెక్కించారు. నగదు రూ.78,12,667 సమకూరిందని ఈవో తెలిపారు. విదేశీ నగదు యూఎస్ఏ డాలర్లు 12, సౌదీ రియాల్స్-10, మలేషియా రింగిట్స్-1, ఆస్ట్రేలియా డాలర్లు-20 వచ్చాయని చెప్పారు. బంగారం 50, వెండి 220 గ్రాములు వచ్చిందని.. ఇది డిసెంబరు మూడు నుంచి ఫిబ్రవరి 11 వరకు 71 రోజుల పాటు భక్తుల సమర్పించిన కానుకల ఆదాయమని చెప్పారు.

దోమల నివారణ చర్యలపై శిక్షణ


● 15 ఏళ్ల తర్వాత అధికారులు, సిబ్బందికి తరగతులు

విజయవాడ(భవానీపురం), న్యూస్‌టుడే: గ్రామాలు, పట్టణాల్లో దోమలు, కీటకాల ఉద్ధృతి ఎక్కువగా ఉంటుంది. వాటి కారణంగా ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారు. దోమల నివారణ, అందుకు అనుసరించాల్సిన పద్ధతులపై వైద్య ఆరోగ్య శాఖ ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాన్ని విజయవాడ సమీపంలోని జక్కంపూడి కాలనీలో బుధవారం నిర్వహించారు. వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్, అదనపు సంచాలకులు సుబ్రహ్మణ్యేశ్వరి ఆదేశాల మేరకు దాదాపు 15 ఏళ్ల తర్వాత ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దోమల సంతతిని ప్రాథమిక దశలోనే గుర్తించేందుకు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. మలేరియా వచ్చేందుకు కారణమైన ఎనాఫిలిస్ దోమ, డెంగీ, చికెన్ గున్యాకు కారణమయ్యే ఎడిస్ దోమ, ఫైలేరియా, మెదడు వాపు వ్యాధి రావడానికి కారణమైన క్యూలెక్స్ దోమల నివారణకు అనుసరించాల్సిన పద్ధతులను వివరించారు. సీజనల్ వ్యాధుల నివారణలో భాగంగా 2011 సంవత్సరంలో శిక్షణ కార్యక్రమాలు జరిగాయి. వివిధ కారణాలతో తర్వాత వదిలేశారు. ప్రస్తుతం దోమలు పట్టుకోవడంపై కూడా శిక్షణ ఇచ్చారు. 'మస్కిటో కలెక్షన్ ట్యూబ్' ద్వారా దోమలను పట్టుకునే విధానాన్ని తెలియజేశారు. ఆ దోమలను పరీక్షించి ఏ రకానికి చెందినవి, వాటి వల్ల ఎలాంటి జ్వరాలు వస్తాయనే విషయాన్ని గుర్తించి నిరోధానికి చర్యలు చేపడతారు. మలేరియా అధికారులతో కలిసి యాంటీ లార్వా ఆపరేషన్లు, ఫాగింగ్, తదితర చర్యలు చేపడతారు. గడిచిన రెండు, మూడేళ్లలో ఎక్కువగా కేసులు వచ్చిన ప్రాంతాలను గుర్తించి అక్కడ చేపట్టాల్సిన చర్యలను వివరించారు.

మెడికల్ మాఫియాపై 14న నిరసనలు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్, ఫార్మా రంగాల్లో నెలకొన్న మాఫియా ధోరణులను అరికట్టాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న సీపీఐ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య తెలిపారు. బుధవారం దాసరి భవన్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో మెడికల్ రంగం ఒక మాఫియాగా రూపాంతరం చెందిందని నకిలీ మందుల వినియోగం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. ఇతర దేశాల్లో దశాబ్దాల క్రితమే నిషేధించిన ఔషధాలను కొనుగోలు చేసి తెలుగు రాష్ట్రాలకు తీసుకొచ్చి నిల్వల పేరుతో డ్రగ్స్ కంట్రోల్ విభాగం నుంచి అనుమతులు పొంది ప్రజల ఆరోగ్యాన్ని ప్రమాదంలోకి నెడుతున్నాయని మండిపడ్డారు. రాష్ట్రంలో నకిలీ ఫార్మసీ మెడికల్ సర్టిఫికెట్లను గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ నెల 12న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు అక్కినేని వనజ, పి.హరినాథ్‌రెడ్డి, పి.దుర్గాభవానీ, రావులపల్లి రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

బుసలు కొట్టదు.. నేరుగా కాటేస్తుంది



చంద్రనాగును పట్టుకున్న సుధాకర్

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట పట్టణంలోని కోదాడ రోడ్డు పుట్టబజార్‌లో తిరుగుతూ రెండు రోజులుగా ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న విష సర్పం ఎట్టకేలకు చిక్కింది. స్థానికంగా ఓ ఇంటివద్ద ఉన్న పామును బుధవారం స్నేక్ క్యాచర్ సుధాకర్ చాకచక్యంగా పట్టుకున్నారు. ఇది అత్యంత ప్రమాదకరమైన చంద్రనాగు అని.. శబ్దం చేయకుండా కాటు వేయడం దీని ప్రత్యేకత అని ఆయన తెలిపారు. అనంతరం పామును సురక్షితంగా అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

అన్ని రంగాల్లో మహిళల ప్రతిభ



పోటీలను ప్రారంభిస్తున్న వీసీ చంద్రశేఖర్, చిత్రంలో రిజిస్ట్రార్ సాయి సుధీర్, త్రిమూర్తి తదితరులు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: మహిళలు అన్ని రంగాల్లో ప్రతిభ చాటుతున్నారని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ పి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. వర్సిటీ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ఎన్టీఆర్ వర్సిటీ మహిళా చెస్ జట్టు ఎంపిక పోటీలను రిజిస్ట్రార్ డాక్టర్ టి.సాయిసుధీర్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. వీసీ మాట్లాడుతూ.. విశాఖలోని ఓ పేద కుటుంబానికి చెందిన అథ్లెట్ యర్రాజి జ్యోతి అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ చాటి రాష్ట్ర, దేశ ఖ్యాతిని ఇనుమడింపజేసిందని కొనియాడారు. క్రీడల్లో అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం గ్రూపు-1, 2 పోస్టులు ఇచ్చి ప్రోత్సహిస్తుందని తెలిపారు. తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లోని అన్నా విశ్వవిద్యాలయంలో జరుగుతున్న ఆలిండియా అంతర్ వర్సిటీ మహిళా బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో ఎన్టీఆర్ వర్సిటీ జట్టు బుధవారం కర్ణాటక రాష్ట్రంలోని చామరాజనగర వర్సిటీ జట్టుపై గెలవడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ నెల 21 నుంచి విశాఖలోని గీతం డీమ్డ్ వర్సిటీ ఆధ్వర్యంలో జరిగే ఆలిండియా అంతర్ వర్సిటీ మహిళా చెస్ టోర్నీలో వర్సిటీ జట్టు ప్రతిభ చూపాలని ఆకాంక్షించారు. టి.సాయి సుధీర్ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసిక వికాసం కలుగుతుందని అన్నారు. వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ఇ.త్రిమూర్తి, ఎంపిక కమిటీ సభ్యులు ఎస్.రామకృష్ణ, జె.రాము, గున్నాజీ, కె.సుధాకరరావు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

పాఠశాలలో శుద్ధజల యూనిట్ ప్రారంభం


విద్యార్థికి శుద్ధజలం అందిస్తున్న సర్పంచి నాగమల్లేశ్వరి, కోటేశ్వరరావు దంపతులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట పరిధి తిరువనమ్మ టెంపుల్ పాఠశాలలో శుద్ధజల యూనిట్‌ను స్థానిక సర్పంచి సొంగాటి నాగమల్లేశ్వరి కోటేశ్వరరావు దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా నాయకుడు ఆకుల రాధాకృష్ణ, ప్రధానోపాధ్యాయులు యు.శ్రీపల్లి, ఉపాధ్యాయులు మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గొల్లమండలలో జల సేవా అధ్యయనం

ఎ.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని గొల్లమండల, తండా గ్రామాల్లో బుధవారం హైదరాబాద్‌కు చెందిన వర్ధమాన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థుల బృందం జల సేవా అధ్యయనం నిర్వహించారు. ప్రభుత్వం జల జీవన్ మిషన్ ద్వారా ఏర్పాటు చేసిన పైప్‌లైన్ ద్వారా ప్రజలకు సరఫరా చేస్తున్న శుద్ధ జలం నమూనాలను సదరు విద్యార్థులు పరీక్ష చేశారు. ప్రజలకు సరఫరా చేస్తున్న తాగునీటి భద్రతను పరీక్షలు చేస్తున్నట్లు విద్యార్థులు తెలిపారు. కళాశాల సహాయ ఆచార్యులు దుర్గాశ్రీలక్ష్మి, ఆదిబాబ్జాన్స్ ఏఈ బి.సాయివెంకట లక్ష్మి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.


గొల్లమండలలో నీటి పరీక్షలు చేస్తున్న విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

తిరువూరు, న్యూస్‌టుడే

స్పందన: తిరువూరు ఎనిమిది, పదకొండు వార్డుల్లో మురుగు, చెత్త కారణంగా దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు రాజేందర్, సిరాజుద్దీన్ మేమున్నాం..మీకుతోడుగా ద్వారా సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మున్సిపల్ శానిటరీ అధికారి విజయ్ సిబ్బందిని పంపి దోమల మందు ఫాగింగ్ చేయించారు.

పరీక్షల తరుణం.. ఆరోగ్యం భద్రం

న్యూస్‌టుడే, గంపలగూడెం

పరీక్షలను పండగలా భావించాలి.. వేడుకగా జరుపుకోవాలి.. 'పరీక్షే పర్వ్' చర్చలో ప్రధాని నరేంద్రమోదీ విద్యార్థులకు ఇచ్చిన సందేశమిది. నిజమే విద్యార్థులు చదువును భారంగా భావించకూడదు. అదే సమయంలో ఆరోగ్యంపై శ్రద్ధ తప్పనిసరని వైద్యులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు సూచిస్తున్నారు. ఈ నెల 23 నుంచి ఇంటర్, మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. పది విద్యార్థులకు 100 రోజుల ప్రణాళిక, ఇంటర్ విద్యార్థులకు సంకల్ప కార్యక్రమాలు అమలు చేస్తూ తుది పరీక్షలకు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అలసట, ఆందోళన, నిస్సత్తువ, ఒత్తిడికి దూరంగా ఉంటూ ఉత్సాహంగా, ఉల్లాసంగా పరీక్షలు రాయాలంటే కచ్చితంగా వ్యాయామం, పోషకాహారం ప్రతి రోజూ ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.

★ తిరువూరు నియోజకవర్గంలో ఈ ఏడాది 36 ప్రభుత్వ పాఠశాలల నుంచి 1598 మంది పది పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, గురుకులాలు, కేజీబీవీలు, ఆదర్శ పాఠశాలల నుంచి ఇంటర్ విద్యార్థులు మరో వెయ్యి వరకు ఉంటారు. పరీక్షలు దగ్గరపడే కొద్దీ విద్యార్థులు మానసిక ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉంది. రాత్రి వేళ ఎక్కువ సేపు చదవటం వల్ల నిద్రలేమికి గురై, చదువుపై దృష్టి సారించలేని పరిస్థితి ఏర్పడొచ్చు. రాత్రి 9 గంటలకు నిద్రకు ఉపక్రమించి తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి చదువుకుంటే మంచిది. రాత్రివేళ నిద్ర లేకుండా చదివే పిల్లలకు మధ్య మధ్యలో, నాలుగు గంటలకోసారి ఆహారం అందించాలి. తద్వారా మెదడుకు సరైన పోషకాలు అందుతాయి. ఉదయం నిద్రలేవగానే కొంత సమయం వ్యాయామం, ధ్యానం చేస్తే చలాకీగా ఉంటారు. రోజుకు 8 గంటల పాటు నిద్రపోయేలా చూడాలి.


నెమలి పాఠశాలలో ప్రత్యేక తరగతిలో చదువుతున్న పది విద్యార్థులు

తేలికగా జీర్ణమయ్యే ఆహారం అందించాలి: డాక్టర్ వి.శ్రుతి, పీహెచ్‌సీ వైద్యాధికారి



తల్లిదండ్రులు తమ పిల్లలను ఖాళీ కడుపుతో పాఠశాలలకు పంపవద్దు. అల్పాహారం తీసుకోవడం నిర్లక్ష్యం చేస్తే చదువుపై దృష్టి సారించలేరు. ఉదయం అల్పాహారంగా తేలికపాటి ఇడ్లీ, దోశ, పాలు, కోడిగుడ్డు ఇవ్వాలి. నీరు ఎక్కువగా తాగేలా చూడాలి. పరీక్షలు ముగిసే వరకు మాంసాహారంతో పాటు మసాలాలు, నూనె పదార్థాలకు దూరంగా ఉండటం మేలు. పీచు పదార్థాలు, వాల్‌నట్స్, కార్బోహైడ్రేట్లు కూడిన పదార్థాలను రోజుకు రెండు నుంచి మూడు సార్లు అందించాలి.

టీవీలు, చరవాణులకు దూరంగా ఉంచాలి: సీహెచ్.సతీష్, ప్రధానోపాధ్యాయుడు, సత్యాలపాడు ఉన్నత పాఠశాల



పరీక్షల సమయంలో టీవీలు, సామాజిక మాధ్యమాలు, సినిమాలు, ఫోన్లకు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ఉపాధ్యాయులతో తరచూ మాట్లాడాలి. బడిలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నాం. ఇంటి వద్ద తల్లిదండ్రులు కూడా వారితో మాట్లాడి ధైర్యాన్ని నింపితే ఉత్తమ ఫలితాలు సాధించొచ్చు.

సోలార్ సాంకేతికతపై శిక్షణ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లి రైజ్ కేంద్రంలో స్వయం సహాయక సంఘాల మహిళలకు బుధవారం సోలార్‌తో పనిచేసే పరికరాల సాంకేతికతపై శిక్షణ ఇచ్చారు. ఇబ్రహీంపట్నం, విజయవాడ రూరల్ మండలాలకు చెందిన ఎస్‌హెచ్‌జీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై బృంద చర్చ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడి నిమ్రా ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులతో కేంద్ర బడ్జెట్‌పై చర్చ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు దేశ ఆర్థిక వృద్ధి అభివృద్ధి పథకాలపై వ్యయాలు, రాబడులను వివరించారు. వివిధ రంగాలకు చెందిన సీహెచ్.నరేష్, లక్ష్మీ కృష్ణమోహన్, శ్రీకుమార్, కళాశాల ప్రిన్సిపల్ అక్సర్‌ఖాన్, ఎన్ఎస్ఎస్ యూనిట్ అధికారి వెంకటేశ్వరరావు తమతమ అభిప్రాయాలను వెల్లడించారు.

మత్స్యకారుల జీవనోపాధికి కృషి


నదిలో చేప పిల్లలను వదులుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమం, జీవనోపాధికి ప్రభుత్వం కృష్ణా నదిలో చేప పిల్లలను వదులుతుందని ఇబ్రహీంపట్నం మండల పరిషత్తు అధ్యక్షురాలు పాలడుగు జ్యోత్స్న పేర్కొన్నారు. తుమ్మలపాలెం వద్ద కృష్ణా నదిలో బుధవారం ఆమె, సర్పంచి వెంకట రమణ, జనసేన అధికార ప్రతినిధి అక్కల గాంధీ మత్స్యశాఖ అధికారులతో కలిసి 4.8 లక్షల చేప పిల్లలను వదిలారు. జిల్లా మత్స్యశాఖ అధికారిణి చక్రాణి మాట్లాడుతూ జిల్లాలో చేపల ఉత్పత్తితోపాటు మత్స్యకారుల జీవనోపాధి మెరుగుపరచడం లక్ష్యంగా ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన అమలు చేస్తున్నట్లు వివరించారు. విజయవాడ ఎఫ్‌డీవో తేజస్వి మాట్లాడుతూ చేప పిల్లలను నదిలో వదలడం వల్ల మత్స్య ఉత్పత్తిలో 15 శాతం వృద్ధి రేటు సాధించే అవకాశముందన్నారు.

హనుమాన్ చాలీసా పారాయణం

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలోని శ్రీరంగనాయకమ్మ ఆలయంలో మంగళవారం రాత్రి భక్తులు హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం సామూహికంగా 11 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేపట్టారు. దేశం సుఖశాంతులతో, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ పారాయణం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.


శ్రీ రంగనాయకమ్మ ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించిన భక్తులు

మత్తులో తేలితే.. జీవితం మునిగినట్లే

మైలవరం, న్యూస్‌టుడే: మత్తు పదార్థాలకు అలవాటైతే జీవితం మునిగినట్లేనని స్థానిక శాసనసభ్యుడు వసంత కృష్ణప్రసాద్ అన్నారు. ఎన్టీఆర్ జిల్లా పోలీస్ శాఖ నిర్వహిస్తున్న డ్రగ్స్‌పై దండయాత్ర కార్యక్రమంలో భాగంగా బుధవారం మైలవరంలో సైకిళ్లపై, పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులతో కలిసి ప్రదర్శన చేశారు. స్థానిక లకిరెడ్డి హనిమిరెడ్డి క్రీడా ప్రాంగణంలో సభ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పిల్లలు డ్రగ్స్‌కు అలవాటుకాకుండా ఉండాలంటే, వారి ప్రవర్తనను పెద్దలు గమనిస్తుండాలని, వారి స్నేహాల పట్ల నిఘా ఉంచాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం అనాలోచితంగా మద్యం ధరలను విపరీతంగా పెంచటంతోనే గంజాయి వాడకం పెరిగిందని ఎమ్మెల్యే కృష్ణప్రసాద్ ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక గంజాయి తగ్గుముఖం పట్టిందన్నారు. సీపీ ఎస్వీ.రాజశేఖర్‌బాబు మాట్లాడుతూ గతంలో రాష్ట్రంలో విచ్చలవిడిగా దొరికేదని, గంజాయితో పట్టుబడుతున్న వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు పెడుతుండటంతో తగ్గుముఖం పట్టిందని చెప్పారు. ప్రభుత్వం, పోలీస్ చర్యలతో గంజాయి విక్రేతలు వచ్చేందుకు భయపడుతున్నారని చెప్పారు. అనంతరం సైకిల్ ప్రదర్శన చేస్తున్న మహిళా పోలీసులను సన్మానించి, సర్వమత ప్రార్థనలతో స్థానికులు దీవెనలు ఇచ్చారు. కార్యక్రమంలో సర్పంచి మంజుభార్గవి, డీసీపీ లక్ష్మీనారాయణ, స్థానిక ఏసీపీ ప్రసాదరావు, సీఐ చంద్రశేఖర్, ఏఎంసీ ఛైర్మన్ నవ్యశ్రీ, గాంధీ, నివృత్‌రావు, శ్రీనివాసరెడ్డి, సర్కిల్‌లోని ఎస్సైలు సుధాకర్, సతీష్, శ్రీను, సిబ్బంది పాల్గొన్నారు.


డ్రగ్స్‌కు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్, సీపీ ఎస్వీ రాజశేఖర బాబు, పోలీసులు, అతిథులు

నెమలి కృష్ణుని ఆదాయం రూ.17.52 లక్షలు

నెమలి(గంపలగూడెం), న్యూస్‌టుడే: నెమలి వేణుగోపాల స్వామి గుడిలో భక్తులు సమర్పించిన కానుకలను బుధవారం లెక్కించారు. 2025 డిసెంబరు 6 నుంచి బుధవారం వరకు వచ్చిన కానుకలు లెక్కించగా స్వామివారి ఆలయానికి రూ.17,52,279 నగదు, 5 గ్రాముల బంగారం, 92 గ్రాముల వెండి, 175 యూఎస్‌ఏ డాలర్లు, 10 సింగపూర్ డాలర్లు అందాయి. పాలకవర్గ అధ్యక్షురాలు కె.శశిరేఖ, ఏసీ ఎన్.సంధ్య, పలువురు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.


కానుకల లెక్కింపును పర్యవేక్షిస్తున్న అధికారులు, పాలకవర్గం

పవర్ లిఫ్టింగ్‌లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ అప్పారావు

మైలవరం, న్యూస్‌టుడే: అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉమ్మడి కృష్ణా జిల్లా పవర్ లిఫ్టింగ్ పోటీల్లో లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభతో పతకాలు సాధించినట్లు ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. వెంకట పూర్ణచంద్ర (ఈసీఈ) బంగారు, సాయితేజ్‌రెడ్డి(ఏఐడీఎస్) కాంస్య, బి.సాయిప్రసాద్ రజిత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. వెంకట పూర్ణచంద్ర రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.

దారికి అడ్డుగా ఇసుక దిబ్బలు..

తిరువూరు, న్యూస్‌టుడే: తిరువూరు పట్టణంలోని బీసీ బాలుర వసతి గృహం, పలు పాఠశాలలు, అసుపత్రులకు వెళ్లే మార్గంలో అడ్డుగా ఇసుక దిబ్బలు ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు సైకిళ్లపై నుంచి జారిపడి గాయాలపాలవుతున్నారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. రాత్రివేళ ఇసుక దిబ్బలు కనిపించక తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని, అధికారులు వీటిని తొలగించే ఏర్పాటు చేయించాలని స్థానికులు కోరుతున్నారు.



క్రమశిక్షణతో ఉన్నతులుగా ఎదగాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నతులుగా ఎదగాలని లయన్స్ జిల్లా మాజీ గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి తెలిపారు. బుధవారం లయన్స్ క్లబ్ ఆఫ్ బెజవాడ ఆధ్వర్యంలో రెడ్డిగూడెం నారాయణ పాఠశాలలో మోటివేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఉన్నతమైన లక్ష్యాన్ని నిర్దేశించుకోవడం ఎంత ముఖ్యమో లక్ష్యం సాధించే దిశగా ఆచరణ అంతే ముఖ్యమని సూచించారు. పాఠశాల డైరెక్టర్లు వి.రాధాకృష్ణారెడ్డి, కోటిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్తు నియంత్రికను మార్చరూ..

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కేతనకొండ రైస్ మిల్లు సమీపంలోని విద్యుత్తు నియంత్రిక ప్రమాదభరితంగా ఉంది. గతంలో దీని సమీపంలో గడ్డి మేస్తున్న రెండు పాడి గేదెలు విద్యుదాఘాతానికి గురై మృతిచెందాయి. అత్యంత తక్కువ ఎత్తులో ఉండే నియంత్రిక వల్ల ఎప్పుడు ఏ ప్రమాదం రానుందోనని సమీప నివాసాల పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు. కనీసం నియంత్రిక చుట్టూ అధికారులు రక్షణ వలయం కూడా ఏర్పాటు చేయకపోవడం పట్ల గ్రామస్థులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. నియంత్రికను అక్కడి నుంచి మరో ప్రదేశానికి తరలించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఇబ్రహీంపట్నం విద్యుత్తు సహాయక ఇంజినీరు వెంకన్న దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా నియంత్రిక ప్రదేశాన్ని పరిశీలించి మరో చోటుకు మార్పు చేయడం, లేదా రక్షణ కంచె ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరిస్తానన్నారు.


ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్తు నియంత్రిక

ఆరోగ్య కేంద్రానికి ఆధునిక వైద్య పరికరాలు

కొండపల్లి,న్యూస్‌టుడే: సామాజిక బాధ్యతతో దాతలు చేస్తున్న కార్యక్రమాలు హర్షణీయమని కొండపల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యులు రాథోడ్ అన్నారు. ఎస్‌బీఐ అమరావతి సర్కిల్, అవేరా గ్రూప్‌లు సంయుక్తంగా కొండపల్లి ఆరోగ్య కేంద్రానికి బుధవారం వైద్య పరికరాలను అందజేశాయి. సంస్థలు, కంపెనీలు సామాజిక బాధ్యతగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తే ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు ఆధునిక వైద్య సదుపాయాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో వైద్యులు శిరీష, బ్యాంకు, అవేరా గ్రూప్ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పరికరాలను అందిస్తున్న ఎస్‌బీఐ, అవేరా గ్రూప్‌సభ్యులు

ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం తప్పనిసరి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ప్రతి ఒక్క ద్విచక్ర వాహనదారుడు శిరస్త్రాణం తప్పనిసరిగా వాడాలని ఏసీపీ దుర్గారావు అన్నారు. బుధవారం ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో పలుచోట్ల శిరస్త్రాణంపై వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. నిబంధనలను పాటించని వారిపై చర్యలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఆర్ఐ కృష్ణ, ఎస్సై లక్ష్మణరావు పాల్గొన్నారు.

'పది' ఫలితాల్లో రికార్డు సాధించాలి

కొండపల్లి,న్యూస్‌టుడే: పదో తరగతి ఫలితాల్లో కొండపల్లి జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల గత రికార్డును అధిగమించి మరో ఉత్తమ ఫలితం సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత అన్నారు. ఏపీటీఎఫ్ యూనియన్ సభ్యులు, జాహ్నవి అకాడమి సంయుక్తంగా 170 మంది విద్యార్థులకు విద్యావసర వస్తువులను బుధవారం అందజేశారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా జనరల్ సెక్రటరీ ఖాసిం, మండల సెక్రటరీ శ్రీనివాసరావు, జాహ్నవి సంస్థ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతి

జి.కొండూరు, న్యూస్‌టుడే: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వర్ధంతిని స్థానిక ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో బుధవారం నిర్వహించారు. ఎన్టీఆర్ జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు నాయకులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాజపా మండల నాయకులు సుబ్బారావు, వెంకటేశ్వరరావు, జీ శ్రీనివాసరావు, వెంకటరెడ్డి, టీ.శ్రీనివాసరావు, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి: కొండపల్లి, ఇబ్రహీంపట్నం భాజపా కార్యాలయాల్లో బుధవారం దీనదయాళ్ ఉపాధ్యాయ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో భాజపా నియోజకవర్గ నాయకులు బాలకోటేశ్వరరావు, రఘునాథరెడ్డి, భవాని, సేనాపతి, నాగమణి, కృష్ణకుమారి, కనకదుర్గ పాల్గొన్నారు.


జి.కొండూరులో దీన్‌దయాళ్ చిత్రపటానికి నివాళులర్పించిన కొల్లి నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు

ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

విస్సన్నపేట, న్యూస్‌టుడే: రైతులందరూ తమ స్మార్ట్ ఫోన్లో తప్పనిసరిగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ , ఏపీఎయిమ్స్ అనే యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలని సహాయ వ్యవసాయ సంచాలకులు కె శశికళ, మండల వ్యవసాయ అధికారి షేక్ టిప్పు సుల్తాన్ కోరారు. విస్సన్నపేట మండలం కొర్లమండ, కలగర, చంద్రుపట్ల గ్రామాల్లో బుధవారం రైతులకు అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ నెల 20 లోపు ఫార్మర్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలన్నారు. మున్ముందు వ్యవసాయ శాఖ నుంచి అందే సౌలభ్యాలు ఈ యాప్ వినియోగించే రైతులకు మాత్రమే అందుతాయన్నారు. ఏఈవో ఉషారాణి, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి కపులూరి రాజా, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.


చంద్రుపట్లలో అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయాధికారులు శశికళ, టిప్పుసుల్తాన్, ఉషారాణి, స్థానిక రైతులు

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులకు వ్యవసాయ రంగంలో సకల సౌకర్యాలు అందించేందుకు దిక్సూచి వంటి ఏపీ ఎయిమ్స్ 2.0 యాప్‌ను ప్రభుత్వం విడుదల చేసిందని ప్రతి ఒక్క రైతు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విస్సన్నపేట వ్యవసాయ శాఖ సహాయ సంచాలకురాలు కె.శశికళ తెలిపారు. బుధవారం మద్దులపర్వ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈ ప్రక్రియ వల్ల రైతులకు ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలందుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

'రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది'

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అంబేడ్కర్ రాజ్యాంగం నడుస్తుంటే ఆంధ్రాలో లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాషా అన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్‌ను బుధవారం ఆయన ఇబ్రహీంపట్నంలో పరామర్శించారు. రెడ్‌బుక్ అంటూ లోకేష్, ఆయన బృందం ప్రతిపక్షాన్ని భయపెట్టి పాలన సాగించాలనుకోవడం అవివేకమన్నారు.

క్రీడా పరికరాల పంపిణీ

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజాప్రగతి ట్రస్టు ఇండియా లిటరసీ ప్రాజెక్టు ద్వారా చిలుకూరు, త్రిలోచనాపురం గ్రామాలలోని మండల పరిషత్తు పాఠశాలలకు ఒక్కొక్కదానికి రూ.3వేలు విలువగల క్రీడా పరికరాలను ఆయా పాఠశాలల హెచ్ఎంలకు అందజేశారు.

ఘంటసాలకు నివాళి

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలంలోని పెనుగొలనులో బుధవారం ప్రముఖ నేపథ్య గాయకుడు ఘంటసాల వెంకటేశ్వరరావు వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద చిన్నారులు, గ్రామస్థులు నివాళులర్పించారు. ఆయన ఆలపించిన భగవద్గీత తెలుగునాట అత్యంత ప్రజాదరణ పొందిందని, వేలాదిగా భక్తి, సినిమా పాటలు పాడారని వక్తలు అన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

రెడ్డిగూడెం,న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెదేపా నాయకులు పలువురు పేర్కొన్నారు. బుధవారం రాత్రి తెదేపా రెడ్డిగూడెం గ్రామ పార్టీ కార్యకర్తల సమావేశం రాఘవాపురం బీసీ కాలనీలో నిర్వహించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు సీహెచ్.చందా అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు జె.వేణుగోపాలరెడ్డి, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు ఎం.నాగేశ్వరరెడ్డి, తెదేపా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఛత్తీస్‌గఢ్‌లో ఒకేరోజు 6,414 జంటలకు పెళ్లిళ్లు

ఛత్తీస్‌గఢ్‌లో ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి సమక్షంలో కన్యా వివాహ యోజన కింద ఒకేరోజు అన్ని మతాలకు చెందిన 6,414 జంటలకు పెళ్లిళ్లు జరిగాయి. ఈ కార్యక్రమం 'గోల్డెన్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో చోటు సాధించింది. మూడుముళ్ల బంధంతో ఒక్కటైన జంటల్లో ఆదివాసీ వీడి జనజీవన స్రవంతిలో చేరిన మాజీ నక్సలైట్లు కూడా ఉన్నారు. రాయ్‌పుర్ సైన్స్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ పథకం కింద ప్రతి కొత్త జంటకు రూ.35,000 ఆర్థికసహాయం అందించారు. నారాయణ్‌పుర్ జిల్లాలో ఏడు మాజీ నక్సలైట్ జంటలు వివాహ బంధంతో ఒక్కటయ్యాయి.


వధూవరులకు సీఎం ఆశీర్వాదం

వాహనం ఈ రోడ్డెక్కితే.. జయహో

ముంబయి: భారత్‌లో తొలి మ్యూజికల్ రోడ్డును ప్రారంభించి ముంబయి తీరప్రాంత రహదారుల అధికారులు రికార్డు సృష్టించారు. హంగేరియన్ టెక్నాలజీ సాయంతో నారిమన్ ప్రాంతం నుంచి వర్లి వైపు వెళ్లే రహదారిపై లయ సంగీత స్ట్రిప్‌లను ఏర్పాటు చేశారు. దీంతో ఈ రోడ్డుపై దాదాపు 500 మీటర్ల మేర వాహనదారులకు 'స్లమ్‌డాగ్ మిలియనీర్' సినిమాలోని 'జయ హో' పాట వినిపించనుంది. వాహనాలు 70 - 80 కి.మీ.ల వేగంతో ప్రయాణించినప్పుడు రోడ్డుపై ఉన్న ప్రత్యేక పట్టీల రాపిడికి 'జయహో' అని ధ్వని తరంగాలు ఉత్పత్తి అవుతాయి. ప్రజల్లో దేశ భక్తి భావాన్ని మరింత పెంచేందుకు ఈ విధంగా డిజైన్ చేసినట్లు ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు. బృహన్ ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) చేపట్టిన ఈ ప్రాజెక్టుకు రూ.6.21 కోట్ల వ్యయం అయినట్లు అంచనా. ముంబయి కోస్టల్ రోడ్ కారిడార్ ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన ఈ రహదారి దేశంలోనే మొదటి మ్యూజికల్ రోడ్డుగా నిలవనుంది. ఇప్పటివరకు ఈ తరహా రహదారులు హంగరీ, జపాన్, దక్షిణ కొరియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లో ఉన్నాయి. ముంబయిలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ దీనిని ప్రారంభించారు.




నేడు దేశవ్యాప్తంగా కార్మిక సంఘాల సమ్మె

దిల్లీ: ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆరోపిస్తున్న కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త ఫోరం.. గురువారం దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. దీనివల్ల బ్యాంకులు, ఇన్సూరెన్స్, రవాణా రంగాలపై పాక్షిక ప్రభావం పడే అవకాశముంది. 30 కోట్ల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొననున్నారని ఫోరం వెల్లడించింది. కార్మిక, రైతు, జాతీయ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ సమ్మె చేయనున్నట్లు గత నెల 9న తేదీనే కార్మిక సంఘాలు ప్రకటించాయి. 'విద్యుత్తు, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్, రవాణా, ఆరోగ్య, విద్య గ్యాస్, నీటి సరఫరా సేవలకు అంతరాయం కలగనుంది' అని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్జీత్ కౌర్ తెలిపారు. సమ్మెలో పాల్గొనాలని బ్యాంకు ఉద్యోగుల సంఘాలు హామీ ఇచ్చాయని వెల్లడించారు. సమ్మెకు కాంగ్రెస్ కూడా మద్దతు తెలిపింది. సంయుక్త ఫోరంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, ఎస్ఈడబ్ల్యూఏ, ఏఐసీసీటీయూ ఎల్‌పీఎఫ్, యూటీయూసీ తదితర సంఘాలున్నాయి. టీయూసీసీ ఈ సమ్మెలో పాల్గొనడం లేదు.

దోషాలున్న నోటీసును తిరస్కరించొద్దన్న స్పీకర్

- సరిచేయించి పరిశీలించాలని సిబ్బందికి ఆదేశం
- సాధ్యమైనంత త్వరగా సభ ముందుంచాలన్న ఓం బిర్లా



దిల్లీ: తనపై అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదిస్తూ విపక్షాలు ఇచ్చిన నోటీసులో దోషాలు ఉన్నప్పటికీ దానిని సరిచేయించాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా తమ సిబ్బందిని ఆదేశించినట్లు సమాచారం. నిజానికి నోటీసులో లోపాలుంటే దానిని తిరస్కరించవచ్చని, స్పీకర్ మాత్రం తప్పుల విషయాన్ని విపక్షానికి తెలిపి సరిచేయించి, సాధ్యమైనంత త్వరగా అది సభ ముందుకు వచ్చేలా చూడాలని చెప్పారని పార్లమెంటరీ వర్గాలు వెల్లడించాయి. కాంగ్రెస్ సహా విపక్షాలకు చెందిన 118 మంది సభ్యులు మంగళవారం లోక్‌సభ సెక్రటరీ జనరల్‌ను కలిసి ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానానికి నోటీసు ఇచ్చిన విషయం తెలిసిందే. 'ఫిబ్రవరి 2025'లో జరిగిన పరిణామాలంటూ దానిలో నాలుగుచోట్ల కొన్ని తప్పులు ప్రస్తావించారు. నిబంధనల ప్రకారం ఆ ఒక్క తప్పుతో నోటీసు చెల్లదని ప్రకటించే అవకాశం ఉంది. తిరస్కరించకుండా నోటీసుపై చర్యల్లో వేగవంతం చేయాలని, నిబంధనల ప్రకారం స్పందించాలని స్పీకర్ ఆదేశించారు.

కాంగ్రెస్ ఎంపీలు స్పీకర్‌ను ఛాంబర్లోనే దూషించారు: రిజిజు

లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాను 20-25 మంది కాంగ్రెస్ ఎంపీలు ఆయన ఛాంబర్లోనే దూషించారని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. వారు దూషణలకు దిగినప్పుడు అక్కడే ఉన్న సీనియర్ నేతలు కె.సి.వేణుగోపాల్, ప్రియాంకాగాంధీ వంటివారు నిలువరించలేదని విమర్శించారు. దాంతో స్పీకర్ ఎంతో మనస్తాపానికి గురయ్యారని, ఆయన ఎంతో సౌమ్యుడు కాబట్టి ఎలాంటి కఠిన చర్యలు తీసుకోలేదని బుధవారం విలేకరులకు తెలిపారు.

భారత పప్పుధాన్యాలకు రక్షణ

సవరించిన ఫ్యాక్ట్‌షీట్‌ను విడుదల చేసిన అమెరికా

వాషింగ్టన్: పప్పు ధాన్యాలపై సుంకాలను భారత్.. సున్నాకు చేర్చడంగానీ, తగ్గించడంగానీ చేస్తుందని తొలుత ప్రకటించిన అమెరికా.. వెనక్కి తగ్గింది. భారత ఉత్పత్తులకు రక్షణ కల్పిస్తూ వాటిని సుంకాల తగ్గింపు జాబితా నుంచి తొలగించింది. సోమవారం విడుదల చేసిన ఫ్యాక్ట్‌షీట్‌ను సవరించింది. సవరించిన ఫ్యాక్ట్‌షీట్‌ను మంగళవారం విడుదల చేసింది. 'అన్ని పారిశ్రామిక ఉత్పత్తులు, ఆహార, వ్యవసాయ ఉత్పత్తుల (ఎండు ధాన్యాలు, ఎర్ర జొన్నలు, ట్రీ నట్స్, తాజా, ప్రాసెస్డ్ పండ్లు, సోయాబీన్ ఆయిల్, వైన్, ఆల్కహాల్, ఇతర ఉత్పత్తులు)పై సుంకాలు సున్నా స్థాయికిగానీ, అతి స్వల్ప స్థాయికిగానీ చేరతాయి' అని సవరించిన ఫ్యాక్ట్‌షీట్ వెల్లడించింది. తొలుత ఇచ్చిన ఫ్యాక్ట్‌షీట్‌లో 'కొన్ని పప్పు ధాన్యాలు' అని ఉంది. సవరించిన దానిలో దానిని అమెరికా తొలగించింది.

ఎప్‌స్టీన్‌ను కలిశా..కానీ!

కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ

ఇంటర్నెట్ డెస్క్: తాను ఎప్‌స్టీన్‌ను కలిసింది నిజమేగానీ.. అతడిపై వచ్చిన ఆరోపణలకు, తనకు సంబంధం లేదని కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురీ స్పష్టం చేశారు. ఇంటర్నేషనల్ పీస్ ఇనిస్టిట్యూట్ (ఐపీఐ) బృందంతోపాటు తాను అతడిని కలిశానని పేర్కొన్నారు. ఎప్‌స్టీన్‌ను మంత్రి కలిశారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆరోపించిన నేపథ్యంలో ఆయన ఈ వివరణ ఇచ్చారు. 'ఐపీఐలో మా బాస్‌కు ఎప్‌స్టీన్ తెలుసు. కొన్ని సందర్భాల్లో అతడితో సమావేశమయ్యా. కచ్చితంగా చెప్పాలంటే మూడు నాలుగు సార్లు కలిశా. ఒక్కసారి ఈమెయిల్ చేసుకున్నాం. అతడిపై వచ్చిన ఆరోపణలకు, మా మధ్య జరిగిన సంభాషణలకు ఎలాంటి సంబంధం లేదు' అని మంత్రి వెల్లడించారు.

వందేమాతరం తర్వాతే జనగణమన

- ఆలాపనపై కేంద్ర హోంశాఖ ఆదేశం



దిల్లీ: అధికారిక కార్యక్రమాల్లో జాతీయ గీతం జనగణమన ఆలపించడానికి ముందే జాతీయ గేయం వందేమాతరంలోని 6 చరణాలను పాడాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. రాష్ట్రపతి పాల్గొనే, త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసే, గవర్నర్ల ప్రసంగాల వంటి కార్యక్రమాల్లో తొలుత 3 నిమిషాల 10 సెకన్ల నిడివి ఉండే వందేమాతరంలోని 6 చరణాలను ఆలపించాలని సూచిస్తూ గత నెల 28న తేదీన కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 'రెండింటినీ ఆలపించాల్సిన సమయంలో వందేమాతరాన్ని ముందుగా పూర్తి చేయాలి' అని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. వందేమాతరం ఆలపించేటప్పుడు అందరూ లేచి నిల్చోవాలని సూచించింది. అయితే న్యూస్‌రీల్, డాక్యుమెంటరీలు, సినిమాల్లో భాగంగా వందేమాతరం ఆలాపన వచ్చినప్పుడు నిల్చోవాల్సిన అవసరం లేదని పేర్కొంది.

■ పాఠశాలల్లో వందేమాతరంతోనే కార్యకలాపాలను ప్రారంభించాలని కేంద్ర హోంశాఖ సూచించింది.


■ దేశభక్తి, మాతృభూమి పట్ల ప్రేమతో, మర్యాదపూర్వకంగా.. సముచిత పద్ధతిలో ఏ కార్యక్రమంలోనైనా వందేమాతరాన్ని ఆలపించొచ్చని, దానిపై ఆక్షేపణలు ఉండవని స్పష్టం చేసింది.

■ దేశ గౌరవానికి చిహ్నమైన జాతీయ గీతం, గేయం ఆలాపన జరుగుతున్నప్పుడు ఎవరైనా ఉద్దేశపూర్వకంగా అంతరాయం కలిగించినా, అగౌరవపరిచినా ప్రభుత్వం కఠినంగా వ్యవహరించనుంది. కొత్త నిబంధనల ప్రకారం, ఇటువంటి చర్యలకు పాల్పడే వారికి గరిష్ఠంగా మూడేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉంది.

నేడు బంగ్లాదేశ్ ఎన్నికలు

బీఎన్‌పీ, జమాతే పార్టీల మధ్యే ప్రధాన పోరు


తారిఖ్ రెహమాన్


షఫీకుర్ రెహమాన్

ఢాకా: ఏడాదిన్నర క్రితం షేక్ హసీనా ప్రభుత్వం కుప్పకూలినప్పటి నుంచి తీవ్ర అస్థిరతను ఎదుర్కొంటున్న బంగ్లాదేశ్‌లో గురువారం సార్వత్రిక ఎన్నికలకు జరగన్నాయి. ప్రజలు కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకోనున్నారు. 2024ఆగస్టులో విద్యార్థుల ఉద్యమంతో అవామీ లీగ్ నేతృత్వంలో హసీనా ప్రభుత్వం పడిపోయిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి బంగ్లా పాలనను మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం పర్యవేక్షిస్తూ వచ్చింది. ఇప్పుడు ఈ ఎన్నికలతో ఢాకాలో కొత్త ప్రభుత్వం కొలువుదీరనుంది. 299 పార్లమెంటు స్థానాలకు జరిగే ఈ పోరులో వివిధ పార్టీలకు చెందిన 1,981 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. దాదాపు 12.7 కోట్ల మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. హసీనా నేతృత్వంలోని అవామీ లీగ్‌పై ప్రభుత్వం నిషేధం విధించడంతో ఈసారి ప్రధాన పోటీ.. బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ), షఫీకుర్ రెహమాన్ నేతృత్వంలోని జమాత్-ఎ-ఇస్లామీ కూటమి మధ్యే జరగనుంది. విద్యార్థుల ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన నేషనల్ సిటిజన్ పార్టీ కూడా జమాతే కూటమిలో ఉంది. ఎన్నికలతో పాటు కీలక రాజ్యాంగ సంస్కరణలపైనా రిఫరెండం జరగనుంది.

■ హసీనా నాయకత్వంలోని అవామీ లీగ్ పార్టీ లేకుండా ఎన్నికలు జరగనుండడం ఇదే తొలిసారి. హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతున్న సంగతి తెలిసిందే.

■ హసీనా ప్రభుత్వం కుప్పకూలిన తర్వాత బంగ్లాలోని మైనారిటీలు ముఖ్యంగా హిందువులను లక్ష్యంగా చేసుకుంటూ దాడులు జరిగాయి. ఈ ఎన్నికల్లో మతతత్వ పార్టీ జమాత్-ఎ-ఇస్లామీ అధికారంలోకి వస్తే ఈ దాడులు మరింతగా పెరిగే అవకాశం ఉందని మైనారిటీలు భావిస్తున్నారు.



పిల్లల పెంపకం అంటే ఆదర్శంగా ఉండటమే

మీరు ఏ అలవాట్లను పాటిస్తే మీ పిల్లలు వాటినే అనుసరిస్తారు. మీరు ఎల్లప్పుడూ ఒత్తిడితో ఉంటే వారు దానినే నేర్చుకుంటారు. మీరు అనారోగ్యకర ఆహారాలను భుజిస్తుంటే వారూ అదే అలవరచుకుంటారు. మీరు ఆరోగ్యంపై శ్రద్ధ చూపితే దానిని నేర్చుకుంటారు. ఉత్తమ పిల్లల పెంపకం అంటే ఆదర్శంగా నిలవడమే.

– బాబీ ఫ్రైలెర్, ఇన్‌ఫ్లుయెన్సర్

కెనడా స్కూల్లో కాల్పులు.. 10 మంది మృతి

ఒట్టావా: కెనడాలో కాల్పులు కలకలం సృష్టించాయి. బ్రిటిష్ కొలంబియా ప్రాంతంలోని టంబ్లర్ రిడ్జ్ సెకండరీ పాఠశాలలో జరిగిన కాల్పుల్లో 10 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 25 మంది గాయపడగా.. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. మృతుల్లో కాల్పులకు తెగబడినట్లు అనుమానిస్తున్న మహిళ కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. కాల్పుల జరిపిన అనంతరం తనను తాను కాల్చుకుని మహిళ ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. షూటర్‌ను గుర్తుపట్టినప్పటికీ ఆమె వివరాలను మాత్రం వెల్లడించలేదు. స్థానిక కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటలకు కాల్పులు జరిగాయి. పాఠశాలలో ఏడుగురి మృతదేహాలను గుర్తించగా... స్కూల్ సమీపంలోని ఓ ఇంట్లో మరో రెండు మృతదేహాలను గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. మరొకరు ఆసుపత్రికి తరలిస్తుండగా మరణించారన్నారు. ఇక్కడి సెకండరీ స్కూల్‌లో దాదాపు 175 మంది విద్యార్థులు చదువుతున్నారు.


పాఠశాల నుంచి వెలుపలకు వస్తున్న విద్యార్థులు

కమీషన్ల ఎరచూపి అద్దె ఖాతాలు

విజయవాడలో వెలుగు చూసిన మరో మ్యూల్ ఎకౌంట్స్ వ్యవహారం

ఈనాడు, అమరావతి: విజయవాడ నగరంలో మరో అద్దె ఖాతాల వ్యవహారం వెలుగుచూసింది. ఇందులో ముగ్గురు సభ్యుల ముఠాను సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. వివరాలను ఏసీపీలు రాజశేఖర్, పావన్‌కుమార్, ఇన్‌స్పెక్టర్‌లు మీడియా సమావేశంలో వెల్లడించారు. నిందితులను బుధవారం సాయంత్రం మూడో ఏసీజేఎం కోర్టులో హాజరుపర్చగా.. న్యాయాధికారి నిందితులకు ఈనెల 25వ తేదీ వరకు రిమాండ్ విధించారు.

డిజిటల్ మార్కెటింగ్ పేరుతో కార్యాలయం తెరిచిన సోదరులు : విజయవాడ సమీపంలోని యనమలకుదురు ప్రాంతానికి చెందిన సోదరులు రాయపాటి రవికుమార్ (ఏ1), అతని సోదరుడు స్టీవెన్ (ఏ2)లు.. బంధువుల వివాహం నిమిత్తం గతేడాది చెన్నై వెళ్లారు. బ్యాంకు ఖాతాలు తెరిపించి, వాటిని తనకు ఇస్తే ఒక్కో దానికి రూ. 4వేలు చొప్పున ఇస్తానని అక్కడ వారి సమీప బంధువు చెప్పాడు. దీనికి వారు అంగీకరించారు. విజయవాడ వచ్చిన తర్వాత డిజిటల్ మార్కెటింగ్ పేరుతో గదిని అద్దెకు తీసుకుని కార్యాలయాన్ని నడిపిస్తున్నారు. పలువురు అమాయకులు, కుటుంబ అవసరాలకు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నవారిని గుర్తించి వారితో పొదుపు, కరెంటు ఖాతాలు తెరిపించి.. వాటి చెక్, పాస్‌పుస్తకాలు, డెబిట్ కార్డులు తీసుకుని తమ వద్ద ఉంచుకునేవారు. ఖాతాలను మాత్రం చెన్నైలోని బంధువుకు పంపించేవారు. ఖాతాలు తెరిపించిన తర్వాత వారి నుంచి సిమ్‌లు తీసుకునేవారు. ఇలా 9 నెలల కాలంలో 36 ఖాతాలను తెరిపించారు. లావాదేవీలు జరిగినప్పుడు ఓటీపీలను చెన్నైలోని వ్యక్తికి ఫోన్‌లో వీరు చెబుతుండేవారు.

★ అద్దెకు తీసుకున్న గదిలోనే 21 ఫోన్లు పెట్టుకుని నిందితులు.. చెన్నై నుంచి వచ్చిన సూచనల మేరకు వీరి ఆధీనంలోని ఖాతాలకు వచ్చిన మొత్తాన్ని.. పైనుంచి ఆదేశాల మేరకు ఆయా ఖాతాలకు తిరిగి బదిలీ చేసేవారు. యూపీఐ లావాదేవీలు కూడా నిర్వహించారు. వీరి వద్ద ఉన్న ఖాతాలకు నగదు వస్తే.. పలుసార్లు డెబిట్ కార్డుల ద్వారా డ్రా చేసి, ఇతర ఖాతాలకు జమ చేసేవారు. ఈ వ్యవహారాల కోసం అవసరమైన ఫోన్లు, ల్యాప్‌టాప్‌ను చెన్నైకు చెందిన వ్యక్తి నుంచి వచ్చిన డబ్బులతో కొనుగోలు చేశారు. వీరి ఇంటికి సమీపంలో ఉండే స్నేహితుడు బాజి (ఏ3) కూడా జతకలిశాడు. ఇతను ఇతరులతో ఖాతాలు తెరిపించడంతో పాటు.. తను, తన భార్య పేరుతో కూడా పొదుపు, కరెంటు ఖాతాలు తెరిచి రవికుమార్, స్టీవెన్‌లకు ఇచ్చారు


వివరాలు వెల్లడిస్తున్న సైబర్ ఏసీపీ రాజశేఖర్. చిత్రంలో సౌత్ ఏసీపీ పావన్‌కుమార్, సైబర్ ఇన్‌స్పెక్టర్ శ్రీను

ల్యాప్‌టాప్‌లో లావాదేవీల చిట్టా..

పోలీసులు నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ల్యాప్‌టాప్‌లో నిందితులు తెరిచిన ఖాతాలు, చెన్నై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు నిర్వహించిన లావాదేవీల తాలూకు ఖాతాల వివరాలు లభించాయి. వీటిలో ఇప్పటివరకు వీరు నిర్వహించిన లావాదేవీలను నమోదు చేశారు. ఆయా ఖాతాలకు జమ అయిన, బదిలీ అయిన నగదు వివరాలను నిక్షిప్తం చేశారు. వీరి నుంచి ల్యాప్‌టాప్‌తో పాటు రూ. 3.40 లక్షలు, 21 మొబైళ్లు, 46 ఏటీఎం కార్డులు, 21 చెక్ పుస్తకాలు, 16 పాస్‌పుస్తకాలు, రెండు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

బోగస్ పత్రాలతో మోసం...


వ్యాపారంతో ఏమాత్రం సంబంధం లేని వారితో కూడా బోగస్ పత్రాలతో నిందితులు కరెంట్ ఖాతాలు తెరిపించారు. ఇలా నాలుగు కరెంటు ఖాతాలను తెరిపించారు. యనమలకుదురులోని ఓ పండ్ల దుకాణం వద్ద బ్యానర్ కట్టి.. బాజీ (ఏ3)ని అక్కడ నిలబెట్టి ఫొటో తీశారు. దీని ఆధారంగా పండ్ల వ్యాపారం చేస్తున్నట్లుగా మీసేవా కేంద్రంలో ట్రేడ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేయించి.. అది వచ్చిన తర్వాత, దాని ఆధారంగా బ్యాంకుల్లో కరెంట్ ఖాతా తెరిచారు. ఇలా మరో స్నేహితుడితో ఏబీ వెజిటబుల్స్ పేరుతోనూ ఇలాగే చేసి కరెంట్ ఖాతా తెరిపించారు.

ఫిర్యాదుతో వెలుగులోకి.. : పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న రాజవంశీ.. తన స్నేహితుడైన రవికుమార్ (ఏ1) సూచనతో మూడు బ్యాంకు ఖాతాలు తెరిచారు. తనకు తెలిసిన వారికి సంబంధించి కంపెనీకి ఐటీ, జీఎస్టీ సమస్యలు ఉన్నాయని.. దీనికి బ్యాంకు ఖాతాలు కావాలని నమ్మించాడు. దీంతో రాజవంశీ ఖాతాలు తెరిచారు. ఇటీవల ఈ ఖాతాను పరిశీలించగా రూ. కోట్లలో లావాదేవీలు జరిగినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘనంగా ముగిసిన వీరమ్మతల్లి తిరునాళ్లు

ఉయ్యూరు, న్యూస్‌టుడే: ఉయ్యూరు వీరమ్మతల్లి తిరునాళ్ల బుధవారం రాత్రితో ముగిశాయి. పదిహేను రోజుల పాటు అత్యంత వైభవంగా జరిగిన తిరునాళ్లకు జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వచ్చి వీరమ్మతల్లిని ఉత్సవ ఆలయంలో దర్శించుకున్నారు. గత నెల 28వ తేదీన ప్రారంభమైన తిరునాళ్లు పదిహేను రోజుల పాటు జరిగాయి. బుధవారం అర్ధరాత్రి వీరమ్మతల్లిని స్థానిక రావిచెట్టు సమీపంలోని మెట్టినింటికి తీసుకెళ్లారు. అక్కడ మహాశివరాత్రి రోజు వరకు ఉంచి..ఆ రోజు నడకదారిన తోట్లవల్లూరు మండలం ఐలూరు వద్ద కృష్ణానదిలో అమ్మవారిని స్నానమాచరింపజేసి తిరిగి మెట్టినింటికి తీసుకొస్తారు. వచ్చే ఏడాది తిరునాళ్ల ప్రారంభం వరకు అమ్మవారు అక్కడే భక్తులకు దర్శనమిస్తారు. చివరి రోజున వేలాది మంది జనంతో ఉయ్యూరు రహదారులన్నీ నిండిపోయాయి. కాటూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటైంది. శ్రీనివాసరావు వైద్యసేవలందించారు. గన్నవరం డీఎస్పీ శ్రీనివాస్ నేతృత్వంలో ఉయ్యూరు పట్టణ సీఐ టీవీవీ రామారావు ఆధ్వర్యంలో వందలాది మంది పోలీసులు బందోబస్తులో పాల్గొన్నారు.

ముఠా కార్మికుల ఆధ్వర్యంలో: బుధవారం ఉయ్యూరులో ముఠా కార్మికుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున వీరమ్మతల్లి సంబరం జరిగింది. అమ్మవారి సారె తీసుకెళ్లే పోతుల ప్రభ ఊరేగింపును ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వై. వి. బి. రాజేంద్రప్రసాద్‌లు ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ ఛైర్మన్ పూర్ణచంద్రరావు, తెదేపా బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి రాజులపాటి ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.


ఊరేగింపును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్ర ప్రసాద్ తదితరులు

ఎంఎస్‌ఎంఈ రంగాన్ని అగ్ర స్థానానికి తీసుకెళ్లడమే లక్ష్యం

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు బ్యాంకుల నుంచి ఆర్థిక సహాయం మంజూరు పరంగా దేశంలోనే మొదటి ఐదు స్థానాల్లో రాష్ట్రాన్ని నిలిపేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. ప్రస్తుతం పదో స్థానంలో ఉందని, గతంతో పోలిస్తే రుణాల మంజూరు రెట్టింపు అయ్యిందని తెలిపారు. 'ఎంఎస్‌ఎంఈ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లు... పరిష్కారానికి సూచనలు' అనే అంశంపై కాన్ఫడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో విజయవాడ ఎంజీ రోడ్డులోని ఓ హోటల్లో బుధవారం రాత్రి నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంత్రి, ఉప సభాపతి రఘురామకృష్ణరాజు హాజరయ్యారు. వివిధ రంగాల పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ.. ఎంఎస్‌ఎంఈ రంగాన్ని అగ్ర స్థానంలోకి తీసుకెళ్లాలనే కృతనిశ్చయంతో ప్రభుత్వం ఉందని అన్నారు. అందులో భాగంగానే అనుమతులను సరళీకృతం చేశామని, ఆటో అప్రూవల్ విధానాన్ని అందుబాటులోకి తీసుకొచ్చామని వివరించారు. పరిశ్రమల స్థాపనలో జాప్యాన్ని నివారించేందుకు వైట్, గ్రీన్ కేటగిరీ పరిశ్రమలకు ఆటోమెటిక్ అప్రూవల్ విధానాన్ని వర్తింపజేస్తున్నామని చెప్పారు. పారిశ్రామికవేత్తలు అనుమతుల కోసం చూడకుండా వెంటనే నిర్మాణ పనులు ప్రారంభించవచ్చని, రెండేళ్ల లోపు అవసరమైన పత్రాలను సమర్పించే వెసులుబాటు కల్పిస్తున్నామని అన్నారు. గత రెండేళ్లలో ఎంఎస్‌ఎంఈలకు బ్యాంక్‌ల ఆర్థిక సహాయం రూ.4 వేల కోట్ల నుంచి రూ.8 వేల కోట్లకు పెరిగిందన్నారు. ఇంకా ఆ సహాయాన్ని పెంచాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి ఇంటికి ఓ పారిశ్రామికవేత్త రావాలన్నదే ప్రభుత్వ సంకల్పమని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 175 ఎంఎస్‌ఎంఈ పార్కులను ఆయా రంగాల అవసరాలకు అనుగుణంగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అన్నారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ.. ప్రభుత్వంతో ఘర్షణ ధోరణిలో కాకుండా... సంప్రదింపుల ద్వారా పారిశ్రామికవేత్తలు తమకు అవసరమైన రాయితీలు, సౌకర్యాలు పొందే వీలుంటుందని, ఈ విషయం తన వ్యక్తిగత అనుభవంతో చెబుతున్నానని అన్నారు. సీఐఐ విజయవాడ జోన్ ఛైర్‌పర్సన్ నాగలక్ష్మి, సభ్యులు కోటగిరి అభినవ్, ఈబీ రాజేశ్, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు కీర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం రుణాల మంజూరు పరంగా బ్యాంకుల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను పారిశ్రామికవేత్తలు మంత్రి, ఉప సభాపతి దృష్టికి తీసుకెళ్లారు. పూచీకత్తు లేని రుణాల పరిమితి పెంచాలని సీఐఐ ప్రతినిధులు కోరారు. గత ప్రభుత్వ కాలం నుంచి నిలిచిపోయిన పారిశ్రామిక రాయితీలను విడుదల చేయాలని అన్నారు.


మాట్లాడుతున్న ఉప సభాపతి రఘురామకృష్ణరాజు, వేదికపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు

15న వీణావాద్య కచేరీలు

విజయవాడ సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీసుబ్రహ్మణ్య మహతీ సంగీత సంస్థ 10వ వార్షికోత్సవం సందర్భంగా గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో దశమ వార్షిక అఖండ ఖచ్ఛపీ (వీణావాద్య కచేరీలు) మహోత్సవం నిర్వహించనున్నట్లు కార్యదర్శి సి.విశ్వేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు చిట్టా రామలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15వ తేదీ ఉదయం 8 నుంచి 16వ తేదీ ఉదయం 8 వరకు(24 గంటలు) నిర్విరామంగా సాగుతుందన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి 200 మందికిపైగా విద్వాంసులు, వాద్యకళాకారులు పాల్గొని వీణపై సంప్రదాయ కీర్తనలతో అలరిస్తారని ఆ ప్రకటనలో తెలిపారు.

14న హెచ్‌సీఎల్ క్రీడా జట్ల ఎంపిక పోటీలు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: హెచ్‌సీఎల్, హీల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 14న పటమటలోని కేబీసీ జడ్పీహెచ్ స్కూల్ మైదానంలో ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి క్రీడా జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని హెచ్‌సీఎల్ స్పోర్ట్స్ ఫర్ ఛేంజ్ ప్రాజెక్ట్ మేనేజర్ ఎస్. శ్యామ్ సుందరరావు తెలిపారు. బాలబాలికలకు ఫుట్‌బాల్, హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాలికలకు మాత్రమే రగ్బీ పోటీలు ఉంటాయని చెప్పారు. జనవరి ఒకటి, 2011 తర్వాత జన్మించి.. ప్రభుత్వ, నగర పాలక సంస్థ, గురుకుల పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న వారు మాత్రమే పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ఈ పోటీల నుంచి ప్రతిభ గల క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ఆ జట్లు త్వరలో బెంగళూరులో జరిగే దక్షిణ భారత్ అంతర్ రాష్ట్ర పోటీల్లో తలపడతాయని వివరించారు. పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు హెచ్‌సీఎల్ ఉచిత ప్రయాణ, దినసరి భత్యం చెల్లిస్తుందని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు, జట్లు ఈ నెల 14వ తేదీ ఉదయం 8 గంటలకు జడ్పీ హెచ్ స్కూల్ మైదానంలో హాజరు కావాలని సూచించారు. హెచ్‌సీఎల్ ఏరియా మేనేజర్ బి. శ్రీనివాసరావు, హీల్ సీఈవో కె. అజయ్‌కుమార్ పోటీలను పర్యవేక్షిస్తారని ఎస్. శ్యామ్ సుందరరావు తెలిపారు. కార్యక్రమానికి ఎస్‌పీడీ బి. శ్రీనివాసరావు, ఎన్టీఆర్ డీఈవో చంద్రకళ ముఖ్యఅతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు.

అందరూ సహోదర ప్రేమతో జీవిస్తే మేలు

ముగిసిన గుణదల మేరీమాత ఉత్సవాలు

గుణదల, న్యూస్‌టుడే: మూడు రోజులుగా నిర్వహించిన గుణదల మేరీమాత మహోత్సవాలు బుధవారంతో ముగిశాయి. ముగింపు వేడుకలకు విజయవాడ కథోలిక పీఠం బిషప్ తెలగతోటి రాజారావు ముఖ్యఅతిథిగా హాజరై సందేశమిచ్చారు. అసమానతలు తొలగినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. మదర్ థెరెసా, జోసఫ్ తంబి లాంటి వ్యక్తులు సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. అందరూ సహోదర ప్రేమతో జీవించాలని పిలుపునిచ్చారు. మేరీమాతను దర్శించిన భక్తులకు అనుగ్రహం లభించడం వల్లే ఏటా వేడుకలకు వచ్చే విశ్వాసుల సంఖ్య పెరుగుతోందని పేర్కొన్నారు. అనంతరం బిషప్‌లు రాజారావు, షమీంద్ర జయవర్ధన (అమెరికా)లతో కలిసి మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్, వికార్ జనరల్ ఫాదర్ మేశపాం గాబ్రియేలు, గుణదల పుణ్యక్షేత్రం రెక్టర్ యేలేటి విలియం జయరాజు తదితర 500 మంది గురువులు ముగింపు మహోత్సవాల సమిష్టి దివ్యపూజాబలి సమర్పించారు. భక్తులకు దివ్యసత్ప్రసాదం అందజేశారు. ఉత్సవాల చివరి రోజు పుణ్యక్షేత్రం విశ్వాసులతో కిటకిటలాడింది. ప్రార్థనలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. దివ్యసత్ప్రసాదం స్వీకరించారు. ఫాదర్ పసల థామస్, మధిర బెర్నాడ్ బృందం ఆలపించిన ఆధ్యాత్మిక గీతాలు, కోలాటం, భక్తి గీతాలు, లూర్దు మాత సంక్షిప్త చరిత్ర ప్రదర్శన, బుర్రకథ ఆకట్టుకున్నాయి. పీఠాధిపతిగా బిషప్ రాజారావు 10 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన్ని మోన్సిన్యోర్ ఫాదర్ మువ్వల ప్రసాద్ తదితరులు సన్మానించారు. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, వైకాపా ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు దేవినేని అవినాష్ తదితరులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ.. తమిళనాడు వేళాంగిణి మాత ఉత్సవాల తరహాలో వచ్చే ఏడాది మరింత వైభవంగా.. మేరీమాత ఉత్సవాలు నిర్వహించేందుకు ఎమ్మెల్యే రామ్మోహన్‌తో కలిసి కృషి చేస్తానని తెలిపారు. పుణ్యక్షేత్రాన్ని మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. ఉత్సవాలకు జిల్లా యంత్రాంగం చక్కటి ఏర్పాట్లు చేసిందని అభినందించారు. ఫాదర్లు పసల థామస్, కొలకాని మరియన్న, తోట సునీల్ రాజు, జి.కిరణ్‌బాబు, మెరుగుమాల చిన్నప్ప, తెలగతోటి పౌలు, గుజ్జల మైఖేల్, డేవిడ్ రాజు, వినయ్ కుమార్ తదితర 500 మంది గురువులు, సిస్టర్లు పాల్గొన్నారు. పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.


మాట్లాడుతున్న ఎంపీ కేశినేని శివనాథ్, వేదికపై ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, బిషప్ తెలగతోటి రాజారావు తదితరులు


వేడుకలకు హాజరైన విశ్వాసులు

వసుంధర

vasundhara@eenadu.in

పని చేద్దామా... కలిసికట్టుగా!



ఇప్పుడే ఆఫీసులో చేరా కదా! ఎన్ని జెనరేషన్స్ కలిసి పనిచేస్తున్నాయో! భిన్న వయసుల వాళ్లు అలా కలిసి చేయడం కూడా ముఖ్యమే. కానీ ఇంటిలోలాగ కొన్ని మాటలూ వినిపిస్తుంటాయి. 'అమ్మో ఈతరం పిల్లలతోనా' అంటారు పెద్దవాళ్లు. 'అబ్బా ఈ పెద్దవాళ్లకి మనం అర్థం కాము. చెబితే వినరని కినుక వహిస్తారు ఈ తరం అమ్మాయిలు. ఇంట్లో అంటే ఎవరి పని వాళ్లు చూసుకుంటూ... ఎవరి దారిలో వాళ్లు వెళ్తే సరిపోతుంది. ఆఫీసులో ఇది కుదిరే పనేనా? ఎన్నో తరాల వాళ్లతో పనిచేయాలి.

సర్లే... పనంటే తప్పదుగా చెప్పింది చేద్దాం అన్నట్టుగా ఉన్నా బాగోదు. చిన్నచిన్న సరదాలు, అనుభవ పాఠాలు, తప్పుల నుంచి నేర్చుకోవడం... ఇలా ఉన్నప్పుడే ఆఫీసు వాతావరణమూ బాగుంటుంది. కానీ అక్కడే జరుగుతుంది! ఒకే వయసున్న వాళ్లే ఫ్రెండ్స్‌లా మారతారు. వాళ్లతోనే ఆలోచనలు పంచుకుంటూ గడిపేస్తుంటారు. పెద్దవాళ్లు ఏదైనా చెబితే అబ్బా నస అనుకుంటారు చిన్నవాళ్లు. అలాగని అర్థమయ్యేలా చెప్పే ఓపిక ఈ తరానికీ ఉండదు. కానీ అలాకాకుండా స్నేహం చేయండి. తాజా ట్రెండ్‌లు, టెక్నాలజీ, సోషల్‌మీడియా పోకడలు వంటివి చిన్నవాళ్లు పెద్దవాళ్లకి నేర్పించొచ్చు. తమ అనుభవాలు, పరిశ్రమ పరిజ్ఞానం, నాయకత్వ నైపుణ్యాలు, క్లిష్టమైన పరిస్థితుల్లో ఎదుర్కోవడం వంటివి పెద్దవాళ్లే చెబుతారు. ఎంత బాగుంటుంది ఇలా పంచుకుంటే! దీన్నే టూ వే మెంటరింగ్ అంటున్నారు నిపుణులు. ఆఫీసులో దీనికి పోటీపడుతుంటున్నారు. మాకారా ఏం తెలియదు అని పక్కనపెడితే ఎన్నింటిని కోల్పోతున్నామో! కేవలం కెరియరేనా? పిల్లలు, అత్తారింట్లో మెలగడం, కొనుగోళ్లు... ఇలా ఎన్నో విషయాల్లోనూ వీళ్ల సలహాలు పనిచేస్తాయి. మీరు చేయాల్సిందల్లా నవ్వుతూ పలకరించడం. ఓపికగా వాళ్లతో మనసు విప్పడం. సులభమే కదూ! నేర్పిస్తూ... నేర్చుకునే ఈ ప్రయాణాన్ని మిస్ చేసుకోకండి మరి.



మీరూ ఈ తప్పు చేయకండి..!

'పిల్లాడు ఒక్క ముద్ద అన్నం కూడా తినడం లేదు!' 'జంక్‌ఫుడ్ తప్ప వేరే ఏం పెట్టినా వద్దంటున్నాడు!' 'కూరగాయల్ని ఏరి పడేస్తున్నాడు'! అమ్మల్ని పిల్లల ఆహారపు అలవాట్ల గురించి అడగాలే కానీ... ఇలా ఎన్ని ఫిర్యాదులు చెబుతారో. ఇది ఏ ఒక్క తల్లికో పరిమితమైన సమస్య కాదు. భారత్‌లో దాదాపు 81శాతం మంది తల్లులకు ఉన్నదే అంటున్నారు నిపుణులు. మరి దీన్నుంచి ఎలా బయటపడాలి అంటే...

- పిల్లల ఆహారపు అలవాట్లు ఒక్కరోజులో వచ్చినవి కాదు. వాళ్లకి సెమీ సాలిడ్స్ పెడుతున్నప్పటి నుంచే అన్నీ ఒక్కొక్కటిగా అలవాటు అవుతూ వస్తాయి. ఈ దశ నుంచే వాళ్లకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని మిశ్రమాల రూపంలో అలవాటు చేస్తే... ఏ చింతా ఉండదు.
- రెండేళ్లు వచ్చేసరికి మనం తినే ఆహారం వాళ్లకీ అలవాటయ్యేలా చూసుకోవాలి. ముఖ్యంగా ఆకుకూరలు, కూరగాయల్ని ఒక్కొక్కటిగా కొద్ది పరిమాణంలో పెట్టాలి. అప్పుడే వాళ్లకి అన్ని రుచుల మీదా ఆసక్తి కలుగుతుంది.
- ఇక జంక్ ఫుడ్ విషయానికొస్తే... బయట దొరికే ఆహార పదార్థాలన్నీ ఇప్పుడు ఇంట్లోనూ ఆరోగ్యంగా చేసుకునే అవకాశం ఉంటుంది. అలాంటి వాటిని ఎంపిక చేసుకుని పిల్లలకు అందిస్తే సరి. వీటన్నింటి వల్లా వంకలు పెట్టకుండా అన్నీ తింటారు. పాటిస్తారుగా మరి!



బంగారం - వెండి

11న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,60,620	1,45,700	2,68,399
విజయవాడ	1,56,170	1,45,300	2,75,000
ప్రొద్దుటూరు	1,59,200	1,46,460	2,70,500
రాజమహేంద్రవరం	1,58,510	1,45,300	3,00,000
విశాఖపట్నం	1,59,600	1,46,300	2,73,000
తమిళనాడు	-----	1,47,900	3,00,000

కీటో డైట్ పాటించొచ్చా?

నా వయసు 35. బరువు 80 కిలోలు. తెలిసినవాళ్లని అడిగితే కీటో డైట్ చేయమని సలహా ఇచ్చారు. ఇది మంచిదేనా? ఎలాంటి ఆహార నియమాలు పాటించాలి?

– చైతన్య

బరువు తగ్గడం మంచిదే. ఆహారంలో తక్కువ కార్బోహైడ్రేట్లు, అధిక ప్రొటీన్లు, ఎక్కువ కొవ్వులు తీసుకుంటూ శరీరానికి శక్తిని అందించడమే కీటో డైట్. ముఖ్యంగా అన్నం, చపాతీ, పండ్లు, స్వీట్స్ తక్కువ మొత్తంలో తీసుకోవాలి. ఎలాంటి అనారోగ్య సమస్యలూ లేకపోతే కిడ్నీ పనితీరు, హెల్త్ స్క్రీనింగ్ వంటివి చేయించుకుని న్యూట్రిషనిస్ట్ సలహాలతో దీన్ని చేయాలి. కీటో డైట్ మొదట్లో రోజుకి 8గం. లేదా 4 గంటలకోసారి ఆహారం తినడంవల్ల కీటోన్లు ఉత్పత్తి అయ్యి బరువు తగ్గడానికి ఉపయోగపడతాయి. మీ బరువును బట్టి కిలోకి 1గ్రా. నుంచి 2గ్రా. ప్రొటీన్ ఆహారంలో ఉండేలా చూసుకోవాలి. ఈ డైట్‌లో ఆకుకూరలు, కూరగాయలు... వంటివీ తీసుకోవచ్చు. సలాడ్లు తీసుకుంటే శరీరానికి కావాల్సిన పొటాషియం అందుతుంది. అయితే కీటో డైట్‌లో నూనె, నెయ్యి, మటన్ ఎక్కువ తినొచ్చు అనుకుంటారు. కానీ వాటిని తగినంత పరిమాణంలోనే తీసుకోవాలి. ఈ సమయంలో శరీరం శక్తికోసం గ్లూకోజ్‌ని కాకుండా కొవ్వుని వినియోగించుకుంటుంది. అందుకే జీర్ణకోశ పనితీరుని కాపాడుకోవాలి. కీటో డైట్‌లో మీ యూరిన్‌లో కీటోన్స్ ఎలా ఉన్నాయో చెక్ చేసుకోవాలి. కీటోన్స్ మీ శరీరాన్ని ప్రభావితం చేయడానికి కనీసం 7-15 రోజులు పడుతుంది. తరవాత 6 వారాలైనా ఈ ఆహార నియమాలు పాటించాలి. వీటితో పాటు శారీరక శ్రమ, సరిపడా నీళ్లు తాగడమూ ముఖ్యమే. మీరనుకున్న బరువు తగ్గాక పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే చపాతీ, రైస్ వంటివి కొద్దికొద్దిగా పెంచుకుంటూ వెళ్లాలి.

డియర్ వసుంధర



డా. జానకీ శ్రీనాథ్
పోషకాహార నిపుణులు

యూరప్‌లో మన సేంద్రియ పాఠాలు

వ్యవసాయం లాభసాటి కాదు... రసాయన మందులు వాడకపోతే దిగుబడి రాదు... అంటూ అందరూ చెప్పిన మాటలేవీ ఈ మహిళల చెవికెక్కలేదు. సేంద్రియ సాగులో ప్రయోగాలు చేశారు. ప్రకృతితో మమేకమై... లాభాలు అందుకుంటున్నారు. తాము విజయం సాధించడమే కాదు... నలుగురినీ ఆ బాటలో నడిపిస్తున్నారు. ఈ చొరవను గుర్తించే ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ... యూరప్‌లో సాగు పద్ధతులను తెలుసుకోవడానికీ, మన వ్యవసాయ విధానాలను వారితో పంచుకోవడానికి ఆరిక నరసమ్మ, లాలం జ్యోతిలను ఎంపిక చేసింది.



సేద్యం చేస్తూ... వ్యవసాయ విద్య చదువుతూ..

కురుపాం మండలంలోని మారుమూల కొండలపై ఉన్న ఎగువ పులిపుట్టి నరసమ్మది. కాలక్రమంలో ఆమె తల్లిదండ్రులు గ్రామాన్ని విడిచి నీలకంఠాపురం సమీపంలోని సంతోషపురంలో స్థిరపడ్డారు. వ్యవసాయమే వారి జీవనాధారం. తర్వాత నరసమ్మకు దురిబిలికి చెందిన గవరయ్య(గౌతమ్)తో వివాహమైంది. పెళ్లి నాటికి పదో తరగతి మాత్రమే చదివారామె. ప్రస్తుతం సేంద్రియ వ్యవసాయం చేస్తూనే ప్రకృతి సాగులో నాలుగు సంవత్సరాల డిగ్రీ కోర్సులో చేరారు. ప్రస్తుతం ఆమె వ్యవసాయ విద్యలో చివరి సంవత్సరం చదువుతున్నారు.

ప్రకృతి వ్యవసాయంలో నరసమ్మ రెండు విధానాల్ని పాటిస్తున్నారు. ఏటీఎం (ఎనీటైం మనీ) పేరుతో 20 సెంట్లలో అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలు, పాదులు, దుంపలు వేసి, నిత్యం ఏదో ఒక పంట చేతికి వచ్చేలా పండిస్తున్నారు. 'ఏ గ్రేడు' విధానంలో క్షేత్ర ప్రయోగాలను నిర్వహిస్తూ ఫలితాలు సాధిస్తున్నారు. పొలం గట్లను విడిచిపెట్టకుండా, పండ్లజాతుల మొక్కలు పెంచుతూ ఆదాయం పొందుతున్నారు. ప్రకృతి సేద్యం చేస్తూ, నెలకు రూ.20 వేల వరకు ఆదాయాన్ని పొందుతున్నారు. ఈ ఫలితాలను చూడటానికే ఇటీవల యూరప్ బృందం ఈ ప్రాంతంలో పర్యటించింది. ఈమె క్షేత్రాన్ని సందర్శించి సేంద్రియ సాగులో చేస్తున్న కృషి, సాధిస్తున్న ఫలితాలను తెలుసుకున్నారు. దాంతో నరసమ్మకు విదేశాలకు వెళ్లి ప్రకృతి సేద్యాన్ని పరిచయం చేసే అవకాశమూ కలిగింది.

– జి. రామకృష్ణ, పార్వతీపురం



రైతు సాధికార సంస్థ, బెర్లిన్‌కు చెందిన ఫౌండేషన్ ఆఫ్ ఫ్యూచర్ ఫార్మింగ్ సంస్థలు సంయుక్తంగా ఈ పర్యటనను నిర్వహిస్తున్నాయి. ఇందులో భాగంగా నెలరోజుల పాటు యూరప్‌లోని జర్మనీ, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్, పోలండ్, బెల్జియం... ఇలా పలు దేశాల్లో పర్యటించనున్నారు.

ప్రకృతి సేద్యంలో.. ఆశా 'జ్యోతి'

'పర్యావరణ పరిరక్షణ... ఆరోగ్యకరమైన ఆహారం' అనే లక్ష్యంతో పొలంలో అడుగుపెట్టారు లాలం జ్యోతి. రసాయనాల అవసరం లేకుండా ప్రకృతి సేద్యంలో అధిక దిగుబడులు సాధిస్తున్నారు. జ్యోతిది అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం సంతపాలెం. మధ్యతరగతి కుటుంబంలో పుట్టిపెరిగారు. ఎంబీఏ పూర్తి చేసి విజయవాడలోని ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగంలో చేరారు. ఆపై కొన్నాళ్లకే వివాహమైంది. గర్భం దాల్చినప్పుడు బిడ్డ సరైన బరువు లేదని వైద్యులు చెప్పడంతో ఆందోళన చెందారట. అందుకు కారణం తాను తీసుకునే ఆహారమేనని తెలుసుకుని ఆలోచనలో పడ్డారు. ఆ క్రమంలోనే రసాయనిక పంటల వల్ల కలిగే నష్టాలను గమనించి ముందు తన కుటుంబానికి ఆరోగ్యకరమైన ఆహారాన్ని అందించాలని సంకల్పించి, ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేశారు. మొదట్లో అంతా దిగుబడి రాదన్నవారే. కానీ, ఆమె ప్రయత్నం ఆపలేదు. 2020లో 10 సెంట్లలో ఆరు రకాల పంటలను సాగు చేయడం ప్రారంభించారు. సాగు ఖర్చు, నేల స్వభావాలు వంటివి తెలుసుకున్నారు. దీంతోపాటు ప్రకృతి విధానాలైన జీవామృతం, బీజామృతం, మల్చింగ్ పద్ధతులను సమర్థంగా అమలు చేస్తున్నారు. ఇప్పుడు రెండు ఎకరాల్లో దాదాపు 42 రకాలకు పైగా పంటలు పండిస్తున్నారు. ఏడాదికి రూ. రెండు లక్షల వరకు ఆదాయం సంపాదిస్తున్నారు. జ్యోతి.. చేసిన ప్రయోగాలు, ప్రకృతి వ్యవసాయం సత్ఫలితాలు ఇవ్వడంతో అనేక మంది రైతులకు ఆమెను ఉదాహరణగా చూపడం ఆరంభించారు వ్యవసాయ అధికారులు. 2024 ఆగస్టులో పులివెందుల సమీపంలోని ఇండో-జర్మన్ గ్లోబల్ అకాడమీలో మెంటార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ ప్రయాణంలో తనకు భర్త వరాహమూర్తి సహకారం అందించారని చెబుతారు జ్యోతి.



– టి. చిరంజీవి, పి.సీతారాం, అనకాపల్లి

జెన్‌జీలు ఎలా ఉన్నారంటే..

శోధిత

మీ ఇంట్లో జెన్‌జీ పిల్లలున్నారా... అయితే ఈ అధ్యయనం గురించి మీరు తెలుసుకోవాల్సిందే. 'గత కాలం మేలు... వచ్చు కాలం కంటెన్' అని నన్నయ్య చెప్పిన మాటల్ని కాస్త మార్చి.. 'గత తరం మేలు... వచ్చు తరం కంటెన్' అంటున్నారు పరిశోధకులు. మానవ పరిణామ క్రమంలో ప్రతీతరం తమ ముందరి తరంకంటే, తెలివిగా ఆలోచిస్తూ వచ్చింది. కానీ మొదటిసారి జెన్‌జీలు అందుకు భిన్నంగా ఉన్నారట. జెన్‌జీలు తమ ముందరి తరమైన మిలీనియల్స్‌కంటే తక్కువ ఐక్యూ స్థాయుల్ని కలిగిఉన్నారట. అమెరికాకు చెందిన న్యూరో సైంటిస్ట్ డాక్టర్ జారెడ్ కూనీ హోర్వత్... అమెరికా సెనేట్ కమిటీ(కామర్స్, సైన్స్, ట్రాన్స్‌పోర్టేషన్)కి ఇచ్చిన నివేదికలో ఈ విషయాల్ని తెలిపారు. ఆలోచించడం, నేర్చుకోవడం, సమస్యను పరిష్కరించడం, ప్రపంచాన్ని అర్థం చేసుకోవడం... వంటి అభిజ్ఞా నైపుణ్యాలు ఐక్యూలో భాగం. 'ముందరి తరంకంటే జెన్‌జీల చదువులకు మెరుగైన అవకాశాలున్నాయి. అయినా వాళ్ల ఐక్యూ స్థాయి తక్కువగా ఉంది' అని చెప్పడమే కాదు, 2010 నుంచి క్రమంగా తగ్గుతూ వచ్చిన డేటాని ప్రదర్శించారు. మిలీనియల్స్‌తో పోల్చితే ఏకాగ్రత, సమస్యల్ని పరిష్కరించడం, చదవడం, గణిత సాధన... మొత్తంగా అన్నింట్లో జెన్‌జీలు వెనకబాటుని ప్రదర్శించారు. 'మానవ పరిణామక్రమంలో అన్నీ నేరుగా(ముఖాముఖీ) తెలుసుకుంటూ, నేర్చుకుంటూ వచ్చారు. వ్యక్తుల్ని గమనించడం, లోతైన అధ్యయనం ద్వారా నేర్చుకోవడానికి మానవ మెదడు అలవాటు పడింది తప్ప స్క్రీన్‌లు చూస్తూ, తిప్పుతూ కాద'ంటారు హోర్వత్. అమెరికాలోనే కాదు, దాదాపు 80 దేశాల్లో ఇదే తరహా ఫలితాలు ఉన్నట్లు చెబుతారు హోర్వత్. జెన్‌జీలకే ఇలా ఉంటే ఇక జెన్ ఆల్ఫాల పెంపకంలో తల్లిదండ్రులు ఇంకెన్ని జాగ్రత్తలు తీసుకోవాలో! కాబట్టి పిల్లల స్క్రీన్‌టైమ్ తగ్గించి, వాళ్లచేత పుస్తకాలు, పత్రికలు చదివించాలి. తరగతులకు నేరుగా హాజరవుతూ, ప్రాక్టికల్‌గా నేర్చుకునే వాతావరణం కల్పించాలి. మొత్తమ్మీద తమ ముందరి, తర్వాత తరాల కంటే తెలివైనవాళ్లుగా నిలిచిన ఘనత మిలీనియల్స్‌దే!



పట్టుదలకు తిరుగులేని తీర్పు!

తొలి మహిళ

వైకల్యం శరీరానికే, ప్రతిభకు కాదని ఇదివరకే చాలామంది అమ్మాయిలు నిరూపించారు. తాన్య నాథన్ గెలుపు ఈ విషయాన్ని మరింత బలపరిచింది. తొలి అంధ మహిళా జడ్జిగా పగ్గాలు అందుకోబోతున్న ఈమె విజయం ఓ సంచలనం. ఇదెలా సాధ్యమైందంటే...



సాంకేతిక విద్య, క్రీడలు... ఇలా అన్ని రంగాల్లో పోటీపడుతూ, మంచి ఫలితాల్ని అందుకుంటున్నారు దృష్టిలోపం ఉన్న అమ్మాయిలు. కానీ, వీళ్లు న్యాయ రంగంలో వెనకపడ్డారనే చెప్పాలి. అంధులు బెంచ్‌కు తగినవాళ్లు కాదన్న అభిప్రాయమే ఇందుకు కారణం. దీన్ని తిరగరాస్తూ సుప్రీంకోర్టు గతేడాది మార్చిలో తీర్పును వెల్లడించింది. ఆసక్తి, నైపుణ్యాలున్న అంధ అభ్యర్థులూ న్యాయ సేవల్ని అందించడానికి అర్హులని ప్రకటించింది. దాంతో న్యాయవాదిగా శిక్షణ పొందుతున్న తాన్య ఈ అవకాశాన్ని వినియోగించుకున్నారు. కేరళలోని మాంగడ్‌లో పుట్టిపెరిగారీమె. నాన్న జగన్నాథమ్ గల్ఫ్‌లో ఉద్యోగి. అమ్మ బబిత. పుట్టుకతోనే అంధురాలు తాన్య. 7వ తరగతి వరకూ మోడల్ స్కూల్లో చదువుకున్నారు. తర్వాత సాధారణ పాఠశాలలోనే ప్రాథమిక, మాధ్యమిక విద్యను పూర్తిచేశారు.

ఆమె ఒక్కరే...

పదో తరగతి చదువుతున్నప్పుడే తాన్యకు న్యాయ వృత్తిలో స్థిరపడాలన్న ఆలోచన వచ్చిందట. 'చట్టం, న్యాయం అత్యంత శక్తిమంతమైన ఆయుధాలు. వాటిని అందుకోవడంలో ఏ ఒక్కరూ వెనకపడకూడదు' అంటారు తాన్య. ఇంటర్మీడియట్ పూర్తయిన వెంటనే లా ప్రవేశ పరీక్ష రాసి కన్నూర్ విశ్వవిద్యాలయంలో సీటు సంపాదించారీమె. ఆ బ్యాచ్‌లో తాన్య ఒక్కరే దృష్టిలోపం ఉన్న విద్యార్థిని. దాంతో మిగతా వాళ్లతో సమానంగా చదవలేక పోయేవారట. అయినా వెనకడుగు వేయలేదు. 'బ్రెయిలీ మెటీరియల్ లేక మొదట్లో చాలా ఇబ్బందులు పడ్డా. తర్వాత స్క్రీన్ రీడింగ్ సాఫ్ట్‌వేర్లు ఉపయోగించి మెలకువల్ని నేర్చుకోవడం మొదలుపెట్టా. మెటీరియల్‌లో ఉన్న విషయాల్ని విని, బ్రెయిలీలో పాయింట్లు రాసుకునేదాన్ని' అనే తాన్య... తన కృషికి ఫలితంగా యూనివర్సిటీ టాపర్‌గా నిలిచారు. 2024లో బార్ కౌన్సిల్‌లో చేరి, స్థానిక లాయర్ దగ్గర ట్రైనీగా శిక్షణ ఆరంభించారు.

అక్కడా సవాళ్లే...

శిక్షణ ప్రారంభంలో అనేక సవాళ్లను ఎదుర్కొన్నారీమె. కోర్టు రూమ్‌లోకి ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్లకి అనుమతి ఉండేది కాదట. దాంతో ఆర్గ్యుమెంట్ నోట్స్‌ను ముందుగానే బ్రెయిలీలో సిద్ధం చేసుకునేవారట. అలా ఏడాదిగా శిక్షణలో ఉన్నారు. ఈ క్రమంలో జ్యుడీషియల్ సర్వీస్ ఎగ్జామినేషన్ నోటిఫికేషన్ వచ్చింది. 'మా సీనియర్లు నన్నూ ప్రయత్నించమని సలహా ఇచ్చారు. కానీ ఈ పరీక్షకు సిద్ధం కావాలంటే శిక్షణ చాలా అవసరం. ఈ క్రమంలో కోర్టుకి దూరమవుతా అనిపించింది. అందుకే స్వయంగా నోట్స్ తయారుచేసుకుని చదవడం మొదలుపెట్టా. గెలుస్తా అన్న నమ్మకం కాదు. కానీ ఓడిపోతే ఇదో పాఠం అవుతుందన్న ఆలోచనతోనే ప్రయత్నాలు ప్రారంభించా' అనే తాన్య... దివ్యాంగుల కేటగిరీలో టాపర్‌గా నిలిచారు. 24ఏళ్ల వయసులోనే కేరళలో సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)గా విధులు నిర్వర్తించనున్నారు. 'ఇప్పటికీ సవాళ్లు ఉన్నాయి. అయినా భవిష్యత్తులో వాటన్నింటినీ దాటగలను అన్న నమ్మకం నాకుంది. వైకల్యం కారణంగా ఎవరూ బలహీనులు కాదు. ప్రతి ఒక్కరిలోనూ ఏదో ఒక సామర్థ్యం దాగి ఉంటుంది. దాన్ని గుర్తించి సానబెట్టే ప్రయత్నాలు చేస్తే విజయం తప్పక వరిస్తుంద'ంటారీ యువ న్యాయమూర్తి.

నిద్రెలా పడుతుంది?


రాత్రుళ్లు నిద్రపట్టడం లేదని చెప్పే మహిళల సంఖ్య ఎక్కువే. పడుకునే ముందు... టీవీలు, ఫోన్‌లూ చూడటం మాత్రమే ఇందుకు కారణం కాకపోవచ్చు. మరెన్నో ఇందుకు దారితీయొచ్చు. వాటిల్లో మీరేం పొరబాటు చేస్తున్నారో సరదిద్దుకోండి. మీ సమస్య తీరిపోవచ్చు.



- నిద్రపోవాలనుకునేటప్పుడు టీ, కాఫీలకు దూరంగా ఉండండి. లేదంటే మీ నిద్ర మొత్తం ఎగిరిపోవచ్చు. కనీసం రెండు మూడు గంటల ముందు నుంచే ఈ జాగ్రత్త పాటించాలి. అలానే మితిమీరి తినడమూ, ఖాళీ కడుపుతో ఉండటమూ సరికాదు. కనీసం 40 నిమిషాల ముందైనా భోజనం పూర్తి అయ్యి ఉండాలి. అప్పుడే గ్యాస్ చేరదు. జీర్ణ సంబంధిత సమస్యలేవీ నిద్రకు భంగం కలిగించవు. బదులుగా కాసిని గోరువెచ్చని పాలను తీసుకోండి. నిద్ర ముంచుకొస్తుంది.
- నిద్రలేమికి... మీ పడకగది నిద్ర సరిగా పట్టకపోవడానికి ఓ కారణం కావొచ్చని తెలుసా? అవును. ఘాటైన వాసనలు, దుమ్మూ ధూళి, గాలి ప్రసరణ లేకపోవడం... వంటివన్నీ ప్రభావం చూపిస్తాయి. ముఖ్యంగా ఆ గదిలో వాతావరణం వేడిగా ఉన్నా, అతి చల్లగా అనిపించినా కూడా నిద్రపట్టదు. అందుకే, ఉష్ణోగ్రతల్ని సరిచూసుకోండి. అతిగా ఏసీల మీదా ఆధారపడొద్దు. అలానే పరుపులు, దిండ్లు మరీ మెత్తగా ఉంటే కానీ, ఇది నిద్ర కలతకూ కారణం కావొచ్చు. పడుకుంటే మరీ కిందకి ఒత్తుకుపోకుండా చూసుకోండి. వాటిపై బెడ్‌షీట్‌లూ, కవర్లను ఎప్పటికప్పుడు మార్చడం మరిచిపోవద్దు.
- నిద్రపోయేటప్పుడు బిగుతైనవీ, ఎంబ్రాయిడరీ ఉన్నవీ, గుచ్చుకున్నట్లు అనిపించేవీ, దుర్వాసన వచ్చే దుస్తుల్ని వేసుకోవద్దు. అలానే నిద్రపోయే సమయంలోనూ బ్రా ధరిస్తే అసౌకర్యంగా అనిపించడమే కాదు... అనారోగ్యాలనూ తెచ్చిపెట్టొచ్చు. కాస్త వదులుగా, గాలి తగిలేలా కాటన్ వంటివి ఎంచుకోవడం వల్ల హాయిగా నిద్రపడుతుంది.


చిట్టిపొట్టి సక్యులెంట్లు... చూడముచ్చటగా!





ఇంట్లో ఎంత ఖరీదైన వస్తువులు తెచ్చిపెట్టినా... మొక్కలు తెచ్చే అందమే వేరు. అందులోనూ తక్కువ నిర్వహణతో వైవిధ్యంగా పెరిగేవి అయితే మరింత కళగా అనిపిస్తాయి. అలాంటివాటిల్లో సక్యులెంట్లు ఒకటి. వీటి ప్రత్యేకతలు ఏంటో? వీటినెలా పెంచుకోవాలో తెలుసా?

లక్షల సంవత్సరాలుగా మనుగడలో ఉన్న మొక్కల్లో సక్యులెంట్లు ఒకటి. ఆకులు, కాండం లేదా వేర్లలో నీటిని నిల్వ చేసుకుని పొడి వాతావరణంలోనూ సులువుగా బతికేస్తాయివి. తక్కువ నిర్వహణతో ఇంటి అందాన్ని రెట్టింపు చేస్తాయి. ఇవి అవుట్‌డోర్లలోనూ బాగానే పెరిగినా.. ఇండోర్ ప్లాంట్స్‌గా చాలా పాపులర్. చిట్టి, పొట్టి రకాలుగా... అరచేతిలో ఇమిడిపోతూ, కుండీల్లో ఒదిగిపోతూ భలే ముచ్చటగొలుపుతాయి. మందంగా నిగనిగలాడే వీటి ఆకులు, రంగులు ఆకట్టుకుంటాయి.




ముఖ్యంగా ఆఫ్రికా, మధ్య అమెరికా, దక్షిణ అమెరికా వంటి పొడి ప్రాంతాల్లో ఇవి ఎక్కువగా కనిపిస్తాయి. 18,19వ శతాబ్దాల్లో యూరోపియన్ వృక్ష శాస్త్రవేత్తలు వీటిని ప్రపంచానికి పరిచయం చేశారు. ఆధునిక కాలంలో ఇండోర్ గార్డెనింగ్ ట్రెండ్‌తో మరింత పాపులర్ అయ్యాయి. సక్యులెంట్స్‌లో వేలాది రకాలు ఉన్నాయి. అలొవెరా, జేడ్, ఎకవేరియా, హావోర్తియా, సెడమ్, కాలంచో వంటివి ప్రముఖమైనవి. ఇవి సాధారణంగా ఆకుపచ్చ రంగులో ఉంటాయి. కానీ, సూర్యకాంతి, ఉష్ణోగ్రత, ఒత్తిడి వల్ల ఎరుపు, ఊదా, నీలం, గులాబీ, నారింజ రంగుల్లోకి మారతాయి. ఈ వర్ణాలు వాటిని మరింత ఆకర్షణీయంగా కనిపించేలా చేస్తాయి.

ఇంటి తోట

ఎలా పెంచాలి...

సక్యులెంట్లను నాటుకునేందుకు నీరు నిలవని, ఇసుక కలిపిన సారవంతమైన మట్టిని ఎంచుకోవాలి. ఇది పూర్తిగా పొడిగా అయ్యాకే నీళ్లు పోయాలి. ఎక్కువ పోస్తే వేర్లు కుళ్లిపోతాయి. అలానే ఎరువులను కూడా వీలైనంత తక్కువగా అందించాలి. నెలకోసారి 5-10-10 నిష్పత్తిలో సమగ్ర ఎరువుని ఇస్తే సరి. ఎక్కువైతే ఆకులు పొడవుగా పెరిగి పాడవుతాయి. ఈ మొక్కలను సాధారణంగా తెల్లదోమ, పేనుబంక, స్పైడర్ మైట్స్... వంటివి వేధిస్తాయి. క్రమం తప్పకుండా పరీక్షించి... వ్యాధి సోకిన మొక్క లేదా కొమ్మను వేరు చేయాలి. వేపనూనెను నీటిలో కలిపి చల్లాలి. గాలి బాగా ప్రసరించేలా చేయాలి. ఇవి నేరుగా తగిలే ఎండలో కంటే... ప్రకాశవంతంగా ఉండే పరోక్ష కాంతిలో చక్కగా పెరుగుతాయి. ఆకులూ, కొమ్మ కత్తిరింపుల ద్వారా కొత్త మొక్కల్ని సులభంగా పెంచవచ్చు. సక్యులెంట్స్ గాలిని శుద్ధి చేయడంతో పాటు మానసిక ఒత్తిడినీ తగ్గిస్తాయి.





వీసామెత్తు భయమూ లేదు

- ఫీజు రెట్టింపైనా హెచ్‌-1బీ నియామకాలు కొనసాగుతాయ్
- వేతన అంతరం, నిపుణుల కొరత వల్లే
- ఎన్‌బీఈఆర్ నివేదిక



అమెరికాలో విదేశీ నిపుణులు ఉద్యోగం చేసేందుకు అవసరమైన హెచ్‌-1బీ కొత్త వీసా రుసుమును లక్ష డాలర్లు (రూ.90 లక్షలకు పైగా) చేసినా, కంపెనీలు తమకు అవసరమైన నిపుణుల నియామకాలను ఆపబోవని తాజా నివేదిక అంచనా వేస్తోంది. వీసా ఫీజును 1.5 - 2 లక్షల డాలర్లు చేసినా కూడా, అత్యున్నత నైపుణ్యం ఉన్న విదేశీ ఉద్యోగుల కోసం కంపెనీలు ముందడుగే వేస్తాయని తెలిపింది. అవసరమైన నైపుణ్యాలున్న వారి కొరత అమెరికాలో అధికంగా ఉండడం ఇందుకు కారణమని వివరించింది. ఈ నివేదిక ప్రకారం..

వేతన అంతరాలు ఇలా..

అమెరికాలో పుట్టిన ఉద్యోగులతో పోలిస్తే, హెచ్‌-1బీ వీసాపై అక్కడకు వెళ్లే విదేశీ ఉద్యోగులకు తక్కువ వేతనాలే లభిస్తున్నాయని అమెరికాకు చెందిన నేషనల్ బ్యూరో ఆఫ్ ఎకనమిక్ రీసెర్చ్ (ఎన్‌బీఈఆర్) నివేదిక తెలిపింది. ఒకటే ప్రాంతం, ఒకే తరహా విద్య, వయసు, లింగం, హోదా ఉన్న అమెరికా ఉద్యోగితో పోలిస్తే సగటు హెచ్‌-1బీ ఉద్యోగికి 16% తక్కువ వేతనం లభిస్తోంది. హెచ్‌-1బీ సిబ్బందికి కంపెనీని బట్టి వేతన స్థాయిలు ఉంటున్నాయి. మెటా, యాపిల్ వంటి దిగ్గజ సంస్థలు సగటున 1,50,000 డాలర్ల వార్షిక వేతనాలిస్తుండగా.. ఇన్ఫోసిస్, టీసీఎస్, విప్రో, హెచ్‌సీఎల్ టెక్ వంటి భారతీయ ఐటీ కంపెనీలు 80,000 డాలర్ల వరకే ఇస్తున్నాయి. భారీ స్థాయి అమెరికా టెక్ కంపెనీల్లో మాత్రమే హెచ్‌-1బీ ఉద్యోగికి, అమెరికాలో జన్మించిన ఉద్యోగికి మధ్య వేతన అంతరం చాలా తక్కువగా ఉంటోంది. మెటా, టెస్లాలో అయితే పెద్దగా అంతరమే లేదని అమెరికా వలస విధానాలపై సలహాలు ఇచ్చే ఆర్థికవేత్త జార్జ్ బోర్హాస్ రూపొందించిన 'హెచ్‌-1బీ వేజ్ గ్యాప్, వీసా ఫీజ్ అండ్ ఎంప్లాయర్ డిమాండ్' నివేదిక చెబుతోంది.

అగ్రగామి 25 కంపెనీలకు బయటే 75% మంది

హెచ్‌-1బీ ఉద్యోగులేమీ పెద్ద కంపెనీల్లో అధిక స్థాయుల్లో కనిపించడం లేదు. అగ్రగామి 25 కంపెనీలకు బయటే వీరిలో 75% మంది పని చేస్తుండడం గమనార్హం. ఐ-129 డేటా ప్రకారం.. దాదాపు 46,184 కంపెనీలు కనీసం నాలుగేళ్లకు ఒక హెచ్‌-1బీ ఉద్యోగిని నియమించుకుంటున్నాయి. సగటు ఇలా ఉన్నా.. 75 పర్సంటైల్‌లో ఉన్న కంపెనీలు మాత్రం ముగ్గురిని తీసుకున్నాయి. తక్కువ స్థాయుల్లో హెచ్‌-1బీ సిబ్బందిని నియమించుకుంటున్న కంపెనీల్లోనూ, అమెరికా పౌరులకు వీరికి మధ్య వేతన అంతరం ఉంటోంది. ఒకే హెచ్‌-1బీ నిపుణుడిని తీసుకున్న కంపెనీలు కూడా 18.5% తక్కువ వేతనాన్నే ఇస్తున్నాయి. పెద్ద కంపెనీల్లో చాలా తక్కువగా చేరిన హెచ్‌-1బీ నిపుణులను మినహాయిస్తే.. ఈ వీసాపై వచ్చిన వారిలో చాలా మంది, అమెరికా పౌరుల కంటే తక్కువ జీతానికే పనిచేస్తున్నారు. – ఈనాడు వాణిజ్య విభాగం

వీరే ఎక్కువ..

హెచ్‌1-బీ సిబ్బందిలో 38.3% మంది సాఫ్ట్‌వేర్ డెవలపర్లే ఉన్నారు. అగ్రగామి 5 హోదాల్లోనే మూడింట రెండొంతుల మంది పనిచేస్తున్నారు. తొలి 10 హోదాల వాటా 75 శాతంగా ఉంది. ఎందుకంటే అమెరికాలో జన్మించిన సిబ్బంది ఈ అధిక నైపుణ్య హోదాల వైపునకు వెళ్లడం లేదు. అంటే నైపుణ్యం ఉన్న వృత్తుల కొరత ఉంది.

ఫీజు పెరిగితే కంపెనీలకు నష్టమా?

హెచ్‌-1బీ వీసాపై పనిచేసే ఒక ఉద్యోగికి ఇచ్చే వేతనాన్ని, అమెరికా పౌరులకు ఇచ్చే వేతనంతో పోలిస్తే, ఆరేళ్ల వ్యవధిలో సగటున లక్ష డాలర్ల వరకు కంపెనీలకు ఆదా చేయొచ్చు. అంటే కొత్త ఫీజు చెల్లించినా కూడా కంపెనీలకు ప్రయోజనమే. అందుకే వీసా ఫీజును 1,50,000-2,00,000 డాలర్లకు పెంచినా కూడా, హెచ్‌-1బీ నియామకాలు ఆగిపోవచ్చని భావించడం లేదు. కాకపోతే అత్యున్నత నిపుణులను మాత్రమే అమెరికాకు తీసుకువచ్చేందుకు సంస్థలు మొగ్గు చూపుతాయని వివరించింది.

ఈనాడు బిజినెస్

తెలుగు రాష్ట్రాల్లో 3 హబ్‌లు: కార్స్‌24

ఈనాడు, హైదరాబాద్: ఆటో టెక్ వేదిక కార్స్‌24 విస్తరణ ప్రణాళికల్లో భాగంగా విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లలో 3 కొత్త హబ్‌లను ఏర్పాటు చేయనుంది. ఆరేడు నెలల్లో వీటిని ప్రారంభిస్తామని సంస్థ సీఎఫ్ఓ శివాన్షు ముఖ్వర్ తెలిపారు. కార్స్‌24 మొత్తం వాహన లావాదేవీల్లో తెలంగాణ వాటా 10-12 శాతంగా ఉంటున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 85,000 కార్ల లావాదేవీలను చేసినట్లు వెల్లడించారు. సంస్థ మొత్తం ఆదాయం రూ.651 కోట్లుగా ఉన్నట్లు వివరించారు. ఏడాదిలో ఐపీఓకి వచ్చే ప్రయత్నాలు చేస్తున్నామన్నారు. కార్ల కొనుగోలుదార్లకు సొంత ఎన్‌బీఎఫ్‌సీ నుంచి గరిష్ఠంగా 84 నెలల వ్యవధికి రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో పాత కార్ల కొనుగోలుదార్లలో ఎక్కువ మంది పెట్రోలు వాహనాలపైనే మక్కువ చూపిస్తున్నారని పేర్కొన్నారు. నెక్సన్, బాలెనో, స్విఫ్ట్ మోడళ్లపై ఆసక్తి చూపిస్తున్నారని వెల్లడించారు.

టీసీఎస్‌ను మించిన ఎస్‌బీఐ

రూ.10.91 లక్షల కోట్లకు మార్కెట్ విలువ



మార్కెట్ విలువ విషయంలో ఐటీ సేవల సంస్థ టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)ను స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) అధిగమించింది. దేశంలోనే అత్యంత విలువైన నాలుగో కంపెనీగా అవతరించింది. టీసీఎస్ అయిదో స్థానానికి పరిమితమైంది.

ర్యాంక్	కంపెనీ	మార్కెట్ విలువ (రూ.లక్షల కోట్లలో)
1	రిలయన్స్ ఇండస్ట్రీస్	19.88
2	హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	14.26
3	భారతీ ఎయిర్‌టెల్	11.47
4	ఎస్‌బీఐ	10.91
5	టీసీఎస్	10.53

ఇలా సాధించింది..: బుధవారం స్టాక్‌మార్కెట్లో ఎస్‌బీఐ షేరు 3.4% లాభంతో రూ.1183 వద్ద ముగిసింది. ఒక దశలో 52 వారాల గరిష్ఠ స్థాయి అయిన రూ.1187.70కూ దూసుకెళ్లింది. ఏడాది వ్యవధిలో ఎస్‌బీఐ షేరు 67.5% పైగా రాణించింది. బుధవారం టీసీఎస్ షేరు ధర 2.5% నష్టంతో రూ.2,909 వద్ద ముగిసింది. ఈ పరిణామాల మధ్య ఎస్‌బీఐ మార్కెట్ విలువ రూ.10.91 లక్షల కోట్లకు చేరుకోగా, టీసీఎస్ మార్కెట్ విలువ రూ.10.53 లక్షల కోట్లకు పరిమితమైంది.

ఎలా సాధ్యమైందంటే..: డిసెంబరు త్రైమాసికంలో రూ.21,028.15 కోట్ల నికరలాభాన్ని ఎస్‌బీఐ నమోదు చేసింది. ఇదే షేరు దూకుడుకు కారణమైంది. మొండి బకాయిలు తగ్గడమూ కలిసొచ్చింది. 2025-26 ఆర్థిక సంవత్సరానికి రుణ వృద్ధి అంచనాలను 12-14% నుంచి 13-15 శాతానికి ఎస్‌బీఐ సవరించడం మదుపర్లను ఆకర్షిస్తోంది.

సంతోషంగా లేరా.. స్వచ్ఛందంగా వైదొలగండి

ఉద్యోగులకు గూగుల్ ఆఫర్



టెక్ దిగ్గజ సంస్థ గూగుల్, తమ గ్లోబల్ బిజినెస్ ఆర్గనైజేషన్ (జీబీఓ) ఉద్యోగులకు స్వచ్ఛంద పదవీ విరమణ ప్యాకేజీలను ప్రకటించింది. కృత్రిమమేధ (ఏఐ) ఆధారిత భవిష్యత్తుకు తమ సిబ్బంది సిద్ధంగా ఉండాలనే కంపెనీ ప్రణాళికలో భాగంగానే ఈ ఆఫర్ ఇచ్చింది. సాంకేతికతలో వస్తున్న మార్పులకు, కంపెనీ ఏఐ లక్ష్యాలకు అనుగుణంగా ఉద్యోగులు మారాలని గూగుల్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ (సీబీఓ) ఫిలిప్ షిండ్లర్ అంతర్గత మెమోలో స్పష్టం చేశారు. 'ఏఐ ఫస్ట్' వ్యాపార సంస్థగా గూగుల్ వేగంగా మారుతోంది. ఇందుకు అనుగుణంగా పనితీరు మార్చుకోని ఉద్యోగులకు ఉద్వాసన పలకడానికి కంపెనీ వెనకాడటం లేదు. కంపెనీలో వేగంగా పనిచేయడాన్ని ఆస్వాదించలేకపోతున్న ఉద్యోగులతో పాటు, వేరే అవకాశాలకు సిద్ధంగా ఉన్న వారు నిష్క్రమణ ప్యాకేజీలు తీసుకోవచ్చని సూచిస్తోంది. సొల్యూషన్స్ బృందాలు, అమ్మకాలు, కార్పొరేట్ డెవలప్‌మెంట్, ఇతర విభాగాల్లోని ఉద్యోగులపై ఈ ప్రభావం ఉండొచ్చు.

దివీస్ ఆదాయం రూ.2,692 కోట్లు



ఈనాడు, హైదరాబాద్: దివీస్ లేబొరేటరీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.2,692 కోట్ల మొత్తం ఆదాయం, రూ.583 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.21.98గా ఉంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.2,401 కోట్లు, లాభం రూ.589 కోట్లుగా ఉన్నాయి. కొత్త లేబర్ కోడ్ అమలులో భాగంగా రూ.74 కోట్లు కేటాయించడంతో లాభాలు కొంత తగ్గినట్లు సంస్థ పేర్కొంది. విదేశీ మారకపు ద్రవ్యం రూపేణ రూ.19 కోట్లు లాభం వచ్చింది. 2025-26 ఏప్రిల్-డిసెంబరులో ఆదాయం రూ.8,801 కోట్లు, నికర లాభం రూ.1,817 కోట్లుగా ఉన్నాయి. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఆదాయం రూ.7,401 కోట్లు, నికర లాభం రూ.1,529 కోట్లు మాత్రమే.

అమెరికాలో అమర రాజా అనుబంధ సంస్థ

ఈనాడు, హైదరాబాద్: అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ, డిసెంబరు త్రైమాసికంలో ఏకీకృత ఖాతాల ప్రకారం రూ.3,410.15 కోట్ల ఆదాయం, రూ.140.15 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. త్రైమాసిక ఈపీఎస్ రూ.7.66గా ఉంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.3,272.47 కోట్ల ఆదాయం, రూ.298.37 కోట్ల లాభాన్ని నమోదు చేసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడు త్రైమాసికాల్లో కలిపి ఆదాయం రూ.10,278.25 కోట్లు, నికర లాభం రూ.581.44 కోట్లుగా ఉన్నాయి. అంతర్జాతీయ వ్యాపార విస్తరణలో భాగంగా, అమెరికాలో పూర్తిస్థాయి అనుబంధ సంస్థను 5 మిలియన్ డాలర్ల (రూ.45 కోట్ల) పెట్టుబడితో ఏర్పాటు చేసేందుకు అమర రాజా బోర్డు ఆమోదం తెలిపింది. అక్కడ తయారీ/అసెంబ్లింగ్ ప్లాంట్ల ఏర్పాటు అవకాశాలను ఇది పరిశీలిస్తుంది.

తొలిసారిగా రూ.50,000 కోట్లు మించిన ఎం & ఎం ఆదాయం

మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం), అక్టోబరు-డిసెంబరులో రూ.5,021.47 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని ప్రకటించింది. 2024-25 ఇదే కాల లాభం రూ.3,624.48 కోట్లతో పోలిస్తే ఇది 38.54% ఎక్కువ. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.41,464.98 కోట్ల నుంచి రూ.51,579.95 కోట్లకు వృద్ధి చెందింది. ఏకీకృత ప్రాతిపదికన త్రైమాసికంలో రూ.50,000 కోట్ల ఆదాయాన్ని కంపెనీ నమోదు చేయడం ఇప్పుడే. మొత్తం వ్యయాలు రూ.37,096.65 కోట్ల నుంచి రూ.41,464.98 కోట్లకు పెరిగాయి. కొత్త కార్మిక చట్టాల అమలు కోసం రూ.292.94 కోట్లు కేటాయించింది.

అమెరికా - వెనెజువెలా నుంచి మరింత చమురు!



అమెరికా, వెనెజువెలా నుంచి ముడిచమురు కొనుగోళ్లు పెంచడాన్ని పరిశీలించాల్సిందిగా ఐఓసీ, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వ రంగ రిఫైనరీ సంస్థలను ప్రభుత్వం కోరింది. తమతో కుదిరిన వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా చమురు కొనుగోలు చేయడాన్ని భారత్ నిలిపి వేయనుందని అమెరికా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే, టెండర్ల ద్వారా స్పాట్ మార్కెట్ నుంచి చమురు కొనుగోలు చేసే సమయంలో అమెరికా గ్రేడ్‌లకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాల్సిందిగా ప్రభుత్వం కోరినట్లు రిఫైనరీ వర్గాలు తెలిపాయి. వెనెజువెలా ముడిచమురు విషయంలోనూ ప్రభుత్వం ఇటువంటి సూచనే చేసినట్లు వెల్లడించాయి.

అధికారిక ప్రకటనైతే లేదు: రష్యా చమురు కొనుగోళ్లను నిలిపివేయడానికి భారత్ అంగీకరించిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. ఇంధన భద్రతకు ప్రాధాన్యమిస్తామని, దేశ అవసరాలకు అనుగుణంగా అవకాశం ఉన్న చోట కొనుగోలు చేస్తామనే మనదేశం వెల్లడించింది.

ఆ చమురు అనుకూలమేనా?: అమెరికా, వెనెజువెలా చమురు కొనుగోళ్ల విషయంలో భారత రిఫైనరీలకు పరిమితులు ఉన్నాయి. అమెరికా చమురు గ్రేడ్‌లలో తక్కువ గంధకం (సల్ఫర్) ఉంటుంది. అయితే భారత రిఫైనరీలు తమ యూనిట్లను మధ్యరకం చమురును శుద్ధి చేసేందుకు వీలుగా ఏర్పాటు చేశాయి. అందువల్ల అమెరికా చమురు ఎంతవరకు సరిపోతుందో చూడాల్సిందే. దీంతోపాటు చమురు రవాణా ఖర్చులూ అధికమవుతాయి. పశ్చిమ ఆఫ్రికా, కజకిస్థాన్ నుంచి అయితే ఖర్చు తగ్గుతుంది.

✦ వెనెజువెలా ముడిచమురు నిల్వలను విక్రయించడంపై అమెరికా దృష్టి పెట్టింది. మనదేశం నుంచి ఇండియన్ ఆయిల్, భారత్ పెట్రోలియం, హిందుస్థాన్ పెట్రోలియం రిఫైనరీలు ఇటీవల 4 మిలియన్ బ్యారెళ్ల వెనెజువెలా ముడిచమురును దిగుమతి చేసుకున్నాయని సమాచారం.

హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్‌కు రూ.800 కోట్ల పనులు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్ కేంద్రంగా ఉన్న హెచ్‌బీఎల్ ఇంజినీరింగ్, వారణాసిలోని బనారస్ లోకోమోటివ్ వర్క్స్ నుంచి రూ.800.36 కోట్ల ఆర్డర్ దక్కించుకుంది. ఆన్-బోర్డ్ కవచ్ పరికరాల (వెర్షన్ 4.0) సరఫరా, పరీక్షలు, కమిషనింగ్ పనులను వచ్చే 12 నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుందని సంస్థ తెలిపింది.

కోడి గుడ్లు

12న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	515
తూ/ప గోదావరి	485
విశాఖపట్నం	490
చిత్తూరు	573

అశోక్ లేలాండ్ లాభం రూ.862 కోట్లు



వాణిజ్య వాహనాల తయారీ సంస్థ అశోక్ లేలాండ్, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబరు త్రైమాసికంలో రూ.862.24 కోట్ల ఏకీకృత నికర లాభాన్ని నమోదు చేసింది. 2024-25 ఇదే కాల లాభం రూ.819.67 కోట్లతో పోలిస్తే ఇది 5.19% ఎక్కువ. కార్యకలాపాల ఆదాయం రూ.11,995.21 కోట్ల నుంచి రూ.14,830.24 కోట్లకు పెరిగింది. మొత్తం వ్యయాలూ రూ.10,937.89 కోట్ల నుంచి రూ.13,490.15 కోట్లకు చేరాయి. మధ్య, భారీ వాణిజ్య వాహనాల (ఎంహెచ్‌సీవీ) విక్రయాలు 26,692 నుంచి 23% పెరిగి 32,929కు చేరాయి. తేలికపాటి వాణిజ్య వాహనాల (ఎల్‌సీవీ) విక్రయాలు 15,754 నుంచి 30% పెరిగి 20,518కు చేరాయి. ఎగుమతులు 4,151 నుంచి 20% పెరిగి 4,965కు చేరాయి. 'అన్ని విభాగాల్లో పరిమాణం, లాభదాయకత పరంగా కంపెనీ బలమైన, స్థిరమైన వృద్ధి నమోదు చేసింది. భవిష్యత్తుపైనా ఆశావహంగా ఉన్నామ'ని అశోక్ లేలాండ్ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ ధీరజ్ హిందుజా వెల్లడించారు.

అవంతి ఫీడ్స్ లాభం రూ.149 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: అవంతి ఫీడ్స్, డిసెంబరు త్రైమాసికంలో రూ.1,446.58 కోట్ల ఏకీకృత ఆదాయంపై రూ.149.38 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఈపీఎస్ రూ.12.01గా ఉంది. 2024-25 ఇదే కాలంలో ఆదాయం రూ.1,407.75 కోట్లు, లాభం రూ.135.21 కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి 9 నెలలకు ఆదాయం రూ.4,761.26 కోట్లు, నికర లాభం రూ.480.97 కోట్లకు చేరుకున్నాయి. భవిష్యత్తు వృద్ధిని దృష్టిలో ఉంచుకుని, ఏఐ ఆధారిత హెచ్‌ఆర్ సేవలు అందిస్తున్న క్వాంటా పీపుల్ సొల్యూషన్స్ అనే అంకురంలో వాటా కొనుగోలుకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇందుకోసం రూ.25 లక్షలు పెట్టుబడి పెట్టనుంది.

బెంగళూరులో పౌలోమీ ప్రాజెక్టు

ఈనాడు, హైదరాబాద్: హైదరాబాద్‌కు చెందిన స్థిరాస్తి సంస్థ పౌలోమీ ఎస్టేట్స్, బెంగళూరులో కొత్త గృహ నిర్మాణ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. 8.66 ఎకరాల విస్తీర్ణంలో 4 టవర్లను, 28 అంతస్తుల్లో నిర్మించబోతున్నామని, మొత్తం 720 విలాసవంత యూనిట్లు అందుబాటులోకి వస్తాయని సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రశాంత్ రావు తెలిపారు. సికింద్రాబాద్‌లో 2.5 ఎకరాల్లో మరో ప్రాజెక్టును వచ్చే ఏడాది ప్రారంభిస్తామన్నారు.

అవాంటెల్‌కు రూ.122 కోట్ల ఆర్డర్

ఈనాడు, హైదరాబాద్: టెలికాం, రక్షణ పరికరాల తయారీ సంస్థ అవాంటెల్‌కు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ నుంచి రూ.122 కోట్ల ఆర్డర్ లభించింది. ఎస్/ఎక్స్-బ్యాండ్ ఫుల్ మోషన్ యాంటెన్నాలను అవాంటెల్ సరఫరా చేసి, వాటి ఇన్‌స్టలేషన్, ప్రారంభ బాధ్యతలనూ నిర్వహించనుంది. ఈ ప్రాజెక్టును 2027 ఆగస్టుకు పూర్తి చేయాలి.

అక్టోబరు-డిసెంబరు త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2025-26	2024-25	2025-26	2024-25
ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్	90	233	4114	4396
పతంజలి ఫుడ్స్	593	371	10541	9021
ఎస్‌జేవీఎన్1	224	149	1124	761
జూపిటర్ వ్యాగన్	62	96	900	1045
బేయర్ క్రాప్‌సైన్స్	96	34	1106	1057
లెన్స్‌కార్ట్	133	1.8	2308	1669
యునైటెడ్ బ్రూవరీస్	81	39	3937	4427

1) మధ్యంతర డివిడెండ్ రూ.1.15

సామర్థ్యం కంటే తక్కువగా ఎస్ఎంఈ విలువ

సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే

ముంబయి: క్యాపిటల్ మార్కెట్ల కోణంలో చూస్తే, ఎస్ఎంఈ విభాగం వాస్తవ స్థాయి కంటే తక్కువగానే ఉందని మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పాండే పేర్కొన్నారు. ఇటీవల పలు చర్యలు చేపట్టినా, ఈ విభాగం అదే విధంగా ఉందని, ఇందుకు కారణాలు గుర్తించినట్లు 'ఇండియా ఎస్ఎంఈ ఫైనాన్స్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ సదస్సు'లో ఆయన తెలిపారు. క్యాపిటల్ మార్కెట్లపై అనుమానాలతో సంస్థల నిర్వాహకులు లిస్టింగ్‌కు సంకోచించడం.. మర్చంట్ బ్యాంకర్లకు చేరుకోవడానికి వారికి పరిమిత అవకాశాలు ఉండటం ప్రభావం చూపుతోందన్నారు. తొలి పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ద్వారా మూలధనం సమీకరించడానికి అవుతున్న ఖర్చు కూడా ప్రతిబంధకంగా ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. నిబంధనలను పాటించడం, వివరాలను బహిర్గతం చేయడాన్ని భారంగా సంస్థలు భావిస్తున్నాయని, ఐపీఓ కోసం ముసాయిదా పత్రాలు దాఖలు చేయడంలోనూ స్పష్టత లోపిస్తోందని పాండే వివరించారు. మార్కెట్ల నుంచి నిధులు సేకరించడం చాలా అవసరమని, చిన్న కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదైతే, సంస్థల్లో పరిపాలన మెరుగుపడుతుందని పేర్కొన్నారు.

ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌పై 1400 కంపెనీలు: ఎక్స్ఛేంజీల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఎస్ఎంఈ ప్లాట్‌ఫామ్‌లపై 1400 కంపెనీలు నమోదయ్యాయని, వీటి మొత్తం మార్కెట్ విలువ రూ.4.1 లక్షల కోట్లుగా ఉందని పాండే తెలిపారు. ఇందులో 350 కంపెనీలు మెయిన్‌బోర్డ్‌కు వెళ్లాయని అన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో 98 ఎస్ఎంఈ ఐపీఓలు రూ.9,800 కోట్లు సమీకరించాయని, 2025-26లో ఇప్పటివరకు 232 కంపెనీలు రూ.10,500 కోట్లు సమీకరించాయని వెల్లడించారు.

రూ.19.44 లక్షల కోట్లకు ప్రత్యక్ష పన్నులు

దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఫిబ్రవరి 10 నాటికి ప్రత్యక్ష పన్ను నికర వసూళ్లు రూ.19.44 లక్షల కోట్లకు చేరుకున్నాయి. 2024-25 ఇదే సమయంలోని పన్ను వసూళ్లతో పోలిస్తే ఇవి 9.4% అధికం. కార్పొరేట్ పన్ను వసూళ్లు అధికంగా నమోదవడం ఇందుకు దోహదం చేసింది. ఆదాయ పన్ను విభాగం బుధవారం విడుదల చేసిన గణాంకాల ప్రకారం, నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు 14.51% వృద్ధితో రూ.8.9 లక్షల కోట్లకు చేరుకోగా, నాన్-కార్పొరేట్ (వ్యక్తిగత, హిందు అవిభాజ్య కుటుంబాలు సహా) విభాగం నుంచి 5.91% అధికంగా రూ.10.03 లక్షల కోట్లకు చేరాయి. పన్ను రిఫండ్‌ల జారీ 18.82% తగ్గి రూ.3.34 లక్షల కోట్లకు పరిమితమైంది. సవరించిన అంచనాల (ఆర్ఈ) ప్రకారం.. ఈ ఆర్థిక సంవత్సరంలో నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.24.84 లక్షల కోట్లకు చేరొచ్చని ప్రభుత్వం భావిస్తోంది.

2026–27 వ్యయాలు రూ.53.47 లక్షల కోట్లు: వచ్చే ఆర్థిక సంవత్సరానికి మొత్తం వ్యయాలను రూ.53.47 లక్షల కోట్లుగా ప్రభుత్వం అంచనా వేస్తున్నట్లు ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో పేర్కొన్నారు.

ఏఐ విప్లవానికి డేటా సెంటర్లే కీలకం

కంట్రోల్‌ఎస్ డేటా సెంటర్స్ ప్రెసిడెంట్ అశోక్ మైసూర్



మనదేశంలో డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా విస్తరించేందుకు, డేటా సెంటర్లే కీలకంగా నిలుస్తున్నాయని కంట్రోల్‌ఎస్ డేటా సెంటర్స్ ప్రెసిడెంట్ (సేల్స్) అశోక్ మైసూర్ తెలిపారు. కృత్రిమ మేధ (ఏఐ) వినియోగం పెరుగుతుండటం వల్లా, డేటా మౌలిక వసతులకు గిరాకీ అధికమైందని పేర్కొన్నారు. ప్రస్తుతం అప్లికేషన్, ఆటోమేషన్, డిజిటల్.. ఏ రంగం తీసుకున్నా ఏఐ ముఖ్య పాత్ర పోషిస్తోందని, ప్రభుత్వాలతో పాటు దాదాపు అన్ని సంస్థలూ ఏఐని వినియోగిస్తున్నాయని అశోక్ మైసూర్ వివరించారు.

రూ.18,000 కోట్ల పెట్టుబడులు: దేశంలో డేటా సెంటర్ల విస్తరణకు 2023లో 2 బిలియన్ డాలర్లు (సుమారు రూ.18,000 కోట్లు) పెట్టుబడి పెట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని, 2030కి ఈ నిధులను పూర్తిగా వినియోగిస్తామని మైసూర్ వెల్లడించారు. క్లౌడ్ సెక్యూరిటీ సంస్థ జీస్కేలర్ నివేదిక ప్రకారం.. ఎంటర్‌ప్రైజ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్ లావాదేవీల్లో అమెరికా తర్వాత భారత్ ప్రపంచంలోనే రెండో స్థానంలో నిలిచిందని ఆయన గుర్తు చేశారు. ఆసియా-పసిఫిక్ ప్రాంతంలో జరుగుతున్న మొత్తం ఏఐ లావాదేవీల్లో 46.2% వాటా మన దేశానిదే. దేశ ఆర్థిక ఇంజిన్‌ను నడిపించే అత్యంత కీలకమైన ఆస్తులుగా డేటా సెంటర్లు మారుతున్నాయని మైసూర్ అభిప్రాయపడ్డారు.

అమెరికాలో జనవరిలో 1,30,000 ఉద్యోగాలొచ్చాయ్

2024-25 గణాంకాల భారీ సవరణ

వాషింగ్టన్: అమెరికా కంపెనీలు గత నెలలో ఆశ్చర్యకర రీతిలో 1,30,000 మంది ఉద్యోగుల్ని నియమించుకున్నాయి. నిరుద్యోగ రేటు 4.3 శాతానికి తగ్గిందని కార్మిక శాఖ బుధవారం తెలిపింది. డిసెంబరులో ఇది 4.4 శాతంగా ఉంది. అయితే 2024-25 నియామకాల సంఖ్యను కార్మిక శాఖ భారీగా సవరించింది. అంతక్రితం 5,84,000 ఉద్యోగాల సృష్టి జరిగిందని పేర్కొన్న ప్రభుత్వం, తాజాగా దానిని 1,81,000కు సవరించడం గమనార్హం. కొన్నాళ్లుగా ఆర్థిక వ్యవస్థ వృద్ధిని నమోదు చేస్తున్నా.. ఉద్యోగ మార్కెట్ స్తబ్దుగా ఉంటోంది. జనవరిలో విశ్లేషకులు అంచనా వేసిన 75,000 ఉద్యోగాలతో పోలిస్తే, అధికంగా నమోదు కావడం ఆశ్చర్యకరం.

ఐటీ షేర్లు పడేశాయ్

సెన్సెక్స్ ▼ 40 84234 | నిఫ్టీ ▲ 19 25954

మిశ్రమంగా ముగిసిన సూచీలు

ఎఫ్ఐఐ కొనుగోళ్లు: రూ.943.81 కోట్లు
డీఐఐ విక్రయాలు: రూ.125.36 కోట్లు



ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో సూచీలు మిశ్రమంగా ముగిశాయి. పీఎస్‌యూ బ్యాంకులు, వాహన షేర్లలో లాభాలు కనిపించినా, ఐటీ షేర్ల నష్టాలతో సూచీలు ముందుకు కదల్లేకపోయాయి. సెన్సెక్స్ స్వల్ప నష్టంతో, నిఫ్టీ స్వల్ప లాభంతో ముగిశాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 22 పైసలు తగ్గి 90.78 వద్ద స్థిరపడింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 1.44% పెరిగి 69.78 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో దక్షిణ కొరియా, హాంకాంగ్, షాంఘై సూచీలు సానుకూలంగా ముగిశాయి. జపాన్ మార్కెట్లు పని చేయలేదు. ఐరోపా మార్కెట్లు ప్రతికూల ధోరణిలో ట్రేడయ్యాయి.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.51,000 కోట్లు పెరిగి, రూ.474.99 లక్షల కోట్ల (5.24 లక్షల కోట్ల డాలర్ల)కు చేరింది.

✦ సెన్సెక్స్ ఉదయం 84,339.15 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 84,273.92 పాయింట్లు) సానుకూలంగా ప్రారంభమైంది. రోజంతా ఒడుదొడుకుల మధ్య సాగిన సూచీ ఒక దశలో 84,487.34 పాయింట్ల గరిష్ఠ స్థాయిని, 84,081.25 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదు చేసింది. చివరకు 40.28 పాయింట్ల నష్టంతో 84,233.64 పాయింట్ల వద్ద ముగిసింది. నిఫ్టీ 50 సూచీ 18.70 పాయింట్ల లాభంతో 25,953.85 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 26,009.40-25,899.80 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 16 నష్టపోయాయి. టీసీఎస్ 2.51%, ఇన్ఫోసిస్ 1.75%, హెచ్‌సీఎల్ టెక్ 1.34%, ఎటర్నల్ 1.04%, ఐటీసీ 0.98% తగ్గాయి. ఎస్‌బీఐ 3.4%, మారుతీ 1.7%, ఇండిగో 1.06%, ట్రెంట్ 0.86% చొప్పున లాభపడ్డాయి. బీఎస్ఈలో 1,913 షేర్లు సానుకూలంగా, 2,316 షేర్లు ప్రతికూలంగా కదలాడాయి. 154 షేర్లలో ఎలాంటి మార్పు లేదు.

✦ 2025 అక్టోబరు-డిసెంబరులో అదానీ గ్రీన్ ఎనర్జీలో 1.7% వాటా విక్రయించినట్లు ఫ్రాన్స్ ఇంధన దిగ్గజం **టోటల్‌ఎనర్జీస్** బుధవారం తెలిపింది. పెట్టుబడుల ఉపసంహరణ ద్వారా 2.08 బిలియన్ డాలర్ల (సుమారు రూ.18,700 కోట్ల)ను సమీకరించినట్లు పేర్కొంది.

✦ ఏఐ సొల్యూషన్స్ సేవల సంస్థ **ఫ్రాక్టల్ అనలిటిక్స్** ఐపీఓ ముగిసేసరికి 2.66 రెట్ల స్పందన లభించింది. కంపెనీ 1,85,79,360 షేర్లను ఆఫర్ చేయగా, 4,94,79,888 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. అర్హులైన సంస్థాగత మదుపర్ల (క్యూఐబీ) విభాగంలో 4.18 రెట్లు, రిటెయిల్ మదుపర్ల విభాగంలో 1.03 రెట్లు, సంస్థాగతేతర మదుపర్ల విభాగంలో 1.06 రెట్ల స్పందన దక్కింది.

✦ క్యాన్సర్ చికిత్సలో వినియోగించేందుకు **జైడస్ లైఫ్‌సైన్సెస్** రూపొందించిన 'నివోలుమాబ్'కు జనరిక్ బయోసిమిలర్ ఔషధ విక్రయాలను నిలిపివేసేందుకు సుప్రీంకోర్టు బుధవారం నిరాకరించింది.

ఇకపై ఎల్‌టీఐమైండ్‌ట్రీ కాదు.. ఎల్‌టీఎం లిమిటెడ్

ఐటీ సేవల సంస్థ ఎల్‌టీఐమైండ్‌ట్రీ తన పేరును 'ఎల్‌టీఎం లిమిటెడ్'గా రీబ్రాండ్ చేస్తున్నట్లు బుధవారం తెలిపింది. 2022లో ఎల్ అండ్ టీ ఇన్ఫోటెక్, మైండ్‌ట్రీ సంస్థల విలీనంతో ఎల్‌టీఐమైండ్‌ట్రీ ఏర్పడింది. ప్రస్తుతం ఈ సంస్థ 40 దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తుండగా, 87,000 మందికి పైగా ఉద్యోగులు పని చేస్తున్నారు.

ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకుడి రాజీనామా


ప్రవీణ్ అయ్యర్

దిల్లీ: ఆకాశ ఎయిర్ సహ వ్యవస్థాపకులు, చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ (సీసీఓ) ప్రవీణ్ అయ్యర్ రాజీనామా చేశారు. మూడేళ్ల కిందట పెట్టిన ఈ కంపెనీ నుంచి, గత 4 నెలల వ్యవధిలో చోటు చేసుకున్న రెండో అత్యున్నత ఉద్యోగి నిష్క్రమణ ఇది. జీవితంలో తదుపరి అధ్యాయాన్ని ప్రారంభించేందుకే, ప్రవీణ్ ఈ నిర్ణయం తీసుకున్నట్లు కంపెనీ తెలిపింది. కార్యకలాపాలు సజావుగా జరిగే నిమిత్తం ఈ ఏడాది ఏప్రిల్ 30 వరకు నాయకత్వ బృందంతో కలిసి ఆయన పనిచేస్తారనీ వివరించింది. మరో సహ వ్యవస్థాపకులు నీలు ఖత్రి 2025 అక్టోబరులో రాజీనామా చేయగా, ఇప్పుడు అయ్యర్ వైదొలగారు. సంస్థ ఎగ్జిక్యూటివ్ కమిటీలోనూ ఈయన సభ్యుడిగా ఉన్నారు. తాజా రాజీనామా అనంతరం నలుగురు సహ వ్యవస్థాపకులే (ఆదిత్య ఘోష్, ఆనంద్ శ్రీనివాసన్, బెల్సన్ కొటిన్హో, భవిన్ జోషి) కంపెనీలో ఉన్నట్లయింది. వ్యవస్థాపకుడు వినయ్ దూబే సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం సంస్థ చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్ (సీఐఓ)గా ఉన్న శ్రీనివాసన్, సీసీఓగా బాధ్యతలు తీసుకుంటారు. సీఐఓ ఎంపిక ప్రక్రియను కంపెనీ మొదలుపెట్టింది.

డిజిటల్ హాజరు మంచి పునాది కాబోతోంది
స్పీకర్ అయ్యన్నపాత్రుడు

ఈనాడు, అమరావతి: శాసనసభలో తీసుకొచ్చిన డిజిటల్ హాజరు విధానం ఒక మంచి సంప్రదాయానికి పునాదిగా నిలుస్తుందని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు తెలిపారు. 'ఈ విధానంలో సభ్యులు తమ సీట్లో కూర్చుంటేనే హాజరు రికార్డవుతుంది. దీనిపై ఇప్పుడు ప్రారంభంలో కొందరు సభ్యుల్లో అపోహలు వచ్చినా తర్వాత వాళ్లు అలవాటు పడతారు' అని వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన అసెంబ్లీలో తన కార్యాలయంలో ఉపసభాపతి రఘురామకృష్ణరాజుతో కలిసి విలేకర్లతో మాట్లాడారు. అమరావతిలో నిర్మిస్తున్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ క్వార్టర్ల భవన సముదాయాలు వచ్చే ఏప్రిల్‌కు పూర్తవుతున్నాయని, వెంటనే సభ్యులకు కేటాయిస్తామని, వాటిలో వాళ్లు చేరుతారని స్పీకర్ తెలిపారు. 250 మీటర్ల ఎత్తులో ఉండే ఈ భవనం పైనుంచి మొత్తం వ్యూ అత్యద్భుతంగా ఉంటుందని చెప్పారు. నూతన అసెంబ్లీ భవనం 2028 డిసెంబరుకు పూర్తవుతుందని తెలిపారు. 'స్పీకర్‌గా నా టర్మ్‌లోనే నూతన అసెంబ్లీలో తొలి సమావేశాన్ని నిర్వహించాలనేదే నా కోరిక' అని ఆయన అన్నారు. 'అసెంబ్లీలో 278 మంది సభ్యులకు సరిపడా సీటింగ్ పెట్టారు.. దాన్ని 300కు పెంచాలని సూచించాం' అని ఉప సభాపతి తెలిపారు. సెంట్రల్‌హాలు 400 మందికి సరిపడా ఉంటుందన్నారు.

చిన్నప్పన్న పేరిట ఒక్క నెలలో 6,433 సుపథం టికెట్లు

- 2021 సెప్టెంబరులో జారీ చేసిన తితిదే ఛైర్మన్ కార్యాలయం
- నాలుగేళ్లలో ఎన్ని లక్షల టికెట్లు ఇచ్చి ఉంటారో?
- అప్పటి ఛైర్మన్ సుబ్బారెడ్డికి సన్నిహితుడు కాకపోతే అన్ని టికెట్లు ఎందుకిస్తారు?



ఈనాడు – అమరావతి, న్యూస్‌టుడే – తిరుపతి: కల్తీ నెయ్యి సరఫరా కేసులో నిందితుడైన కదురు చిన్నప్పన్న 2018 వరకే తనకు పీఏగా పనిచేశారని, తర్వాత అతనితో తనకెలాంటి సంబంధం లేదని తితిదే మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి పదే పదే చెబుతున్న మాటలు పచ్చి అబద్ధాలేనని మరో రుజువు ఇది. కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి సాధారణ భక్తులు ఉచిత దర్శనం టోకెన్ల కోసం తిరుపతిలోని క్యూలైన్లలో తెల్లవారుజాము నుంచే పడిగాపులు కాస్తారు. ఇక ఆన్‌లైన్‌లో, ఏ ఎమ్మెల్యే సిఫారసు లేఖతోనో సుపథం (రూ.300) టికెట్టు దొరికితే సంబరపడతారు. అలాంటిది తితిదే ఛైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్న సమయంలో ఒక్క నెల (2021 సెప్టెంబరు)లోనే చిన్నప్పన్న పేరు మీద ఛైర్మన్ కార్యాలయం నుంచి ఏకంగా 6,433 టికెట్లు జారీ చేశారు. ఈ లెక్కన సుబ్బారెడ్డి తితిదే ఛైర్మన్‌గా ఉన్న నాలుగేళ్లలో చిన్నప్పన్న పేరుమీద కొన్ని లక్షల టికెట్లు జారీ చేసి ఉంటారనడానికి ఇది నిదర్శనం. వీఐపీ బ్రేక్‌దర్శనం, ఆర్జితసేవ టికెట్లు ఇంకెన్ని జారీ చేసి ఉంటారోనని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఎమ్మెల్యేకి రోజుకు 6 టికెట్లే

వైకాపా హయాంలో కూడా ఒక్కో ఎమ్మెల్యేకి రోజుకు ఆరు సుపథం టికెట్లు మాత్రమే ఇచ్చేవారు. అది కూడా వారానికి ఐదు రోజులే. కానీ చిన్నప్పన్న పేరు మీద 2021 సెప్టెంబరులో ఒక్క రోజు కూడా విరామం లేకుండా రోజుకు సగటున 214 టికెట్లు జారీ అయ్యాయి. అది కూడా ఛైర్మన్ కార్యాలయం నుంచి! సుబ్బారెడ్డి మాత్రం చిన్నప్పన్న 2014 నుంచి 2018 వరకే తన దగ్గర పీఏగా పనిచేశారని, ఆ తర్వాత ఏపీ భవన్‌లో లైజన్ అధికారిగా, ఆతనితో తనకెలాంటి సంబంధమూ లేదని చెప్పుకొస్తున్నారు. సుబ్బారెడ్డి అండ లేకపోతే.. ఏపీ భవన్‌లో లైజన్ ఆఫీసర్‌గా పనిచేసే ఒక సాధారణ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి పేరు మీద తితిదే ఛైర్మన్ కార్యాలయం ఒక్క నెలలో 6,433 సుపథం టికెట్లు ఎందుకు జారీ చేస్తుంది? వైకాపా హయాంలో చిన్నప్పన్న పేరుకు దిల్లీలోని ఏపీ భవన్‌లో లైజన్ ఆఫీసర్ అయినా సుబ్బారెడ్డికి అనధికార పీఏగా పనిచేశారని, ఆయన ఇంట్లో మనిషిగా చలామణి అయ్యారు, ఆయన తరపున అన్ని పనులు చక్కబెట్టారని, తితిదేలోనూ చక్రం తిప్పారనడానికి, ఛైర్మన్ కార్యాలయంలో హవా చెలాయించారనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? సుబ్బారెడ్డి ఛైర్మన్‌గా ఉన్న సమయంలో చిన్నప్పన్న పేరు మీద ఎన్ని లక్షల టికెట్లు జారీ చేశారో, తితిదేతో ఏ సంబంధం లేని వ్యక్తి పేరు మీద అన్ని లక్షల టికెట్లు ఎందుకు జారీ చేశారో లెక్కలు తీయాలి. బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

అంధుల కోసమే ఈ ఏఐ కళ్లజోడు!



పుస్తకాన్ని చదువుతున్న అంధ వ్యక్తి

ఈనాడు, బెంగళూరు: అంధుల నిత్యావసరాలను తీర్చేలా బెంగళూరుకు చెందిన నారాయణ నేత్రాలయ, ఎస్‌హెచ్‌జీ టెక్నాలజీస్ స్మార్ట్ విజన్ గ్లాసెస్ అన్న కళ్లజోళ్లను తయారు చేశాయి. ఈ కళ్లజోడు ద్వారా అంధులు తమ ముందు కనిపించే వస్తువులు, పుస్తకాల్లోని అక్షరాలు, ఇతర సమాచారాన్ని సులువుగా తెలుసుకుంటారు. ఈ కళ్లజోళ్లలోని లైడార్ (లైట్ డిటెక్షన్ అండ్ రేంజింగ్) సెన్సర్లు పరిసరాలకు సంబంధించిన వివరాలను స్కాన్ చేసి బ్లూటూత్ ద్వారా వ్యక్తికి వినిపించేలా చేస్తాయి. ఈ ఆవిష్కరణ గురించి నారాయణ నేత్రాలయ విభాగం ఆప్టోమెట్రిస్టు డాక్టర్ మహ్మద్ ధ్యానిష్ మాట్లాడుతూ మా వద్దకు వచ్చే అంధులను పరిశీలించి, వారికి రోజువారీగా కలిగే అవసరాలను సిద్ధం చేసి వాటిని ఈ కళ్లజోడులోని కృత్రిమ మేధ (ఏఐ) సాంకేతికత ద్వారా అందించే ఏర్పాటు చేశామన్నారు. వందశాతం చూపుకోల్పోయిన వారికి కూడా ఈ స్మార్ట్ కళ్లజోడు ఉపయోగపడుతుందన్నారు. "మొత్తం 18 భారతీయ భాషలు, 56 విదేశీ భాషలను ఈ కళ్లజోడు ద్వారా చదవగలరు. వస్తువులు, వ్యక్తుల ముఖాలు, కరెన్సీ నోట్లను అందులోని ఏఐ సాంకేతికత ద్వారా గుర్తించగలరు. విదేశాల నుంచి దిగుమతి చేసుకునే స్మార్ట్ కళ్లజోళ్లతో పోలిస్తే ఈ గ్లాసులు తక్కువ ధరలకే అందుబాటులో ఉంటాయి" అని వివరించారు.

లంచాల చిట్టా విప్పిన కమీషన్ ఏజెంట్ డైరీలు

- ఎవరెవరికి ఎంత చెల్లించారో రాసుకున్న పీపీ శ్రీనివాసన్
- నగదుతో పాటు యూపీఐ లావాదేవీల ప్రస్తావన
- చెన్నైలో స్వాధీనం చేసుకున్న సిట్ అధికారులు

ఈనాడు–తిరుపతి, న్యూస్‌టుడే, తిరుపతి (నేరవిభాగం): తితిదేకు కల్తీ నెయ్యి సరఫరాతో భోలేబాబా, వైష్ణవి, మాల్‌గంగా, ఏఆర్ డెయిరీలకు రూ.234.51 కోట్లు ముట్టాయి. అందులో కొంత మొత్తాన్ని హవాలా రూపంలో డెయిరీల డైరెక్టర్లు, నిపుణులకు అందజేసి ఆధారాలు చిక్కకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కానీ, కమీషన్ ఏజెంట్ పీపీ శ్రీనివాసన్ డైరీల్లో రాసుకున్న లెక్కలు ఈ గుట్టును రట్టు చేశాయి. చెన్నైకి చెందిన పీపీ శ్రీనివాసన్ తొలుత.. భోలేబాబాకు కమీషన్ ఏజెంట్. తర్వాత పామిల్ జైన్ ఆదేశాలతో వైష్ణవి, మాల్‌గంగాకూ కమీషన్ ఏజెంట్‌గా చేశారు. ఆ డెయిరీలు టెండర్లలో పాల్గొనేటప్పుడు అవసరమైన డాక్యుమెంట్లు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం, తితిదే అధికారులతో బిల్లుల గురించి సంప్రదించడం ఇతని పని. అప్‌లోడింగ్‌కు ఒక్కసారి రూ.5వేలు వసూలు చేసేవారు. బిల్లుల చెల్లింపు, గోదాముల విభాగంలోని ఉద్యోగులు, సిబ్బందికి లంచాలు ముట్టజెప్పే బాధ్యత అప్పగించారు. 2022-24 మధ్య మూడేళ్లపాటు తితిదే ఉద్యోగులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సిబ్బందికి ఎంత నగదు ఇచ్చారనే వివరాలను శ్రీనివాసన్ డైరీలో రాసుకున్నారు. భార్య పేరుతో ఉన్న యూపీఐ ఖాతా నుంచి కూడా లంచం ఇచ్చేవారు. వీటినీ రాసుకున్నారు. మూడేళ్లపాటు రాసుకున్న డైరీలు చెన్నైలోని శ్రీనివాసన్ నివాసంలో దొరకడంతో సిట్ అధికారుల పని తేలికైంది. మూడు డెయిరీల నుంచి తనకు ఎంతెంత కమీషన్ రావాలి? ఎంత చెల్లించారన్న వివరాలనూ అందులో పొందుపరిచారు. ఉద్యోగులకు లంచంగా చెల్లించిన సొమ్మును.. డెయిరీ ప్రతినిధుల నుంచే శ్రీనివాసన్ రాబట్టారు.

ఈశ్వరరెడ్డికి 166 సార్లు.. అనిల్‌కు 150 సార్లు ఫోన్లు

పీపీ శ్రీనివాసన్ ఎవరెవరితో ఫోన్‌లో సంప్రదించారో విచారణలో సిట్ తేల్చింది. గోదాముల విభాగం జూనియర్ అసిస్టెంట్ పల్లి ఈశ్వరరెడ్డి (ఏ25).. శ్రీనివాసన్ మధ్య 2023 ఆగస్టు 22 నుంచి 2024 మార్చి 12 వరకు 166 సార్లు ఫోన్‌కాల్స్ వెళ్లాయి. ఇతను రూ.20,600 నగదు రూపంలో, రూ.3వేలు యూపీఐ ద్వారా తీసుకున్నారు. కొనుగోళ్ల విభాగంలో సీనియర్ అసిస్టెంట్ ముద్దు వెంకట అనిల్‌కుమార్ (ఏ26)కు రూ.59,600 లంచంగా ఇచ్చారు. వీరిద్దరి మధ్య 2023 మే 30 నుంచి 2023 నవంబరు 27 వరకు 150 సార్లు సంభాషణలు జరిగాయి. డిప్యూటీ ఈవో వెంకట నటేష్‌బాబు రూ.16,600 నగదు, రూ.2వేలు యూపీఐ ద్వారా వసూలు చేశారు. తాడిపత్రి నుంచి బెంగళూరుకు కారులో వెళ్లడానికి అయిన ఖర్చును వైష్ణవి డెయిరీ చెల్లించింది.

కేసు నమోదైన మర్నాడే పూనమ్, సారికా జైన్‌ల రాజీనామా

కల్తీనెయ్యి ఘటనలో మరో ఆసక్తికర ఘటన వెలుగు చూసింది. 2024 సెప్టెంబరు 25న తిరుపతి ఈస్ట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు కాగా ఆ మర్నాడే భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు సారికా జైన్ (ఏ21), పూనమ్ జైన్ (ఏ22) రాజీనామా చేశారు. కంపెనీ రికార్డుల్లో మాత్రం జులై 15న రాజీనామా చేసినట్టు చూపారు. వీరిద్దరూ వైష్ణవి డెయిరీలోనూ డైరెక్టర్లే. 2024 జనవరి 15న భోలేబాబా-వైష్ణవి డెయిరీ మధ్య ఎంఓయూ జరిగింది. వైష్ణవి సంస్థ షేర్లు భోలేబాబా డెయిరీ డైరెక్టర్లు కొన్నారు. దాంతో పామిల్ జైన్, విపిన్ జైన్, పూనమ్ జైన్, సారికా జైన్‌లకు వైష్ణవిలో ఒక్కొక్కరికి 1.25 లక్షల షేర్లు దక్కాయి. కల్తీ నెయ్యి వ్యవహారం తర్వాత విపిన్ జైన్, పామిల్ జైన్.. వైష్ణవి డెయిరీలో డైరెక్టర్లుగా వైదొలిగారు. డ్రైవర్లుగా ఉన్న సురేంద్రసింగ్, సౌరభ్ కశ్యప్‌లను డైరెక్టర్లుగా చేర్చారు.

కలీముల్లాఖాన్ దొరికితే మరిన్ని వివరాలు?

మరోవైపు వైష్ణవి డెయిరీలో ప్లాంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా షబిల్ కలీముల్లాఖాన్ ఎలియాస్ సమీర్ (ఏ8) ఉన్నారు. భోలేబాబా నుంచి వచ్చే కల్తీనెయ్యిని వైష్ణవి డెయిరీకి తీసుకొచ్చి అక్కడినుంచి తమిళనాడు దిండిగల్‌లోని ఏఆర్ డెయిరీకి పంపడంలో ఇతను కీలక పాత్ర పోషించారు. ఇతని వద్ద సైతం హవాలా చెల్లింపుల వివరాలున్నాయి. కొన్ని డైరీలు రాసుకున్నట్టు సమాచారం. కలీముల్లాఖాన్ జాడ కోసం సిట్ అధికారులు జల్లెడ పట్టినా తప్పించుకుని తిరిగారు. ఇతను దొరికితే మరిన్ని వివరాలు లభించే అవకాశముంది.

శ్రీసిటీలో డైకిన్-రెచీ ఇండియా నూతన ప్లాంటుకు భూమిపూజ
రూ.547 కోట్ల పెట్టుబడి.. 500 మందికి ఉపాధి



భూమిపూజ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

శ్రీసిటీ (వరదయ్యపాళెం), న్యూస్‌టుడే: శ్రీసిటీలో డైకిన్-రెచీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కొత్త పరిశ్రమ నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేసింది. జపాన్‌కు చెందిన డైకిన్ ఎయిర్ కండిషనింగ్ ఇండియా, తైవాన్‌కు చెందిన రెచీ ప్రెసిషన్ కంపెనీ సంయుక్త భాగస్వామ్యంతో ఏర్పాటవుతున్న ఈ కంపెనీలో ఏసీల విడిభాగాలు (రోటరీ కంప్రెసర్లు) ఉత్పత్తి చేస్తారు. 33 ఎకరాల్లో విస్తరించే ఈ ప్రాజెక్టును మూడు దశల్లో అభివృద్ధి చేయనున్నారు. తొలిదశలో రూ.547 కోట్ల పెట్టుబడితో 500 మందికి ఉపాధి కల్పించాలన్నది లక్ష్యం. ఏడాదికి 20 లక్షల రోటరీ కంప్రెసర్లు తయారుచేస్తారు. నూతన ప్లాంటు భూమిపూజ కార్యక్రమంలో డైకిన్ ఇండియా ఛైర్మన్, ఎండీ కన్వల్‌జీత్ జావా, డైరెక్టర్ సెకిదా నయోటో, శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. జావా మాట్లాడుతూ.. ప్రధాని మోదీ మేక్ ఇన్ ఇండియా ఫర్ వరల్డ్ లక్ష్యానికి అనుగుణంగా డైకిన్ లోకలైజేషన్ ప్రయాణంలో ఇదో కీలక మైలురాయిగా నిలుస్తుందన్నారు.

నేల తల్లిని రసాయనాలతో శల్యం చేయొద్దు
రైతులకు చినజీయర్ స్వామి సూచన



పాదయాత్రలో చినజీయర్ స్వామి, విజయరామ్, చలసాని ఆంజనేయులు తదితరులు

మోపిదేవి, న్యూస్‌టుడే: జన్మనిచ్చిన అమ్మలాంటి ధరిత్రిని రసాయనాలతో చిక్కిశల్యం చేయొద్దని రైతులకు చినజీయర్ స్వామి సూచించారు. సుఫల రైతు పాదయాత్ర రెండోవిడతను కృష్ణా జిల్లా మోపిదేవిలో బుధవారం ప్రారంభించి, 7 గ్రామాల్లోని పొలాల మీదుగా 8 కిలోమీటర్లు నడిచి అయోధ్య గ్రామంలో ముగించారు. మన మట్టి, మన ఆరోగ్యం, భూ పరిరక్షణ కోసం రైతుల్లో చైతన్యం తీసుకురావడం ఈ పాదయాత్ర ముఖ్య ఉద్దేశమన్నారు. పాలేకర్ సూచించిన ప్రకృతి వ్యవసాయ విధానాన్ని పాటించేలా రైతుల్లో మార్పు తీసుకురావాలన్న సంకల్పంతో తాను చేస్తున్న కృషికి తోడ్పాటు ఇవ్వాలన్నారు. మన్నును అన్నంగా మార్చే రైతు పాదమే రామ పాదంగా పంట పొలాలు వేలమంది పాదస్పర్శతో పునీతమై మార్పునకు నాందిగా మారాలన్న ముఖ్య ఉద్దేశంతో ఈ కార్యక్రమానికి శ్రీకారం పలికామన్నారు. ప్రకృతి వ్యవసాయదారు విజయరామ్, కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, కోనేరు కరుణాకర్‌లు ఈ యజ్ఞంలో భాగస్వాములు కావడం సంతోషంగా ఉందన్నారు.

బ్రిటిష్ పార్లమెంట్‌లో తెలంగాణ బిడ్డ
హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో జీవితకాల సభ్యుడిగా ఉదయ్ నాగరాజు ప్రమాణ స్వీకారం



భగవద్గీత పట్టుకొని ప్రమాణం చేస్తున్న ఉదయ్ నాగరాజు

ఈనాడు, హైదరాబాద్: శతాబ్దాల చరిత్ర ఉన్న బ్రిటిష్ పార్లమెంట్ ఎగువ సభ 'హౌస్ ఆఫ్ లార్డ్స్'లో తెలంగాణ బిడ్డ ఉదయ్ నాగరాజు జీవితకాల సభ్యుడి (లైఫ్ పీర్)గా ప్రమాణం చేశారు. బ్రిటిష్ సంప్రదాయాల మేరకు బుధవారం జరిగిన వేడుకలో ముదురు ఎరుపు రంగు గౌను ధరించి, భగవద్గీతపై నాగరాజు ప్రమాణం చేశారు. మూలాలను మరవకుండా భారతీయ సంస్కృతిపై తన గౌరవాన్ని చాటారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలం శనిగరం గ్రామానికి చెందిన ఉదయ్ నాగరాజు.. దాదాపు 25 ఏళ్ల క్రితం బ్రిటన్ వెళ్లారు. మహాత్మాగాంధీ ఫ్యూచర్ లీడర్స్ ప్రోగామ్ వ్యవస్థాపకుడిగా యువతలో నైతిక నాయకత్వం, సామాజిక న్యాయం, గాంధేయ విలువలను పెంపొందించడంలో కృషిచేస్తున్నారు. 'ఏఐ పాలసీ ల్యాబ్స్' సంస్థను స్థాపించి కృత్రిమ మేధ (ఏఐ), గ్లోబల్ గవర్నెన్స్‌పై విశేష కృషి చేస్తున్నారు. రెండేళ్ల క్రితం అక్కడి పార్లమెంట్ ఎన్నికల్లో నార్త్ బెడ్‌ఫోర్డ్‌షైర్ నియోజకవర్గం నుంచి లేబర్ పార్టీ తరఫున పోటీ చేసి స్వల్ప తేడాతో రెండో స్థానంలో నిలిచారు. అయినా ఆయన సేవలకు గుర్తింపుగా బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ సిఫార్సు మేరకు కింగ్ చార్లెస్-3.. ఎగువ సభ సభ్యునిగా ఎంపిక చేశారు. ఇకపై ఆయనను 'లార్డ్ నాగరాజు ఆఫ్ బ్లూమ్స్‌బరీ' పేరుతో పిలుస్తారు. తన పేరు ముందు 'బ్లూమ్స్‌బరీ' చేరడం వెనక బలమైన కారణం ఉంది. ఆయన ఉన్నత విద్యను అభ్యసించిన ప్రఖ్యాత 'యూనివర్సిటీ కాలేజీ లండన్' ఈ ప్రాంతంలోనే ఉంది. గాంధీ చదివిన ఈ కళాశాలలోనే ఆయన పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేశారు.

ఇద్దరు వక్ఫ్‌బోర్డు సిబ్బంది సస్పెన్షన్

ఈనాడు, అమరావతి: వక్ఫ్ ఆస్తుల పరిరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సీనియర్ అసిస్టెంట్ అలీం, జూనియర్ అసిస్టెంట్ మహమ్మద్ ఇమ్రాన్‌లను సస్పెండ్ చేసినట్లు వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ తెలిపారు. విధి నిర్వహణలో అలసత్వాన్ని సహించేది లేదని, విచారణ పూర్తయ్యే వరకు ఈ సస్పెన్షన్ అమల్లో ఉంటుందని బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.



నైపుణ్యం అవసరంలేని కొన్ని విషయాలు

1. సమయపాలన
2. ప్రయత్నం చేయడం
3. అత్యంత ఉత్సాహంగా ఉండటం
4. సానుకూల వైఖరి
5. విధుల పట్ల మక్కువ కలిగిఉండటం
6. ముందస్తు సన్నద్ధత
7. మరింత సమయం పనిచేసే గుణం
8. క్రమశిక్షణతో కూడిన పనితీరు

– వినీత్ కె, ఇన్వెస్టర్

56 మంది ప్రభుత్వ వైద్యులపై వేటు?

- ఏళ్లుగా గైర్హాజరైన వారికి ఫైనల్ షోకాజ్ నోటీసులు జారీ

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ అనుమతి లేకుండా ఏళ్లుగా విధులకు గైర్హాజరవుతున్న 56 మంది వైద్యులను విధుల నుంచి తొలగించాలని వైద్యారోగ్యశాఖ ప్రాథమికంగా నిర్ణయించింది. చివరి అవకాశంగా ఈనెల 21లోగా స్వయంగా విజయవాడలోని రాష్ట్ర వైద్య విద్య సంచాలకుల కార్యాలయానికి (డీఎంఈ) వచ్చి లిఖితపూర్వకంగా వివరణ ఇవ్వాలని, లేదంటే ప్రభుత్వ నిబంధనల మేరకు సేవల నుంచి తొలగిస్తామని హెచ్చరించింది. సంబంధిత వైద్యులే స్వయంగా విధులకు రాజీనామా చేసినట్లు భావిస్తామని పేర్కొంది. ఈ మేరకు తొమ్మిది మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు, 45 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లకు, ఇద్దరు ట్యూటర్లకు డీఎంఈ డాక్టర్ జి.రఘునందన్ ఫైనల్ షోకాజ్ నోటీసులు జారీచేశారు.

కారు నడుపుతూ కుప్పకూలిన వైద్యుడు

- రోగులకు సత్వర వైద్యమే మన కర్తవ్యమని రెండు గంటల ముందే సిబ్బందికి సూచన
- అంతలోనే గుండెపోటుతో మృతి



డాక్టర్ తాతారావు




ఆసుపత్రిలో తాతారావు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ఆసుపత్రి సిబ్బంది

నిడదవోలు, ఉండ్రాజవరం, తణుకు–న్యూస్‌టుడే: 'ప్రాణం విలువైనది.. విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండి రోగులకు సత్వర వైద్యం అందించగలిగితే కాపాడినవారమవుతాం..' అంటూ సిబ్బందికి సూచించిన ఓ వైద్యాధికారి రెండు గంటలకే గుండెపోటుతో మరణించిన విషాద ఘటన ఇది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని జిల్లా కేంద్ర ప్రభుత్వాసుపత్రిలో ఆర్ఎంవోగా పనిచేస్తున్న డాక్టర్ అందే వెంకటరమా సత్య తాతారావు (56) తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో ఉంటారు. బుధవారం విధులకు హాజరై రోగులను చూశారు. సిబ్బందికి పలు సూచనలూ చేశారు. గుండెల్లో మంటగా ఉండటంతో ముందు జాగ్రత్తగా ఈసీజీ తీయించుకుని, ఏ సమస్యా లేదని అనుకున్నారు. మధ్యాహ్నం సెలవు పెట్టి కారు నడుపుకొంటూ ఇంటికి బయలుదేరారు. ఉండ్రాజవరం జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోకి చేరుకోగానే గుండెపోటు రావడంతో కారును పంట కాలువ మార్జిన్‌లో ఆపేశారు. కారు జారి ఉండటాన్ని గమనించిన స్థానికులు అద్దాలు పగలగొట్టి ఆయనను బయటకు తీసి సీపీఆర్ చేశారు. అదే సమయంలో అటుగా వస్తున్న రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు సమీప ప్రైవేట్ ఆసుపత్రికి అంబులెన్స్‌లో తరలించే ఏర్పాటు చేశారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. తాతారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారు వైద్య విద్య అభ్యసిస్తున్నారు.

పేదల వైద్యుడిగా..: డాక్టర్ తాతారావు స్వస్థలం పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు. ఎక్కువ కాలం నిడదవోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారిగా పనిచేశారు. నిడదవోలులో ఆయన నిర్వహిస్తున్న 'అమ్మ' ఆసుపత్రిలో పేదలకు చికిత్సలో వెసులుబాటు కల్పించేవారు. దీంతో పేదల వైద్యుడిగా పేరొందారు. అనంతరం మృతదేహాన్ని మొగల్తూరు తరలించారు.

ముస్లిం తల్లిదండ్రులు.. లింగాయత్ కుమారులు
స్నేహానికి, మతసామరస్యానికి నిదర్శనం ఈ కుటుంబం



వధూవరులతో నూర్జహాన్, మెహబూబ్ దంపతులు

బెళగావి, న్యూస్‌టుడే: అనాథలను సొంత బంధువులే భారంగా భావించే సమాజంలో పొరుగున ఉన్న వారి పిల్లలను తమ బిడ్డల్లాగే పెంచి ఆదర్శంగా నిలిచారు ఈ దంపతులు. కర్ణాటకలోని హుక్కేరి తాలూకా బస్తెవాడకు చెందిన నూర్జహాన్ నాయికవాడి, మెహబూబ్ హాసన్ దంపతులు, లింగాయత్ ధర్మాన్ని అనుసరించే కాడయ్య, శైల దంపతులు ఇరుగుపొరుగు నివసించేవారు. కాడయ్య కుమారులైన సోమశేఖర్‌కు నాలుగేళ్లు, వసంత్‌కు రెండేళ్ల వయసు ఉన్నప్పుడు తల్లిదండ్రులు కన్నుమూశారు. ఆ సమయంలో వారి కుమారుల బాధ్యతలను నూర్జహాన్, మెహబూబ్ దంపతులు తీసుకున్నారు. అలా ఆ అన్నదమ్ములను 20 ఏళ్ల పాటు పెంచి, విద్యాబుద్ధులు చెప్పించారు. మెహబూబ్ కేఎస్ఆర్టీసీలో డ్రైవరుగా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఇటీవలే సోమశేఖర్‌కు పూనం అనే యువతితో లింగాయత సంప్రదాయం ప్రకారం వివాహం చేయించారు. 'నేను కాడయ్య మొదటి నుంచి స్నేహితులం. మా స్నేహానికి మతం ఎప్పుడూ అడ్డుకాలేదు. మేము వారి కుమారులను దత్తత తీసుకున్నప్పటికీ వారి సంప్రదాయాలను అనుసరించేందుకు అడ్డు చెప్పలేదు' అని మెహబూబ్ వివరించారు. ప్రస్తుతం అన్నదమ్ములు ఇద్దరూ ఒక ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారని చెప్పారు. వారు ముస్లిం ధర్మాన్ని అనుసరించకపోయినా తమ బిడ్డల్లాగే పెరిగారని నూర్జహాన్ తెలిపారు.

సిట్ నివేదిక బహిర్గతం చేసి దోషులను శిక్షించాలి: వామపక్ష పార్టీలు



మాట్లాడుతున్న శ్రీనివాసరావు. వేదికపై ఈశ్వరయ్య, ప్రసాద్ తదితరులు

విజయవాడ (రాఘవయ్యపార్క్ కూడలి), న్యూస్‌టుడే: తిరుమల లడ్డూ తయారీపై వచ్చిన ఆరోపణలకు సంబంధించి సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ నివేదికను బహిర్గతం చేయాలని వామపక్ష పార్టీలు డిమాండ్ చేశాయి. బుధవారం విజయవాడ బాలోత్సవ్ భవన్‌లో పది వామపక్ష పార్టీలు సమావేశం నిర్వహించాయి. కార్యక్రమంలో సీపీఎం, సీపీఐ పార్టీల రాష్ట్ర కార్యదర్శులు వి.శ్రీనివాసరావు, జి.ఈశ్వరయ్యలు మాట్లాడుతూ.. "సిట్ నివేదికను అధికారికంగా వెల్లడించకుండా తెదేపా, జనసేన, భాజపా, వైకాపాలు తోచిన విధంగా మాట్లాడటం సరికాదు. సిట్ ముగ్గురు తితిదే అధికారులపై చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేస్తే బదిలీతో చేతులు దులుపుకొన్న ప్రభుత్వం వివరణ ఇవ్వాలి. సిట్ నివేదిక ఆధారంగా దోషులకు శిక్షపడేలా చూడాల్సిన బాధ్యత ముఖ్యమంత్రిపై ఉంది. గత ప్రభుత్వ నిర్వహణలో తలెత్తిన లోపాలపై వైకాపా నాయకులు సరైన వివరణ ఇవ్వకుండా సిట్ తమకు క్లీన్‌చిట్ ఇచ్చినట్లుగా ప్రచారం చేసుకోవడాన్ని ప్రజలు అంగీకరించబోరు. గత, ప్రస్తుత తితిదే బోర్డుల్లో, కొనుగోళ్ల కమిటీల్లో భాజపా ప్రతినిధులు ఉన్నందున అవినీతి, కల్తీ జరిగి ఉంటే అందుకు ఆ పార్టీ కూడా బాధ్యత వహించాల్సిందే" అని పేర్కొన్నారు. సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకులు పి.ప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో వివిధ వామపక్ష పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

అప్పటి తితిదే పాలకవర్గం క్షమాపణలు చెప్పాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

విశాఖపట్నం(అల్లిపురం), న్యూస్‌టుడే: వైకాపా హయాంలో రసాయనాలతో తిరుమల లడ్డూ తయారు చేసి, భక్తులకు విక్రయించిన నాటి తితిదే పాలకవర్గం సభ్యులు రాష్ట్ర ప్రజలకు బహిరంగ క్షమాపణలు చెప్పాలని ఏపీ సాధుపరిషత్తు అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి డిమాండ్ చేశారు. బుధవారం విశాఖపట్నంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. "తితిదే మాజీ ఛైర్మన్ కరుణాకరరెడ్డి సాధువులపై ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేయడం సరైంది కాదు. నుదుటున బొట్టు పెట్టని కరుణాకరరెడ్డి, గతంలో వేంకటేశ్వరస్వామిని నల్లరాయి అన్నారు. లడ్డూ తయారీలో కల్తీనెయ్యి వినియోగానికి సంబంధించి కిందిస్థాయి సిబ్బంది తప్పుచేశారని, మాజీ సీఎం జగన్‌కు సంబంధం లేదనడం విడ్డూరం. ఈ విషయంలో మాజీ సీఎం జగన్, తితిదే మాజీ ఛైర్మన్లు వైవీ సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి క్షమాపణలు చెప్పాలి" అని శ్రీనివాసానంద సరస్వతి అన్నారు.

విద్యుత్ బస్సుల కోసం 11 డిపోల్లో ఏర్పాట్లు

- సివిల్, విద్యుత్ పనులకు కేంద్రం నిధులు
- విశాఖ, రాజమహేంద్రవరంలలో కొత్త డిపోల నిర్మాణం

ఈనాడు, అమరావతి: 'పీఎం- ఈబస్ సేవ' పథకం కింద కేంద్రం రాష్ట్రంలోని 11 నగరాల్లో ఏపీఎస్ఆర్టీసీకి 750 విద్యుత్ బస్సులను కేటాయించగా, వీటి కోసం ఆయా డిపోల్లో సివిల్, విద్యుత్ పనులు చేపట్టనున్నారు. విజయవాడ, నెల్లూరు, గుంటూరు, విశాఖపట్నంలకు 100 బస్సుల చొప్పున, కాకినాడ, రాజమహేంద్రవరం, మంగళగిరి, కడప, మంగళం (తిరుపతి), అనంతపురం, కర్నూలుకు 50 బస్సుల చొప్పున కేటాయించారు. పుణెకు చెందిన పినాకిల్ సంస్థ ఈ బస్సులను నడపనుంది. అయితే బస్సుల కోసం డిపోల్లో వివిధ నిర్మాణాలు, విద్యుత్ పనులు చేపట్టాల్సి ఉంది. తాజాగా సివిల్ పనుల్లో కేంద్ర వాటా కింద రూ.64 కోట్లు, హెచ్‌టీ విద్యుత్‌లైన్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణానికి రూ.101 కోట్లు మంజూరు చేసింది. దీంతో డిపోల వారీగా టెండర్లు పిలిచి, ఆ పనులు చేపట్టేందుకు ఆర్టీసీ అధికారులు సిద్ధమయ్యారు. సివిల్ పనులను ఆర్టీసీ సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధికారులు చేపట్టనుండగా, విద్యుత్ పనులను విద్యుత్ శాఖతో చేయించనున్నారు. వచ్చే ఏడాది మార్చి నాటికి సివిల్, విద్యుత్ పనులు పూర్తి చేసి, విద్యుత్ బస్సులు ఆరంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

- విజయవాడ విద్యాధరపురం డిపో నుంచి 100 విద్యుత్ బస్సులు నడపనున్నారు. లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ఈ డిపో భారీ వర్షాలొస్తే మునిగిపోతోంది. అక్కడి నిర్మాణాలన్నీ కూల్చేసి ఎత్తు పెంచి, కొత్త నిర్మాణాలు చేయనున్నారు.
- గుంటూరు-2 డిపో ద్వారా 100 విద్యుత్ బస్సులు నడపనున్నారు. ఆ డిపో కూడా లోతట్టుప్రాంతంలో ఉండటంతో దీనిని ఎత్తు చేయనున్నారు.
- నెల్లూరు-2 డిపో నుంచి 100 విద్యుత్ బస్సులు నడుపుతారు. అక్కడ కూడా సివిల్ పనులు చేయనున్నారు.
- విశాఖపట్నానికి కేటాయించిన 100 బస్సుల్లో 50 బస్సులను గాజువాక డిపో ద్వారా నడపనున్నారు. దీని కోసం ఆ డిపోకి వెనుకవైపు విద్యుత్ బస్సుల కోసం నిర్మాణం చేస్తారు. మరో 50 బస్సులను కొత్తగా సింహాచలానికి దగ్గరలో నిర్మించే సింహపురి డిపో ద్వారా నడపనున్నారు.
- తిరుపతిలోని మంగళం, అనంతపురం, కడప, కర్నూలు, కాకినాడ, మంగళగిరిల్లోని ప్రస్తుత డిపోల్లో కొంత భాగంలో విద్యుత్ బస్సుల కోసం సివిల్ పనులు చేయనున్నారు. వాటి రాకపోకలకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయనున్నారు.
- వీటికి టెండర్ల ప్రక్రియ ఆరంభించారు. త్వరలో గుత్తేదారులను ఎంపిక చేసి పనులు అప్పగించనున్నారు.

ప్రైవేటీకరణ యత్నాలు ఆపాలి: ఈయూ

విద్యుత్ బస్సులను ప్రైవేటు సంస్థల ద్వారా నడిపేందుకు, కొన్ని డిపోలను ఆ సంస్థకు అప్పగించేందుకు చూస్తున్నారని.. ఈ ప్రైవేటీకరణ యత్నాలు ఆపకపోతే రాష్ట్రస్థాయిలో ఆందోళన చేస్తామని ఎంప్లాయిస్ యూనియన్ (ఈయూ) బుధవారం ఓ ప్రకటనలో తెలిపింది. విద్యుత్, సీఎన్‌జీ, డీజిల్ బస్సులన్నీ ఆర్టీసీయే నడపాలని, డిపోలను ప్రైవేట్ కన్సార్టియంకు అప్పగించే నిర్ణయాలు రద్దుచేయాలని ఈయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దామోదరరావు, నరసయ్య కోరారు.

టీ20 ధమాకా ప్రపంచకప్ ఫిబ్రవరి 7 - మార్చి 8

టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా మరో సమరానికి సిద్ధమైంది. టోర్నీ ఫేవరెట్‌గా బరిలోకి దిగినా.. తొలి మ్యాచ్‌లో కష్టపడ్డ సూర్యసేన, నేడు నమీబియాను ఢీకొట్టనుంది. ఈ చిన్న జట్టును ఓడించడం పెద్ద కష్టమేమీ కాకపోవచ్చు. కానీ తన అసలు సత్తాను చూపిస్తూ సాధికార విజయం సాధించాలనే పట్టుదలతో ఉన్న భారత జట్టును గాయాలు వేధిస్తున్నాయి. స్టార్ ఓపెనర్ అభిషేక్ శర్మ అనారోగ్యం కారణంగా ఈ మ్యాచ్‌లో ఆడడం అనుమానంగా మారింది.

రాత్రి 7 నుంచి

నమీబియాతో భారత్ పోరు నేడు

టీ20 ప్రపంచకప్‌లో ఈనాడు

శ్రీలంక × ఒమన్ — వేదిక: పల్లెకెలె, ఉ. 11.00

నేపాల్ × ఇటలీ — వేదిక: ముంబయి, మ. 3.00

భారత్ × నమీబియా — వేదిక: దిల్లీ, రా. 7.00

ఛాంపియన్

అసలాట ఆడతారా!

అభిషేక్ అనుమానం


శాంసన్

దిల్లీ

టీ20 ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా గురువారం జరిగే గ్రూప్-ఎ మ్యాచ్‌లో నమీబియాతో తలపడుతుంది. వాంఖడేలో ఆడిన తన తొలి మ్యాచ్‌లో అమెరికాపై బ్యాటుతో తడబడ్డ ఆతిథ్య జట్టు.. ఇప్పుడు దిల్లీలో జోరందుకోవాలనుకుంటోంది. డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌ను నిలువరించడం నమీబియాకు కష్టమే కావచ్చు. రెండు జట్ల మధ్య అంతరం ఎక్కువే. కానీ తొలి మ్యాచ్ అనుభవం దృష్ట్యా ఈసారి భారత్ కొంచెం జాగ్రత్తగా ఉండాల్సిందే. బ్యాటింగ్‌కు అనుకూలించే అవకాశాలున్న దిల్లీ పిచ్‌పై టీమ్‌ఇండియా పరుగుల వరద పారించడం ఖాయమని భావిస్తున్నారు. కానీ జట్టుకు కొన్ని సవాళ్లూ ఉన్నాయి.

శాంసన్‌కు ఛాన్స్?: తిరుగులేని ఫేవరెట్ అనుకున్న టీమ్‌ఇండియా.. తొలి మ్యాచ్‌లో చేసిన ప్రదర్శన అభిమానులను నిరాశపరిచింది. బ్యాటుతో తీవ్రంగా తడబడ్డ ఆ జట్టు కష్టంగా ఓ మోస్తరు స్కోరు చేయగలిగింది. సూర్య ఒక్కడు నిలబడడంతో భారత్ గట్టెక్కింది. మెరుపు ఆరంభాన్నిస్తారనుకున్న ఓపెనర్లు ఇషాన్ కిషన్, అభిషేక్‌తో పాటు శివమ్ దూబె, రింకు సింగ్, హార్దిక్, అక్షర్ పటేల్ విఫలమయ్యారు. తిలక్ వర్మ కూడా ఎక్కువ సేపు నిలువలేకపోయాడు. పేపర్‌పై భీకరంగా కనిపిస్తోన్న ఈ బ్యాటింగ్ లైనప్ ఈ పోరు నుంచైనా విధ్వంసం సృష్టించాలని జట్టు కోరుకుంటోంది. ఇక బుమ్రా గైర్హాజరీలో అమెరికాపై భారత బౌలర్లు బాగానే రాణించారు. అయితే ప్రత్యర్థి కాకుండా.. గాయాలు, అనారోగ్యం టీమ్‌ఇండియాకు పెద్ద సవాలుగా మారాయి. ముఖ్యమైన మ్యాచ్‌లు ముందున్న నేపథ్యంలో ఇది ఆతిథ్య జట్టుకు ఆందోళన కలిగిస్తోంది. ఆటగాళ్ల అందుబాటును బట్టి తుది జట్టు ఉంటుంది. పొట్టలో ఇన్ఫెక్షన్ కారణంగా ఆసుపత్రిపాలైన ఓపెనర్ అభిషేక్ శర్మ ఈ మ్యాచ్‌లో ఆడడం సందేహంగా మారడం భారత్‌కు ఇబ్బందే. అతడు డిశ్చార్జయ్యాడు కానీ.. ఫిట్‌గా ఉన్నాడా లేదా అన్నదే ప్రశ్న. అభిషేక్ దూరమైతే ఇషాన్ కిషన్‌తో కలిసి సంజు శాంసన్ ఇన్నింగ్స్ ఆరంభిస్తాడు. తిరిగి ఫామ్‌ను అందుకోవడానికి శాంసన్‌కు ఇది చక్కని అవకాశమవుతుంది. మరోవైపు జ్వరం కారణంగా తొలి మ్యాచ్‌కు దూరమైన ప్రధాన పేసర్ బుమ్రా.. కోలుకున్నట్లు కనిపిస్తున్నాడు. నెట్స్‌లో పూర్తి స్థాయిలో బౌలింగ్ చేశాడు. కానీ అతడు ఆడడంపైనా ఇంకా స్పష్టత లేదు. ఒకవేళ బుమ్రా పూర్తి ఫిట్‌గా ఉంటే.. సిరాజ్ స్థానంలో జట్టులోకి వస్తాడు. గాయం నుంచి కోలుకున్న ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ జట్టుతో చేరాడు. కానీ నమీబియాతో పోరులో అతణ్ని ఆడించే అవకాశాలు కనిపించట్లేదు.

చిన్న జట్టే కానీ..: ఎరాస్మస్ నేతృత్వంలోని నమీబియా జట్టు తొలి మ్యాచ్‌లో నెదర్లాండ్స్ చేతిలో ఓడింది. అయితే ఎరాస్మస్‌కు తోడు లాఫ్టీ ఈటన్, ఫ్రైలింక్, జేజే స్మిట్, లీచర్.. ఇలా చాలామంది ఆల్‌రౌండర్లున్న నమీబియాను మరీ తక్కువ అంచనా వేస్తే కష్టమే. ఫలితాల సంగతి పక్కన పెట్టి టోర్నీపై తమదైన ముద్ర వేయాలని ప్రతి చిన్న జట్టూ చూస్తున్న నేపథ్యంలో నమీబియాతో టీమ్‌ఇండియా జాగ్రత్తగా ఆడాల్సిందే. ట్రంపుల్‌మ్యాన్, షోల్జ్ ఆ జట్టులో చూడదగ్గ బౌలర్లు.

పిచ్.. వాతావరణం

మ్యాచ్ వేదిక అరుణ్ జైట్లీ స్టేడియం సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలిస్తుంది. బౌండరీలు చిన్నవి కావడం బ్యాటర్లకు సానుకూలాంశం. ఇక్కడ స్పిన్నర్ల ప్రభావం ఉంటుంది. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు.

తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్/సంజు శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, రింకు సింగ్, శివమ్ దూబె, అక్షర్ పటేల్, అర్ష్‌దీప్, బుమ్రా/సిరాజ్, వరుణ్ చక్రవర్తి.

నమీబియా: స్టీ క్యాంప్, ఫ్రైలింక్, లాఫ్టీ ఈటన్, ఎరాస్మస్, జేజే స్మిత్, జేన్ గ్రీన్, లీచర్, మైబర్గ్, ట్రంపుల్‌మ్యాన్, షోల్జ్, బెన్ షికాంగో.


ముకేశ్

ముకేశ్‌కు మరో 2 పతకాలు

గుంటూరు క్రీడలు, ఈనాడు: ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో తెలుగు కుర్రాడు ముకేశ్ నేలవల్లి మరో రెండు పతకాలు సాధించాడు. జూనియర్ పురుషుల 25 మీటర్ల వ్యక్తిగత ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో ముకేశ్ కాంస్య పతకంతో మెరిశాడు. టీమ్ విభాగంలో ముకేశ్, సూరజ్‌శర్మ, సాహిల్ చౌదరి బృందం బంగారు పతకం కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ముకేశ్ నాలుగు విభాగాల్లో ఏడు పతకాలకు పోటీపడి ఆరు నెగ్గాడు.

అనీష్‌కు కాంస్యం

దిల్లీ: ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ క్రీడాకారుడు అనీష్ భన్వాలా కాంస్యం గెలిచాడు. 25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్‌లో అతను మూడో స్థానంలో నిలిచాడు. ఆసియా షూటింగ్‌లో అతడికిది మూడో పతకం. 50 మీటర్ల రైఫిల్ ప్రోన్‌లో అడ్రియన్ కర్మాకర్ పసిడి గెలవగా.. జూనియర్ 25 మీటర్ల రైఫిల్ ప్రోన్ టీమ్‌లోనూ భారత్‌కు స్వర్ణం దక్కింది. ఇప్పటిదాకా ఈ టోర్నీలో భారత్ 41 స్వర్ణాలు సహా 75 పతకాలు సాధించింది.

మార్ష్‌కూ గాయం

కొలంబో: టీ20 ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా తొలి పోరులో ఆ జట్టు కెప్టెన్ మిచెల్ మార్ష్ బరిలోకి దిగలేదు. మార్ష్‌కు గజ్జల్లో గాయం కావడంతో ఐర్లాండ్ మ్యాచ్‌కు ఓపెనర్ ట్రావిస్ హెడ్ సారథిగా వ్యవహరించాడు. ముందు జాగ్రత్తగా స్టీవ్ స్మిత్‌ను ప్రత్యామ్నాయ ఆటగాడిగా ఎంచుకుంది కంగారూ జట్టు. ఇప్పటికే ఆ జట్టు మేటి పేసర్లు జోష్ హేజిల్‌వుడ్, ప్యాట్ కమిన్స్ గాయాల వల్ల టోర్నీ మొత్తానికి దూరమయ్యారు. శ్రీలంక స్పిన్నర్ హసరంగ, కివీస్ ఆల్‌రౌండర్ బ్రేస్‌వెల్ కూడా గాయాలతో ప్రపంచకప్ నుంచి వైదొలిగారు.

సూపర్ ఓవర్-1 సాగిందిలా...

అఫ్గాన్ (17/0)	బంతి	దక్షిణాఫ్రికా (17/1)
అజ్మతుల్లా (4)	1	మిల్లర్ (1)
అజ్మతుల్లా (6)	2	బ్రెవిస్ (6)
అజ్మతుల్లా (1)	3	బ్రెవిస్ (వికెట్)
గుర్బాజ్ (1)	4	స్టబ్స్ (4)
అజ్మతుల్లా (4)	5	స్టబ్స్ (0)
అజ్మతుల్లా (1)	6	స్టబ్స్ (6)
బౌలర్: ఎంగిడి		బౌలర్: ఫారూఖీ

సూపర్ ఓవర్-2 సాగిందిలా...

దక్షిణాఫ్రికా (23/0)	బంతి	అఫ్గాన్ (19/2)
స్టబ్స్ (6)	1	నబి (0)
స్టబ్స్ (1)	2	నబి (వికెట్)
మిల్లర్ (2)	3	గుర్బాజ్ (6)
మిల్లర్ (6)	4	గుర్బాజ్ (6)
మిల్లర్ (6)	5	గుర్బాజ్ (6)
మిల్లర్ (2)	6	గుర్బాజ్ (వైడ్)
	6	గుర్బాజ్ (వికెట్)
బౌలర్: అజ్మతుల్లా		బౌలర్: కేశవ్

చిన్న కథ కాదు

ప్రపంచకప్‌లో సూపర్ థ్రిల్లర్

- రెండో సూపర్‌ఓవర్లో దక్షిణాఫ్రికా గెలుపు
- గుర్బాజ్ పోరాటం వృథా.. అఫ్గాన్ ఓటమి

దక్షిణాఫ్రికా 187/6.. అఫ్గానిస్తాన్ 187.. ఫలితం టై! అఫ్గానిస్తాన్ 17/0.. దక్షిణాఫ్రికా 17/1.. మళ్లీ టై!! నిర్ణీత ఓవర్లలో స్కోర్లు సమం.. తర్వాత సూపర్ ఓవర్లోనూ స్కోర్లు ఒకటే. క్రికెట్లో ఎప్పుడో కానీ కనిపించే దృశ్యం కాదిది! కానీ సినిమా అంతటితో అయిపోలేదు. ఉత్కంఠకు అంత సులువుగా తెరపడలేదు. రెండో సూపర్ ఓవర్ ప్రతి ఆటగాణ్ని ఉక్కిరిబిక్కిరి చేసింది. వీక్షకులను మునివేళ్లపై నిలబెట్టింది. అఫ్గాన్ లక్ష్యం 6 బంతుల్లో 24. కేశవ్ మహరాజ్ బౌలింగ్. తొలి బంతికి సున్నా. రెండో బంతికి నబి ఔట్. 4 బంతుల్లో 24 పరుగులు కావాలి. అన్నీ సిక్సర్లే బాదాలి. అఫ్గాన్ పోరాటం ముగిసినట్లేనని అనుకున్నారంతా! కానీ గుర్బాజ్ అనే కుర్రాడు మాత్రం ఆశలు కోల్పోలేదు. కండల్లో కరెంటు నింపుకొచ్చాడో లేదా బ్యాటుకు మంత్రం వేయించుకొచ్చాడో గానీ స్టేడియంలో అగ్గి రాజేశాడు. మూడో బంతికి వికెట్ల ముందుకొచ్చి కొడితే బాల్ స్టేడియం దాటిపోయింది. గుర్బాజ్ మళ్లీ ముందుకొచ్చి ఆడగా.. బంతి లాంగాన్‌లో 6 అడుగుల 8 అంగుళాల ఎత్తున్న యాన్సెన్‌కు అందకుండా అవతలపడింది. వరుసగా రెండు సిక్సర్లు. అసలు ఏం జరుగుతుందో అర్థమయ్యేలోపే గుర్బాజ్ నుంచి డీప్ మిడ్‌వికెట్ మీదుగా మరో సిక్సర్. 3 బంతుల్లో 18 పరుగులు వచ్చేశాయి. ఇంకో సిక్సర్ బాదితే అఫ్గాన్‌దే విజయం. తర్వాతి బంతి వైడ్.

ఒక్క బంతికి అయిదు పరుగులు కావాలి. బౌండరీ వస్తే మ్యాచ్ మళ్లీ టై. సిక్స్ కొడితే అఫ్గాన్ ఖాతాలో అద్భుత విజయం. ఆఖరి బంతికి గెలిచేదెవరు? ఓడేదెవరు? ఒకవేళ ఇంకోసారి టై అయితే? ఇలా ఉత్కంఠ ఊపేస్తుండగా.. ఒత్తిడి పతాక స్థాయికి చేరుకోగా.. కేశవ్ యార్కర్ లెంగ్త్‌లో సంధించిన బంతి ఊహించని క్లైమాక్స్‌ను లిఖించింది. కవర్స్ మీదుగా భారీ షాట్ కోసం గుర్బాజ్ బ్యాటును ఊపాడు. బంతి గాల్లోకి లేచింది. మిల్లర్ క్యాచ్‌ను ఒడిసి పట్టేశాడు. అంతే.. సఫారీ జట్టులో అంబరాన్నంటే సంబరం! అఫ్గాన్ జట్టులో తీవ్ర విచారం! విషణ్ణ వదనంతో నిలబడ్డ గుర్బాజ్‌ను చూసి అఫ్గాన్ అభిమానుల గుండెలు పగిలాయి. క్రికెట్ ప్రపంచం కూడా ఒకింత నిట్టూర్చి.. ఆ యోధుడికి సలాం కొట్టింది! ఈ పోరులో సఫారీలు గెలిచుండొచ్చు.. కానీ అఫ్గాన్ ఓడిపోలేదు! క్రికెట్‌ను గెలిపించిన గుర్బాజ్ తానూ విజేతగా నిలిచాడు.


గుర్బాజ్ నిర్వేదం

అహ్మదాబాద్

టీ20 ప్రపంచకప్‌లో ఇలాంటి పోరు నభూతో! ఉత్కంఠ ఊపేసి.. ఇరు జట్లతో విజయం దోబూచులాడగా.. చివరికి రెండు సూపర్ ఓవర్ల తర్వాత ఫలితం తేలింది. బుధవారం నరేంద్ర మోదీ స్టేడియంలో జరిగిన గ్రూపు-డి పోరులో రెండో సూపర్ ఓవర్లో దక్షిణాఫ్రికా 4 పరుగుల తేడాతో అఫ్గానిస్థాన్‌పై విజయం సాధించింది. క్వింటన్ డికాక్ (59; 41 బంతుల్లో 5×4, 3×6), ర్యాన్ రికిల్‌టన్ (61; 28 బంతుల్లో 5×4, 4×6) సత్తాచాటడంతో మొదట దక్షిణాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 187 పరుగులు రాబట్టింది. అనంతరం అఫ్గాన్ 19.4 ఓవర్లలో సరిగ్గా 187 పరుగులకే ఆలౌటైంది. రహ్మనుల్లా గుర్బాజ్ (84; 42 బంతుల్లో 4×4, 7×6) వీరోచితంగా పోరాడినా అఫ్గాన్ గెలుపు తీరం చేరలేక పోయింది. మ్యాచ్ టై అవడంతో సూపర్ ఓవర్ అనివార్యమైంది. తొలి సూపర్ ఓవర్లో అఫ్గాన్ 17/0 స్కోరు చేయగా.. దక్షిణాఫ్రికా కూడా 17/1తో సమంగా నిలిచింది. దీంతో మ్యాచ్ రెండో సూపర్ ఓవర్‌కు దారితీసింది. స్టబ్స్ (7 నాటౌట్; 2 బంతుల్లో 1×4), మిల్లర్ (16 నాటౌట్; 4 బంతుల్లో 2×6) దంచడంతో దక్షిణాఫ్రికా 23/0 స్కోరు సాధించింది. గుర్బాజ్ (18; 4 బంతుల్లో 3×6) వీరోచితంగా పోరాడినా.. అఫ్గాన్ 19/2తో వద్దే ఆగిపోయింది. ఇప్పటికే న్యూజిలాండ్ చేతిలో ఓడిన అఫ్గాన్‌కు సూపర్ 8 అవకాశాలు సంక్లిష్టమయ్యాయి. సఫారీ జట్టుకిది వరుసగా రెండో విజయం.

అఫ్గాన్ రనౌట్: అంతకుముందు 188 పరుగుల లక్ష్య ఛేదనలోనూ గుర్బాజ్ వీరోచితంగా పోరాడాడు. బౌండరీలు, సిక్సర్లతో సఫారీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. యాన్సెన్, రబాడ, లిండె బౌలింగ్‌లలో సిక్సర్లతో అలరించాడు. మరోవైపు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఎంగిడి (3/26) వికెట్లు తీస్తూ అఫ్గాన్‌పై ఒత్తిడి పెంచాడు. గుర్బాజ్ క్రీజులో ఉన్నంత వరకు అఫ్గాన్ గెలుపు దిశగా పయనించింది. అయితే గుర్బాజ్‌ను కేశవ్ ఔట్ చేయడం.. రసూలి (15), మహ్మద్ నబి (5) వెంటవెంటనే పెవిలియన్ చేరుకోవడంతో అఫ్గాన్ ఇబ్బందుల్లో పడింది. కెప్టెన్ రషీద్‌ఖాన్ (20; 12 బంతుల్లో 3×4), నూర్ అహ్మద్ (15 నాటౌట్; 9 బంతుల్లో 2×6) పోరాడంతో ఆ జట్టు మళ్లీ రేసులో కొచ్చింది. అయితే 5 పరుగుల తేడాతో ఈ ఇద్దరూ ఔటవడంతో మ్యాచ్ ఉత్కంఠభరితంగా మారింది. ఆఖరి ఓవర్లో అఫ్గాన్ విజయానికి 13 పరుగులు కావాల్సి ఉండగా.. ఒకే వికెట్ మిగిలింది. రబాడ వేసిన ఆ ఓవర్లో తొలి బంతికే నూర్ క్యాచ్ అందించగా.. అది నోబాల్ అయింది. తర్వాతి బంతి వైడ్. ఒక డాట్‌బాల్ తర్వాత నూర్ సిక్సర్ బాదగా.. నాలుగో బంతిని రబాడ నోబాల్ వేయడంతో పాటు రెండు పరుగులిచ్చాడు. ఆ సమయంలో 3 బంతుల్లో 2 పరుగులు కావాలి. అఫ్గాన్ విజయం లాంఛనమే అనిపించింది. అయితే నాలుగో బంతికే విజయాన్ని అందుకోవాలన్న తొందర్లో అఫ్గాన్ తడబడింది. రబాడ డెలివరీని లాంగాఫ్ దిశగా ఆడిన నూర్ రెండో పరుగుకు ప్రయత్నించాడు. నాన్ స్ట్రైకర్ ఎండ్‌కు ఫారూఖీ పరుగెత్తుతుండగా.. యాన్సెన్ త్రోను అందుకున్న రబాడ అద్భుతమైన డైవ్‌తో వికెట్లను గిరాటేశాడు. బెయిల్స్ పడే సమయానికి బ్యాట్ క్రీజు గీత మీద ఉండటంతో అఫ్గాన్ పోరాటానికి తెరపడింది. అంతకుముందు డికాక్, రికిల్‌టన్ రెండో వికెట్‌కు 114 పరుగులు జోడించి దక్షిణాఫ్రికాకు మెరుగైన స్కోరు అందించారు.


రికిల్‌టన్, డికాక్

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్: మార్క్రమ్ (సి) నబి (బి) ఫారూఖీ 5; డికాక్ (సి) ఇబ్రహీం జద్రాన్ (బి) రషీద్ 59; రికిల్‌టన్ (ఎల్బీ) (బి) రషీద్ 61; బ్రెవిస్ (సి) నబి (బి) అజ్మతుల్లా 23; మిల్లర్ 20 నాటౌట్; స్టబ్స్ (సి) ముజీబ్ (బి) అజ్మతుల్లా 1; యాన్సెన్ (సి) అటల్ (బి) అజ్మతుల్లా 16; ఎక్స్‌ట్రాలు 2; మొత్తం: (20 ఓవర్లలో 6 వికెట్లకు) **187; వికెట్ల పతనం:** 1-12, 2-126, 3-127, 4-155, 5-159, 6-187; **బౌలింగ్:** ఫారూఖీ 4-0-32-1; ముజీబ్ రెహ్మాన్ 3-0-30-0; అజ్మతుల్లా ఒమర్‌జాయ్ 4-0-41-3; మహ్మద్ నబి 2-0-20-0; రషీద్ ఖాన్ 4-0-28-2; నూర్ అహ్మద్ 3-0-35-0

అఫ్గానిస్థాన్ ఇన్నింగ్స్: గుర్బాజ్ (సి) లిండె (బి) మహరాజ్ 84; ఇబ్రహీం జద్రాన్ (బి) ఎంగిడి 12; గుల్బదిన్ (సి) అండ్ (బి) ఎంగిడి 0; అటల్ (సి) యాన్సెన్ (బి) రబాడ 0; రసూలి రనౌట్ 15; ఒమర్జాయ్ (సి) స్టబ్స్ (బి) ఎంగిడి 22; మహ్మద్ నబి (సి) మార్క్రమ్ (బి) లిండే 5; రషీద్‌ఖాన్ (సి) మిల్లర్ (బి) యాన్సెన్ 20; ముజీబ్ రనౌట్ 0; నూర్ అహ్మద్ 15 నాటౌట్; ఫారూఖీ రనౌట్ 0; ఎక్స్‌ట్రాలు 14; మొత్తం: (19.4 ఓవర్లలో ఆలౌట్) **187; వికెట్ల పతనం:** 1-51, 2-51, 3-52, 4-121, 5-121, 6-139, 7-164, 8-169, 9-175, 10-187; **బౌలింగ్:** ఎంగిడి 4-0-26-3; యాన్సెన్ 4-0-42-1; రబాడ 3.4-0-38-1; జార్జ్ లిండే 3-0-39-1; కేశవ్ మహరాజ్ 4-0-27-1; మార్క్రమ్ 1-0-14-0

2024లో భారత జట్టు టీ20 ప్రపంచకప్ గెలిచాక దిగ్గజ ఆటగాళ్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ ఒకేసారి టీ20లకు టాటా చెప్పేశారు. వాళ్లిద్దరూ మిగిల్చిన ఖాళీతో ఒక్కసారిగా జట్టు కళ తప్పినట్లయింది. ఏ జట్టుకైనా స్టార్ క్రీడాకారులే ఆకర్షణ. వాళ్ల ఆట చూడాలనే అభిమానులు మైదానాలకు వస్తారు. టీవీల ముందు కూర్చుంటారు. కోహ్లి, రోహిత్ నిష్క్రమణతో టీ20 జట్టు ఈ ఆకర్షణే కోల్పోయింది. కానీ కొన్ని నెలలు తిరిగేసరికి అభిషేక్ శర్మ అనే కుర్రాడు అభిమానుల దృష్టిని తన వైపు తిప్పుకొన్నాడు. తన ఆట కోసమే మ్యాచ్‌లు చూసేలా చేశాడు. టీ20 జట్టులో అతనే ఇప్పుడు పెద్ద స్టార్. కానీ అతడీ స్థాయిని నిలబెట్టుకోవాలన్నా.. కోహ్లి, రోహిత్‌లా సూపర్‌స్టార్‌గా ఎదగాలన్నా కొంచెం జాగ్రత్తగా అడుగులు వేయడం అవసరం.

అభిషేక్.. బహుపరాక్!


అభిషేక్

థర్డ్ అంపైర్

ప్రస్తుత భారత టీ20 జట్టుకు బ్యాటింగ్‌లో అతి పెద్ద బలం అభిషేక్ శర్మనే అనడంలో భిన్నాభిప్రాయాలు లేవు. అతను క్రీజులో కుదురుకున్నాడంటే ప్రత్యర్థి జట్లకు హడలే. బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడుతూ, అలవోకగా భారీ షాట్లు ఆడుతూ మ్యాచ్‌ల ఫలితాలను శాసించే ఆటగాడు తను. కెరీర్ ఆరంభంలో సగటు ఆటగాడి లాగే కనిపించాడు. ఆచితూచి ఆడేవాడు. కానీ ఐపీఎల్ అవసరాలకు తగ్గట్లు తన బ్యాటింగ్‌ను విధ్వంసక శైలికి మార్చుకోవడంతో లీగ్‌లో విలువైన ఆటగాళ్లలో ఒకడిగా ఎదిగాడు. ఐపీఎల్ మెరుపులు భారత టీ20 జట్టులో చోటూ తెచ్చిపెట్టాయి. రెండో మ్యాచ్‌లోనే సెంచరీ కొట్టేయడంతో ఇక అతను వెనుదిరిగి చూడాల్సిన పని లేకపోయింది. గత ఏడాది కాలంలో జట్టులో అతడి ప్రాధాన్యం, అభిమానుల ఆదరణ అమాంతం పెరిగిపోయాయి. 39 టీ20ల్లో 36 సగటుతో 1297 పరుగులు చేశాడు అభిషేక్. అందులో 2 శతకాలు, 8 అర్ధశతకాలు ఉన్నాయి. ఈసారి టీ20 ప్రపంచకప్‌లోనే అత్యంత ఆకర్షణీయ ఆటగాళ్లలో అతనొకడు. అభిషేక్ నిలిస్తే.. మ్యాచ్ గెలిచినట్లే, అతను నిలకడగా ఆడితే భారత్‌కు మరో ప్రపంచకప్ చేజిక్కినట్లే అనే స్థాయిలో అంచనాలు నెలకొన్నాయి. కానీ ఓ జట్టుకు అతి పెద్ద బలంగా మారిన ఆటగాడి మీద ప్రత్యర్థి జట్లు కన్నేయకుండా ఉంటాయా? వేస్తున్నాయి. అతడి కోసం ప్రత్యేకంగా ప్రణాళికలు రచిస్తున్నాయి. ఇటీవల కొన్ని మ్యాచ్‌ల్లో అతను ప్రత్యర్థుల ప్రణాళికలను తిప్పికొట్టాడు. కొన్నిసార్లు మాత్రం ఉచ్చులో పడ్డాడు.

ఈ రోజుల్లో టీ20 బ్యాటర్లు తొలి బంతి నుంచే భారీ షాట్లకు దిగుతున్నారు. అభిషేక్‌ది కూడా అదే శైలి. ఏ దశలోనూ అతను దూకుడు తగ్గించడు. ప్రత్యర్థి జట్లకు ఊపిరి సలపనివ్వకుండా షాట్లు కొడుతూనే ఉంటాడు. ఇలా కొన్ని మ్యాచ్‌ల్లో తన మెరుపు ఇన్నింగ్స్‌లతో ఆరంభంలోనే మ్యాచ్ ఫలితాలను నిర్దేశిస్తున్నాడు. కానీ ఒక మ్యాచ్ చెలరేగితే.. ఇంకో మ్యాచ్‌లో వెంటనే ఔటవుతున్నాడు. చివరి అయిదు మ్యాచ్‌ల్లో మూడుసార్లు తొలి బంతికే వికెట్ సమర్పించుకున్నాడు అభిషేక్. గత నెల న్యూజిలాండ్‌తో తొలి టీ20 35 బంతుల్లోనే 84 పరుగుల విధ్వంసక ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. కానీ తర్వాతి మ్యాచ్‌లో తొలి బంతికే డకౌటయ్యాడు. మూడో టీ20లో 155 పరుగుల లక్ష్యాన్ని భారత్ 10 ఓవర్లకే ఛేదించిందంటే అందుకు ప్రధాన కారణం ఈ కుర్రాడే. ఆ మ్యాచ్‌లో 20 బంతుల్లోనే 68 పరుగులు కొట్టేశాడు. కానీ మరుసటి మ్యాచ్‌లో మళ్లీ తొలి బంతికే వెనుదిరిగాడు. తాజాగా టీ20 ప్రపంచకప్ ఆరంభ పోరులోనూ అమెరికాపై తొలి బంతికే వికెట్ ఇచ్చేశాడు. అమెరికా జట్టు ముందే ఒక వ్యూహం ప్రకారం అతణ్ని ఔట్ చేసిందని స్పష్టమైంది. షార్ట్ పిచ్ బంతులకు 'వి' కోణంలో షాట్లు ఆడే ప్రయత్నం చేస్తాడు అభిషేక్. బంతి ఆఫ్‌సైడ్ పడితే కవర్స్‌లో, లెగ్ సైడ్ పడితే మిడ్ వికెట్‌లో బౌండరీ కోసం ప్రయత్నిస్తాడు. అలీఖాన్ కవర్స్‌లో షాట్ ఆడేలా అతణ్ని ప్రేరేపించాడు. బౌండరీ వద్ద ఫీల్డర్‌ను పెట్టడంతో అభిషేక్ అతడికి చిక్కాడు. దీంతో పాటు క్రీజు వదిలి బయటికి వచ్చి షాట్ ఆడే క్రమంలో కొన్నిసార్లు అభిషేక్ బ్యాట్ ఎడ్జ్ తీసుకుని స్లిప్, థర్డ్ మ్యాన్‌లో క్యాచ్‌లు లేస్తున్నాయి. కివీస్ బౌలర్లు కూడా ఈ బలహీనతను ఉపయోగించుకునే అతణ్ని రెండుసార్లు డకౌట్ చేయగలిగారు.

అభిషేక్ కొంచెం తన ఆటనే కాక దృక్పథాన్నీ మార్చుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది. ప్రతి జట్టులోనూ ప్రత్యర్థి ఆటగాళ్ల ఆటను విశ్లేషించడానికి ఒక బృందం పని చేస్తుంది. వీడియో విశ్లేషకుల సాయంతో.. ఆటను ఆమూలాగ్రం చదివేస్తారు. దీని ఆధారంగా వ్యూహాలు రూపొందిస్తారు. మ్యాచ్ ఫలితాలనే తారుమారు చేసే ఆటగాడు కావడంతో అభిషేక్ ఆట మీద ప్రత్యర్థి జట్లు దృష్టిసారిస్తున్నాయి. కొన్ని మ్యాచ్‌ల్లో అతను ఔటవుతున్న తీరే అందుకు నిదర్శనం. బౌలింగ్ మీద ఒక అంచనాకు రాకుండా, ఫీల్డింగ్ ఏర్పాట్లను గమనించకుండా గుడ్డిగా షాట్లు ఆడడం మానుకోవాలి. శైలి మార్చుకోవడం, దూకుడు తగ్గించడం అవసరం లేదు కానీ.. కొన్ని బంతులను గౌరవించాలి, క్రీజులో ఎక్కువసేపు గడిపేందుకు ప్రయత్నించాలి. ఒక ఆటగాడు బాగా ఆడుతున్నపుడు ఆకాశానికెత్తేసే వాళ్లే.. కొన్ని వైఫల్యాలు ఎదురైతే నిర్దాక్షిణ్యంగా కిందపడేస్తారు. కాబట్టి బలహీనతలను అధిగమించడం, కొత్త అస్త్రాలను సిద్ధం చేసుకోవడం అవసరం. వ్యూహాలకు ప్రతివ్యూహాలు పన్నితేనే ఆటలో అత్యున్నత స్థాయి సాధ్యం. ఈ విషయంలో సచిన్, కోహ్లి లాంటి మేటి ఆటగాళ్ల అడుగుజాడల్లో అభిషేక్ నడవాలి. ప్రస్తుతం అభిషేక్ జట్టులో ఆధారపడదగ్గ ఆటగాడిగా మారాడు. అతణ్ని ఔట్ చేస్తే భారత్‌ను ఒత్తిడిలోకి నెట్టొచ్చని ప్రత్యర్థి జట్లు చూస్తున్నాయి. కాబట్టి అప్రమత్తత అవసరం. ప్రపంచకప్‌పై అభిషేక్ తనదైన ముద్ర వేయగలిగితే భారత క్రికెట్ కొత్త సూపర్ స్టార్‌గా ఎదిగే అవకాశముంటుంది.

నిరుడు ఆసియా కప్‌లో జట్టును ఒంటిచేత్తో ఫైనల్‌కు చేర్చాడు అభిషేక్. కానీ ఫైనల్లో 5 పరుగులకే వెనుదిరగడంతో జట్టు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. తిలక్ అసాధారణ ఇన్నింగ్స్ ఆడడంతో జట్టు గట్టెక్కింది కానీ.. లేదంటే ఓటమి తప్పేది కాదు. జట్టు మీద అభిషేక్ ప్రభావం ఎలాంటిదో చెప్పడానికి ఇది ఉదాహరణ.

ఆసీస్ అలవోకగా..

తొలి మ్యాచ్‌లో ఐర్లాండ్‌పై ఘనవిజయం


ఎలిస్ 4/12

కొలంబో: టీ20 ప్రపంచకప్ ప్రారంభమైన నాలుగు రోజులకు బరిలో దిగిన ఆస్ట్రేలియా.. తొలి మ్యాచ్‌లో ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. బుధవారం గ్రూప్-బి పోరులో ఐర్లాండ్‌ను 67 పరుగుల తేడాతో చిత్తు చేసింది. మొదట ఆస్ట్రేలియా 6 వికెట్లకు 182 పరుగులు సాధించింది. మార్కస్ స్టాయినిస్ (45; 29 బంతుల్లో 2×4, 1×6) రాణించాడు. జోష్ ఇంగ్లిస్ (37; 17 బంతుల్లో 6×4, 1×6), కామెరూన్ గ్రీన్ (21; 11 బంతుల్లో 1×4, 2×6) మెరుపు ఇన్నింగ్స్‌లు ఆడారు. ప్రత్యర్థి బౌలర్లలో మార్క్ అడైర్ రెండు వికెట్లు తీశాడు. ఛేదనలో ఐర్లాండ్ 16.5 ఓవర్లలో 115 పరుగులకే కుప్పకూలింది. డాక్రెల్ (41; 29 బంతుల్లో 3×4, 2×6) టాప్ స్కోరర్. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' నాథన్ ఎలిస్ (4/12), ఆడమ్ జంపా (4/23) విజృంభించారు.

ఛేదనలో ఐర్లాండ్ చతికిల: గాయం కారణంగా ఈ మ్యాచ్‌కు దూరమైన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ స్థానంలో.. జట్టు పగ్గాలు అందుకున్న విధ్వంసక ఓపెనర్ ట్రావిస్ హెడ్ (6) విఫలమయ్యాడు. అయినా.. మరో ఓపెనర్ ఇంగ్లిస్, గ్రీన్ రెచ్చిపోవడంతో పవర్‌ప్లే ముగిసేసరికి ఆస్ట్రేలియా 64/2తో నిలిచింది. టీ20 ప్రపంచకప్‌లో తొలి మ్యాచ్ ఆడుతున్న మ్యాట్ రెన్‌షా (37) పర్వాలేదనిపించాడు. 88/4తో ఇబ్బందుల్లో పడ్డ కంగారూ జట్టును.. స్టాయినిస్, రెన్‌షా జోడీ 61 పరుగుల భాగస్వామ్యంతో ఆదుకుంది. ఆఖర్లో కనోలీ (11 నాటౌట్), బార్ట్‌లెట్ (11 నాటౌట్) కొన్ని షాట్లు ఆడారు. 183 పరుగుల లక్ష్యంతో బరిలో దిగిన ఐరిష్ జట్టుకు గొప్ప ఆరంభమేమీ దక్కలేదు. కెప్టెన్ స్టిర్లింగ్ (1) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. పవర్‌ప్లే ఆఖరికి ఆ జట్టు 40/4తో కష్టాల్లో పడింది. ఏ దశలోనూ ఐర్లాండ్ విజయం వైపు సాగలేదు. డాక్రెల పోరాటంతో ఐర్లాండ్ కొంచెం గౌరవప్రదంగా ఓడింది.

సంక్షిప్త స్కోర్లు: ఆస్ట్రేలియా: 182/6 (స్టాయినిస్ 45, ఇంగ్లిస్ 37, రెన్‌షా 37, గ్రీన్ 21; మార్క్ అడైర్ 2/44); **ఐర్లాండ్:** 16.5 ఓవర్లలో 115 (డాక్రెల్ 41, టకర్ 24; ఎలిస్ 4/12, జంపా 4/23)

అదరగొట్టిన వెస్టిండీస్

ఇంగ్లాండ్‌పై విజయం


రూథర్‌ఫర్డ్ 76 నాటౌట్

ముంబయి: టీ20 ప్రపంచకప్‌లో వెస్టిండీస్ వరుసగా రెండో విజయం సాధించింది. గురువారం గ్రూప్-సి మ్యాచ్‌లో ఆ జట్టు 30 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌పై విజయం సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' రూథర్‌ఫర్డ్ (76 నాటౌట్; 42 బంతుల్లో 2×4, 7×6) విరుచుకుపడడంతో మొదట వెస్టిండీస్ 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. హోల్డర్ (33; 17 బంతుల్లో 1×4, 4×6), చేజ్ (34; 29 బంతుల్లో 6×4) రాణించారు. తొలి 10 ఓవర్లలో 79/4తో నిలిచిన విండీస్, రూథర్‌ఫర్డ్ జోరుతో చివరి 10 ఓవర్లలో 117 పరుగులు రాబట్టింది. అతడు.. పావెల్ (14)తో అయిదో వికెట్‌కు 51, హోల్డర్‌తో ఆరో వికెట్‌కు 61 పరుగులు జోడించాడు. ఇంగ్లాండ్ బౌలర్లలో అడిల్ రషీద్ (2/16), ఓవర్టన్ (2/33) మెరుగైన ప్రదర్శన చేశారు. ఛేదనలో ఇంగ్లాండ్ తడబడింది. మోటీ (3/33), ఛేజ్ (2/29) ధాటికి 19 ఓవర్లలో 166 పరుగులకే ఆలౌటైంది. జోసెఫ్ (1/30), అకీల్ హోసీన్ (1/32) కూడా రాణించారు. సామ్ కరన్ (43 నాటౌట్; 30 బంతుల్లో 3×4, 2×6) టాప్ స్కోరర్. బెతెల్ (33), సాల్ట్ (30) పర్వాలేదనిపించారు. 35 పరుగుల వ్యవధిలో ఇంగ్లాండ్ తన చివరి ఆరు వికెట్లు కోల్పోయింది. తొలి మ్యాచ్‌లో నేపాల్ మీద అతి కష్టం మీద గెలిచిన ఇంగ్లాండ్.. ఈ మ్యాచ్‌లో ఓటమి తప్పించుకోలేకపోయింది. **సంక్షిప్త స్కోర్లు... వెస్టిండీస్:** 196/6 (రూథర్‌ఫర్డ్ 76 నాటౌట్, ఛేజ్ 34, హోల్డర్ 33; రషీద్ 2/16, ఓవర్టన్ 2/33); **ఇంగ్లాండ్:** 19 ఓవర్లలో 166 ఆలౌట్ (సామ్ కరన్ 43 నాటౌట్, బెతెల్ 33; మోటీ 3/33, ఛేజ్ 2/29)

బీవీఎస్సీతో ఎలాంటి ఉద్యోగాలు?

బీవీఎస్సీ చివరి ఏడాది చదువుతున్నాను. ఈ కోర్సు పూర్తిచేస్తే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఎలాంటి ఉద్యోగాలు ఉంటాయి? గ్రామీణ ప్రాంతాల్లో పని చేయాల్సి వస్తుందా?

- వంశీకృష్ణ

■ బ్యాచిలర్ ఆఫ్ వెటర్నరీ సైన్స్ (బీవీఎస్సీ) జంతువుల ఆరోగ్యం, వ్యాధుల నివారణ, చికిత్స, పోషణ, నిర్వహణ లాంటి అంశాల్లో నిపుణులను తయారు చేసే ముఖ్యమైన ప్రొఫెషనల్ డిగ్రీ కోర్సు. దీన్ని పూర్తి చేసినవారు వెటర్నరీ డాక్టర్లుగా గుర్తింపు పొందుతారు. వ్యవసాయం, పశుసంవర్ధక గ్రామీణాభివృద్ధి రంగాలతో ఈ కోర్సుకు సన్నిహిత సంబంధం ఉన్నప్పటికీ ఉద్యోగాలు కేవలం గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కావు.



✦ బీవీఎస్సీ విద్యార్హతతో ప్రభుత్వ రంగంలో వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, లైవ్‌స్టాక్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ లాంటి పోస్టుల్లో నియామకం పొందవచ్చు. ప్రారంభంలో గ్రామీణ లేదా నగర శివారు ప్రాంతాల్లో పోస్టింగ్ వచ్చే అవకాశం ఉంటుంది. అనుభవం పెరిగేకొద్దీ పట్టణాలు లేదా జిల్లా కేంద్రాల్లో విధులు నిర్వర్తిస్తారు.




✦ ప్రైవేట్ రంగంలో అయితే నగరాలు, పట్టణాల్లో పనిచేసే అవకాశాలు విస్తృతంగా ఉంటాయి. వెటర్నరీ క్లినిక్స్, పెట్ హాస్పిటల్స్, పౌల్ట్రీ సంస్థలు, డెయిరీలు, ఫార్మాస్యూటికల్ సంస్థలు, పెట్ ఫుడ్ పరిశ్రమలు లాంటి రంగాల్లో ఉద్యోగాలు లభిస్తాయి. ఇవేకాకుండా పెట్ క్లినిక్ లేదా వెటర్నరీ సెంటర్ ప్రారంభించుకోవచ్చు.

✦ బీవీఎస్సీ తర్వాత ఎంవీఎస్సీ, పీహెచ్‌డీ లాంటి ఉన్నత చదువులు పూర్తిచేస్తే బోధన, పరిశోధన రంగాల్లో ఉన్నత ఉద్యోగాలు పొందవచ్చు. విశ్వ విద్యాలయాలు, కళాశాలలు, పరిశోధన సంస్థలు సాధారణంగా నగరాలు లేదా పట్టణాల్లోనే ఉంటాయి.

బీవీఎస్సీతో తప్పనిసరిగా గ్రామీణ ప్రాంతాల్లోనే పని చేయాల్సిన అవసరం లేదు. మీరు ఎంచుకునే రంగం ఆధారంగా గ్రామాలు, పట్టణాలు లేదా నగర ప్రాంతాల్లో స్థిరమైన, గౌరవప్రదమైన కెరియర్ నిర్మించుకోవచ్చు.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్



అప్పుడే డిగ్రీ పూర్తిచేసుకుని కార్పొరేట్ సంస్థల్లో ఉద్యోగం పొందిన యువతను ఆ ప్రపంచం మంత్ర ముగ్ధులను చేస్తుంది. ఆకర్షణీయమైన వేతన ప్యాకేజీ, అంతర్జాతీయ స్థాయి జీవన విధానం ఉద్యోగం ఆశించేవారిని ఆకర్షిస్తాయి. అయితే ఇవన్నీ బయటకు కనిపించే మెరుగులు మాత్రమే. కార్పొరేట్ సంస్థల ఆలోచనా ధోరణిని అర్థం చేసుకున్నవారే ఉద్యోగంలో ఉన్నత స్థాయికి చేరుకుని, రాణించగలరు.

ఉన్నత సాంకేతిక నైపుణ్యాలతో అదే సంస్థలో ఉద్యోగానికి శ్రావణి ఎంపికైంది. పనిపట్ల బాధ్యతతో వ్యవహరించేది. శిక్షణ సమయంలో ఆమెకు ఏ పని అప్పగించినా ఇది నా బాధ్యత కాదు అనకుండా మొత్తం ప్రక్రియను అర్థం చేసుకునేది. ఒకసారి క్లయింట్‌కు పంపాల్సిన నివేదికలో చిన్న లాజిక్ లోపించడంతో అది తన పని కాకపోయినా సంబంధిత టీమ్‌ను అప్రమత్తం చేసింది. ఫలితంగా క్లయింట్‌కు నష్టం రాకుండా ఆపింది. యాజమాన్యం దృష్టిలో నమ్మదగిన ఉద్యోగిగా పేరు తెచ్చుకుంది. విద్యార్హతలతో పాటు కార్పొరేట్ ఉద్యోగ నిబద్ధత ఉందని నిరూపించుకుని.. తక్కువ సమయంలోనే శ్రావణి గుర్తింపు పొందింది.

సంస్థలు ఏమంటున్నాయి?

- 'వరల్డ్ వైడ్ రిక్రూట్‌మెంట్ రిపోర్ట్' ప్రకారం.. 70 శాతం మంది విద్యార్థులు ఉద్యోగాలకు సిద్ధంగా ఉన్నామని భావిస్తుంటే కేవలం 16 శాతం సంస్థలు మాత్రమే తాజా యువ పట్టభద్రులు కార్పొరేట్ ఉద్యోగానికి సిద్ధంగా ఉంటున్నారని తెల్పాయి.
- 'గ్రాడ్యుయేట్స్ స్కిల్ ఇండెక్స్ 2025' నివేదిక ప్రకారం భారతీయ పట్టభద్రుల్లో ఉపాధి అర్హత 2023లో 44.3 శాతం ఉంది. అది 2024 నాటికి 42.6 శాతానికి పడిపోయింది. ముఖ్యంగా సాంకేతికేతర (నాన్ టెక్నికల్) రంగాల్లో ఈ లోటు స్పష్టంగా కనిపిస్తోంది.

ఉద్యోగ సంసిద్ధతలో కార్పొరేట్ సంస్థలు ఆశిస్తున్న నైపుణ్యాలకు, విద్యాసంస్థలు అందిస్తున్న విషయ పరిజ్ఞానానికి మధ్య అంతరం ఉందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

నిబద్ధతే ప్రమాణం

కార్పొరేట్ స్కిల్స్

కొలువులో ఉన్నతి ఖాయం!

కార్పొరేట్ సంస్థల్లో ఎలా మెసులుకోవాలో కళాశాలలూ, శిక్షణా సంస్థల్లో చెప్పరు. అనుభవం, సరైన దృక్పథంతో సంస్థల అంతరంగాన్ని అర్థం చేసుకోవాలి.

ఆలోచనా విధానం

సమస్యలను ఒక ఉద్యోగిగా మీరు ఎలా ఎదుర్కొంటారు? విమర్శలను ఎలా స్వీకరిస్తారు? ఇతర బృంద సభ్యులతో మీ వ్యవహార శైలి ఎలా ఉందనే అంశాలపై ఆ సంస్థలో మీ ఎదుగుదల ఆధారపడి ఉంటుంది.

పేరున్న విశ్వవిద్యాలయంలో ఎంబీఏ పూర్తిచేసి, బహుళ జాతి సంస్థలో ఉద్యోగం పొందిన అవినాష్ సంస్థలో క్రమశిక్షణను, సమయపాలనను చాలా తేలిగ్గా తీసుకున్నాడు. పనిచేసే క్రమంలో ఏదైనా సమస్య ఎదురైతే 'ఇది శిక్షణలో చెప్పలేదనో', 'నా ప్రాజెక్టులో భాగం కాదనో' తప్పించుకోవడానికే ప్రయత్నించేవాడు. ప్రతి పనీ ఆలస్యం చేస్తూ, అందుకు కారణం వెతుక్కునేవాడు. త్రైమాసిక పనితీరు సమీక్షలో తక్కువ రేటింగ్ రావడంతో అతడిపై విశ్వాసం కోల్పోయిన మేనేజ్‌మెంట్ కీలక ప్రాజెక్టు నుంచి తొలగించింది. ఉద్యోగానికి అవసరమైన విద్యార్హతలు, నైపుణ్యాలు అవినాష్‌లో ఉన్నప్పటికీ, ఉద్యోగ సంసిద్ధత లోపించడంతో ఎదిగే అవకాశాన్ని కోల్పోయాడు.

ఉద్యోగ సంసిద్ధతకు మూడు ప్రధాన సూత్రాలు

యువ ఉద్యోగార్థులు మెరుగు పడటానికి వీటిని అలవరచుకోవాలి.

యాజమాన్య భావన: కేవలం జీతం కోసమే పనిచేసే వ్యక్తిని కాదని, ఒక విలువైన ప్రాజెక్టులో భాగస్వామిననే భావన ఉద్యోగిలో ఉండాలి. ఈ ప్రాజెక్టు విజయవంతమైతే ఆ ఫలితాలు సమాజంపై గొప్ప ప్రభావం చూపుతాయన్న మేటి భావన ప్రాజెక్టు పూర్తయ్యే వరకూ ఉండాలి. ప్రతి పనినీ ఇబ్బందిగా భావించకుండా బాధ్యతతో పూర్తి చేయాలి.

వృత్తి పరిపక్వత: ఒక సందర్భాన్ని వ్యక్తిగత కోణంలో చూడకుండా, ఆ పరిస్థితికి గల నేపథ్యాన్ని, సంస్థ లక్ష్యాలను, దృష్టిలో ఉంచుకుని స్పందించే మానసిక పరిపక్వత ఉండాలి. కార్పొరేట్ ప్రపంచంలో తక్షణ భావోద్వేగాలకు లోనుకాకుండా పరిస్థితిని పూర్తిగా అర్థం చేసుకుని సంయమనంతో స్పందించగలగడం వృత్తిపరమైన పరిపక్వతకు గుర్తు.

అంతిమ ఫలితంపై దృష్టి: ఫలితాలపై దృష్టి ఉన్న ఉద్యోగులు సమస్య పునరావృతం కాకుండా ఉండేందుకు పరిష్కారం ఆలోచిస్తారు. వైఫల్యాలు ఎదురైనప్పుడు 'ఎలా జరిగింది' అని కాకుండా ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుంటారు. ఉద్యోగి ఎన్ని గంటలు పనిచేశారనే దానికంటే, ఎంత ఫలితం సాధించారన్నది కార్పొరేట్ సంస్థలకు ముఖ్యం. సాకులపై దృష్టి పెట్టేవారు సగటు ఉద్యోగిగా మిగిలిపోతారు. పరిష్కారాలు చూపించే వారే బాధ్యతాయుతమైన వృత్తి నిపుణులుగా ఎదుగుతారు.

డిగ్రీ పట్టా కార్పొరేట్ ఉద్యోగిగా ఎంపికయ్యేందుకు సహకరిస్తుంది. అయితే సంస్థలో మీ స్థానాన్ని, మీ ఎదుగుదలను నిర్ణయించేది మీలోని 'ఉద్యోగ సంసిద్ధత' మాత్రమే. సమస్యలను ఎత్తి చూపే సగటు ఉద్యోగిగా మిగిలి పోతారా? లేదా పరిష్కారాలు చూపే బాధ్యతాయుతమైన వృత్తి నిపుణులుగా ఎదుగుతారా? ఈ రెండూ మీ నిబద్ధత పైనే ఆధారపడి ఉంటాయి.



– దొరైరాజ్
సీనియర్ జనరల్ మేనేజర్,
ఎలక్ట్రో స్టీల్ కాస్టింగ్స్ లిమిటెడ్

సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్‌లో

సెంట్రల్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (సీఈఎల్).. పలు విభాగాల్లో 34 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
పోస్టులు: డిప్యూటీ జనరల్ మేనేజర్, సీనియర్ టెక్నికల్ మేనేజర్, సీనియర్ మేనేజర్, డిప్యూటీ ఇంజినీర్, పర్సనల్ ఆఫీసర్, ఆపరేటర్, క్లర్క్, గ్రాడ్యుయేట్ ఇంజినీర్ ట్రెయినీ, రాజ్‌భాష అధికారి.. మొదలైనవి.
అర్హత: పోస్టును అనుసరించి పదో తరగతి, డిగ్రీ, బీఈ/ బీటెక్, పీజీ, ఎంబీఏతో పాటు ఉద్యోగానుభవం కావాలి.
వయసు: పోస్టు ప్రకారం 29 నుంచి 63 ఏళ్లలోపు ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు డిప్యూటీ జనరల్ మేనేజర్‌కు రూ.80,000 - 2,20,000. సీనియర్ మేనేజర్/ సీనియర్ టెక్నికల్ మేనేజర్‌కు రూ.70,000 - 2,00,000, డిప్యూటీ ఇంజినీర్/ పర్సనల్ ఆఫీసర్‌కు రూ.40,000 - 1,40,000. క్లర్క్ 'సీ'కు రూ.20,000 - 65,000. ఆపరేటర్ 'ఏ'కు రూ.17,500 - 50,000.
దరఖాస్తు ఫీజు: రూ.1000. ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలనలతో.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 03.03.2026.
వెబ్‌సైట్: https://www.celindia.co.in/

టీచింగ్ పోస్టులు

ఆయిల్ ఇండియా లిమిటెడ్, నోయిడా ఒప్పంద ప్రాతిపదికన 29 టీచింగ్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
విభాగాలు: గ్రాడ్యుయేట్ టీచర్, పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్, ఇన్‌స్ట్రక్టర్
అర్హత: పోస్టును అనుసరించి బీఈడీ, ఎంకామ్, ఎమ్మెస్సీ, ఎంసీఏ, డిప్లొమాలతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.32,000 - 1,45,000.
వయసు: 35 ఏళ్లు మించకూడదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 07.03.2026.
వెబ్‌సైట్: https://www.oil-india.com/



నేటి పోటీ ప్రపంచంలో పట్టాలతో పాటు నైపుణ్యాలకూ ప్రాధాన్యం పెరుగుతోంది. అందులో అతి ముఖ్యమైంది కమ్యూనికేషన్. విద్యార్థులు, ఉద్యోగులు, నాయకులు, ఏ వృత్తిలో ఉన్న వారికైనా ఇది అత్యంత ముఖ్యమైన నైపుణ్యం. పట్టుదలతో ప్రయత్నిస్తే చాలు కమ్యూనికేషన్‌కు మెరుగులద్దుకోవచ్చు.

సాధన తోడుగా సంభాషణ మెరుగ్గా

ఉద్యోగ వేటలో విఫలం కావడంలోనూ, ఉద్యోగాలు కోల్పోవడంలోనూ కమ్యూనికేషన్ స్కిల్స్ పాత్ర ఎక్కువే. చాలా మంది ఉన్నత స్థాయికి చేరుకోవడంలోనూ ఈ నైపుణ్యమే కారణమవుతోంది. కమ్యూనికేషన్ అంటే.. మన ఆలోచనలు, భావాలు, అభిప్రాయాలు, జ్ఞానం, సమాచారాన్ని.. స్పష్టంగా, ఉద్దేశం అర్థమయ్యేలా ఇతరులకు సమర్థంగా తెలపడం. ముఖ్యంగా ఇంటర్వ్యూలో విజయానికి కమ్యూనికేషన్ పాత్ర కీలకం. చాలామంది అనుకున్నట్లు సంభాషణలో పెద్ద, సంక్లిష్ట పదాలు వాడితే గొప్ప కమ్యూనికేషన్ నైపుణ్యం ఉన్నట్లు కాదు. మీ భావాన్ని ఎంత స్పష్టంగా, తేలికైన పదాలతో, సూటిగా చెప్పగలుగుతున్నారో పరిశీలిస్తారు. ఆత్మవిశ్వాసంతో కూడిన సమాధానాలను ఆశిస్తారు.

వెర్బల్, నాన్ వెర్బల్

వెర్బల్ కమ్యూనికేషన్‌లో భాష ప్రధానం. ఫోను, ఈమెయిల్, పలు మాధ్యమాల ద్వారా సంభాషణ జరుగుతుంది. నాన్ వెర్బల్‌లో బాడీ లాంగ్వేజ్, ముఖకవళిక, అభినయం, ఐ కాంటాక్ట్, గొంతు ముఖ్యమైనవి. గొప్ప కమ్యూనికేటర్ కావడానికి వెర్బల్, నాన్ వెర్బల్ రెండిటి మీదా దృష్టి సారించాలి.

● మంచి సంభాషణ అనేది ఆలోచనలను క్రమపద్ధతిలో ఎలా చెబుతున్నామనే దానిపై ఆధారపడి ఉంటుంది. కమ్యూనికేషన్‌లో ఐదు 'సీ'లు ముఖ్యం. స్పష్టంగా(క్లియర్), సరైంది(కరెక్ట్), సంక్షిప్తం(కాన్‌సైజ్), కరుణ/సానుభూతి(కమ్‌పాషనేట్), పూర్తిగా(కంప్లీట్). ఇవన్నీ సంభాషణలో భాగమైతే కమ్యూనికేషన్ విజయవంతమైనట్లే.

● సంస్థల్లో సాంకేతిక పరిజ్ఞానం కంటే కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న ఉద్యోగులకు ప్రాధాన్యం పెరుగుతోంది. సహోద్యోగులతో ఎలా మెలగాలి, వారి మనోభావాలు దెబ్బతినకుండా ఎలా మాట్లాడాలి, క్లయింట్స్‌తో ఎలా వ్యవహరించాలి ఇవన్నీ మంచి కమ్యూనికేషన్ ఉంటేనే సాధ్యం. సరైన మాటల ఎంపిక, మర్యాదపూర్వకంగా మాట్లాడటం వల్ల ఉద్యోగంలో గౌరవం, విశ్వాసం పెరుగుతాయి. ఎంత అనుభవజ్ఞులైనప్పటికీ సరిగా కమ్యూనికేట్ చేయలేకపోతే ఆ మాటలు అపార్థానికి దారితీస్తాయి.

మనసుని హత్తుకోవాలి

కమ్యూనికేషన్ అంటే వినడం, రాయడం, మాట్లాడటమే కాదు. మీ మాటలు అవతలి వ్యక్తి మనసుని తాకాలి. కొన్నిసార్లు సంభాషణే గెలుపోటములను నిర్ణయిస్తుంది. బృంద సభ్యులు ఆలోచనలను స్పష్టంగా తెలిపితే నాయకుడి దృష్టిలో పడతారు. అవకాశం వచ్చిన ప్రతి సందర్భాన్నీ సద్వినియోగం చేసుకోవాలి. అలాగే ఇతరులు మాట్లాడుతున్నప్పుడూ శ్రద్ధగా గమనించి, అవసరమైన మార్పులు చేసుకోవాలి.

● మీరు చెప్పే విషయం దేని గురించైనా కావచ్చు.. అవతలి వ్యక్తి అందులో లీనమైపోయేలా చేయగలగాలి. వాళ్లకు ఒక సందేశాన్ని ఇస్తూ, చిన్న ప్రశ్నలు వేస్తూ మన అభిప్రాయాల్ని, సందేహాలనూ తెలపాలి. చివరలో ఇంకా ఏమైనా సమాచారం కోరుకుంటున్నారేమో అడగాలి. మాటల్లో ఆత్మవిశ్వాసం కనిపించాలి. బాడీ లాంగ్వేజ్, ముఖాభినయం, చేతి కదలికలు, కూర్చునే విధానం, ఐ కాంటాక్ట్ ఇవన్నీ మనం మాట్లాడే మాటల కన్నా ఎక్కువ ప్రభావితం చేస్తాయి.

టీవీలు, ఆన్‌లైన్‌లో ప్రముఖుల ఇంటర్వ్యూలను నిశితంగా గమనించి కమ్యూనికేషన్ నైపుణ్యాలు మెరుగుపరచుకోవచ్చు. అద్దం ముందు నిల్చుని, రోజూ ఏదైనా అంశంపై మాట్లాడటం సాధన చేస్తే తక్కువ వ్యవధిలోనే ఆశించిన మార్పు సాధ్యమవుతుంది. టెడ్‌టాక్స్, పాడ్‌కాస్టులూ మేలు చేసేవే.

ఇంటర్న్‌షిప్స్

హైదరాబాద్‌లో

కంటెంట్
సంస్థ: స్నాప్‌బాట్-స్టూడియో కెహయ
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.20,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://tinyurl.com/bdh2jfcy

ప్రోగ్రామ్ కోఆర్డినేటర్
సంస్థ: అయతన డిజైన్స్ అండ్ బిల్డ్‌మార్ట్ ప్రై.లి. **నైపుణ్యం:** ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.10,000-15,000
దరఖాస్తు గడువు: మార్చి 9
☛ https://url-shortener.me/AUI3

బ్రాండ్ అసోసియేట్
సంస్థ: ఫోర్జ్ అల్యుమ్‌నస్ సర్వీసెస్ ప్రై.లి.
నైపుణ్యాలు: బ్రాండింగ్, కంటెంట్ రైటింగ్, డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, మార్కెట్ రిసెర్చ్
స్టైపెండ్: రూ.8,000-10,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://tinyurl.com/39zx3ws6

డిజిటల్ మార్కెటింగ్
సంస్థ: లీప్ రోబోస్
నైపుణ్యాలు: డిజిటల్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియా మార్కెటింగ్
స్టైపెండ్: రూ.10,000-12,000
దరఖాస్తు గడువు: మార్చి 6
☛ https://tinyurl.com/2wjrus5z

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: నియస్టా గ్రామోజ్వల సొల్యూషన్స్
నైపుణ్యాలు: డిజిటల్, సోషల్ మీడియా మార్కెటింగ్, మార్కెటింగ్ స్ట్రాటజీస్
స్టైపెండ్: రూ.8,000-15,000
దరఖాస్తు గడువు: మార్చి 5
☛ https://url-shortener.me/AUNE

విజయవాడలో

మెకానికల్ ఇంజినీరింగ్
సంస్థ: సిటిక్ హబ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రై.లి. **నైపుణ్యాలు:** ఆటోక్యాడ్, సాలిడ్‌వర్క్స్
స్టైపెండ్: రూ.3,000-6,000
దరఖాస్తు గడువు: మార్చి 3
☛ https://url-shortener.me/AUOS

హైదరాబాద్, విజయవాడల్లో

గ్రాఫిక్ డిజైన్
సంస్థ: సాయిచైత్ర ఫుడ్స్
నైపుణ్యాలు: అడోబ్ యానిమేట్, ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, యానిమేషన్, ఆటోడెస్క్, 3డీస్ మ్యాక్స్, కోరల్‌డ్రా
స్టైపెండ్: రూ.3,000-10,000
దరఖాస్తు గడువు: మార్చి 1
☛ https://url-shortener.me/AUQL

సీనియర్ టెక్నికల్ ఆఫీసర్

సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోకెమికల్స్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (సీపెట్).. ఒప్పంద ప్రాతిపదికన మేనేజర్, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ● మేనేజర్ (టెక్నికల్): 04 ● సీనియర్ టెక్నికల్ ఆఫీసర్: 06 ● మేనేజర్ (పీఅండ్ఏ): 01
అర్హత: సంబంధిత విభాగంలో గ్రాడ్యుయేషన్, ఎంబీఏ, పీజీ డిప్లొమా, పీజీ ఎంఈ/ఎంటెక్, పీహెచ్‌డీతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్, కంప్యూటర్ పరిజ్ఞానం, పని అనుభవం. **మూల వేతనం:** నెలకు మేనేజర్‌కు రూ.78,800. సీనియర్ టెక్నికల్ ఆఫీసర్‌కు రూ.67,700.
వయసు: మేనేజర్‌కు 45 ఏళ్లు, సీనియర్ టెక్నికల్ ఆఫీసర్‌కు 40 ఏళ్లు మించకూడదు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 03.03.2026. **వెబ్‌సైట్:** www.cipet.gov.in/index.php

ఉద్యోగ వేటలో ఉన్న తాజా అభ్యర్థులకు ఇంటర్వ్యూ అనగానే తెలియని భయం మొదలవుతుంది. అయితే అక్కడ కష్టమైన ప్రశ్నలే అడుగుతారనుకోవద్దు. ముఖ్యమైన విషయాలతో పాటు సున్నిత అంశాల పైనా ప్రశ్నలుంటాయి. ఉదాహరణకు 'మా సంస్థలోనే ఎందుకు పని చేయాలనుకుంటున్నారు?' అని అడగొచ్చు. మీ సమాధానం ఉద్యోగ ఎంపికలో ప్రమాణంగా నిలుస్తుంది.

ముఖాముఖిలో మెప్పించండిలా..

ఉద్యోగ పాత్ర

సంస్థ మీకు ఏమి ఇస్తుంది అనే దానికంటే, మీ నైపుణ్యాలతో కంపెనీకి ఏమి ఇవ్వగలరో ఆ కోణంలో ఆలోచించి సమాధానం ఇవ్వొచ్చు. జాబ్ డిస్క్రిప్షన్‌ను పూర్తిగా చదివి, అందులోని బాధ్యతలకు మీ నైపుణ్యాలు ఎలా ఉపయోగపడగలవో వివరించండి. ఈ ప్రయత్నం మీరు ఆ ఉద్యోగం కోసం ప్రత్యేకంగా సిద్ధమయ్యారని నిరూపిస్తుంది.

ప్రశ్న కాదు ఫిల్టర్

తేలికగా తీసుకునే పై ప్రశ్న యాజమాన్యం దృష్టిలో ఒక వడపోత ప్రక్రియ. మీరు సంస్థ గురించి ఎంత పరిశోధన చేశారు? మీ ఆసక్తులు కంపెనీ లక్ష్యాలతో సరిపోతున్నాయా? స్పష్టమైన లక్ష్యంతో వచ్చారా లేదా ఏదో ఒక ఉద్యోగం పొందితే చాలని దరఖాస్తు చేశారా? ఈ విషయాలన్నిటినీ ఈ ఒక్క ప్రశ్న తేల్చేస్తుంది. ఇక్కడ మీరు ఇచ్చే స్పష్టమైన సమాధానమే మీ మోటివేషన్‌ను తెలియజేస్తుంది. సమాధానం వినూత్నంగా, మీ భావం అర్థమయ్యేలా ఉండాలి. మీరు స్పందించే విధానం మీ వ్యక్తిత్వానికి అద్దం పడుతుంది.



సరైన జవాబు

సంస్థపై గౌరవం ఉందని ఇంటర్వ్యూ చేసేవారికి అర్థం కావాలి. ఇందుకు మీ సమాధానమే ప్రమాణం. మీ కంపెనీ బాగుంటుంది, మీ సంస్థ చాలా పెద్దది, టర్నోవర్ ఎక్కువ.. ఇలాంటి మాటలను వారు ఆశించరు. సంస్థ విజన్ లేదా తయారు చేసే ఉత్పత్తులు మీకు ఎలా నచ్చాయో చెప్పండి. ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏదైనా సమస్యను పరిష్కరిస్తే, అది మిమ్మల్ని ఎలా ఆకట్టుకుందో వివరించండి. మీ వ్యక్తిగత విలువలకు, సంస్థ లక్ష్యాలకూ మధ్య ఉన్న సంబంధాన్ని ఇక్కడ హైలైట్ చేయాలి. ఏ మాత్రం అతిశయోక్తులకు తావివ్వకుండా సంక్షిప్త సమాధానం ఇవ్వాలి.

మమేకం కావడం

ప్రతి ఉద్యోగార్థీ మంచి వేదికపై ఎదగాలని కోరుకుంటారు. ఆ సంస్థ పని తీరు, అక్కడ ఉద్యోగులకు ఇచ్చే గౌరవం లేదా కొత్త విషయాలు నేర్చుకునే అవకాశం గురించి మాట్లాడండి. 'నేను మీ సంస్థలో చేరి, మీతో పాటు ఎదగాలనుకుంటున్నాను' అని చెప్పడం ద్వారా మీరు లాంగ్-టర్మ్ ప్లాన్‌తో ఉన్నారని అర్థమవుతుంది. మీ నైపుణ్యాల గురించి క్షుణ్నంగా తెలియజేయండి.

ముందస్తు ప్రణాళిక

మీ సమాధానానికీ, ముఖ కవళికలకూ సంబంధం లేకపోతే ఫలితం దక్కకపోవచ్చు. అందుకే అద్దం ముందు నిల్చుని జవాబు చెప్పాలి. ముఖ కవళికలు ఎలా ఉంటున్నాయి, ఒత్తిడి కనిపిస్తుందా, ఉత్సాహంగా స్పందిస్తున్నారా, తడబాటుకు లోనవుతున్నారా గమనించుకుని మిమ్మల్ని మీరు సరిదిద్దుకోవాలి.

కష్టపడేతత్వం

అవసరమైనప్పుడు అదనపు బాధ్యతలు తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నారనే సంకేతాలనూ ఇవ్వండి. నైపుణ్యాలతో పాటు విశ్వసనీయతతో పనిచేసే సామర్థ్యం ఉందని అర్థమయ్యేలా మీ కమ్యూనికేషన్ ఉండేలా చూసుకోండి.

సీనియర్ రెసిడెంట్లు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), బీబీనగర్.. 13 సీనియర్ రెసిడెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: సంబంధిత విభాగంలో డీఎన్‌బీ, ఎంఎస్, ఎండీ, ఎంసీహెచ్, డీఎంతో పాటు పని అనుభవం.
వయసు: 45 సంవత్సరాల్లోపు ఉండాలి.
మూల వేతనం: నెలకు రూ.67,700.
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌లకు రూ.1,770. ఇతరులకు ఫీజు లేదు.
ఎంపిక: ఇంటర్వ్యూతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 23.02.2026.
వెబ్‌సైట్: https://aiimsbibinagar.edu.in/recruitment.html

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్‌లో

నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ (ఎన్ఐసీ).. 243 సైంటిస్టు-బీ (గ్రూప్-ఏ, గెజిటెడ్) పోస్టుల భర్తీకి షార్ట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.
● సైంటిస్టు-బీ (గ్రూప్-ఏ, గెజిటెడ్)
అర్హతలు: సంబంధిత విభాగంలో డిగ్రీ, బీటెక్, ఎమ్మెస్సీ/ ఎంఈ/ ఎంటెక్ లేదా ఎంఫిల్‌తో పాటు గేట్-2024/ 25/ 26 స్కోరు ఉండాలి.
వేతన శ్రేణి: నెలకు రూ.56,100 - 1,77,500.
దరఖాస్తు: గేట్-2026 ఫలితాలు వెలువడిన తర్వాత పది రోజుల్లోగా వివరాలు నమోదు చేసుకోవాలి.
వెబ్‌సైట్: https://recruitment.nic.in/



కేంద్ర మంత్రి హర్దీప్‌సింగ్ పురీకి ధన్యవాదాలు తెలుపుతున్న పెమ్మసాని చంద్రశేఖర్

గుంటూరు, కడప ప్రభుత్వాసుపత్రుల్లో క్యాన్సర్ చికిత్స యంత్రాలు

కేంద్ర మంత్రి పెమ్మసాని వినతితో సీఎస్ఆర్ కింద నిధుల మంజూరు

ఈనాడు, దిల్లీ: కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద ఓఎన్‌జీసీ మంజూరు చేసిన నిధులతో గుంటూరు, కడప ప్రభుత్వ ఆసుపత్రుల్లో రూ.60 కోట్లతో క్యాన్సర్ చికిత్సకు అవసరమైన ఆధునిక లైనాక్ యంత్రాలు ఏర్పాటు చేయనున్నారు. ఈ రెండు ఆసుపత్రుల్లో యంత్రాల ఏర్పాటుకు ప్రభుత్వ రంగ చమురు సంస్థ నుంచి సీఎస్ఆర్ కింద నిధులు మంజూరుచేయించాలని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చేసిన విజ్ఞప్తి మేరకు పెట్రోలియంశాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీ పచ్చజెండా ఊపారు. దీంతో మంత్రి పెమ్మసాని బుధవారం ఇక్కడ హర్దీప్ సింగ్‌ను కలిసి ధన్యవాదాలు తెలిపారు. యంత్రాల ఏర్పాటుతో ఆంధ్రప్రదేశ్‌తోపాటు, పరిసర రాష్ట్రాల రోగులకూ ప్రపంచస్థాయి సేవలు అందించడానికి వీలవుతుందన్నారు.



మార్చి నెలాఖరుకు 3 రెట్ల శక్తి

ఈ రోజు నుంచి మీరు కొన్ని పనులు ప్రారంభించి కొనసాగిస్తే మార్చి నెలాఖరుకు మీ ఓర్పు, మీ శక్తి మూడు రెట్లు పెరుగుతాయి. అవేంటంటే..

- ప్రతీ రోజూ వేగంగా 30 నిమిషాల నడక
- వారంలో రెండుసార్లు డంబెల్స్‌తో వ్యాయామం
- వారం మొత్తంలో కనీసం 400 మెట్లు ఎక్కడం దిగడం
- ప్రతీరోజూ నిమిషం చొప్పున 15 సార్లు నిలబడటం
- భోజనానంతరం 15 నిమిషాల నడక.

– చిరాగ్ బర్జాత్యా, ఫిట్‌నెస్ కోచ్

ఇంటర్ పరీక్షల్లో 32 పేజీల బుక్‌లెట్

- అందులోనే అన్ని సమాధానాలూ రాయాలి
- ప్రథమ సంవత్సరం విద్యార్థులకు మాత్రమే
- రెండో ఏడాది వారికి 24 పేజీలే
- పబ్లిక్ పరీక్షలకు హాజరు కానున్న 10.57లక్షల మంది విద్యార్థులు
- 23 నుంచి పరీక్షలు.. ఏర్పాట్లు పూర్తి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఈ నెల 23 నుంచి ప్రారంభం కానున్న ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు ఇంటర్మీడియట్ విద్యా మండలి ఏర్పాట్లు పూర్తి చేసింది. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 5,31,275, ద్వితీయ సంవత్సరం వారు 5,26,624 మంది కలిపి మొత్తం 10,57,899 మంది పరీక్షలకు హాజరు కానున్నారు. ప్రథమ సంవత్సరానికి సంబంధించి ఈ ఏడాది సిలబస్‌తోపాటు ప్రశ్నపత్రాల విధానంలోనూ మార్పులు తీసుకొచ్చారు. సమాధానాలు రాయడానికి ఇప్పటి వరకు 24 పేజీల బుక్‌లెట్ ఇస్తుండగా.. ఈసారి మొదటి ఏడాది విద్యార్థులకు 32 పేజీల బుక్‌లెట్ ఇవ్వనున్నారు. అన్ని ప్రశ్నలకు అందులోనే జవాబులు రాయాల్సి ఉంటుంది. అదనంగా ఎలాంటి పేజీలు ఇవ్వరు. ప్రథమ సంవత్సరంలో గణితం, భౌతిక, రసాయన, జీవ శాస్త్రాల్లో ప్రశ్నల సంఖ్య పెరగడంతో బుక్‌లెట్‌లో పేజీలు పెంచారు. ఛాయిస్ లేకుండా పూర్తిగా అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాసినా 28 పేజీలు సరిపోతాయని, అందుకోసమే 32 పేజీల బుక్‌లెట్ తీసుకొచ్చినట్లు ఇంటర్మీడియట్ విద్యా మండలి పేర్కొంది. ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మాత్రం గతంలోలానే 24 పేజీల బుక్‌లెట్ ఇస్తారు.

జీవశాస్త్రానికి విడివిడిగా..

గతంలో వృక్ష జంతుశాస్త్రా(బోటనీ, జువాలజీ)లకు విడివిడిగా పరీక్షలు నిర్వహించేవారు. ఈ ఏడాది నుంచి రెండింటినీకలిపి జీవశాస్త్రంగా ఒక్క ప్రశ్నపత్రమే ఇస్తారు.

★ పార్ట్-ఏలో వృక్ష శాస్త్రం నుంచి 43, పార్ట్-బీలో జంతుశాస్త్రం నుంచి 42 మార్కులకు ప్రశ్నలుంటాయి. వీటికి జవాబులు రాసేందుకు విడివిడిగా 24 పేజీల రెండు బుక్‌లెట్లు ఇస్తారు. బుక్‌లెట్లపై వృక్ష శాస్త్రం, జంతుశాస్త్రం అని ప్రత్యేకంగా పేర్కొంటారు.

★ ఈ ఏడాది మొదటి సంవత్సరం వారికి ఒక్క మార్కు ప్రశ్నలు ఉంటాయి. ద్వితీయ సంవత్సరం ప్రశ్నపత్రాల్లో ఎలాంటి మార్పు ఉండదు.

★ ఆర్థిక శాస్త్రం, చరిత్ర, పౌరశాస్త్రం సబ్జెక్టుల మార్కుల్లో ఎలాంటి మార్పు లేకపోయినా ప్రశ్నల సంఖ్య పెరగడంతో వీటికి సైతం 32 పేజీల బుక్‌లెట్ ఇస్తారు.

ఒక్క మార్కు ప్రశ్నలు సబ్జెక్టుల వారీగా	
గణితం	12
రసాయనశాస్త్రం	9
భౌతికశాస్త్రం	9
వృక్షశాస్త్రం	5
జంతుశాస్త్రం	4

29 మార్కులొస్తే పాస్

★ భౌతిక, రసాయన, జీవశాస్త్రం సబ్జెక్టులకు మొదటి ఏడాదిలో 85 మార్కులకు రాత పరీక్ష ఉంటుంది. 35% మార్కులొస్తే పాసయినట్లు. ఆ లెక్కన 29.75 మార్కులు రావాల్సి ఉండగా.. 29 మార్కులు వచ్చినా ఉత్తీర్ణులైనట్లే పరిగణిస్తారు.

★ ద్వితీయ సంవత్సరంలో 85 మార్కులకు 30 మార్కులు తెచ్చుకోవాలనే నిబంధన పెట్టారు.

★ రెండు సంవత్సరాలకు కలిపి 35% కింద 59.5 మార్కులు సాధించాల్సి ఉండగా.. 59 మార్కులను ఉత్తీర్ణతగా నిర్ణయించారు. ఈ అర్ధ మార్కును సర్దుబాటు చేసి, రెండో ఏడాదిలో ప్రాక్టికల్స్ 30 మార్కులకు ఉత్తీర్ణత మార్కులను 10.5 నుంచి 11కు పెంచారు.

అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు

అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నారు. వీటిని జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో ఇంటర్మీడియట్ బోర్డుకు అనుసంధానం చేస్తారు. రాష్ట్ర స్థాయిలో ఒక్కో జిల్లాను ఒక్కో అధికారి పర్యవేక్షిస్తారు. ఆయా కళాశాలలు సీసీకెమెరా ఫుటేజ్ హార్డ్‌డిస్క్‌ను ఆర్‌ఐఓలకు ఇస్తాయి. అక్కడ వాటిని భద్రపరుస్తారు.

8 మంది మెప్మా ఉద్యోగులపై వేటు

- గత ప్రభుత్వంలో వైకాపా నాయకులతో కలిసి రూ.4 కోట్ల మేర అవకతవకలు

నరసరావుపేట సెంట్రల్, న్యూస్‌టుడే: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)కు చెందిన 8 మంది ఉద్యోగులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సస్పెండ్ చేస్తూ మెప్మా పీడీ మురళీకృష్ణ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో వైకాపా నాయకులు, మెప్మా విభాగంలో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు కలిసి నకిలీ గ్రూపులు సృష్టించారు. తద్వారా బ్యాంకుల్లో సుమారు రూ.4 కోట్ల మేర అవకతవకలకు పాల్పడ్డారు. గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన సమావేశంలో జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా ఈ అవినీతి గురించి సీఎం చంద్రబాబుకు వివరించారు. స్పందించిన సీఎం.. వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలని, రికవరీ కాకుంటే ఆస్తులు స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో నరసరావుపేట మెప్మా కార్యాలయంలో పనిచేసే సిటీ మిషన్ మేనేజర్ తుమ్మా దీప, కమ్యూనిటీ ఆర్గనైజర్ బి.విజయప్రణతి, సిటీ మిషన్ మేనేజర్ ఉమర్‌వలి (వినుకొండ), చిలకలూరిపేటకు చెందిన కమ్యూనిటీ ఆర్గనైజర్ ఎం.మల్లికార్జునరావు, నరసరావుపేటకు చెందిన కమ్యూనిటీ ఆర్గనైజర్ జి.భూదేవి, సిటీమిషన్ మేనేజర్ జి.శ్రీనివాసరావు (పిడుగురాళ్ల), గురజాల, పిడుగురాళ్లకు చెందిన కమ్యూనిటీ ఆర్గనైజర్లు కె.శ్రీనివాసరావు, డి.బాలాంజనేయులను సస్పెండ్ చేస్తూ పీడీ తాజాగా ఉత్తర్వులు ఇచ్చారు. అయితే వీరిపై క్రిమినల్ చర్యలు తీసుకోకపోవడంపై డ్వాక్రా సంఘాల మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వైకాపా హయాంలో దీప, ఉమర్‌వలి, ప్రణతిలు నకిలీ గ్రూపులతో రుణాలు పొందారని ఆరోపణలు వచ్చినా వారికే కూటమి నేతలు ప్రాధాన్యమివ్వడం స్థానికంగా చర్చనీయాంశమైంది.

శివరాత్రి రోజు విద్యుత్ అంతరాయాలు ఉండొద్దు: మంత్రి గొట్టిపాటి

ఈనాడు, అమరావతి: మహాశివరాత్రి రోజున రాష్ట్రంలోని అన్ని దేవాలయాలు, పరిసర ప్రాంతాలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని డిస్కంల అధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. డిస్కంల సీఎండీలు, ఉన్నతాధికారులతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సూచనలు అందించారు. 'శివరాత్రి రోజు భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాలకు వచ్చే అవకాశం ఉంది. వారికి అసౌకర్యం లేకుండా అవసరమైన చోట ప్రత్యామ్నాయ మార్గాల్లో విద్యుత్ అందించేలా ఏర్పాట్లు చేయాలి. ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ పంపిణీ లైన్లకు ముందస్తుగా తనిఖీలు నిర్వహించాలి. అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించాలి' అని మంత్రి ఆదేశించారు.

గిరిజన గ్రామాల సరిహద్దులను వెబ్‌సైట్లో ఉంచండి: హైకోర్టు



ఈనాడు, అమరావతి: శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాలోని గిరిజన గ్రామ పంచాయతీలు, వాటి సరిహద్దుల వివరాలను వెబ్‌సైట్లో ఉంచాలని గిరిజన సంక్షేమశాఖ ముఖ్య కార్యదర్శిని హైకోర్టు ఆదేశించింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌లతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖ, తూర్పుగోదావరి జిల్లాల్లోని గిరిజన ప్రాంతాల్లో 595 గ్రామ పంచాయతీల పరిధిలో 878 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయని, ఆ గ్రామాల జాబితాను గిరిజన సంక్షేమశాఖ వెబ్‌సైట్లో ఉంచేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ ఇంటిగ్రేటెట్ ట్రైబల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు వెంకట శివరామ్ ఈ పిల్ వేశారు. ఆయన తరఫున న్యాయవాది సీహెచ్ శ్రీనివాసరెడ్డి వాదనలు వినిపిస్తూ.. గిరిజన గ్రామాల హద్దులను బహిర్గతం చేయని కారణంగా గిరిజనేతరులు సారవంతమైన భూములను కొల్లగొడుతూ, అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారని పిటిషన్‌లో పేర్కొన్నారు.

విశాఖలో దివ్యాంగుల క్రీడాకేంద్రం ఏర్పాటుకు సహకరించండి

కేంద్రమంత్రి వీరేంద్రకుమార్‌కు తెదేపా ఎంపీ లావు వినతి



కేంద్రమంత్రి వీరేంద్రకుమార్‌తో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

ఈనాడు, దిల్లీ: విశాఖపట్నంలో దివ్యాంగుల క్రీడాకేంద్రం ఏర్పాటుకు కేంద్రం ఆర్థికపరంగా, అనుమతుల పరంగా సహకరించాలని తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కేంద్ర సామాజిక న్యాయం, సాధికారశాఖ మంత్రి వీరేంద్రకుమార్‌ను కోరారు. బుధవారం ఇక్కడి పార్లమెంటు భవన్‌లో కేంద్రమంత్రిని కలిసి వినతి పత్రం సమర్పించారు. "దివ్యాంగుల క్రీడాకేంద్రం ఏర్పాటుకు ఏపీ ప్రభుత్వం విశాఖపట్నం జిల్లా బక్కన్నపాలెంలో 22.64 ఎకరాల భూమిని ఇప్పటికే గుర్తించింది. 2025 మార్చిలోనే కేంద్ర అధికారులు దాన్ని పరిశీలించారు. రాష్ట్రప్రభుత్వం సహకరిస్తున్నందున.. త్వరగా ఏర్పాటుచేసేందుకు వీలుగా కేంద్రం నుంచి ఆర్థికసాయం, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలి" అని శ్రీకృష్ణదేవరాయలు కేంద్రమంత్రికి విజ్ఞప్తిచేశారు.

రేపే బార్ కౌన్సిల్ ఎన్నికలు

ఈనాడు, అమరావతి: ఏపీ బార్ కౌన్సిల్‌కు శుక్రవారం ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 143 మంది న్యాయవాదులు పోటీలో ఉండగా హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఏవీ శేషసాయి రిటర్నింగ్ అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ ఎన్నికలకు రాష్ట్రవ్యాప్తంగా 148 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. బార్ కౌన్సిల్‌కు 25 మంది సభ్యులను ఎన్నుకుంటారు. అడ్వొకేట్ జనరల్(ఏజీ) ఎక్స్‌అఫీషియో సభ్యుడిగా ఉంటారు. ఈ 25 మందిలో ఒకరిని ఛైర్మన్‌గా, మరొకరిని వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకుంటారు. ఈసారి జరుగుతున్న బార్ కౌన్సిల్ ఎన్నికల్లో మహిళలకు తొలిసారి 30శాతం ప్రాతినిధ్యం కల్పించారు. గతంలో నిర్వహించిన ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన 25 మంది సభ్యుల్లో 19 మంది మళ్లీ పోటీలో ఉండటం విశేషం.

ఏప్రిల్ 4 నుంచి పదో తరగతి మూల్యాంకనం

ఈనాడు, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఏప్రిల్ 4 నుంచి 13 వరకు నిర్వహించేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం ఆదేశాలు జారీ చేసింది. మూల్యాంకన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై జిల్లా విద్యాధికారులకు పలు సూచనలు చేసింది. మూల్యాంకనంపై ఏప్రిల్ 4న నిర్వహించే అవగాహన కార్యక్రమానికి హాజరుకావాలని పేర్కొంది.

శ్రీవారిని దర్శించుకున్న బండ్ల గణేష్



శ్రీవారి ఆలయం ఎదుట కుటుంబసభ్యులతో సినీ నిర్మాత బండ్ల గణేష్ తదితరులు

తిరుమల, న్యూస్‌టుడే: సినీ నిర్మాత, నటుడు బండ్ల గణేష్ బుధవారం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబసభ్యులతో కలిసి మూలమూర్తిని దర్శించుకోగా..అనంతరం రంగనాయకుల మండపంలో వేదపండితులు ఆశీర్వచనం, అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం గణేష్ మీడియాతో మాట్లాడుతూ.. బీజీ బ్లాక్ బస్టర్స్ బ్యానర్ నిర్మించనున్న 'ఫేర్ వెల్' సినిమా స్క్రిప్ట్‌కు చిత్ర బృందంతో కలిసి ప్రత్యేక పూజలు చేయించినట్లు తెలిపారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఈ సినిమా సెట్స్ మీదకు వెళుతుందన్నారు.

EENADU Vol: 52, Issue: 183 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

మకరందం
■ makarandam@eenadu.in
ఈనాడు
గురువారం ఫిబ్రవరి 12, 2026

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501 512



పవిత్రం.. నదీ స్నానం

ఫిబ్రవరి 13 కుంభ సంక్రమణం

సూర్యుడు మకరరాశి నుంచి కుంభరాశిలో ప్రవేశించే రోజును కుంభ సంక్రమణం అంటారు. హిందూ సౌరమానం ప్రకారం.. ఇది పదకొండో నెల ప్రారంభం. దేశవ్యాప్తంగా అనేకమంది కుంభ సంక్రాంతి ఎంతో వైభవంగా చేసుకుంటారు. భక్తులు పుణ్య నదుల్లో పవిత్ర స్నానాలు చేస్తారు. తమ జీవితాల్లో భయాలు, బాధలు తొలగి శుభం చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తారు. ముఖ్యంగా నదీ తీరాల్లో ఉన్న ఆలయాలు ఈ ప్రత్యేక దినాన భక్తులతో నిండిపోతాయి. కుంభ సంక్రాంతి రోజున స్వయంపాకం దానం ఇవ్వడం శ్రేష్ఠమన్నది శాస్త్ర వచనం. నదీమతల్లికి నమస్కరించి తెలిసీ తెలియక చేసిన పాపాలు నశించాలని కోరుకొని స్నానాలు ఆచరిస్తారు. ఈ రోజున ఆవుకు గ్రాసం సమర్పిస్తే దోషాలు తొలగి, శుభాలు కలుగుతాయని విశ్వసిస్తారు. ఈ రోజున వైష్ణవాలయాలను దర్శించుకోవడం, విష్ణు సహస్రనామ పారాయణం చేయడం వల్ల సత్ఫలితాలుంటాయని పండితులు చెబుతారు. అలాగే ఇష్టదేవతలతో పాటు పార్వతీదేవిని, బృహస్పతిని పూజిస్తారు.



శంఖగుండం రహస్యం!

భాగల్పూర్‌కు 45 కిలోమీటర్ల దూరంలోని బాంకా జిల్లాలో మందార పర్వతం ఉంది. అక్కడే 'శంఖగుండం' ఉంది. ఈ శంఖగుండం ఏడాదిలో 364 రోజులు 70 నుంచి 80 అడుగుల నీటిమట్టంతో ఉంటుంది. మహాశివరాత్రి పర్వదినం రోజున మాత్రం ఈ గుండంలో నీరంతా మాయమవుతుంది. అప్పుడు గుండం అడుగు భాగానున్న మహా శివుని గౌర్ముఖి శంఖం భక్తులకు దర్శనమిస్తుంది. మహాశివరాత్రి గడియలు పూర్తికాగానే శంఖగుండం తిరిగి నీటితో నిండిపోతుంది. పరమశివుడు క్షీర సాగర మథనం సమయంలో.. ఉత్పన్నమైన హాలాహలాన్ని ఈ శంఖంలో నింపి సేవించి నీలకంఠుడు అయ్యాడని స్థల పురాణం తెలియజేస్తోంది. సాధారణంగా శంఖాలు తెలుపు, గోధుమ రంగుల్లో ఉంటాయి. కానీ హాలాహలంతో నిండినందు వల్ల ఇక్కడి శంఖం.. ఆ విష ప్రభావంతో గచ్చకాయ రంగులో ఉంటుంది అంటారు. మహాశివరాత్రి వేళ నీరు ఎక్కడికి వెళ్తుంది, ఆ సమయం ముగియగానే తిరిగి అందులో నీరు ఎలా చేరుతుంది- అనేది నేటికీ అంతుపట్టని రహస్యంగా ఉండిపోయింది.

ఫిబ్రవరి 15 మహాశివరాత్రి

నిశ్శబ్దమే నాదమై నినదించే వేళ. అంధకారంలో జ్ఞానదీపం వెలిగే సమయం. పరమేశ్వరుడు కరుణార్ద్రహృదయుడై భక్తులను అనుగ్రహించే తరుణం. అదే పరమ పవిత్ర మహా శివరాత్రి పర్వదినం. మనసా వాచా పరమేశ్వరుని స్మరిస్తూ.. జాగరణలో దైవసన్నిధిని అనుభూతి చెందడమే పండుగ పరమార్థం.

కాలానికి అతీతుడైన మహాశివుడికి నిత్యం అభిషేకాలు, పూజలు చేస్తుంటాం. ఆయన మన మనసులోని మాలిన్యాలను తొలగించి స్వచ్ఛతను, సంతోషాన్ని ప్రసాదిస్తాడు. ఆ స్వామికి 64 రూపాలు ఉన్నాయని శివపురాణం పేర్కొంది. మహాశివరాత్రి సందర్భంగా పరమేశ్వరుడి ఆరు విశిష్ట రూపాలను స్మరించి తరిద్దాం.

పరమేశ్వరుని రూపాల్లో పరమార్థం

లింగోద్భవమూర్తి : 'లింగమధ్యే జగత్ సర్వం' అన్నారు. ఈ సృష్టిమొత్తం లింగరూపంలోనే ఉందన్నది సారాంశం. ఆధిక్యత గురించి బ్రహ్మదేవుడు, విష్ణుమూర్తిల మధ్య వివాదం తలెత్తింది. ఆ సంవాదాన్ని పరిష్కరించేందుకు పరమేశ్వరుడు అగ్నిలింగరూపాన్ని ధరించాడు. ఆ రూపానికి ఆది, అంతం ఎక్కడో చూసిరమ్మన్నాడు శివుడు. పరీక్షలో నెగ్గలేకపోయిన బ్రహ్మ అబద్ధపు సాక్ష్యం చెప్పించారు. సాక్ష్యం చెప్పిన ఆవు, మొగలిపువ్వులను శపించాడు శివుడు. మనమెంతటి సమర్థులమైనా, అధికులమైనా, వినయవిధేయలతో వ్యవహరించాలని, ధర్మానికి కట్టుబడి ఉండాలని హితవు పలికాడు. ఈ అపురూప ఘట్టం చోటుచేసుకున్న రోజును 'మహాశివరాత్రి' పర్వదినంగా వేడుక చేసుకుంటున్నాం. పూజలు, అభిషేకాలు చేస్తున్నాం. అలానే ప్రతినెలా కృష్ణపక్ష చతుర్దశి రోజును మాసశివరాత్రిగా పరమేశ్వరుని ఆరాధిస్తాం.

రాయచోటి సమీపంలోని మాండవ్య నది ఒడ్డున భద్రకాళి సమేత వీరభద్రస్వామి దేవాలయం ప్రసిద్ధం. ప్రతి సంవత్సరం శివరాత్రి సందర్భంగా ఉత్సవాలు నిర్వహిస్తారు. స్వామివారి కల్యాణం ఎంతో వైభవంగా చేస్తారు. ఈ ఉత్సవాలు చూసేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారని అంచనా.

శివరాత్రికి వీరభద్రస్వామి కల్యాణం





రాయచోటిలో వెలసిన భద్రకాళి సమేత వీరభద్రుడు భక్తుల పాలిట కొంగు బంగారంగా విరాజిల్లుతున్నాడు. స్థానికుల కథనాన్ని అనుసరించి.. చోళ సామ్రాజ్య విస్తరణలో భాగంగా యుద్ధాలు చేసి అలసిపోయిన చోళుడు మానసిక ప్రశాంతత కోసం దేశాటనకు బయల్దేరి.. ఇక్కడి మాండవ్య నది తీరానికి చేరుకున్నాడు. ఈ ప్రాంతం ఆయనకు బాగా నచ్చడంతో జీర్ణావస్థలో ఉన్న భద్రకాళి సమేత వీరభద్రుని ఆలయాన్ని పునఃనిర్మించాడు. ఆలయ గాలిగోపురం ముందు భాగంలో 56 అడుగుల ఎత్తుగల ఏక శిలా రాతి దీపస్తంభం ఉంది. ఇది ఆలయానికి ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ ఉత్సవాలలో కులమతాలకు అతీతంగా సర్వమతస్థులూ పాల్గొనడం విశేషం. శతాబ్దాల చరిత్ర గల ఈ వీరభద్రాలయం గొప్ప శిల్పకళా సంపదతో విరాజిల్లుతూ భక్తులను ఆకట్టుకుంటోంది. ఉత్సవాల సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరిస్తారు. కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు అధిక సంఖ్యలో వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా అన్ని ఏర్పాట్లూ చేస్తున్నారు.

నటరాజమూర్తి : సృష్టి, స్థితి, లయల విన్యాసాలను తెలియజేస్తుంది నటరాజ స్వరూపం. విశ్వానికి సంబంధించిన సకలం, సర్వం నటరాజ భంగిమలో దర్శనమిస్తాయి. నటరాజు వలయాకార అగ్ని మండలం జగత్తు నిరంతర గమనానికి సంకేతం. కాలం నిలవదు, మార్పు తథ్యమని చాటుతుంది. కుడిచేతిలోని ఢమరుకం శబ్దమే సృష్టికి మూలమని తెలియజేస్తుంది. ఎడమ చేతిలోని అగ్ని జ్వాల లయకు ప్రతీక. అభయ ముద్రలో ఉన్న కుడి కింది చేయి భక్తుల భయం వీడమని భరోసా ఇస్తుంది. కాళ్ల వైపు చూపిస్తున్న ఎడమ కింది చేయి శరణు వేడితే- మోక్షం ప్రాప్తిస్తుందని సూచిస్తుంది. మరుగుజ్జు రూపాన్ని తొక్కిపెట్టిన కుడి పాదం అజ్ఞానం, అహంకారాన్ని తొలగిస్తున్నట్లుగానూ, పైకి లేచి ఉన్న ఎడమ పాదం విముక్తికి చిహ్నంగానూ దర్శనమిస్తాయి. ఒక్క మాటలో చెప్పాలంటే.. జీవితం ఒక నృత్యమని, అందులో లయ సాధించినప్పుడే మోక్షం పొందుతామని నటరాజ స్వరూపం ప్రబోధిస్తుంది.

దక్షిణామూర్తి : సహజంగా మనలో ఉన్న పరిపూర్ణతను విద్య వ్యక్తపరుస్తుంది- అన్నారు స్వామి వివేకానంద. ఆ విద్యను అందించేది గురువు. శివుడు ఆదిగురువు. అపార ఆధ్యాత్మిక జ్ఞానసంపద ఉన్నప్పటికీ సమాధానం దొరకని అంశాలుంటాయి. అలా మహర్షులను సైతం తికమకపెట్టే సందేహాలను దక్షిణామూర్తి నివృత్తి చేస్తాడు. ఊరికి ఉత్తరాన శ్మశానముంటుంది. ఆ శ్మశానం శివుడి ఆవాసం. స్వామి దక్షిణాభిముఖుడై ఉంటాడు. ఈ రూపానికి దక్షిణామూర్తి అనే పేరొచ్చిందని చెబుతారు. అంతిమంగా అందరూ చేరుకోవాల్సిన అంతర్ముఖం ఉంది. ఆయనను [illegible] అంటే మనం చివరికి చేరవలసిన స్థలం వైపు. అక్కడికి చేరుకునేలోపు ఆధ్యాత్మిక మార్గాన్ని అనుసరించాలి. జ్ఞానం ఆర్జించేందుకు, చివరికి ముక్తిని పొందేట్లు చేయడానికి పరమశివుడు ఈ రూపం దాల్చాడు.

అర్ధనారీశ్వరమూర్తి

వాగర్థావివసంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగతః పితరౌ వందే పార్వతీపరమేశ్వరౌ

మహాకవి కాళిదాసు అర్ధనారీశ్వరతత్వాన్ని వర్ణించిన వైనమిది. మాటను, అర్థాన్ని ఎలా వేరు చేయలేమో, అలా పార్వతీపరమేశ్వరులను వేర్వేరుగా చూడలేమన్నది ఈ శ్లోక భావం. సృష్టిరహస్యాన్ని తెలియచెప్పడానికే పరమశివుడు ఈ రూపం దాల్చాడు. స్త్రీపురుష మేలుకలయికే సృష్టి అని, శివుడు పురుషతత్వానికి, పార్వతి స్త్రీ తత్వానికి సంకేతమని ఈ రూపం చాటుతుంది. భార్యాభర్తల బంధాన్ని, అన్యోన్యతను, ఆరోగ్యకరమైన రీతిలో గడపాలని ప్రబోధించడమే ఇందులోని సందేశం.

భిక్షాటనమూర్తి: బ్రహ్మహత్యను ఖండించిన దోషం పోవడానికి భిక్షాటనమూర్తి రూపం ధరించాడు శివుడు. జడలుకట్టిన జుట్టుతో, ఒంటిమీద పులి చర్మాన్ని, మెడలో పాములను ధరించి, బ్రహ్మకపాలాన్ని భిక్షాపాత్రగా చేసుకుని.. ఇంటింటా భిక్ష కోరుతూ వీధుల్లో తిరుగుతాడు. తమను తాము గొప్పగా ఊహించుకుని అహంకారులైపోయిన [illegible] నిరాడంబరత్వం చూసి పరివర్తన చెందడం తథ్యం. భిక్షాటనమూర్తి తన చివరి మజిలీగా వారణాసి చేరుకుంటాడు. [illegible] కాశీలో భిక్ష కోరుతూ తిరుగుతున్న శివుణ్ని చూసి, తనకెది అవమానమని [illegible] అన్నపూర్ణాదేవి స్వామివారికి భిక్ష అందించిందంటే పాటు రాజుకే జ్ఞానోదయం కలిగిస్తుంది. అహంకారం తలకెక్కితే.. ఇక ఎన్ని సంపదలున్నా.. అవన్నీ వ్యర్థమే అని ప్రబోధిస్తుంది భిక్షాటనమూర్తి స్వరూపం.

కాలసంహారమూర్తి : ఎదుటివారు చెప్పింది అపార్థం చేసుకుంటే ఘోర ఫలితం ఉంటుందని తెలియచేసేందుకు ఈ రూపం దాల్చాడు శివుడు. సంతానం లేని మృకండ మహర్షి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై- 'వృద్ధాప్యం వరకూ జీవించే దుష్టపుత్రుడు కావాలా, పదహారేళ్లే జీవించినా తదుపరి చిరంజీవిగా మిగిలిపోయే కుమారుడు కావాలా?' అనడిగాడు. సజ్జనుడే కావాలన్నాడు మహర్షి. అలా జన్మించిన మార్కండేయుడు బాల్యం నుంచే సదా శివధ్యానంలో ఉండేవాడు. అతడు తిరుక్కడైయూర్ క్షేత్రం చేరుకుని అమృతఘటం కోసం శివుణ్ణి పూజించసాగాడు. బాలుడికి పదహారేళ్లు నిండే సమయం సమీపించగా యమధర్మరాజు వచ్చాడు. శివసన్నిధిలో ఉన్న మార్కండేయుని పైకి యమపాశం విసిరాడు. అది శివలింగాన్ని తాకింది. దాంతో శివుడు ప్రళయకాల రుద్రుడిగా ప్రత్యక్షమై యముణ్ణి సంహరించాడు. కానీ మార్కండేయుని కోరిక మేరకు తిరిగి బతికించాడు. తన కర్తవ్యంలో ఈ పొరపాటు ఎలా జరిగిందన్న సందేహాన్ని యముడు వ్యక్తం చేయగా.. తానిచ్చిన వరంలో మరణం ప్రస్తావనే లేదు, పదహారేళ్ల తర్వాత చిరంజీవిగా మిగిలిపోతాడని మాత్రమే చెప్పానని శివుడు [illegible] సూక్ష్మాన్ని వివరించాడు. మనం ధర్మాన్ని అనుసరించేందుకు [illegible] అందుకే మహాశివరాత్రి రోజున చేసే జాగారం సరైన సమయం. లింగరూపంలో ఉన్న శివుని అర్చిస్తూనే, ఆ స్వామి వివిధ రూపాల్లోని అర్థాన్ని, పరమార్థాన్ని గ్రహించాలి. [illegible] కోపతాపాలు రావు. జన్మను సార్థకం చేసుకోగలుగుతాం. అలా జీవితం ప్రశాంతంగా గడిచేందుకు ఆ పార్వతీపరమేశ్వరులను పూజిద్దాం.

- వలివేటి అమరేంద్ర



శిశిర రుతువు చలిగాలులకు వీడ్కోలు పలుకుతూ, ప్రకృతి కొత్త చిగుళ్లు తొడిగే అద్భుత కాలం ఫాల్గుణం. ఆధ్యాత్మికంగా, సామాజికంగా, ఆరోగ్యపరంగా ఈ మాస ప్రాముఖ్యత అనన్యం.

చాంద్రమాన గణన ప్రకారం చంద్రుడు ఫల్గుణి నక్షత్రం సమీపంలో ఉండటం వల్ల ఫాల్గుణమాసం అనే పేరొచ్చింది. సూర్యుడు కుంభరాశిని వీడి మీన రాశిలో ప్రవేశించే ఈ సమయం.. ఉత్తరాయణ పుణ్యకాలంలో ఉంటుంది. ఈ మాసం పండుగలకు పెట్టింది పేరు. ప్రతి తిథి ఒక విశేషాన్ని మోసుకొస్తుంది. తెలుగు సంవత్సరంలో ఇది చివరి నెల కావడంతో, గడిచిన ఏడాది జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ.. కొత్త ఏడాదికి స్వాగతం పలికే సంధి కాలంగా దీన్ని భావిస్తారు.

శుభకార్యాలకు అనుకూలం



ఫాల్గుణ మాసం త్రిమూర్తుల అనుగ్రహానికి నిలయం. పురాణ కథనాలను అనుసరించి ఈ మాసంలో ఎన్నో దివ్య ఘట్టాలున్నాయి.

అర్జునుడికి గల పది పేర్లలో 'ఫల్గుణుడు' ఒకటి. ఉత్తర ఫల్గుణి నక్షత్రంలో జన్మించడం వల్ల ఆయనకు ఆ పేరు స్థిరపడింది. ధైర్య సాహసాలు కావాలనుకునే వారు ఈ నెలలో అర్జున నామ స్మరణ చేయడం ఆచారం.

మాఘ బహుళ చతుర్దశి మహాశివరాత్రి. రోజంతా శివ నామస్మరణ, రాత్రి జాగరణ చేయడం వల్ల మనలోని అజ్ఞానాంధకారం తొలగి జ్ఞానోదయం కలుగుతుంది.

క్షీర సాగర మథనం జరిగి మహాలక్ష్మి ఉద్భవించిన ఫాల్గుణ పూర్ణిమను 'లక్ష్మీ జయంతి'గా వేడుక చేస్తారు. ఈ రోజు లక్ష్మీ అష్టోత్తర పఠనంతో ఐశ్వర్యం ప్రాప్తిస్తుంది. అలాగే ఫాల్గుణ పూర్ణిమ నాడు దేశమంతా సంబరాలు చేసుకునే పండుగ హోలీ. దీని వెనుక లోతైన అంతరార్థం ఉంది. శివుడి తపస్సును భగ్నం చేయడానికి ప్రయత్నించిన మన్మథుడు ఈ రోజే భస్మమయ్యాడు. రంగులు చల్లుకోవడం వెనుక ప్రకృతిలోని వైవిధ్యాన్ని ఆస్వాదించాలనే ఉద్దేశం కనిపిస్తుంది.

ఫాల్గుణ శుద్ధ ఏకాదశిని ఆమలకీ ఏకాదశి అంటారు. ఉసిరిచెట్టులో శ్రీమహావిష్ణువు నివసిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ రోజున ఉసిరిచెట్టు కింద పూజలు చేసి, ఉసిరి ఫలాలను దానం చేయడం వల్ల అశ్వమేధ యాగం చేసినంత ఫలితం లభిస్తుందని ప్రతీతి. ఆమలకీ ఏకాదశి కారణంగా ఉసిరి వాడకం పెరుగుతుంది. ఇందులో ఉండే సి-విటమిన్ రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది.

ఫాల్గుణ మాసం జాతరలకు, ఉత్సవాలకు అత్యంత ప్రసిద్ధి. పంటలు చేతికి వచ్చే సమయం కావడంతో రైతులు ఉత్సాహంగా వీటిలో పాల్గొంటారు. మెదక్ జిల్లాలోని ఏడుపాయల వద్ద శివరాత్రి సందర్భంగా జాతర ప్రారంభమై ఈ మాసాంతం వరకూ కొనసాగుతుంది. లక్షలాది మంది భక్తులు ఈ జాతరకు తరలి వస్తారు. గుంటూరు జిల్లాలోని కోటప్పకొండలో జరిగే ప్రభల ఊరేగింపు.. ఒక అద్భుత దృశ్యం. రుతువుల మార్పు జరిగే ఈ కాలంలో మన శరీరం ఎన్నో మార్పులకు లోనవుతుంది. శిశిరంలో చర్మం పొడిబారుతుంది కాబట్టి.. అభ్యంగన స్నానాలకు ప్రాధాన్యత ఇస్తారు. మండు వేసవి రాకముందే శరీరాన్ని చల్లబరిచే ఆహార పదార్థాలు తీసుకోవడం ప్రారంభించాలి.

జ్యోతిష శాస్త్రం ప్రకారం ఫాల్గుణమాసం వివాహ శుభకార్యాలకు అనుకూలమైంది. ఈ మాసంలో జరిగే వివాహాలు సుఖప్రదంగా ఉంటాయని విశ్వసిస్తారు. గృహప్రవేశాలకు, ఉపనయనాలకు కూడా ఈ మాసం శ్రేష్ఠమైంది. ఫాల్గుణం అంటే ముగింపేమీ కాదు, కొత్త పుంతలకు పునాది. మన జీవితాల్లోని కలహాలు, ద్వేషాలను హోలీ మంటల్లో నశింపచేసి, కొత్త ఆశలతో వసంత రుతువుకు సిద్ధమవ్వమని చెప్పడమే ఈ మాసం ఇచ్చే గొప్ప సందేశం.

- సీహెచ్. లత

ఫిబ్రవరి 18 రంజాన్ నెల ప్రారంభం

దైవప్రవక్త ముహమ్మద్ (స) ద్వారా ఖురాన్ అవతరించిన రంజాన్ మాసం అత్యంత పవిత్రం. ఏడాదంతా వృత్తివ్యాపారాలు, కుటుంబ బాధ్యతలు, సామాజిక కార్యకలాపాల్లో నిమగ్నమై ఉండేవారి ఆధ్యాత్మిక పునరుజ్జీవనానికి ఇది సరైన సమయం. ఇస్లాం మూలస్తంభాల్లో ఒకటైన రోజా (సామ్)ను ఈ నెలంతా ఆచరిస్తారు. తెల్లవారు జాము నుంచి సూర్యాస్తమయం వరకు కొనసాగే ఈ ఉపవాసం.. నియంత్రణ, కృతజ్ఞత, అభాగ్యుల పట్ల కరుణను పెంపొందించుకోవటానికి ఉపకరిస్తుంది. ఆరోగ్యంగా ఉన్న వయోజనులైన ముస్లింలకు ఉపవాసం తప్పనిసరి. ఉపవాసాల వల్ల సహనాన్ని, స్వీయ క్రమశిక్షణను పెంపొందించి ఆధ్యాత్మిక వృద్ధికి దోహదం చేస్తాయి. రోజువారీ ప్రార్థనలకు అదనంగా ఈ నెలంతా రాత్రివేళల్లో ప్రత్యేక ప్రార్థనల (తరావీహ్ నమాజ్) ద్వారా ఖురాన్ పఠనం, శ్రవణం భక్తి భావాన్ని ద్విగుణీకృతం చేస్తాయి. హృదయాలను శుద్ధి చేసుకుని, విశ్వాసాన్ని పునరుద్ధరించుకునే లక్ష్యంతో గత పాపాలకు క్షమాపణలు కోరుకుంటారు. సామాజికస్ఫూర్తి పెంపొందేలా దానధర్మాలకు (సద్‌ఖా/ జకాత్), భోజనం (ఇఫ్తార్) పంచుకోవటానికి ప్రాధాన్యం ఇస్తారు.

ఖురాన్ ప్రభవించిన పవిత్ర మాసం

రంజాన్ ఎప్పుడు వస్తుందంటే..: ఇస్లామిక్ క్యాలెండర్‌లో తొమ్మిదో నెల రంజాన్. ఇది దాదాపు 354 రోజులు, 12 నెలలతో చంద్రమాన సంవత్సరంపై ఆధారపడి ఉంటుంది. సౌర సంవత్సరం కంటే 11 రోజులు తక్కువగా ఉంటుంది కాబట్టి ఈ నెల ఏటా 11 రోజులు ముందుగా వస్తుంటుంది. ఒక చక్రాన్ని పూర్తిచేసి తిరిగి అదే కాలంలో రావటానికి 33 సౌర సంవత్సరాలు పడుతుంది. సంప్రదాయం ప్రకారం.. నెలవంక దర్శనం ఆధారంగా నెల ప్రారంభం, ముగింపు ఉంటాయి. ఇటీవలి సంవత్సరాల్లో ఖగోళ గణనల ఆధారంగా ముందుగా నిర్ణయించిన తేదీనే అనుసరిస్తున్నారు.

ఉపవాసం ఉద్దేశం ఏమిటంటే..: ముస్లింలు తెల్లవారుజాము నుంచి సూర్యాస్తమయం వరకు ఉపవాసం ఉంటారు. ఏటా రంజాన్ నెల వచ్చే కాలాన్ని బట్టి 29 నుంచి 30 రోజుల పాటు రోజూ 11 నుంచి 16 గంటల వరకు ఇది కొనసాగుతుంది. ఈ సమయంలో ఆహార పానీయాలు మానేయటం, వివాహితులు దాంపత్య జీవనానికి దూరంగా ఉండటం వంటివి నిష్ఠగా ఆచరిస్తారు. ఇతరులపై అపవాదులు, అబద్ధం చెప్పటం, వాదించటం వంటి ప్రతికూలచర్యలకు దూరంగా ఉంటూ.. శారీరకంగా, ఆధ్యాత్మికంగా శిక్షణ పొందే సమయంగా భావిస్తారు. నిరంతర ఆధ్యాత్మిక చింతనతో దైవానికి చేరువ కావటమే ఉపవాసం అంతిమ లక్ష్యం. ఈ స్థితిని అరబిక్‌లో తక్వా అంటారు. ఈ కాలాన్ని వ్యక్తిగత క్రమశిక్షణ, స్వీయ నిగ్రహంతో సత్కార్యాలకు వినియోగించాలి. యుక్తవయసు దాటిన ముస్లింలు అందరికీ ఉపవాసం ఉండటం తప్పనిసరి. అనారోగ్యంతో ఉన్నవారికి, ప్రయాణంలో ఉన్నవారికి, గర్భిణులు, పాలిచ్చే తల్లులు, రుతుక్రమంలో ఉన్న స్త్రీలు, బలహీనులు, వృద్ధులకు మినహాయింపు ఉంటుంది. పిల్లలకు మినహాయింపు ఉన్నా.. ఏడు సంవత్సరాల వయసు నుంచి సగం రోజులు లేదా వారాంతాల్లో రోజా ఉండటం అలవాటు చేయాలి. ఇది పెద్దయ్యాక రంజాన్ నెలంతా ఉపవాసాలు ఉండటానికి ఒక శిక్షణలా ఉపకరిస్తుంది.

తెల్లవారుజామున సహర్‌తో ఆరంభమై..: ముస్లిం కుటుంబసభ్యులు తెల్లవారుజామున నిద్ర లేచి సహర్ అనే నిరాడంబరమైన అల్పాహారం లాంటి భోజనం తీసుకుంటారు. అనంతరం తొలి ప్రార్థన ఫజర్ నమాజు ఆచరిస్తారు. ఆ తర్వాత కాసేపు విశ్రమించటం లేదా రోజువారీ పనులు ప్రారంభిస్తారు. వేసవిలో అయితే బయట పనులు లేదా చదువు వంటి వాటిని త్వరగా ముగించి, మధ్యాహ్న సమయాన్ని విశ్రాంతికి కేటాయిస్తారు. సూర్యాస్తమయం సమయంలో కొన్ని ఖర్జూరాలు, నీటితో ఉపవాసం విరమించటాన్ని ఇఫ్తార్ అంటారు. సూర్యాస్తమయ ప్రార్థన అనంతరం రాత్రి భోజనం చేస్తారు. ఉపవాస విరమణకు అతిథులను ఆహ్వానించటం లేదా ఇఫ్తార్ కోసం వేరొకరి ఇంటికి వెళ్లటం రంజాన్ నెలలో సర్వసాధారణం. రాత్రి ప్రార్థన, అనంతరం ప్రత్యేక తరావీహ్ నమాజు కోసం మసీదుకు వెళ్తారు. ఒకరోజు తరావీహ్ నమాజులో దివ్యఖురాన్‌లో 30వ వంతు పారాయణం చేస్తారు. తద్వారా నెలాఖరుకు దైవగ్రంథం పఠనం పూర్తవుతుంది.

ఇస్లాం సందేశం



సుహృద్భావాన్ని పెంచే విందులు: ఉపవాసం విరమించటానికి వీలుగా మసీదుల్లో రోజువారీ సామాజిక విందులను ఏర్పాటు చేస్తారు. కొన్నిచోట్ల తెల్లవారుజామున సహర్ కోసం ఏర్పాట్లు చేస్తారు. రంజాన్ నెలలో దాతృత్వానికి ప్రాధాన్యం ఇస్తారు. పేదలకు సాయం చేసేందుకు కొంత మొత్తాన్ని కేటాయిస్తారు. ఇతర మతాలవారు, స్నేహితులు, ఇరుగుపొరుగుతో సుహృద్భావం పెంపొందటానికి ఈ నెలలో ఏర్పాటుచేసే సామాజిక విందులు ఎంతో ఉపకరిస్తాయి. రంజాన్ నెల 27వ రాత్రి- లైలత్ అల్ ఖదర్‌ను వేడుకగా చేసుకుంటారు. ఇది తొలిగా ఖురాన్ అవతరించిన పవిత్రమైన, శక్తిమంతమైన రాత్రిగా విశ్వసిస్తారు. ఈ రోజు రాత్రంతా మసీదుల్లో జాగరణ చేస్తూ ప్రత్యేక ప్రార్థనలు, ఖురాన్ పారాయణం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో గడుపుతారు. రంజాన్ నెల ముగింపులో ఉపవాసాలను విరమించి ఈద్ ఉల్ ఫితర్ పండుగను ఆనందోత్సాహాలతో చేసుకుంటారు. ఈద్ రోజు ఉదయం ప్రత్యేక ప్రార్థన, ధార్మిక ఉపన్యాసం ఉంటాయి. రోజంతా బంధువులు, స్నేహితులు, పరిచయస్తులను కలవటానికి ప్రాధాన్యం ఇస్తారు. ఈద్ ముబారక్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు తెలియజేసుకుంటారు. రంజాన్ నెలంతా ముస్లింలు అధిక సమయం దైవచింతన, ఆధ్యాత్మిక కార్యకలాపాల్లో గడపటం ద్వారా అల్లాహ్ ఆశీర్వాదానికి పాత్రులవుతారు.

- ఖాసిం పీరా

ఆత్మీయత, ఆర్ద్రతల కలయికే ప్రేమ. త్యాగం, క్షమ, సహనం, సర్దుబాటు, నిస్వార్థం, పరోపకారం వంటి ఎన్నో మహనీయమైన గుణాలకు మూలాధారం ప్రేమ. మన మహర్షులు ప్రేమను దైవిక లక్షణమన్నారు.

ప్రేమంటే పూజగానే పరిమళించే [illegible] పవిత్రమైంది. [illegible] ప్రశాంతమైంది. శాసించేది, బంధించేది, బాధించేది ప్రేమ కాదు. పరిపూర్ణమైన తన ప్రేమను ప్రకటించేందుకే పరమాత్మ పలుమార్లు ఈ భువిపై అవతరించాడు. తను పాండిత్యానికి, పటాటోపానికి కాదు.. ప్రేమకే వశుడనవుతానని ప్రస్ఫుటం చేశాడు. అందుకే ఓ భజనలో 'బినా ప్రేమ్‌సే నహీ మిలే నందలాలా.. ప్రేమలేనిదే నందగోపాలుడు దక్కడు..' అని ఘంటాపథంగా చెప్పింది భక్తమీరా. 'మనలోని అహంకారాన్ని సమూలంగా నిర్మూలించడమే ప్రేమ అంతిమ లక్ష్యం' అని ఆ కృష్ణప్రేమిక ఆచరణలో చూపింది.

ప్రేమ.. మధురం మహోన్నతం!

ముగ్గురు మూడు విధాలుగా..: ప్రేమ అనగానే మన మనసులో మెదిలేది శ్రీకృష్ణ భగవానుడి దివ్యమంగళ స్వరూపం. ఆ మురళీకృష్ణుణ్ణి భక్తులే కాదు, భార్యలు కూడా ఒక్కొక్కరు ఒక్కో రీతిలో ప్రేమించారు. సత్యభామ ఆ స్వామి తనకే సొంతమనుకునేది. తన మనోహరుని వేరొకరు కన్నెత్తి చూసినా ఉడుక్కునేది. అది తామసిక ప్రేమ. రుక్మిణీదేవి శ్రీకృష్ణుడు భౌతికంగా తన వద్దకు వచ్చినప్పుడు పూజించేది. స్వామి దూరంగా ఉన్నప్పుడు హృదయమందే ధ్యానించేది. ఇది రాజసిక ప్రేమ. ఇక రాధాదేవి శ్రీకృష్ణుడు భౌతికంగా తన సమీపంలో లేకపోయినా సన్నిధిలో ఉన్నట్లే భావించేది. క్షణం కూడా వేణుగోపాలుని విస్మరించకపోయేది. ఆమె దైనందిన కార్యకలాపాలన్నింటిలో ఆ నవనీతచోరుడి సాహచర్యాన్నే అనుభూతి చెందేది. రాధది సాత్విక ప్రేమ.

ధర్మశాస్త్రాలు ఏమన్నాయంటే..: సాధారణ ప్రేమ, సమంజస ప్రేమ, సమర్థ ప్రేమ- అంటూ మన ధర్మశాస్త్రాలు ప్రేమ ప్రధానంగా మూడు రకాలని పేర్కొన్నాయి. సాధారణ ప్రేమికులు అవతలి వ్యక్తి ఎలా ఉన్నా సరే.. తాను సుఖంగా ఉంటే చాలు అనుకుంటారు. సమంజస ప్రేమలో ఇద్దరూ సుఖంగా ఉండాలన్న ఉదాత్త భావముంటుంది. మూడోదైన సమర్థ ప్రేమలో తాను బాధపడినా ఫర్వాలేదు, ప్రేమించిన వ్యక్తి సుఖంగా ఉండాలన్న విశాల దృక్పథం కనిపిస్తుంది. ఇది మహోన్నతమైంది, పరమ ఆదర్శమైంది. గోపికలు శ్రీకృష్ణపరమాత్మపై ప్రదర్శించిన ప్రేమ ఈ కోవకు చెందింది. అందుకే భగవానుడు గోపికలను తన హృదయంలో నిలిపి.. ఉత్తమ గతుల్ని ప్రసాదించాడు. మన ప్రేమలు సాధారణం నుంచి సమర్థ స్థితికి ఎంత త్వరగా చేరుకుంటే మనం అంత పరిపూర్ణులుగా పరిణతి చెందినట్టు అన్నమాట.

అది ఆనందకారకం..: ప్రేమ ఫలితంగా మనసు నిర్మలంగా, లలితంగా మారాలి. అదే ప్రేమ పరమార్థం. గౌతమ బుద్ధుడి వద్దకు ఓ యువకుడు వచ్చి 'మీరు ప్రేమలో ఆనందం కలుగుతుందని చెప్పారు. కానీ నేను ప్రేమించే వ్యక్తుల నుంచి అలాంటి అనుభవం ఏమీ కలగటం లేదు. ఎందుకలా?' అనడిగాడు. అది విన్న తథాగతుడు 'నువ్వు ప్రేమిస్తున్న లేదా నిన్ను ప్రేమిస్తున్న వారి నుంచి ఏదో ఒకటి ఆశిస్తున్నావు. నీ ప్రేమ స్వార్థంతో కూడుకుంది. ఇచ్చిపుచ్చుకునే ధోరణితో సాగే ఇలాంటి ప్రేమల్లో ఆనందానికి అవకాశం లేదు. ఆశించే ప్రతిదాంట్లో నిరాశ తప్పదు' అని వివరించాడు.



భయానికి తావు లేనిది..: నిర్మల ప్రేమలో భయానికి, అనుమానాలను తావులేదు. అంటే భయపడే లేదా భయపెట్టే చోట ప్రేమ ఉండదన్న వివేకానంద స్వామి ప్రేమను త్రిభుజాలతో పోల్చారు. ఆ మూడు కోణాల్లో మొదటిది ఏమీ ఆశించకపోవటం, అదే అసలైన ప్రేమ అన్నారు. రెండో కోణం నిర్భయం. ఎక్కడ భీతి ఉంటుందో, అక్కడ ప్రేమ ఉండదన్నారు. 'ప్రేమను అనుభూతి చెందడం కోసమే ప్రేమ.. ఇది మూడో కోణం హృదయాన్ని విశాలం చేసే స్పందనల్లో ప్రేమ ఒకటి.. అది జనింపజేసే శక్తితో మనిషి మహోన్నతుడవుతాడు, మానవత్వంతో వ్యవహరిస్తాడు' అన్నారు.

పరోపకారంగా పరిణమిస్తే..: వ్యక్తికి పరిమితమైన ప్రేమను మానవాళికంతటికీ విస్తరించాలి. అంటే పరోపకారంగా పరిణమించాలి. అదే ప్రేమ వికాసం. పవిత్ర ప్రేమానుభూతి.. సేవాభావంగా పరిణమించిన నాడు తోటివారి కష్టాలకు హృదయం కరుగుతుంది. ఆపన్నుల కోసం ఆత్మీయ హస్తం ముందుకు కదులుతుంది. అందుకే కరుణశ్రీ (జంధ్యాల పాపయ్య శాస్త్రి) 'ప్రేయసి ప్రేమలో కనిపించే స్వర్గమే ధ్యేయం కాదు.. ఎందరో నిరుపేదల కన్నీళ్లు తుడిచేందుకు ప్రేయసితో కలిసి వెళ్లు.. అక్కడ కోట్లకొలదీ స్వర్గాలు లభిస్తాయి..' అన్నారు.

నీ ప్రేమ మధురం.. మహోన్నతం..
అది.. నాకెంతో స్వేచ్ఛనిస్తుంది / నేను తమని మరచిపోతానేమోనని.. వీళ్లెవరూ నన్ను ఒంటరిగా వదలరు / నువ్వు మాత్రం అలా కాదు..
నా ప్రార్థనల్లో నిన్ను ప్రస్తావించకున్నా..
ప్రేమిస్తూనే ఉంటావు / నేను విస్మరించినా..
నా ప్రేమ కోసం ఎదురుచూస్తూనే ఉంటావు!

'గీతాంజలి'లో రవీంద్రనాథ్ టాగోర్ పరమాత్ముడి ప్రేమను ప్రస్తుతించిన వైనమిది. ప్రేమ నిజతత్వానికి, ఆదర్శ ప్రేమకు విశ్వకవి అమోఘ నిర్వచనమిది.

- చైతన్య

ఈనాడు సినిమా



'పునాది రాళ్లు'

ఆరోజు నా ఆనందాన్ని వర్ణించలేను - చిరంజీవి

దశాబ్దాలుగా చిత్రసీమను ఏలుతున్న అగ్రహీరో చిరంజీవి సినీ ప్రయాణం ఎంతో మందికి స్ఫూర్తి. ఎన్నో అవార్డులు, గౌరవాలు, కోట్లాది మంది అభిమానాన్ని సంపాదించుకున్న ఆయన... స్టైల్కి ఇప్పటికీ థియేటర్లలో ప్రేక్షకులు ఫిదా అవుతారు. ఇటీవలే 'మన శంకరవరప్రసాద్గారు'తో మరోసారి తన బ్రాండ్ నటనతో ఆకట్టుకున్న చిరంజీవి.. 'పునాది రాళ్లు' కోసం తొలిసారి సెట్లోకి అడుగుపెట్టిన రోజుల్ని గుర్తుచేసుకున్నారు. ఇదొక అందమైన చందమామ కథలాంటి అనుభూతి అంటూ భావోద్వేగానికి గురవుతూ సామాజిక మాధ్యమాల వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. "ఈరోజు 'పునాది రాళ్లు' సినిమా కోసం జీవితంలో కెమెరా ముందు నిలిచిన తొలిరోజు. ఆ రోజు నాలో కలిగిన ఆత్రుత, ఆనందం, బాధ్యత, భావోద్వేగం మాటల్లో వర్ణించలేనిది. ఆ క్షణం ఇప్పటికీ నిన్న, మొన్న జరిగిందేమో అన్నట్టు అనిపిస్తుంది. ఈ ప్రత్యేక సందర్భంలో నాకు ఆ తొలి అవకాశం ఇచ్చిన ఆ చిత్ర దర్శక నిర్మాతలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నా. వారి నమ్మకం, ప్రోత్సాహంతో వచ్చిన అవకాశంతో నటనలో నా ప్రయాణానికి పునాది రాళ్లు పడ్డాయి. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ నన్ను ఆదరిస్తున్న.. ఆశీర్వదిస్తున్న ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు" అంటూ ఆ పోస్టులో పేర్కొన్నారు చిరంజీవి.



కియారా అద్వాణీ

శక్తిమంతమైన కథలో?

'టాక్సిక్' చిత్రంలో నదియాగా ప్రేక్షకుల్ని అలరించడానికి సన్నద్ధమవుతోంది అందాల తార కియారా అద్వాణీ. ప్రస్తుతం మాతృత్వపు దశను ఆస్వాదిస్తున్న ఈమె.. ఇప్పుడు ఓ కొత్త చిత్రానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. 'బరేలీ కీ బర్ఫీ', 'పంగా' లాంటి హిట్ చిత్రాలను రూపొందించిన దర్శకురాలు అశ్వినీ అయ్యర్ తివారీతో ఓ ప్రాజెక్టు కోసం చేతులు కలిపిందట కియారా. "ఇప్పుడు రాబోయే ప్రాజెక్టు ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్ దశలో ఉంది. ఇప్పటికే దీని గురించి కియారా, దర్శకురాలి మధ్య చర్చలు పూర్తయ్యాయి. ఈ చిత్రాన్ని శక్తిమంతమైన మహిళా ప్రాధాన్య కథగా తీర్చిదిద్దనున్నారు. కియారా 'టాక్సిక్' చిత్ర షూటింగ్ను పూర్తి చేసిన తర్వాత ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభించనుంది చిత్ర బృందం సన్నాహాలు చేస్తుంది. త్వరలో ఈ ప్రాజెక్టు గురించి అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ"ని కియారా సన్నిహిత వర్గాలు తెలిపాయి.

కాలం కత్తై దూస్తే కాపాడే కవచం



నభా నటేశ్, నిఖిల్, సంయుక్త

"మనందరం ఇంత స్వేచ్ఛగా ఉండడం వెనక ఎంతో మంది త్యాగాలు ఉన్నాయి. అందరూ రాజుల గురించే మాట్లాడతారు కానీ, త్యాగాలు చేసిన యోధుల గురించి మాట్లాడుకోరు. వెయ్యేళ్ల కిందట రాయలసీమ ప్రాంతానికి చెందిన కృష్ణ అనే ఒక నిజమైన యోధుడి కథతో 'స్వయంభు' తెరకెక్కింది. అల్లరిగా తిరిగే కృష్ణ.. రాజ్యాల్ని శాసించే యోధుడిగా ఎలా ఎదిగాడన్నది ఈ సినిమాలో కీలకం" అన్నారు నిఖిల్. ఆయన కథానాయకుడిగా... భరత్ కృష్ణమాచారి దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రమే 'స్వయంభు'. సంయుక్తా మేనన్, నభా నటేశ్ కథానాయికలు. భువన్, శ్రీకర్ సంయుక్తంగా నిర్మించారు. ఠాగూర్ మధు సమర్పకులు. ఈ వేసవిలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా టీజర్ని బుధవారం హైదరాబాద్లో విడుదల చేశారు. కాలం కత్తై దూస్తే కాపాడే కవచంలా కథానాయకుడు పరిచయమయ్యే విధానం టీజర్ ఆకర్షణగా నిలిచింది. వేదికను ఉద్దేశించి నిఖిల్ మాట్లాడుతూ "కెరీర్లో 'కార్తికేయ 2' లాంటి ఓ గొప్ప సినిమా చేసిన తర్వాత, దానికంటే ఒక అద్భుతమైన సినిమాతో పలకరించాలనే ఇన్నాళ్లు ఆగాను. ఎంతో శ్రద్ధతో, ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటూ ఈ సినిమా చేశా. చూసిన తర్వాత నిఖిల్ మావాడు అని చెప్పడానికి అందరూ గర్వపడతారు. ప్రేక్షకుల అభిరుచిని దృష్టిలో ఉంచుకుని ఓ భారీస్థాయి సినిమా చేశా. అందరికీ నచ్చుతుంది" అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాయాగ్రాహకుడు సెంథిల్కుమార్తోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

'క' దర్శకులతో సాయితేజ్

రెండేళ్లుగా 'సంబరాల ఏటిగట్టు' సినిమాతోనే ప్రయాణం చేస్తున్నారు కథానాయకుడు సాయిదుర్గాతేజ్. భారీ స్థాయిలో రూపొందుతున్న ఆ చిత్రం తుదిదశకు చేరుకోవడంతో, ఇప్పుడు ఆయన కొత్త సినిమాని ఆరంభించడానికి సిద్ధమయ్యారు. 'క' సినిమాతో విజయాన్ని అందుకున్న దర్శకద్వయం సుజీత్, సందీప్ చెప్పిన కథకు సాయిదుర్గా తేజ్ పచ్చజెండా ఊపారు. ఈ కలయికలో సినిమా ఉగాది రోజున ప్రారంభం కానున్నట్టు సమాచారం. 'మన శంకరవరప్రసాద్గారు'తో విజయాన్ని అందుకున్న షైన్ స్క్రీన్స్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించనుంది.



సాయిదుర్గాతేజ్

సందీప్ వంగా మాటలు స్ఫూర్తినింపాయి



శ్రేయాసి, సౌమిత్

సౌమిత్ పోలాడి, శ్రేయాసి సేన్ హీరోహీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'నిలవే'. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా కీలకపాత్రల్లో నటించారు. సాయి కె. వెన్నంతో కలిసి హీరో ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి సంయుక్తంగా నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 13న రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్లో ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గాయని సునీత ముఖ్య అతిథిగా విచ్చేసి ట్రైలర్ని ఆవిష్కరించారు. సౌమిత్ మాట్లాడుతూ... 'నేను సినిమాల్లోకి వెళ్తున్నానంటే మా నాన్న చాలా సపోర్ట్ చేశారు. నన్ను హీరో దర్శకుడిగా మార్చింది సాయి కె వెన్నం' అని తెలిపారు. "ఇది మంచి కంటెంట్ ఉన్న సినిమా. దర్శకుడు సందీప్ రెడ్డిని కలిసినప్పుడు 'ఇక్కడ ఎవరూ క్రిస్టోఫర్ నోలన్ లేరు. మన సినిమాని మనమే నమ్మాలి' అన్నారు. ఆ మాటలే నాలో స్ఫూర్తిని నింపాయి"అన్నారు దర్శకుడు సాయి. ఈ కార్యక్రమంలో నిర్మాత మాధురి, నటి సత్య శ్రీ, ప్రవీణ కడియాల తదితరులు పాల్గొన్నారు.

ఈ చిత్రం నా కూతురుకు ఓ బహుమతి



అర్జున్, సత్యరాజ్, బ్రహ్మానందం, ఐశ్వర్య, నిరంజన్

"సానుకూలమైన ఆలోచనల్ని రేకెత్తించే ఓ మంచి కథతో నా కుమార్తె ఐశ్వర్య అర్జున్ను తెరకు పరిచయం చేయాలనుకున్నా. 'సీతాపయనం'తో ఆ ప్రయత్నం నెరవేరింది. బంధాల విలువల్ని చాటి చెప్పే సినిమాగా అందరి మనసుల్ని గెలుస్తుంది" అన్నారు ప్రముఖ నటుడు అర్జున్ సర్జా. ఆయన దర్శకత్వం వహిస్తూ, స్వయంగా నిర్మించిన చిత్రమే 'సీతాపయనం'. ఆయన కూతురు ఐశ్వర్య అర్జున్ కథానాయికగా నటించారు. కన్నడ నటుడు ఉపేంద్ర సోదరుడి కుమారుడు నిరంజన్ కథానాయకుడిగా నటించారు. అర్జున్, ధృవ సర్జా కీలక పాత్రల్ని పోషించారు. ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్లో విడుదలకు ముందస్తు వేడుకని నిర్వహించారు. ప్రముఖ నటుడు బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజం కోసం పాటుపడుతున్న ప్రముఖులు ప్రకాశ్ ఆమ్టే, మందాకిని ఆమ్టే, ట్యాంక్బండ్ శివ, దుశర్ల సత్యనారాయణ తదితరులను ఈ వేదికపై సత్కరించి, రూ. లక్ష చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ "సమాజంలో నిజమైన హీరోలుగా గుర్తింపు తెచ్చుకున్న పలువురు ప్రముఖుల్ని సత్కరిస్తున్నానని అర్జున్ చెప్పినప్పుడు ఎంతో సంతోషం కలిగింది. మంచి మనిషి అర్జున్. మంచి కథతో ఈ చిత్రాన్ని తెరకెక్కించారు" అన్నారు. దర్శకనిర్మాత అర్జున్ మాట్లాడుతూ "నా కూతురుకు ఓ బహుమతి ఈ చిత్రం. సమాజానికి ఓ మంచి చిత్రాన్ని ఇవ్వాలనే ఓ బాధ్యతతో చేశా" అన్నారు. "ఇది నాకు సినిమా మాత్రమే కాదు, ఓ భావోద్వేగం. ప్రేమ, కుటుంబం, విలువలు గురించి గొప్పగా చెబుతుంది" అన్నారు ఐశ్వర్య. ఈ కార్యక్రమంలో సినీ ప్రముఖులు కె.అశోక్కుమార్, టి.ప్రసన్నకుమార్, బుర్రా సాయిమాధవ్, సత్యరాజ్, అనూప్ రూబెన్స్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవిష్ణు

అరుదైన సినిమా మృత్యుంజయ్

"పాటలు లేకుండా, కథానాయికలు లేకుండా, హాస్యం లేకుండా నిజాయతీగా రూపొందే థ్రిల్లర్ సినిమాలు తెలుగులో అరుదు. అలాంటి ఓ అరుదైన సినిమానే మా 'మృత్యుంజయ్'. ఇందులో నా నటన కూడా కొత్తగా ఉంటుంది" అన్నారు శ్రీవిష్ణు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రెబా మోనికా జాన్ ముఖ్యభూమిక పోషించారు. హుసేన్ షా కిరణ్ దర్శకత్వం వహించారు. సందీప్ గుణ్ణం, వినయ్ చిలకపాటి నిర్మాతలు. ఈ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా బుధవారం టీజర్ని ప్రముఖ దర్శకుడు రాజమౌళి విడుదల చేశారు.

'హే భగవాన్'... నవ్విస్తాడు!



గోపీ అచ్చర

తండ్రీ తనయుల మధ్యఅనుబంధాన్ని ఓ కొత్త కోణంలో ఆవిష్కరిస్తూనే... కడుపుబ్బా నవ్వించే సినిమానే 'హే భగవాన్' అన్నారు గోపీ అచ్చర. ఆయన దర్శకత్వంలో... సుహాస్, శివానీ నాగారం జంటగా నటించిన చిత్రమిది. వీకే నరేశ్, యాంకర్ స్రవంతి కీలక పాత్రలు పోషించారు. బి.నరేంద్రరెడ్డి నిర్మాత. ఈ చిత్రం ఈ నెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్లో విలేకర్లతో ముచ్చటించారు దర్శకుడు.

"మన జీవితాల్లో హే భగవాన్ అంటూ దేవుడిని తలచుకునే సందర్భాలు ఎన్నో. ఇందులోని పాత్రలకు కూడా అలాంటి సంఘటనలే ఎదురవుతుంటాయి. అందుకే ఆ పేరే ఈ సినిమాకి పెట్టాం. సుహాస్ని దృష్టిలో ఉంచుకునే రాసిన కథ ఇది. సుహాస్ కామెడీనే బలం. అయితే కొంతకాలంగా ఆయన సినిమాల్లో పాత్రలు విషాదకరంగా ముగుస్తున్నాయి, జాలి కలిగించేలా చేస్తున్నాయి. అందుకు పూర్తి భిన్నంగా, ఆయన శైలి కామెడీతోనే రాసి తెరకెక్కించిన కథ. ఆరంభం నుంచి, పతాక సన్నివేశాల వరకూ నవ్విస్తూనే ఉంటుందీ సినిమా".

■ "కథని హాస్యం ప్రధానంగా నడిపిస్తూనే, భావోద్వేగాల్ని పంచే సినిమాలంటే నాకు చాలా ఇష్టం. రాజ్కుమార్ హిరాణీ నా అభిమాన దర్శకుడు. ఆయన శైలిలోనే ఈ కథనీ చెప్పా. సుహాస్ స్క్రిప్ట్ దశలో ఎలాంటి జోక్యం చేసుకోలేదు కానీ, సెట్లో మాత్రం తనకు అనిపించిన అభిప్రాయాల్ని చెప్పేవాడు. దాంతో సన్నివేశాలు మరింత ఉత్తమంగా వచ్చాయి. వంశీ నందిపాటికి ఈ కథ స్క్రిప్ట్ దశ నుంచే తెలుసు. మొత్తం మా ప్రయాణంలో ఆయన ఎంతగానో సహకారం అందించారు. నిర్మాత సహకారంతో 36 రోజుల్లోనే చిత్రీకరణ పూర్తి చేశాం. ఈ కథని, దాన్ని తెరపైకి తీసుకొచ్చిన విధానాన్ని చూసి సినిమాని పంపిణీ చేయడానికి ముందుకొచ్చారు వంశీ నందిపాటి. సుహాస్, నరేశ్తోపాటు, వెన్నెల కిశోర్, హర్షవర్ధన్, అజయ్ ఘోష్... ఇలా ప్రతి ఒక్కరూ నవ్విస్తారు. సుహాస్ కెరీర్లో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుంది".

■ "తండ్రీకొడుకుల కథ ఇదని ట్రైలర్లోనే తెలిసిపోతుంది. తండ్రి చేసే వ్యాపారం ఏమిటనే ప్రశ్నని ట్రైలర్ బలంగా రేకెత్తించింది. అయితే అది తెలియాలంటే సినిమా చూడాల్సిందే. సినిమాలో మాత్రం తొలి సన్నివేశంలోనే ఆ సస్పెన్స్కి తెరదించాం. తండ్రి పాత్రని రాసుకునేటప్పుడే నరేశ్ గుర్తొచ్చారు. ఎలాంటి పాత్రలోనైనా ఒదిగిపోయే నటుడు ఆయన".

లవ్స్టోరీలు బాగా తగ్గాయి



ధీరజ్ మొగిలినేని

"మనసుకు నచ్చిన సినిమాల్నే పంపిణీ చేస్తుంటా. ఆ విషయంలో తొందరపాటేమీ ఉండదు. ప్రధానంగా నా దృష్టంతా చిత్ర నిర్మాణంపైనే ఉంటుంది. ఈ ఏడాది కొత్తతరం హీరోలతోపాటు, ఓ స్టార్ కథానాయకుడితోనూ సినిమాల్ని ప్రారంభిస్తున్నా" అన్నారు ధీరజ్ మొగిలినేని. ఒకవైపు నిర్మాతగా సినిమాలు చేస్తూనే, మరోవైపు పంపిణీదారుడిగానూ పలు సినిమాల్లో భాగమవుతున్నారాయన. ఈ నెల 14న తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకొస్తున్న 'కపుల్ ఫ్రెండ్లీ' సినిమాని తెలుగు రాష్ట్రాల్లో ఆయనే పంపిణీ చేస్తున్నారు. సంతోశ్ శోభన్, మానస వారణాసి జంటగా నటించిన చిత్రమిది. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహించారు. యు.వి క్రియేషన్స్ సమర్పణలో యు.వి.కాన్సెప్ట్స్ సంస్థ నిర్మిస్తోంది. చిత్రం విడుదలను పురస్కరించుకుని బుధవారం హైదరాబాద్లో విలేకర్లతో ముచ్చటించారు ధీరజ్ మొగిలినేని.

❑ 'చెన్నై నేపథ్యంలో సాగే సహజమైన ప్రేమకథ ఇది. మన దగ్గర ప్రేమకథలు బాగా తగ్గిపోయాయి. అప్పుడప్పుడూ వస్తున్నా, హృదయాన్ని తాకే సినిమాలు రావడం లేదు. ఎలాంటి సినిమాటిక్ లిబర్టీని తీసుకోకుండా ఎంతో వాస్తవికతతో ఈ చిత్రాన్ని రూపొందించారు. ఈ సినిమాతోనే నైజాంలోనూ పంపిణీదారుడిగా ప్రయాణం ప్రారంభిస్తున్నా. 'పేరు, ట్రైలర్ని చూసి ఇది సహజీవనం నేపథ్యంలో సాగే కథేమో అనుకుంటారంతా. 15 నిమిషాలకు మించి ఉండదు ఆ ప్రస్తావన. ఇదొక కుటుంబ కథలా ఉంటుంది".

❑ "నేను పంపిణీదారుడిగా మారాక సినిమాలో ఎలాంటి మార్పునూ చెప్పలేదు. అయితే ఈ కథకు నేనే నిర్మాతని అయ్యుంటే మాత్రం, భావోద్వేగాల పరంగా ఇంకో పది శాతం గాఢతని పెంచేవాణ్ని. ఇప్పుడు అశ్విన్ ఈ సినిమాతో ఏడిపించడు కానీ, హృదయాన్ని తాకేలా కథని చెప్పాడు. మా సంస్థలో ప్రస్తుతం 'చెన్నై లవ్స్టోరి' సినిమా జరుగుతోంది. తదుపరి సంగీత్ శోభన్, అనస్వర జంటగా ఓ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. దీంతోపాటు వేసవిలో చిన్నారుల నేపథ్యంలో సాగే ఓ చిత్రాన్ని తీసుకొస్తున్నాం. ప్రస్తుతం కొంతమంది స్టార్ హీరోలతోనూ చర్చలు జరుగుతున్నాయి. అందులో ఈ ఏడాదే ఓ సినిమాని మొదలుపెడతాం".

డాక్టర్ శ్రీలీల ఎంబీబీఎస్

యాక్టర్ శ్రీలీల డాక్టర్ అయ్యారు. ఓ పక్క నటిస్తూనే వైద్య విద్య అభ్యసిస్తున్న ఆమె ఇటీవల ముంబయిలో జరిగిన విశ్వవిద్యాలయం స్నాతకోత్సవంలో పట్టా అందుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల వేదికగా వైరల్గా మారాయి. ఈ నేపథ్యంలో డాక్టర్ శ్రీలీల అంటూ సోషల్మీడియాలో శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. "అమ్మమ్మ పడిపోయినప్పుడు నాకు ఏం చేయాలో అర్థం కాలేదు. అన్నయ్య వచ్చి చిన్నపాటి వైద్యం చేశాక ఆమె మామూలు స్థితిలోకి వచ్చింది. దాంతో వైద్యురాలిని కావాలని అప్పుడే నిర్ణయించుకున్నాన"ని శ్రీలీల ఓ సందర్భంలో వెల్లడించిన సంగతి తెలిసిందే. కన్నడలోని 'కిస్' చిత్రంలో వెండితెరపై హీరోయిన్గా పరిచయమైన శ్రీలీల యువ కథానాయకులతోపాటు అగ్ర తారల సరసన అవకాశాలను అందిపుచ్చుకుంటోంది. ఇటీవల 'పరాశక్తి'లో కనిపించిన ఆమె.. పవన్ కల్యాణ్ సరసన 'ఉస్తాద్ భగత్ సింగ్'లో కనిపించనున్నారు.



కథ ఎలా జరిగిందంటే?



రవివర్మ, విజయ్

విజయ్, శీతల్ భట్ జంటగా నటించిన చిత్రం 'అలా జరిగిన కథ'. ప్రభు సూర్య దర్శకత్వం వహించారు. రేణుక శ్రీనివాస్ నిర్మాత. త్వరలోనే రానుందీ చిత్రం. ఈ సందర్భంగా చిత్ర బృందం బుధవారం హైదరాబాద్లో విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ "ఓ కొత్త రకమైన కథని చెప్పబోతున్నామ"న్నారు. నిర్మాత మాట్లాడుతూ "కొత్త ప్రతిభని, కొత్త కథని వెలుగులోకి తీసుకొచ్చే ఓ మంచి చిత్రమిది" అన్నారు. థ్రిల్లర్ కథల్లోనే నటులు కొత్తగా కనిపించేందుకు ఆస్కారం ఉంటుంది, నటులందరినీ కొత్తగా ఆవిష్కరించే చిత్రమిదన్నారు రవివర్మ. ఈ కార్యక్రమంలో చిత్రం శ్రీను, జబర్దస్త్ రాజమౌళి, బిగ్బాస్ ఫేమ్ జ్యోతి, సంగీత దర్శకుడు మహావీర్, ఛాయాగ్రాహకుడు గోలంధర్ తదితరులు పాల్గొన్నారు.

నాతో పెట్టుకోవద్దని చెప్పాను కదా!



అనిల్ కపూర్

నాతో గొడవ పెట్టుకోవద్దని ముందే హెచ్చరించాను కదా! అంటూ ప్రత్యర్థుల ఆటను రక్తికట్టించడానికి రంగంలోకి దిగారు అనిల్ కపూర్. ఇదంతా ఆయన నటిస్తున్న 'సుబేదార్' సినిమా గురించే. సురేశ్ త్రివేణి దర్శకత్వం వహిస్తున్నారు. బుధవారం ఈ సినిమా టీజర్ను పంచుకుంటూ.. ఇన్స్టా వేదికగా విడుదల తేదీని ప్రకటించింది ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్. "సుబేదార్ వచ్చేస్తున్నారు.. మార్చి 5న సిద్ధంగా ఉండండి" అనే వ్యాఖ్యను జోడించింది. ఇందులో సుబేదార్ అర్జున్ మౌర్య అనే మాజీ సైనికుడిగా కనిపించనున్నారు అనిల్ కపూర్. దేశం కోసం పోరాడిన ఆయన.. ఇప్పుడు తన కుటుంబాన్ని రక్షించుకోవడం కోసం శత్రువులను ఎలా ఎదిరించాడనే కథ ఆధారంగా దీన్ని తీర్చిదిద్దారు. ఈ యాక్షన్ డ్రామాలో రాధికా మదన్, సౌరభ్ శుక్లా తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

3 ఇడియట్స్ సీక్వెల్!



రాజ్ కుమార్ హిరాణీ

విద్యా వ్యవస్థ పట్ల ఆలోచనలు రేకెత్తిస్తూనే.. ఇంజినీరింగ్ కాలేజీలో ముగ్గురు స్నేహితులు చేసిన అల్లరి, పంచిన భావోద్వేగాలతో రూపొందిన చిత్రమే '3 ఇడియట్స్'. 2009లో సెటైరికల్ కామెడీ డ్రామాగా ఈ సినిమాని రాజ్ కుమార్ హిరాణి తెరకెక్కించారు. బాలీవుడ్ కథానాయకులు ఆమిర్ ఖాన్, ఆర్.మాధవన్, శర్మన్ జోషి ప్రధాన పాత్రల్లో నటించారు. యువతలో విశేష ఆదరణ సొంతం చేసుకున్న ఈ సినిమా విమర్శకుల ప్రశంసలతోపాటు బాక్సాఫీసు వద్ద భారీ వసూళ్లని సాధించింది. తాజాగా ఈ సినిమా సీక్వెల్పై దర్శకుడు ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. "ప్రస్తుతం నేను 'మున్నాభాయ్' స్క్రిప్ట్తో పాటు '3 ఇడియట్స్' సీక్వెల్పై కూడా పని చేస్తున్నాను. మున్నాభాయ్ని భారీ స్థాయిలో చేయాలనుకుంటున్నా. కానీ, ఇప్పటికీ నాకు ఆ స్క్రిప్ట్ కోసం సరైన ముగింపు దొరకలేదు. 3 ఇడియట్స్ సీక్వెల్ కోసం ఈ మధ్యనే ఓ కొత్త ఆలోచన వచ్చింది. అది తెరపైకి ఎలా వెళుతుందో తెలియదు. ఎందుకంటే.. ఇప్పటికీ మేము దానిపై పూర్తి స్థాయిలో స్క్రిప్ట్ పనులు మొదలుపెట్టలేదు కానీ, చేస్తాము" అని వెల్లడించినట్లు బాలీవుడ్ వర్గాలు తెలిపాయి.

తండ్రి పైనే కేసు వేశాడా?



సాయి సింహాద్రి, మీరారాజ్

"ప్రతి శుక్రవారం పదుల సంఖ్యలో సినిమాలు వస్తున్నాయి. బలమైన కంటెంట్ ఉన్న చిత్రాలు విజయవంతమైతే, చాలా మంది కొత్త ప్రతిభావంతులు తెలుగు చిత్ర పరిశ్రమకు వస్తార"న్నారు రచయిత, నిర్మాత కోన వెంకట్. ఆయన ముఖ్య అతిథిగా 'సన్ ఆఫ్' ట్రైలర్ ఆవిష్కరణ వేడుక ఇటీవల హైదరాబాద్లో జరిగింది. సాయి సింహాద్రి కథానాయకుడిగా నటిస్తూ, స్వయంగా నిర్మించిన చిత్రమిది. మీరారాజ్ కథానాయిక. వినోద్ కుమార్ ముఖ్యభూమిక పోషించారు. బత్తుల సతీశ్ తెరకెక్కించారు. ఈ చిత్రం ఈ నెల 27న రానుంది. కన్నతండ్రిపైనే కేసు వేసి న్యాయస్థానం మెట్లెక్కిన ఓ కొడుకు కథతో ఈ చిత్రం రూపొందినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. వేడుకని ఉద్దేశించి కోన వెంకట్ మాట్లాడుతూ "సినిమాలో నటులు, సాంకేతిక బృందాన్ని చూశాక చిత్రంపై ఓ మంచి అభిప్రాయం ఏర్పడుతోంది. ఈ చిత్రం పెద్ద విజయం సాధించాలని కోరుకుంటున్నా" అన్నారు. సాయిసింహాద్రి మాట్లాడుతూ "కుటుంబం, స్నేహితులతో కలిసి చూడాల్సిన తండ్రీకొడుకుల కథ ఇది" అన్నారు. సాయి సింహాద్రి కథానాయకుడిగా, నిర్మాతగా పడిన కష్టానికి తగ్గ ఫలితం రావాలన్నారు వేడుకకు హాజరైన అతిథులు, సినీ ప్రముఖులు వి.ఎన్.ఆదిత్య, సముద్ర, రామ సత్యనారాయణ, శోభారాణి, లక్ష్మీభూపాల, రఘు కుంచె. ఈ కార్యక్రమంలో గీత రచయిత భాస్కరభట్ల, సంగీత దర్శకుడు రిషితోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

జనరల్ నాలెడ్జ్

మాదిరి ప్రశ్నలు



* 'ల్యాండ్ ఆఫ్ బ్లాక్ గోల్డ్'గా పేరు గాంచిన దేశం?
జ: కువైట్ (భారీ పెట్రోలియం నిల్వలు, అధిక ముడి చమురు ఉత్పత్తి, శక్తిమంతమైన చమురు ఆధారిత ఆర్థిక వ్యవస్థకు ప్రసిద్ధి చెందడంతో కువైట్‌ను 'ల్యాండ్ ఆఫ్ బ్లాక్ గోల్డ్'గా పిలుస్తారు.)

* 'హెర్రింగ్ పాండ్' అని ఏ మహా సముద్రాన్ని పిలుస్తారు?
జ: అట్లాంటిక్ మహాసముద్రం (అట్లాంటిక్ హెర్రింగ్ అనే ఒక రకమైన చేపలు (శాస్త్రీయ నామం క్లూపియా హారెంగస్) ఈ మహాసముద్రంలో అత్యధిక సంఖ్యలో నివసిస్తుండటంతో దీనికి 'హెర్రింగ్ పాండ్' అనే పేరొచ్చింది.)


* 'ల్యాండ్ విత్ నో రివర్స్ (నదులు లేని భూమి)' అని ఏ దేశాన్ని పిలుస్తారు?
జ: సౌదీ అరేబియా (ఈ దేశంలో శాశ్వత నదులు/సహజ సరస్సులు లేనందువల్ల దీనిని 'నదులు లేని భూమి' అని పిలుస్తారు. సౌదీ చాలా వేడిగా, పొడిగా ఉండే వాతావరణంతో ఉంటుంది. చాలా తక్కువ వర్షపాతం ఉంటుంది.)

* 'మినీ పంజాబ్'గా ఏ దేశాన్ని పిలుస్తారు?
జ: కెనడా (ఈ దేశంలో పంజాబీ వలసదారులు అధిక సంఖ్యలో ఉండటంతో దీనికా పేరు వచ్చింది. కెనడియన్ ఇళ్లలో అత్యధికంగా మాట్లాడే భాషల్లో పంజాబీ నాలుగోది. కెనడియన్ పార్లమెంటులో ఇంగ్లిష్, ఫ్రెంచ్ తర్వాత పంజాబీ మూడో భాషగా ఉంది.)

మరింత సమాచారం

సీనియర్ ఇంటర్ తెలుగు

శాంతి కాంక్ష



ఫైనల్ పరీక్షలు 2026
ముఖ్యమైన ప్రశ్నలు-జవాబులు

3 మార్కులు

1. నలగామరాజును భట్టు ఏమని స్తుతించాడు?

జ: మలిదేవరాజు.. భట్టును రాయబారిగా నలగామ రాజు వద్దకు పంపాడు. రాయబారిగా వచ్చిన భట్టు.. నలగామరాజును ఇలా స్తుతించాడు.

భట్టు చేసిన స్తుతి: "ఓ రాజా! నీవు రాజాధిరాజువు. ప్రకాశించే కీర్తి గలవాడవు, రాజులనే వేశ్యలకు విటుడవు. ప్రాభవమును ప్రకటించే వాడవు. నీవు 'గండర గండ' అనే బిరుదు గలవాడవు. దానాలు చేయడంలో గొప్ప నేర్పరివి. నీ ధైర్యం గుణంతో మేరు పర్వతాన్ని జయించినవాడవు. నీవు శూరత్వం, విక్రయం అనే కళలతో నిండిన, నిండు చంద్రుడవు. రాజా! నీవు సూర్యుడితో సమానమైన తేజస్సు గలవాడవు. ప్రౌఢ గుణాల సమృద్ధి గలవాడవు. అభిమానంలో, దుర్యోధనుడి లాంటివాడివి, మైలమ్మ దేవికి పుత్రుడవు. అనుగురాజుకు, నీవు కుమారుడివి. చక్కని శరీరం గలవాడవు. నీవు మన్మథుడి లాంటి వీరుడైన రాజువు. దేవేంద్రుడి లాంటి వైభవం గలవాడివి". అని పైవిధంగా భట్టు.. నలగామరాజును స్తుతించాడు.

2. జన్మఫలంగా భట్టు ఏమని చెప్పాడు?

జ: **జన్మఫలం:** 'మనస్సులో పుట్టిన మంచి తలపులను, అంటే ఆలోచనలను మనం ఆచరించాలి. అంటే వాటిని చేసి చూపాలి. అలాంటి మంచి ఆలోచనలు ఆచరించడానికి శక్యం కాకపోతే, అలాంటి వారి మానవ జన్మకు ఫలితమే ఉండదు. మానవుడు తన మనస్సులో పుట్టిన మంచి తలపులను వెంటనే ఆచరించాలి. అలా ఆచరించడానికి శక్యం కాకపోతే అలాంటి వ్యక్తి జన్మకు, ఫలితం ఏమీ ఉండదు. మనస్సులో పుట్టిన మంచి ఆలోచనలను, ఆచరణలోకి తీసుకురాలేని వ్యక్తి, బతకడం కంటే చావడం మంచిది. పొందలేక పొందలేక ఎలాగో పొందిన వారి మానవ జన్మ దుష్యం అవుతుంది'. అని భట్టు చెప్పాడు.

సందర్భాలు (3 మార్కులు)

1. చెప్పంగనలవియే, శివునకునైన.

జ: ఈ వాక్యం, శ్రీనాథుడు రచించిన 'పల్నాటి వీర చరిత్ర' నుంచి గ్రహించిన, శాంతి కాంక్ష అనే పద్యభాగంలోనిది.

సందర్భం: మలిదేవరాజు, భట్టును నలగామరాజు వద్దకు రాయబారిగా పంపాడు. "మీలో మీరు శత్రుత్వాలను పెంచుకుని పోరాడితే, చూసేవారికి చులకన అవుతుంది. మీ రాజ్యం, ఇతర రాజులకు వశం అవుతుంది. మీ స్వతంత్రత పోతుంది. స్వతంత్రం లేని జనాలకు వచ్చే కష్టాలు శివుడికి కూడా చెప్పడం శక్యం కాదు." అంటూ స్వాతంత్ర్య హీనుల కష్టాలను భట్టు నలగామరాజునకు చెప్పిన సందర్భంలోనిది.

అర్థం: ఈశ్వరుడంతటివాడికి కూడా. చెప్పడానికి శక్యం కాదని భావం.

ఒక మార్కు

1. శాంతి కాంక్ష పాఠ్యభాగం రచయిత ఎవరు?

జ: శాంతి కాంక్ష పాఠ్యభాగం రచయిత శ్రీనాథుడు

2. శ్రీనాథుడికి కనకాభిషేకం చేసినదెవరు?

జ: ప్రౌఢదేవరాయలు, శ్రీనాథుడికి కనకాభిషేకం చేశాడు.

మరికొన్ని ప్రశ్నలు-జవాబులు



రచయిత: మండ్ల మహేశ్వర నాయుడు

జనరల్ స్టడీస్ రసాయన శాస్త్రం

తుప్పును తరిమేసి.. ఇత్తడిని పుత్తడి చేసి!

ఇత్తడి పుత్తడిగా మారి మురిపిస్తుంది. సాధారణ రాగి వస్తువుకు వెండి మెరుపు వస్తుంది. సైకిల్ హ్యాండిల్స్, రిమ్ములు తళతళలాడుతుంటాయి. అవి సహజ పరిణామాలు కావు. కొన్ని ద్రవాల్లో జరిగిన విద్యుత్తు ప్రవాహంతో ఏర్పడిన రసాయన ఫలితాలు. సాధారణంగా రాగి తీగలు, ఇనుప కడ్డీల నుంచే విద్యుత్తు ప్రవహిస్తుందని భావిస్తారు. కానీ కొన్ని ద్రవాలు కూడా విద్యుత్తుకు రహదారులుగా ఉపయోగపడతాయి. వాటి నుంచి విద్యుత్తు ప్రవహించినప్పుడు అది వాటి రూపాలను మార్చేస్తుంది. నీటిలోని హైడ్రోజన్, ఆక్సిజన్ వాయువులను విడదీయాలంటే కూడా విద్యుత్తుకు ఉన్న రసాయన శక్తి అవసరమే. ప్రకృతిలోని అణువులను విడదీస్తూ, కొత్త రూపాలను సృష్టించడానికి సాయపడే విద్యుత్తు రసాయనిక ప్రభావం వెనుక ఉన్న శాస్త్రీయ రహస్యాన్ని పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. విద్యుత్తు ప్రవాహం, దాని స్వభావం, సంబంధిత రసాయన ఫలితాలపై అవగాహన పెంచుకోవాలి.



విద్యుత్తు ప్రవాహం-రసాయన ఫలితాలు

ఒక ద్రావణం ద్వారా విద్యుత్తు ప్రవహించినప్పుడు దానిలో రసాయన మార్పులు జరిగితే వాటిని 'విద్యుత్తు ప్రవాహం రసాయన ఫలితాలు' అంటారు. ఎలక్ట్రోడ్‌లపై వాయువు బుడగలు, రంగు మార్పు, లోహ నిక్షేపం (ఎలక్ట్రోప్లేటింగ్) లాంటివి ముఖ్యమైన రసాయన ఫలితాలు.

ఎలక్ట్రోలైట్

నీటిలో కరిగి లేదా కరిగిన స్థితిలో విద్యుత్తు ప్రవాహాన్ని అనుమతించే పదార్థాన్ని 'ఎలక్ట్రోలైట్' అంటారు. **ఉదా:** ఉప్పు ద్రావణం, నిమ్మరసం, కాపర్ సల్ఫేట్ ద్రావణం.

ఎల్ఈడీ

విద్యుత్తు వలయంలో తక్కువ విద్యుత్తు ప్రవాహాలకే ఎల్ఈడీ (లైట్ ఎమిటింగ్ డయోడ్) వెలుగుతుంది. దీనిని విద్యుత్తు ఉపకరణాలు పని చేస్తున్నాయా లేదా? అని తెలుసుకోవడానికి టెస్టర్‌గా ఉపయోగిస్తారు.



టెస్టర్: ఒక పదార్థం విద్యుత్తును ప్రవహింపజేస్తుందో లేదో తెలుసుకోవడానికి 'టెస్టర్' అనే పరికరాన్ని ఉపయోగిస్తారు.



ఎలక్ట్రోడ్లు: ద్రావణంలో ముంచిన లోహకడ్డీలను 'ఎలక్ట్రోడ్లు' అంటారు. 1) **ఆనోడ్:** ఎలక్ట్రోలైట్‌లో ధనధ్రువానికి అనుసంధానించిన ఎలక్ట్రోడ్. 2) **క్యాథోడ్:** ఎలక్ట్రోలైట్‌లో రుణధ్రువానికి అనుసంధానించిన ఎలక్ట్రోడ్‌నే 'క్యాథోడ్' అంటారు.



అధమ విద్యుత్తు వాహకాలు: విద్యుత్తు ప్రవాహాన్ని బాగా ప్రసారం చేయని పదార్థాలను 'అధమ విద్యుత్తు వాహకాలు' అంటారు. **ఉదా:** రబ్బరు, ప్లాస్టిక్, గాజు, చెక్క, థర్మాకోల్






ఉత్తమ విద్యుత్తు వాహకాలు: విద్యుత్తు ప్రవాహాన్ని బాగా ప్రసారం చేసే పదార్థాలను 'ఉత్తమ విద్యుత్తు వాహకాలు' అంటారు. **ఉదా:** వెండి, రాగి, అల్యూమినియం, ఇనుము.

విద్యుత్తు రసాయన ఫలితం

1800లో బ్రిటిష్ రసాయన శాస్త్రవేత్త విలియం నికల్సన్ ఎలక్ట్రోడ్లను నీటిలో ఉంచి విద్యుత్తును పంపితే ఆక్సిజన్, హైడ్రోజన్ వాయువులు ఉత్పత్తి అవుతాయని నిరూపించారు. బ్యాటరీ ధన ధ్రువానికి కలిపిన ఎలక్ట్రోడ్ వద్ద ఆక్సిజన్ బుడగలు, మరొక ధ్రువం వద్ద హైడ్రోజన్ బుడగలు ఏర్పడతాయి.



విలియం నికల్సన్

ఫారడే విద్యుత్తు విశ్లేషణ నియమాలు: విద్యుత్తు విశ్లేషణ ప్రక్రియపై విస్తృతంగా పరిశోధనలు జరిపిన తర్వాత ఫారడే 1833లో విద్యుత్తు విశ్లేష్యం ద్వారా ప్రవహించిన విద్యుత్తు రాశికి, ఎలక్ట్రోడ్‌ల వద్ద చర్య జరిపిన పదార్థ భారానికి ఉన్న సంబంధాన్ని రెండు నియమాల రూపంలో చెప్పాడు. వీటిని 'ఫారడే విద్యుత్తు విశ్లేషణ నియమాలు' అంటారు.

ఫారడే మొదటి నియమం: విద్యుత్తు విశ్లేషణ ప్రక్రియలో ఒక ఎలక్ట్రోడ్ వద్ద నిక్షిప్తమైన లేదా విడుదలైన లేదా కరిగిపోయిన పదార్థ భారం విద్యుత్తు విశ్లేష్యం ద్వారా ప్రవహించిన విద్యుత్తు రాశికి అనులోమానుపాతంలో ఉంటుంది.

ఫారడే రెండో నియమం: ఒకే పరిమాణంలో విద్యుత్తును వేర్వేరు విద్యుత్తు విశ్లేష్యాల ద్వారా ప్రవహింపజేయగా ఎలక్ట్రోడ్‌ల వద్ద నిక్షిప్తమైన లేదా కరిగిపోయిన పదార్థాల ద్రవ్యరాశులు వాటి తుల్యభారాల నిష్పత్తిలో ఉంటాయి.

ఉత్తమ వాహకాలు, బలహీన వాహకాలు

టెస్టర్ రెండు చివరల మధ్య ఉన్న ద్రవం నుంచి విద్యుత్తును తన ద్వారా పంపిస్తే వలయం పూర్తవుతుంది. విద్యుత్తు ఉష్ణ ఫలితం వల్ల ఫిలమెంట్ వేడెక్కి ఎక్కువ ఉష్ణోగ్రతకు చేరుకోవడంతో బల్బు వెలుగుతుంది. ద్రవాల్లో ఎక్కువగా ఆమ్ల, క్షార, లవణ ద్రావణాలు తమ ద్వారా విద్యుత్తును ప్రవాహింప చేస్తాయి. బలమైన ఆమాలు, క్షారాలను బలమైన విద్యుత్తు విశ్లేష్యకాలు/ఉత్తమ వాహకాలుగా పరిగణిస్తారు. ద్రవంలోని వలయం ద్వారా ప్రవాహించే విద్యుత్తు ప్రవాహం బలహీనంగా ఉంటే ఫిలమెంట్ వేడి ఎక్కకపోవడం వల్ల బల్బు వెలగదు. ఫలితంగా టెస్టర్ వలయం పూర్తయినప్పటికీ బలహీనంగా ఉన్న విద్యుత్తు ప్రవాహం బల్బు వెలగడానికి సరిపోదు. బలహీన విద్యుత్తు ప్రవాహాలను గుర్తించే ఇంకొక టెస్టర్ దిక్సూచి. విద్యుత్తు ప్రవాహం బలహీనంగా ఉన్నప్పటికీ అయస్కాంత సూచిలో కదలికను చూడొచ్చు. విద్యుత్తు అయస్కాంత ఫలితాన్ని ఉపయోగించి వాహకతను తెలుసుకోవచ్చు.

విద్యుత్తు రసాయన చర్యలు - విద్యుత్తు విశ్లేషణ: ఒక ఎలక్ట్రోలైట్ ద్వారా గలన స్థితిలో లేదా జల ద్రావణంలో విద్యుత్తును ప్రవహింప చేస్తే, విద్యుద్వారాల వద్ద రసాయన చర్యలు జరుగుతాయి. ఇదే విధంగా కేటయాన్‌లు, క్యాథోడ్ వద్దకు చేరినప్పుడు అవి ఎలక్ట్రాన్లను గ్రహిస్తాయి. అంటే క్షయకరణం చెందుతాయి. విద్యుత్తును ప్రసారం చేసినప్పుడు విద్యుద్విశ్లేష్యంలో ఆనోడ్ వద్ద ఆక్సీకరణం, క్యాథోడ్ వద్ద క్షయకరణం ఏక కాలంలో జరుగుతాయి. ఒక ఎలక్ట్రోలైట్ ద్వారా గలన స్థితిలో లేదా జల ద్రావణంలో విద్యుత్తును ప్రసారం చేయడం ద్వారా దానిని వియోగం చెందించడాన్ని 'విద్యుత్తు విశ్లేషణ' అంటారు.

విద్యుత్తు విశ్లేషణ అనువర్తనాలు: లోహ సంగ్రహణం, అలోహాల తయారీ, లోహాలను శుద్ధి చేయడం, సమ్మేళనాల తయారీ, ఎలక్ట్రోప్లేటింగ్ లోనూ విద్యుత్తు విశ్లేషణ ప్రక్రియను వాడతారు.

ఎలక్ట్రోప్లేటింగ్: ఒక లోహంతో మరొక లోహంపై పూతగా పూయడాన్ని 'ఎలక్ట్రోప్లేటింగ్' అంటారు. ఇదొక విద్యుత్తు ప్రవాహం వల్ల ఏర్పడే రసాయన ఫలితానికి ఉదాహరణ. తుప్పు పట్టే అవకాశం ఉన్న లోహాలపై తుప్పు పట్టని లోహాలతో పూతపూస్తారు. ఎలక్ట్రోప్లేటింగ్‌ను విద్యుత్తు విశ్లేషణ పద్ధతి ద్వారా చేస్తారు. ఈ ప్రక్రియలో పూత వేయాల్సిన వస్తువును క్యాథోడ్ (రుణధ్రువం)గా, పూతగా ఉపయోగించిన లోహం ఆనోడ్‌గా తీసుకుంటారు.



✦ ఒక గ్రామ్ గోల్డ్ ఆభరణాలను ఎలక్ట్రోప్లేటింగ్ పద్ధతిలో తయారుచేస్తారు. ✦ ఇత్తడి, వెండి లోహాలపై బంగారం (పుత్తడి) పూత పూయడాన్ని 'గోల్డ్ కవరింగ్' అంటారు. ✦ వాహనాల విడిభాగాలు, వంతెనల నిర్మాణంలో ఉపయోగించే ఇనుముకు జింక్‌తో పూత పూసి తుప్పును నివారిస్తారు. ✦ తినుబండారాలను నిల్వచేసే ఇనుప డబ్బాలకు తగరం అనే లోహంతో పూత పూస్తారు. ✦ సైకిల్ హ్యాండిల్, చక్రాల రిమ్ములు మెరవడానికి వాటిపై క్రోమియం పూత పూస్తారు.



రచయిత: ఎస్.రామకృష్ణ

ఫ్రెంచ్ విప్లవం

'స్వేచ్ఛగా పుట్టిన మానవుడు సంకెళ్లతో బందీ!'

ప్రపంచ చరిత్రలో ఫ్రెంచ్ విప్లవం మేలిమలుపు లాంటిది. ఐరోపా సమాజంలో రాచరికాన్ని అంతం చేసి ప్రజాస్వామ్యాన్ని ఉనికిలోకి తెచ్చింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాత్రం అనే ఉదారవాద భావాలను, ఆధునిక జాతీయవాదాన్ని పరిచయం చేసింది. ప్రపంచ వ్యాప్తంగా వలసవాదానికి వ్యతిరేకంగా పోరాడేవారికి స్ఫూర్తినిచ్చింది. 1789-1799 మధ్యలో భూస్వామ్య వ్యవస్థ రద్దు, మానవ హక్కుల ప్రకటన, 16వ లూయీ ఉరితీత, భీతావహ పాలన, నెపోలియన్ అధికారంలోకి రావడం తదితర ప్రధాన పరిణామాలతో సాగిన ఫ్రెంచ్ విప్లవ క్రమంపై పోటీ పరీక్షార్థులు అవగాహన పెంచుకోవాలి. ఈ విప్లవాన్ని ప్రభావితం చేసిన వ్యక్తులు, నినాదాలు, గ్రంథాలు, రాజకీయ సంకేతాలు, ప్రసిద్ధ ప్రకటనల గురించి తెలుసుకోవాలి.

జనరల్ స్టడీస్ - చరిత్ర

1. ఫ్రెంచ్ విప్లవం కింది ఏ భావాలను ప్రచారం చేసింది?
   1) స్వేచ్ఛ 2) సమానత్వం
   3) సోదర భావం 4) పైవన్నీ

2. ఎస్టేట్ జనరల్ ఆఖరి సమావేశం ఎప్పుడు జరిగింది?



   1) 1614
   2) 1650
   3) 1789
   4) 1791

3. 'నేనే రాజ్యం' అని ప్రకటించిన ఫ్రాన్స్ చక్రవర్తి?
   1) 4వ హెన్రీ 2) 14వ లూయీ
   3) 15వ లూయీ 4) 16వ లూయీ

4. 16వ లూయీ భార్య ఏ దేశ యువరాణి?
   1) ఫ్రాన్స్ 2) ప్రష్యా 3) రష్యా 4) ఆస్ట్రియా

5. కింది వాటిలో సరికాని దాన్ని గుర్తించండి.
   1) 16వ లూయీ పరిపాలనా కాలంలో ఫ్రెంచ్ విప్లవం జరిగింది.
   2) 'నా తర్వాత ప్రళయం వస్తుంది' అని 15వ లూయీ ప్రకటించాడు.
   3) మేరి అంతూనెట్‌కు జాలి, కరుణ, పేదలంటే ప్రేమ ఎక్కువ.
   4. ఫ్రాన్స్‌లో అధికారం చెలాయించిన రాజవంశం బూర్బన్ వంశం.

6. అమెరికా స్వాతంత్ర్య పోరాటానికి సహకరించిన దేశం?
   1) ఇంగ్లండ్ 2) రష్యా 3) ఫ్రాన్స్ 4) భారత్


7. టైథ్ అంటే?
   1) మతపరమైన పన్ను
   2) ప్రభువర్గం చెల్లించే పన్ను
   3) ప్రభుత్వానికి చెల్లించే పన్ను 4) పైవన్నీ

8. 'స్పిరిట్ ఆఫ్ లాస్' అనే గ్రంథ రచయిత?
   1) ఓల్టేర్ 2) మాంటెస్క్యూ
   3) రూసో 4) జాన్‌లాక్

9. ఓల్టేర్‌కు సంబంధించి కింది వాటిలో సరైంది?
   1) ఈయన క్రైస్తవ మతాన్ని వ్యతిరేకించాడు.
   2) ప్రాణభయంతో ఎక్కువగా విదేశాల్లో గడిపాడు.
   3) జైలులో సదుపాయాలు లేవని అసంతృప్తి వ్యక్తపరిచాడు.
   4) పైవన్నీ

10. 'స్వేచ్ఛగా పుట్టిన మానవుడు సంకెళ్లతో బందీగా ఉన్నాడు' అనే వాక్యం ఏ గ్రంథంలో కనిపిస్తుంది?
    1) సోషల్ కాంట్రాక్ట్ 2) స్పిరిట్ ఆఫ్ లాస్
    3) ది ప్రిన్స్ 4) యానిమల్ ఫాం

11. 'ఫ్రెంచ్ విప్లవ పితామహుడు' అని ఎవరిని పిలుస్తారు?
    1) రూసో
    2) జాన్‌లాక్
    3) మాంటెస్క్యూ
    4) లూయీ ఫిలిప్



రూసో

12. 'ఆదాయ, వ్యయాల నివేదిక'ను ప్రచురించినవారు?
    1) టర్గట్ 2) కలోని 3) నెక్కర్ 4) జాన్ లాక్

13. ఫ్రాన్స్‌లో 1789, మే 5 ప్రాముఖ్యత ఏమిటి?
    1) ఇది ఫ్రాన్స్ జాతీయ దినోత్సవం.
    2) ప్యారిస్ మహిళల ఆకలి యాత్ర జరిగింది.
    3) ఎస్టేట్ జనరల్ సమావేశం జరిగింది.
    4) 16వ లూయీ సింహాసనాన్ని త్యజించిన రోజు.

14. కింది సంఘటనలను వరుసలో అమర్చండి.
    ఎ) బాస్టిల్ కోట ముట్టడి
    బి) ప్యారిస్ మహిళల ఆకలి యాత్ర
    సి) డైరెక్టరీ ప్రభుత్వం
    డి) ఎస్టేట్ జనరల్ సమావేశం
    1) ఎ, బి, సి, డి 2) డి, ఎ, బి, సి
    3) ఎ, సి, డి, బి 4) డి, ఎ, సి, బి

15. ఫ్రాన్స్‌లో భూస్వామ్య వ్యవస్థ ఎప్పుడు రద్దయింది?
    1) 1789, ఆగస్టు 4 2) 1780, ఆగస్టు 26
    3) 1789, జనవరి 4 4) 1789, జులై 14

16. ఫ్రాన్స్‌లో మానవ హక్కుల ప్రకటనను రూపొందించింది?
    1) థామస్ జెఫర్ సన్
    2) జాన్ మారా
    3) లఫాయత్ 4) రాబిస్పియర్



లఫాయత్

17. ఫ్రాన్స్ మొదటి రాజ్యాంగం ఓటు వేసే అధికారాన్ని ఎవరికి కల్పించింది?
    1) 21 ఏళ్లున్న పురుషులకు
    2) 21 ఏళ్లున్న స్త్రీ, పురుషులందరికీ
    3) 25 ఏళ్లున్న పన్ను చెల్లించే పురుషులందరికీ
    4) 25 ఏళ్లున్న పురుషులకు

18. మార్సెలీ అనే గీతాన్ని మొదటిసారిగా ఎప్పుడు పాడారు?
    1) 1871లో ప్యారిస్ కమ్యూన్ సమయంలో
    2) 16వ లూయీని ఉరి తీసే సమయంలో
    3) ఫ్రాన్స్‌ను గణతంత్ర రాజ్యంగా మార్చినప్పుడు
    4) 1792లో ఆస్ట్రియాతో యుద్ధం సమయంలో

19. జకోబియన్ క్లబ్ నాయకుడు ఎవరు?
    1) రాబిస్పియర్ 2) డాంటన్
    3) జీన్‌పాల్ మారా 4) మిరాబు

20. ఫ్రాన్స్ మానవ హక్కుల ప్రకటనకు స్ఫూర్తి ఇచ్చిన దేశం?
    1) అమెరికా 2) ఇంగ్లండ్
    3) తుర్కియే (టర్కీ) 4) జర్మనీ

21. జాతీయ సభ ఏ సంవత్సరంలో ఏర్పడింది?
    1) 1789, జూన్ 20 2) 1789, ఆగస్టు 26
    3) 1789, జూన్ 10 4) 1789, మే 24

22. జకోబియన్ క్లబ్‌నకు సంబంధించి సరికానిది?
    1) దీనిలో సభ్యత్వం పురుషులకు మాత్రమే.
    2) దీని సభ్యులు పొడవాటి చారల ప్యాంటు ధరిస్తారు.



    3) దీని సభ్యులు సిటోయెన్, సిటోయెన్నీ అని స్త్రీ, పురుషులను సంబోధిస్తారు.
    4) ఈ క్లబ్ ప్రజల మీద ప్రభావాన్ని చూపలేదు.

23. ఫ్రాన్స్‌లో మహిళలకు ఓటుహక్కు ఎప్పుడు లభించింది?
    1) 1946 2) 1947 3) 1948 4) 1949

24. 1797లో నెపోలియన్ ఆస్ట్రియాను ఓడించిన ఫలితంగా జరిగిన సంధి?
    1) కాంపోఫోర్మియా సంధి
    2) విల్లీ - ఫ్రాంకో సంధి
    3) ప్రేగ్ సంధి 4) వర్సయిల్స్ సంధి



కాంపోఫోర్మియా సంధి

25. "నాకు పుస్తకాలు తప్ప మరే స్నేహితుడు లేడు" అనే పలికిన వ్యక్తి?
    1) 16వ లూయీ 2) నెపోలియన్
    3) లూయీ ఫిలిప్ 4) 18వ లూయీ

26. కూప్‌డియట్ అంటే?
    1) కొత్త ప్రభుత్వం ఎన్నిక
    2) ఒక దేశంలో ఆర్థిక అత్యవసర పరిస్థితి
    3) సైనిక చర్య ద్వారా జరిగే కుట్ర 4) పైవన్నీ

27. 1791లో స్త్రీల పౌర హక్కుల ప్రకటనను రచించింది ఎవరు?
    1) థామస్ జెఫర్‌సన్ 2) ఒలింపే-డి-గౌజెస్
    3) మేరి అంతూనెట్ 4) ఇసాబెల్లా-డి-ఎస్టే

28. కింది వాటిలో నెపోలియన్ ఓడిపోయిన యుద్ధం?
    1) నైలు నది యుద్ధం
    2) లీప్‌జిగ్/జాతుల యుద్ధం
    3) వాటర్లూ యుద్ధం 4) పైవన్నీ

29. 'లామి-డు-పీపుల్' అనే పత్రిక స్థాపకుడు ఎవరు?
    1) జీన్‌పాల్ మారా 2) డాంటన్
    3) రాబిస్పియర్ 4) రూసో

30. ఏ దేశం తుమ్మితే యూరప్‌నకు జలుబు చేస్తుందని చరిత్రకారుల అభిప్రాయం?
    1) బ్రిటన్ 2) రష్యా
    3) ఫ్రాన్స్ 4) నెదర్లాండ్స్

31. భీతావహ పాలన జరిగిన సంవత్సరం?
    1) 1793-94 2) 1795-99
    3) 1790-92 4) 1870-75

32. "అసాధ్యం మూర్ఖుల నిఘంటువులో మాత్రమే కనిపిస్తుంది" అని అన్నది?
    1) రాబిస్పియర్
    2) ఒలింపే-డి-గౌజెస్
    3) నెపోలియన్
    4) 10వ చార్లెస్



ఒలింపే-డి-గౌజెస్

33. కింది వారిలో గెలిటిన్ ద్వారా మరణించిన వ్యక్తిని గుర్తించండి.
    1) 16వ లూయీ 2) ఒలింపే-డి-గౌజెస్
    3) నెపోలియన్ 4) రాబిస్పియర్

34. వియన్నా సమావేశం ఏ సంవత్సరంలో జరిగింది?
    1) 1820 2) 1815 3) 1834 4) 1840

35. ఫ్రాన్స్ సమాజంలో మొదటి ఎస్టేట్‌కు చెందినవారు?
    1) మతాధిపతులు 2) కులీన వర్గం
    3) సామాన్య ప్రజలు 4) పైవారందరూ


36. కింది వాటిలో సరైన దాన్ని గుర్తించండి.
    1) లివర్‌లు - ఫ్రాన్స్‌లో ద్రవ్యకొలమానం
    2) టైథ్ - చర్చి విధించే పన్ను అంటే ఉత్పత్తిలో 10వ వంతు
    3) టెయిలే - ప్రభుత్వానికి కట్టే పన్ను 4) పైవన్నీ

37. 'మానర్' అనే పదానికి అర్థం ఏమిటి?
    1) రాజు లేదా కులీన వ్యక్తికి చెందిన కోట
    2) ప్రభువుల భూములు, అంతఃపురం ఉన్న ప్రాంతం
    3) జాతీయ అసెంబ్లీకి మరొక పేరు
    4) ఫ్రాన్స్‌లో విప్లవ సంఘ నాయకులు

38. ఫ్రాన్స్‌లో రాజకీయ సంకేతాలకు సంబంధించి సరైంది ఏది?
    1) విచ్ఛిన్న గొలుసు - స్వేచ్ఛకు సంకేతం
    2) రాజదండం - రాజు శక్తికి చిహ్నం
    3) పాముతోక ఉంగరం - శాశ్వతత్వానికి చిహ్నం
    4) పైవన్నీ

39. ఫ్రాన్స్ జాతీయ జెండాలో (కొకాడ్) రంగులు?
    1) ఆకుపచ్చ, తెలుపు, నీలం
    2) ఎరుపు, తెలుపు, నలుపు
    3) నీలం, తెలుపు, ఎరుపు
    4) ఆకుపచ్చ, ఎరుపు, ఊదా

40. 'మార్సెలీ' గీతాన్ని స్వరపరిచిన వ్యక్తి?
    1) రాబిస్పియర్
    2) రోగెట్ డి ఎల్ ఐల్
    3) డాంటన్
    4) మారా



రోగెట్ డి ఎల్ ఐల్

41. 1789, జూన్ 20న టెన్నిస్ కోర్టులో జాతీయ సభ్యులతో ప్రమాణం చేయించింది ఎవరు?
    1) సాల్విన్ బెయిలీ 2) మిరాబు
    3) డాంటన్ 4) థామస్ జెఫర్ సన్

42. ఫ్రాన్స్‌ను గణతంత్రంగా ప్రకటించిన సంవత్సరం?
    1) 1791 2) 1793 3) 1795 4) 1804

43. పోప్‌తో నెపోలియన్ కంకార్డెట్ ఒప్పందాన్ని ఎప్పుడు చేసుకున్నాడు?
    1) 1801 2) 1805
    3) 1810 4) 1824

44. నెపోలియన్ ఏ ప్రభుత్వాన్ని కూలదోసి కాన్సల్‌గా నియమితుడయ్యాడు?
    1) కన్వెన్షన్ ప్రభుత్వం
    2) కాన్సులేట్ ప్రభుత్వం
    3) డైరెక్టరీ ప్రభుత్వం 4) పైవన్నీ



రచయిత: కాకులూరు వెంకటేశ్వర్లు

సమాధానాలు

1-4; 2-1; 3-2; 4-4; 5-3; 6-3; 7-1; 8-2; 9-4; 10-1; 11-1; 12-3; 13-3; 14-2; 15-1; 16-3; 17-3; 18-4; 19-1; 20-1; 21-3; 22-4; 23-1; 24-1; 25-2; 26-3; 27-2; 28-4; 29-1; 30-3; 31-1; 32-3; 33-3; 34-2; 35-1; 36-4; 37-2; 38-4; 39-3; 40-2; 41-1; 42-2; 43-1; 44-3.

అభివృద్ధి, పర్యావరణ సమస్యలు: సహజ వనరులు - నీరు



నీరు అన్ని రకాల జీవరాశులకు ప్రాణాధారం. ప్రకృతి ప్రసాదించిన ముఖ్యమైన సహజ వనరుల్లో ఇది ఒకటి. పారిశ్రామిక, సామాజిక అభివృద్ధికి ఇదే ప్రధానం. నీటి వనరుల లభ్యత ఉన్న చోటే నాగరికతలు విలసిల్లినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.
అయితే ప్రస్తుత కాలంలో మానవ చర్యల ఫలితంగా జల వనరులు కలుషితమవుతున్నాయి. వేగవంతమైన అభివృద్ధి, జనాభా పెరుగుదల, పారిశ్రామికీకరణ, వ్యవసాయంలో పురుగుమందుల అధిక వినియోగం లాంటివి దీనికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి.
నీటి నాణ్యత క్షీణత, జల వనరుల నిర్వహణకు ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలు మొదలైనవాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

సరైన నీటి నిర్వహణతోనే.. సుస్థిరాభివృద్ధి సాధ్యం!

రకాలు

నీటి వనరులు ప్రధానంగా రెండు రకాలు. అవి
1. భూగర్భ జల వనరులు 2. ఉపరితల జల వనరులు

భూగర్భ జల వనరులు

భూమి లోపల నేల, ఇసుక, రాతిలోని పగుళ్లు, ఖాళీల్లో ఉండే నీటిని భూగర్భ జలం అంటారు. ఇది సహజంగా ఉద్భవించడానికి లేదా మానవ వినియోగానికి ముందు భూగర్భంలోనే నిల్వ ఉంటుంది. ఇది అనేక నదులు, వాగుల్లో నీటి మట్టాలను నిర్వహిస్తుంది. తగినంత పరిమాణంలో ఈ నీటిని నిల్వ చేయగల, ప్రసారం చేయగల భూగర్భ పొరను 'ఆక్విఫర్' (aquifer) అంటారు. గొట్టపు బావులు, బోర్‌వెల్స్ పంపుల ద్వారా ఈ నీటిని బయటకు తీస్తారు.

✦ మన దేశంలో ఇది కీలకమైన జల వనరు. వేగంగా క్షీణిస్తోంది కూడా. ఇవి వ్యవసాయ కార్యకలాపాలు, తాగునీటి సరఫరాకు ప్రాథమిక పునాదిగా పనిచేస్తాయి. ఇవి దాదాపు 62% సాగు అవసరాలను, 85% గ్రామీణ - 50% పట్టణ డిమాండ్‌ను తీరుస్తున్నాయి.

✦ వేగవంతమైన జనాభా పెరుగుదల, అధిక వ్యవసాయం, పారిశ్రామిక విస్తరణ, పట్టణీకరణ లాంటివి భూగర్భ జలాలపై సమష్టిగా ఒత్తిడిని పెంచాయి. దీంతో స్థిరమైన భూగర్భ జల నిర్వహణ పద్ధతులను అవలంబించడం అత్యవసరంగా మారింది.

✦ భారతదేశంలో 43,228 భూగర్భ జల స్థాయి పర్యవేక్షణ కేంద్రాలు, 712 జలశక్తి కేంద్రాలు, 53,264 అటల్ జల్ నీటి నాణ్యత పర్యవేక్షణ కేంద్రాల నెట్‌వర్క్ ఉంది.

నిర్వహణ

భూగర్భ జల నిర్వహణ అనేది సమగ్ర జల వనరుల నిర్వహణ, రక్షణలో భాగం. భూగర్భ జల వనరుల స్థిర, సమతౌల్య వినియోగాన్ని నిర్ధారించడానికి; సమర్థవంతమైన భూగర్భ జల నిర్వహణకు నాలుగు కీలక ప్రాధాన్యతలు అవసరమని యునైటెడ్ నేషన్స్ ఎడ్యుకేషనల్, సైంటిఫిక్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ (యునెస్కో) పేర్కొంది. అవి:

1. సహజంగా తిరిగి పునరుత్పత్తి అయ్యేలా డైనమిక్ నీటి చక్రాన్ని నిర్వహించడం.
2. పర్యావరణ పరిరక్షణను నిర్ధారించడానికి పర్యావరణ, మానవ అవసరాలను సమతౌల్యం చేయడం.
3. కరవుల నుంచి రక్షణ కోసం నిల్వ సామగ్రిని సంరక్షించడం.
4. భూగర్భ జల నాణ్యత, దాని ప్రయోజనానికి సరిపోయేలా నాణ్యత అవసరాలకు అనుగుణంగా వాడకాన్ని సమలేఖనం చేయడం.

☛ ఐక్యరాజ్య సమితి 2030, డిసెంబరు నాటికి 17 సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు సాధించాలని తీర్మానించింది. వాటిలో 6, 11, 12 లక్ష్యాల సాధనకు భూగర్భ జలాల నిర్వహణ ముఖ్యం.

6వ లక్ష్యం - పరిశుభ్రమైన నీరు, పారిశుద్ధ్యం: 2030 నాటికి ప్రజలందరికీ సురక్షితమైన తాగునీటిని అందుబాటు ధరకే పంపిణీ చేయాలి. బహిరంగ మల, మూత్ర విసర్జనను అరికట్టాలి.

11వ లక్ష్యం - నగరాలను నివాసయోగ్యంగా, సురక్షితంగా, సమ్మిళితంగా తయారుచేయడం: 2030 నాటికి అందరికీ సురక్షితమైన ఇళ్లను తక్కువ ధరలకు అందించాలి. నీటి విపత్తుల వల్ల సంభవించే ప్రాణ, ఆస్తి నష్టాన్ని గణనీయంగా తగ్గించాలి. పట్టణాల్లో వాయుకాలుష్యం, ఘనవ్యర్థాల నిర్వహణపై ప్రత్యేకంగా దృష్టి సారించాలి.

12వ లక్ష్యం - సుస్థిర వినియోగం, ఉత్పత్తి విధానాల రూపకల్పన: 2030 నాటికి నివారణ, RRR (Reduce, Reuse and Recycle) ద్వారా వ్యర్థాల సృష్టిని తగ్గించాలి.

నీటి నాణ్యత క్షీణత

గనుల కార్యకలాపాలు, పారిశ్రామిక వ్యర్థాలు, వ్యవసాయం నుంచి ఉత్పన్నమయ్యే కాలుష్యం మొదలైనవి భూగర్భ జలాల నాణ్యతను క్రమంగా దెబ్బ తీస్తున్నాయి. ఈ కారణంగా దీర్ఘకాలిక పర్యావరణ, ప్రజారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి.

▮ సాంకేతికంగా అభివృద్ధి చెందిన డ్రిల్లింగ్ పద్ధతులు, పంపింగ్ లాంటివాటి వల్ల భూగర్భ జలాల వెలికితీత గణనీయంగా పెరిగింది. చిన్న, సన్నకారు రైతులూ ఎక్కువ సంఖ్యలో గొట్టపు బావులను ఏర్పాటు చేసుకుంటున్నారు. తద్వారా భూగర్భ జలాలు గణనీయంగా తరిగిపోతున్నాయి.

ప్రభుత్వ కార్యక్రమాలు

భూగర్భ జలాలను విచక్షణా రహితంగా వెలికి తీయడాన్ని నిరోధించడానికి; వర్షపు నీటి సేకరణ, కృత్రిమ రీచార్జ్ లాంటి స్థిర పద్ధతులను ప్రోత్సహించడానికి; సమర్థవంతమైన నియంత్రణ, నిర్వహణ అవసరం. దీన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు భూగర్భజల వనరుల నియంత్రణ, నిర్వహణ కోసం నియంత్రణ చట్రాన్ని అందించడానికి కేంద్ర ప్రభుత్వం 'భూగర్భ జలాల (క్రమబద్ధీకరణ, అభివృద్ధి నియంత్రణ, నిర్వహణ)' బిల్లును సిద్ధం చేసింది. ఇప్పటివరకు 21 రాష్ట్రాలు దీన్ని ఆమోదించాయి.

◗ పెరుగుతున్న భూగర్భజల ఒత్తిడిని తట్టుకుని స్థిరమైన నీటి భద్రతను అమలు చేసేలా ప్రభుత్వం భూగర్భజల నిర్వహణను బలోపేతం చేసే కార్యక్రమాలు రూపొందించింది. వాటిని పరిశీలిస్తే..

జల్‌శక్తి అభియాన్

ఈ కార్యక్రమాన్ని ప్రధాని నరేంద్ర మోదీ 2021 మార్చి 22న 'ప్రపంచ జల దినోత్సవం' రోజు ప్రారంభించారు. 'క్యాచ్ ది రెయిన్' చొరవ ద్వారా అన్ని జిల్లాలు, పట్టణాల్లో దీన్ని అమలు చేశారు.

◆ ప్రతి ఇంటిలో వర్షపు నీటి సేకరణ నిర్మాణాలను (rainwater harvesting structures) ఏర్పాటు చేయడం, నీటి సంరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం.

◆ ఇది ప్రధానంగా అయిదు అంశాలపై దృష్టి సారిస్తుంది. అవి:
1. జల సంరక్షణ, వర్షపు నీటి సేకరణ
2. అన్ని జల వనరులను లెక్కించడం, జియో ట్యాగింగ్ - మ్యాపింగ్ చేయడం
3. అన్ని జిల్లాల్లో జలశక్తి కేంద్రాలను ఏర్పాటు చేయడం
4. కేంద్రీకృత అటవీ పెంపకం 5. అవగాహన పెంచడం

◆ జల్ శక్తి అభియాన్ కింద 2021 మార్చి నుంచి 2026 జనవరి వరకు 19.19 లక్షల నీటి సంరక్షణ, వర్షపు నీటి సేకరణ నిర్మాణాలు జరిగాయి. 3.61లక్షల సంప్రదాయ జలవనరుల పునరుద్ధరణ జరిగింది. 20.33 లక్షలు వాటర్‌షెడ్ అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. 10.35 పునర్వినియోగ, రీచార్జ్ నిర్మాణాలను అభివృద్ధి చేశారు.

జల్ సంచాయ్ జన్ భగిదారి (జేఎస్‌జేబీ)

దీన్ని 2024, సెప్టెంబరు 6న ప్రారంభించారు. వర్షపు నీటిని సేకరించి, నిల్వచేసి, భవిష్యత్తు అవసరాలకు వాడటం లేదా భూగర్భజలాలను పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. వివిధ స్థాయుల్లో క్షీణిస్తోన్న భూగర్భ జలాలను పరిరక్షించడమూ ఇందులో భాగం.

◆ భూగర్భ జలాల పునరుద్ధరణకు, బాధ్యతాయుతమైన భూగర్భ జల నిర్వహణ, స్థిరమైన నీటి వినియోగాన్ని ప్రోత్సహించడానికి అధునాతన పర్యవేక్షణ వ్యవస్థలను ఇందులో అనుసంధానిస్తారు.

◆ జేఎస్‌జేబీ 1.0, జేఎస్‌జేబీ 2.0 కింద 2026, జనవరి 22 నాటికి మొత్తం పూర్తయిన కృత్రిమ భూగర్భ జలాల పునరుద్ధరణ, నిల్వ పనుల సంఖ్య 39,60,333గా ఉంది.

నేషనల్ ఆక్విఫర్ మ్యాపింగ్ అండ్ మేనేజ్‌మెంట్ ప్రోగ్రాం (ఎన్ఏక్యూయూఐఎం)

ఈ కార్యక్రమాన్ని సెంట్రల్ గ్రౌండ్ వాటర్ బోర్డ్ 2012లో ప్రారంభించింది. దేశంలో భూగర్భ జల నిర్వహణకు మద్దతు ఇవ్వడం దీని ముఖ్య ఉద్దేశం.

◆ దేశంలోని జలాశయాలను మ్యాప్ చేయడం, నిర్వహణ ప్రణాళికలు అభివృద్ధి చేయడం లాంటి విధులు ఇది నిర్వహిస్తుంది.

◆ ఎన్ఏక్యూయూఐఎం మొదటి దశ 2012-23 కాలంలో అమలైంది. ఈ సమయంలో దేశంలో మొత్తం 33 లక్షల చ.కి.మీ. వైశాల్యంలో 25 లక్షల చ.కి.మీ. ప్రాంతాన్ని మ్యాప్ చేశారు.

◆ దీని రెండో దశ 2023 నుంచి ప్రారంభమైంది. 2023-24లో మొత్తం 38,600 చ.కి.మీ. విస్తీర్ణం అధ్యయనం పూర్తయ్యింది. 2024-25లో 21,524 చ.కి.మీ. విస్తీర్ణంలో మ్యాపింగ్ చేశారు. 2025-26లో 16,700 చ.కి.మీ. విస్తీర్ణంలో పనులు జరిగాయి. రాజస్థాన్, గుజరాత్, హరియాణా అంతటా 97,165 చ.కి.మీ.లలో 'హెలిబోర్న్ జియోఫిజికల్ సర్వే' ద్వారా హైరెజల్యూషన్ ఆక్విఫర్ మ్యాపింగ్ పూర్తయ్యింది.



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

Word of the Day

919

Hypocritical

Telugu meaning: కపటమైన, నిజాయతీలేని

English meaning: The word hypocritical (హైపోక్రిటికల్) is an adjective that describes a person who pretends to have moral standards or beliefs that they do not actually follow.

Synonyms: Pretentious, Insincere; ***Antonyms:*** Honest, Sincere

Usage: **1.** It is hypocritical to preach about honesty while secretly engaged in dishonest practices.

2. The audience criticized the leader's hypocritical behaviour, as his actions contradicted his promises.

Current Affairs



India climbed five places to the 91st position out of 182 countries and territories on the Corruption Perceptions Index (CPI) 2025 released on 10 February 2026. India's score has gone up by one point since the previous year, while its rank has improved from 96th position, according to the latest CPI from the global NGO Transparency International. Denmark retained its position at the top of the index, scoring 89 points, ahead of Finland and Singapore.



India and the United Kingdom of Great Britain and Northern Ireland signed an agreement on social security relating to Social Security Contributions in New Delhi on 10 February 2026. The agreement seeks to avoid double social security contributions for employees of both countries on temporary assignments in each other's territories for periods of up to 36 months.

India's doctor-population ratio has improved to 1:811, surpassing the World Health Organization (WHO) benchmark of 1:1000, according to data shared by the Union government in Parliament on 10 February 2026. Union Minister of State for Health and Family Welfare, Prataprao Jadhav, said the country currently has 13,88,185 registered allopathic doctors and 7,51,768 registered AYUSH practitioners.

The Ministry of Steel signed Memoranda of Understanding (MoUs) for 85 projects involving 55 companies under the Production-Linked Incentive (PLI) Scheme 1.2 (third round) for specialty steel at Vigyan Bhawan, New Delhi on 9 February 2026. The MoUs were signed in the presence of Minister of Steel and Heavy Industries H.D. Kumaraswamy and senior officials of the Ministry of Steel.

For more Current Affairs: **Scan QR code**

లోక్‌సభ స్పీకర్

స్టడీ జోన్



భారత ప్రజాస్వామ్యానికి మూలస్తంభం లోక్‌సభ. ఇది పార్లమెంట్‌లో దిగువ సభ. ప్రజల ద్వారా ప్రత్యక్ష పద్ధతిలో ఎన్నికైన వ్యక్తులు ఇందులో సభ్యులుగా ఉంటారు. ప్రజా సంక్షేమం, దేశాభివృద్ధే ధ్యేయంగా లోక్‌సభలో శాసనాల రూపకల్పన జరుగుతుంది. ఇది భారత జాతికి ప్రతిబింబంగా ఉంటుంది. ఇంతటి విశిష్టత కలిగిన లోక్‌సభకు స్పీకర్ అధ్యక్షత వహిస్తారు. ప్రస్తుతం ఆ పదవిలో ఉన్న ఓం బిర్లాను తొలగించే తీర్మానాన్ని ప్రవేశపెట్టాలంటూ కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్ష ఎంపీలు 2026, ఫిబ్రవరి 10న లోక్‌సభ సెక్రటరీ జనరల్ ఉత్పల్ కుమార్ సింగ్‌కు నోటీసు ఇచ్చారు. ఈ నేపథ్యంలో పోటీపరీక్షల కోణంలో 'లోక్‌సభ స్పీకర్'కు సంబంధించిన ముఖ్య విషయాల గురించి తెలుసుకుందాం..!

అభిశంసన నోటీసు ఇలా..

స్పీకర్ తొలగింపునకు తీర్మానం ప్రవేశపెట్టాలంటే నోటీసుపై కనీసం ఇద్దరు లోక్‌సభ సభ్యులు సంతకం చేయాలి. సాధారణ ఆధిక్యంతో సభ ఆమోదిస్తే సరిపోతుంది. దీనికోసం సభలో ప్రస్తుతం ఉన్న సభ్యులందరినీ లెక్కిస్తారు. ఖాళీలు మినహాయించి మిగిలిన సభ్యులంతా లెక్కలోకి వస్తారు.

● నోటీసును ఉపసభాపతికి కాకుండా సెక్రటరీ జనరల్‌కే సమర్పించాలి.


● ప్రతిపాదిత తీర్మానంలో పరువుకు నష్టం కలిగించే భాష, ఇతర అంశాలు ఉండకూడదు. తీర్మానంలో వాడిన భాషను సాధారణంగా డిప్యూటీ స్పీకర్ పరిశీలిస్తారు. లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్ లేకపోతే ప్యానెల్ ఛైర్‌పర్సన్‌లలో అత్యంత సీనియర్ సభ్యుడు దీన్ని పరిశీలిస్తారు.

● తీర్మానం ప్రవేశపెట్టడానికి కనీసం 14 రోజుల ముందే నోటీసులు ఇవ్వాల్సి ఉంటుంది. తీర్మానం పరిగణనలో ఉన్న సమయంలో సభకు స్పీకర్ నేతృత్వం వహించే అవకాశం లేదు.

లోక్‌సభ స్పీకర్ పదవి అసలు మన దేశంలో ఎలా మొదలైంది? తొలిగా ఆ పదవి చేపట్టిన వ్యక్తి ఎవరు? తదితర పూర్తి సమాచారంతో పోటీపరీక్షల కోణంలో రూపొందించిన ఈబుక్ ఉచిత డౌన్‌లోడ్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జనరల్ స్టడీస్ - భారతదేశ సమాజం

మహిళా సంక్షేమం - చట్టాలు



సరోగసీ నియంత్రణ చట్టం - 2021

2022 జనవరి 25 నుంచి ఇది అమల్లోకి వచ్చింది. కేంద్ర ప్రభుత్వం 2022 మార్చిలో సరోగసీ నియమాలను రూపొందించింది.

✦ ఈ చట్టం వ్యాపార కోణంలో సరోగసీని నిషేధించింది.

వివాహిత ముస్లిం మహిళా వివాహ హక్కుల పరిరక్షణ చట్టం - 2019: దీన్నే ట్రిపుల్ తలాక్ నిషేధ చట్టం అంటారు.

✦ షయరాబానో అనే ముస్లిం మహిళ కేసు సందర్భంగా 2017 ఆగస్టు 22న సుప్రీంకోర్టు రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులు, సమానత్వానికి విరుద్ధమని తీర్పు చెబుతూ ట్రిపుల్ తలాక్‌ను నిషేధించింది. కేంద్ర ప్రభుత్వం ఈ విధానంపై శాసనపరమైన చర్యలు తీసుకోవాలని సూచించింది.

మాతృత్వ ప్రయోజనాల చట్టం

ఈ చట్టాన్ని మాతృత్వ ప్రయోజనాల చట్టం 1961 స్థానంలో రూపొందించారు. ఇది 2017 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. ఇందులో పేర్కొన్న ఆలనా కేంద్రాల ఏర్పాటు అదే ఏడాది జులై 1 నుంచి అమల్లోకి వచ్చింది.

గృహహింస నుంచి మహిళల సంరక్షణ చట్టం - 2005

ఈ చట్టం 2006 అక్టోబరు 26 నుంచి అమల్లోకి వచ్చింది. గృహహింస సెక్షన్ 3 ప్రకారం శారీరక, మానసిక దాడులు, మాటలు, బ్లాక్‌మెయిల్ చేయడం, ఉద్వేగపరమైన హింస.. ఇవన్నీ గృహహింస పరిధిలోకి వస్తాయి. కట్నం లేదా ఆస్తిని కోరడం (చట్టవిరుద్ధంగా) లేదా డిమాండ్ చేయడం కూడా దీని పరిధిలోకి వస్తుంది.

1829 నుంచి ఇప్పటి వరకు మహిళా సంక్షేమం కోసం చేసిన చట్టాలు, చారిత్రక తీర్పులు, ఇతర ముఖ్యమైన కేసులు, మహిళల విషయంలో వాడకూడని పదాలు మొదలైన అంశాలతో పాటు మాదిరి ప్రశ్నలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Graduate and Diploma Apprentice Posts

DRDO - Institute for Systems Studies and Analysis (ISSA), Delhi, is inviting applications for Graduate and Diploma Apprentice posts. The total number of posts is 21. Eligible candidates can apply online before 27 February 2026.

Junior Resident Posts

All India Institute of Medical Sciences (AIIMS), Bibinagar, is inviting applications for the Junior Resident posts. The total no. of posts is 13. The application fee is Rs.1,180. The last date for receipt of online applications is 23 February 2026.

Project Engineer Jobs

Indian Institute of Technology Guwahati (IIT Guwahati) is inviting applications for filling up the Project Engineer posts in various departments on a contractual basis. The total no. of posts is 9. Eligible candidates can apply online before 16th February 2026.

Did You Apply..?

Today (February 12) is the last date for the following Jobs

☛ 49 Scientist/Engineer posts at Space Applications Centre, Ahmedabad. ***Eligibility:*** PhD/ME/M.Tech/M.Sc/BE/B.Tech.

☛ Research Engineer posts at IIT Delhi. ***Eligibility:*** B.Tech/Degree.

☛ Young Professional posts at the Regional Passport Office, Hyderabad. ***Eligibility:*** Degree.

For more information and other notifications - scan QR code

Bank Exams
Reasoning

Logical Sequence of Words

Directions (Qs. 1 - 17): *In each of the following questions, arrange the given words in a meaningful sequence and then choose the most appropriate sequence from amongst the alternatives provided below each question.*

1. Arrange the following in a meaningful sequence
1) Consultation 2) Treatment
3) illness 4) Recovery
5) Doctor
A) 2, 3, 1, 4, 5 B) 2, 3, 4, 1, 5
C) 4, 3, 1, 2, 5 D) 5, 1, 4, 3, 2
E) 1, 3, 2, 4, 5

2. Arrange the following in a logical order
1) Euphoria 2) Ecstasy
3) Happiness 4) Pleasure
5) Ambivalence
A) 4, 1, 3, 2, 5 B) 3, 2, 5, 1, 4
C) 2, 1, 3, 4, 5 D) 1, 4, 2, 5, 3
E) 5, 3, 2, 4, 1

3. Arrange the following in a meaningful order, from particular to general
1) Family 2) Locality
3) Community 4) Country
5) Member
A) 3, 1, 2, 4, 5 B) 3, 1, 2, 5, 4
C) 3, 1, 4, 2, 5 D) 3, 1, 4, 5, 2
E) 5, 2, 4, 1, 3

4. 1) Birth 2) Death 3) Funeral
4) Marriage 5) Education
A) 4, 5, 3, 1, 2 B) 2, 3, 4, 5, 1
C) 1, 5, 4, 2, 3 D) 1, 3, 4, 5, 2
E) 1, 2, 4, 5, 3

5. 1) Site 2) Plan 3) Rent
4) Money 5) Building
A) 4, 1, 2, 5, 3 B) 3, 4, 2, 5, 1
C) 2, 3, 5, 1, 4 D) 1, 2, 3, 5, 4.
E) 5, 4, 1, 3, 2

6. 1) Table 2) Tree 3) Wood
4) Seed 5) Plant
A) 4, 5, 3, 2, 1 B) 4, 5, 2, 3, 1
C) 1, 3, 2, 4, 5 D) 1, 2, 3, 4, 5
E) 3, 4, 5, 1, 2

7. 1) College 2) Child 3) Salary
4) School 5) Employment
A) 1, 2, 4, 3, 5 B) 4, 5, 3, 2, 1
C) 4, 1, 3, 5, 2 D) 5, 3, 2, 1, 4
E) 2, 4, 1, 5, 3

8. 1) Key 2) Door 3) Lock
4) Room 5) Switch on
A) 5, 1, 2, 4, 3 B) 4, 2, 1, 5, 3
C) 1, 2, 3, 5, 4 D) 1, 3, 2, 4, 5
E) 4, 1, 5, 3, 2

9. 1) Cutting 2) Dish 3) Vegetable
4) Market 5) Cooking
A) 1, 2, 4, 5, 3 B) 3, 2, 5, 1, 4
C) 4, 3, 1, 5, 2 D) 5, 3, 2, 1, 4
E) 3, 5, 4, 1, 2

10. 1) Income 2) Status
3) Education 4) Well-being
5) Job
A) 1, 3, 2, 5, 4 B) 1, 2, 5, 3, 4
C) 1, 3, 4, 5, 2 D) 3, 5, 1, 2, 4
E) 3, 1, 5, 2, 4

11. 1) Milky way 2) Sun
3) Moon 4) Earth
5) Stars
A) 4, 3, 2, 5, 1 B) 3, 4, 2, 5, 1
C) 2, 3, 4, 5, 1 D) 1, 4, 3, 2, 5
E) 2, 5, 1, 4, 3

12. 1) Sea 2) Rivulet
3) Ocean 4) River
5) Glacier
A) 5, 4, 3, 2, 1 B) 5, 4, 2, 3, 1
C) 5, 2, 4, 1, 3 D) 5, 2, 1, 3, 4
E) 1, 2, 5, 4, 3

13. 1) Poverty 2) Population
3) Death 4) Unemployment
5) Disease
A) 3, 4, 2, 5, 1 B) 2, 4, 1, 5, 3
C) 2, 3, 4, 5, 1 D) 1, 2, 3, 4, 5
E) 2, 1, 5, 3, 4

14. 1) Yarn 2) Plant 3) Saree
4) Cotton 5) Cloth
A) 2, 4, 1, 5, 3 B) 2, 4, 3, 5, 1
C) 2, 4, 5, 1, 3 D) 2, 4, 5, 3, 1
E) 1, 2, 4, 3, 5


15. 1) Puberty 2) Adulthood
3) Childhood 4) Infancy
5) Senescence
A) 5, 2, 3, 4, 1 B) 4, 3, 2, 1, 5
C) 4, 3, 1, 2, 5 D) 2, 4, 3, 1, 5
E) 3, 2, 1, 4, 5

16. 1) Windows 2) Walls
3) Floor 4) Foundation
5) Roof 6) Room
A) 4, 5, 3, 2, 1, 6 B) 4, 3, 5, 6, 2, 1
C) 4, 2, 1, 5, 3, 6 D) 4, 1, 5, 6, 2, 3
E) 5, 3, 2, 6, 1, 4

17. 1) Post-box 2) Letter
3) Envelope 4) Delivery
5) Clearance
A) 3, 2, 4, 5, 1 B) 3, 2, 1, 5, 4
C) 3, 2, 1, 4, 5
D) 2, 3, 1, 4, 5
E) 1, 2, 5, 4, 3

Scan the QR code for Key

These model questions were prepared by ***Rajesh Madhu, Asst. Prof. of Mathematics.***



రెండో ప్రపంచయుద్ధం నాటి ఓ ప్రేమకథ

నాష్‌విల్: అవి రెండో ప్రపంచ యుద్ధపు రోజులు. 1942 వేసవిలో న్యూయార్క్‌కు చెందిన విలియం రేమండ్ విటాకర్ సైన్యంలో చేరి అరిజోనాలోని ఫోర్ట్ హువాచుకాకు వెళ్లిపోయాడు. తనతోపాటు నాష్‌విల్‌లోని మెహరీ వైద్య కళాశాలలో చదువుకున్న జేన్ డీన్‌కు ఈ విషయం చెబుతూ ఉత్తరం రాశాడు. ఇది ఒకందుకు సంతోషించదగ్గ విషయమే అయినా బాధగా ఉంది అంటూ అవతలి నుంచి లేఖ అందింది. ఇలా కొన్ని నెలలపాటు వారి మధ్య 200కు పైగా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిచాయి. ఆ తర్వాత ప్రేమ పెళ్లిపీటలెక్కింది. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో కొనసాగిన వీరి ప్రేమ కథకు దాఖలాలైన ప్రేమ లేఖలు ఇంకా ఉన్నాయి. వీటిని తాజాగా నాష్‌విల్ పబ్లిక్ లైబ్రరీ డిజిటల్ వేదికగా ప్రదర్శనకు ఉంచారు. జేన్, ఆమె తోబుట్టువులకు చెందిన ఓ ఇంటిని 2016లో మెట్రో నాష్‌విల్ ఆర్కైవ్స్‌కు ఇచ్చేశారు. అక్కడే ఉత్తరాలు బయటపడ్డాయి. తొలిసారిగా జేన్‌కు రే రాసిన ఉత్తరం అందుబాటులో లేనప్పటికీ దీనికి ప్రతిగా జేన్ రాసిన లేఖ ఇంకా ఉంది. 1942 జులై 30న 'డియర్ విలియం రేమండ్' అంటూ జేన్ ప్రత్యుత్తరం ఇచ్చారు. 'ఇది సంతోషించదగ్గ విషయమే, ఒకందుకు బాధగానే ఉంది. ఎందుకంటే నా హృదయంలో ఎన్నటికీ నీకు ప్రత్యేకమైన స్థానం ఉంటుంది. నా గురించి నీవు ఆలోచిస్తున్నావని తెలుసుకోవడం ఆనందంగా ఉంది. కానీ నువ్వు సైన్యంలో చేరినందుకు ఒకందుకు బాధగా ఉంది. నేనలా అనకూడదేమో. కానీ యుద్ధ పరిణామాలు ఎక్కడికి దారి తీస్తాయో తెలియదు. అయినప్పటికీ నువ్వు దేశం కోసం పని చేస్తున్నందుకు గర్వంగా ఉంది. త్వరలోనే ఉత్తరం రాయి. లేదంటే ఫోన్ చేయి' అని అందులో పేర్కొంది. నాలుగు నెలలు తిరిగేలోపే ఇద్దరు నవంబరు 7న బర్మింగ్‌హామ్‌లో పెళ్లి చేసుకున్నారు. ఆ తర్వాత రే సైన్యానికి తిరిగి వెళ్లగా.. జేన్ వాండర్‌బిల్ట్ విశ్వవిద్యాలయంలో ల్యాబ్ టెక్నీషియన్‌గా విధుల్లో చేరారు. పెళ్లయిన రెండు రోజులకు రే కి రాసిన లేఖలో 'మై డార్లింగ్ హస్బెండ్' అని జేన్ సంబోధించారు. వీరికి సంతానం కలగలేదు. 1989లో నాష్‌విల్‌లో రే తుది శ్వాస విడిచినట్లుగా తెలిసింది. ప్రేమ కథకు మించి వీరి లేఖలు ఆనాటి కాలంలో ఉన్న జాతి, లింగ వివక్షను, వారి పనులను, ఓ సైనికుడి జీవితాన్ని తెలియజేస్తున్నాయని, అందుకే ఉత్తరాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని నాష్‌విల్ ఆర్కైవిస్టు సిర్కో తెలిపారు.



అమెరికాలోని ఒహాయోలో శిల్పకారుడు అలెన్ కాట్రిల్ రూపొందించిన బంగారు వర్ణపు ట్రంప్ కాంస్య విగ్రహం

అతి పెద్ద హైడ్రోజన్ రిజర్వాయర్‌గా భూమి

నేషనల్ డెస్క్: భూగోళాన్ని తీసుకోండి.. అందులో 70శాతం సముద్రాలే ఉంటాయి కదా.. ఇవన్నీ హైడ్రోజన్‌తో ఏర్పడినవే. అంటే భూమిపై అపరిమిత హైడ్రోజన్ ఉందన్నమాట. కానీ 5 మహా సముద్రాలను 9తో గుణిస్తే ఎన్ని మహా సముద్రాలవుతాయో అంత పరిమాణంలో భూమిపై హైడ్రోజన్ ఉందని తాజా పరిశోధన తేల్చింది. అంటే 45 మహా సముద్రాలన్నంత మాట. మరో విధంగా చెప్పాలంటే.. భూమి మొత్తం బరువులో 0.36% నుంచి 0.7% బరువున్న హైడ్రోజన్ ఉందని చెప్పవచ్చు. మంగళవారం నేచర్ కమ్యూనికేషన్స్ అనే జర్నల్‌లో శాస్త్రవేత్తలు ఈ వివరాలను ప్రచురించారు.

ముంబయి మేయర్‌గా రీతూ తావ్డే

44 ఏళ్ల తర్వాత భాజపాకు దక్కిన పీఠం



ముంబయి: మహారాష్ట్ర రాజధాని ముంబయి నగర మేయర్ పదవిని భాజపా 44 ఏళ్ల తర్వాత మరోసారి కైవసం చేసుకుంది. పార్టీకి చెందిన మహిళా కార్పొరేటర్ రీతూ తావ్డే(53) బుధవారం ముంబయి నగర 78వ మేయర్‌గా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1982-83లో భాజపా మేయర్‌గా పని చేసిన ప్రభాకర్ పాయ్ తర్వాత ఆ పదవిని సొంతం చేసుకున్న కాషాయ పార్టీకి చెందిన రెండో కార్పొరేటర్ ఆమె కావడం విశేషం. దీంతో ముంబయి రాజకీయాల్లో ఠాక్రే కుటుంబ ఆధిపత్యానికి తెరపడినట్లయింది. శివసేన పార్టీకి చెందిన సంజయ్ ఘాడీ(57) ఉపమేయర్‌గా ఎన్నికయ్యారు. బృహణ్‌ముంబయి మున్సిపల్ కార్పొరేషన్ సర్వసభ్య సమావేశంలో రీతూ, సంజయ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శివసేన(ఉద్ధవ్)తో సహా ఇతర ప్రతిపక్ష పార్టీలు తమ అభ్యర్థులను పోటీకి దించలేదు.

పీవోకేతో ఉన్న భారత్ మ్యాప్‌ను తొలగించిన అమెరికా

ఈటీవీ భారత్: పాక్ ఆక్రమిత కశ్మీర్, అక్సాయ్ చిన్‌ను భారత్ భూభాగంలో చూపుతూ పెట్టిన పోస్టును అమెరికా తొలగించింది. భారత్, అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్యం ఒప్పందం ఫ్రేమ్‌వర్క్ ఖరారు సందర్భంగా ఈ మ్యాప్‌ను అమెరికా వాణిజ్య మంత్రిత్వశాఖ ప్రతినిధి కార్యాలయం (యూఎస్‌టీఆర్) తన అధికారిక ఎక్స్ ఖాతాలో పోస్టు చేసింది. తాజాగా ఆ పోస్టును తొలగించింది.

కోలుకుంటున్న శరద్ పవార్



పుణె: నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) అధ్యక్షుడు శరద్ పవార్ ఆరోగ్యం మెరుగుపడుతోందని ఆయనకు చికిత్స అందిస్తున్న వైద్యులు బుధవారం తెలిపారు. పవార్ ఆరోగ్యం నిలకడగా ఉందని, స్థిరంగా ఆయన కోలుకుంటున్నారని రూబీ హాల్ క్లినిక్ ఆసుపత్రి ముఖ్య వైద్యుల్లో ఒకరు చెప్పారు. ఛాతీ ఇన్ఫెక్షన్‌తో పవార్ ఆసుపత్రిలో చేరిన సంగతి తెలిసిందే.

టెండర్లపై చైనా ఏఐ నిఘా

ఇంటర్నెట్ డెస్క్: రహదారులు, రైల్వే ప్రాజెక్టులు సహా అభివృద్ధి పనుల టెండర్లలో అవినీతిపై చైనా ఏఐతో నిఘా పెట్టింది. టెండర్ల ప్రక్రియ అనుమానాస్పదంగా ఉంటే వెంటనే ప్రభుత్వ వర్గాలను ఏఐ టూల్స్ అప్రమత్తం చేస్తాయి. డొల్ల కంపెనీలు, బిడ్డింగ్‌లో అనుచిత ధోరణుల వంటి వాటిని గుర్తిస్తాయి. టెండర్లకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని, కాంట్రాక్టర్ల వివరాలను ఏఐకి అధికార వర్గాలు అందిస్తాయి. దీంతో ఎక్కడ అక్రమాలు జరిగినా అవి గుర్తిస్తాయి.

మడగాస్కర్‌లో తుపాను

- 20 మంది మృతి, 33 మందికి గాయాలు

అంటననారివో: హిందూ మహాసముద్ర ద్వీప దేశమైన మడగాస్కర్‌ను గెజానీ తుపాను వణికిస్తోంది. దీని ప్రభావంతో గంటకు 195 కి.మీ.కు పైగా వేగంగా గాలులు వీచడంతో పలు చోట్ల నివాస భవనాలు, విద్యుత్తు స్తంభాలు, చెట్లు కూలిపోయాయి. ఈ ఘటనల్లో 20 మంది మరణించగా, 33 మంది గాయపడినట్లు జాతీయ విపత్తు నిర్వహణ కార్యాలయం వెల్లడించింది. ఈ నగరంలో విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగింది. తుపాను తూర్పు తీరంలోని ప్రధాన నౌకాశ్రయ నగరం టోమాసినా వద్ద భూభాగాన్ని తాకింది. వరదలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న నేపథ్యంలో పలుప్రాంతాల్లో వాతావరణ శాఖ రెడ్ అలర్ట్ జారీ చేసింది.

జుట్టు కత్తిరింపులో తప్పిదం..

రూ.2 కోట్ల పరిహారం రూ.25 లక్షలకు తగ్గింపు

- సుప్రీంకోర్టు తీర్పు

దిల్లీ: ఒక లగ్జరీ హోటల్ సెలూన్‌లో జుట్టు కత్తిరింపులో తలెత్తిన సేవాలోపానికి గాను బాధితురాలికి ప్రకటించిన రూ.2కోట్ల పరిహారాన్ని సుప్రీంకోర్టు రూ.25 లక్షలకు తగ్గించింది. ఈ తీర్పు వెలువరించిన జస్టిస్ రాజేశ్ బిందల్, జస్టిస్ మన్మోహన్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. 'ఈ కేసులో సేవాలోపం స్పష్టం. వినియోగదారుల వివాదాల్లో పరిహారం ప్రత్యక్ష సాక్ష్యాల ఆధారంగా ఉండాలి. బాధితులు అడిగారనో లేదా ఇష్టాయిష్టాల ప్రకారం పరిహారాన్ని నిర్ణయించడం తగదు. అందులోనూ పరిహారం రూ.కోట్లలో ఉన్న వ్యాజ్యాల్లో సహేతుకమైన, విశ్వసనీయమైన ఆధారాలు చాలా ముఖ్యం' అని ధర్మాసనం పేర్కొంది. కేవలం బాధితురాలు సమర్పించిన ఫొటోల ఆధారంగానే జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ (ఎన్‌సీడీఆర్‌సీ) భారీ పరిహారం నిర్ణయించడం సరికాదని తెలిపింది. ఆశ్నా రాయ్ అనే మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్ 2008 ఏప్రిల్‌లో దిల్లీలోని ఐటీసీ మౌర్య హోటల్ సెలూన్‌లో హెయిర్ కట్ చేయించుకున్నారు. తాను సూచించిన దానికన్నా పొట్టిగా జుట్టును కత్తిరించడంతో తీవ్ర మానసిక వేదనకు గురయ్యానని, మోడలింగ్ అవకాశాలను కోల్పోయానని పేర్కొంటూ ఆమె ఎన్‌సీడీఆర్‌సీని ఆశ్రయించారు. బాధితురాలికి రూ.2కోట్లను పరిహారంగా చెల్లించాలన్న ఎన్‌సీడీఆర్‌సీ నిర్ణయాన్ని ఐటీసీ మౌర్య హోటల్ సవాల్ చేయగా తాజా తీర్పు వెలువడింది.

అస్సాం సీఎంపై విద్వేష ప్రసంగాల ఆరోపణ.. విచారణకు సుప్రీం సమ్మతి

అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆ రాష్ట్రంలోని ముస్లింలకు వ్యతిరేకంగా విద్వేష ప్రసంగాలు చేస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సుప్రీంకోర్టులో మరో వ్యాజ్యం దాఖలైంది. మాజీ ప్రొఫెసర్ హిరేన్ గోహైన్, మాజీ డీజీపీ హరేకృష్ణ, సీనియర్ పాత్రికేయుడు పరేశ్ చంద్ర మలాకర్, సీనియర్ న్యాయవాది శాంతను బర్తాకుర్ సంయుక్తంగా ఈ పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణ తేదీని నిర్ణయిస్తామని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం వెల్లడించింది. వామపక్ష పార్టీల నేతలు కూడా మంగళవారం ఇటువంటి పిటిషనే దాఖలు చేశారు.



వినియోగదారుల వివాదాలనూ హైకోర్టులే పరిష్కరించాలి

వినియోగదారుల వివాద పరిష్కార కమిషన్లలో కేసులు తక్కువగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్రాలకు సంబంధించి సుప్రీంకోర్టు బుధవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. అలాంటి రాష్ట్రాల్లో హైకోర్టులే ఆయా పిటిషన్లపై విచారణ చేపట్టాలని ఆదేశించింది. వినియోగదారుల కేసులు ఎక్కువగా లేనప్పటికీ రాష్ట్ర స్థాయి కమిషన్లను కొనసాగించడం వల్ల ప్రభుత్వ ఖజానాపై అనవసర భారం పడుతుందని వ్యాఖ్యానించింది. దాన్ని నివారించడం కోసం.. రాజ్యాంగంలోని ఆర్టికల్-142 కింద తమకు దఖలు పడిన విశేషాధికారాలను ఉపయోగించుకుంటూ తాజా ఆదేశాలు జారీ చేస్తున్నట్లు భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చీల ధర్మాసనం తెలిపింది. వినియోగదారుల పరిరక్షణ చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ప్రస్తుతం వినియోగదారుల వివాదాల పరిష్కారం కోసం మూడంచెల కమిషన్లు (జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో) ఉన్నాయి. అయితే తమ జిల్లా, రాష్ట్ర స్థాయి కమిషన్లలో కేసులు చాలా తక్కువగా ఉన్నాయని.. కొన్ని వినియోగదారుల కోర్టులైతే ఏడాది కంటే ఎక్కువ కాలం పనిచేయకుండా ఖాళీగా ఉన్నాయని పలు రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ నిర్వహించింది. ప్రజాధనాన్ని కాపాడేందుకు.. ఆయా రాష్ట్ర స్థాయి వినియోగదారుల కమిషన్లలోని పిటిషన్ల విచారణ బాధ్యతను హైకోర్టులకు అప్పగిస్తున్నట్లు ధర్మాసనం తెలిపింది. ఇందుకోసం అనుభవజ్ఞులైన సింగిల్ జడ్జికి వాటి పరిష్కార బాధ్యతను అప్పగించాలని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను ఆదేశించింది. కేసులు తక్కువగా పెండింగ్‌లో ఉన్న జిల్లా స్థాయి కమిషన్ల విషయంలో ఉత్తర్వులు జారీ చేసేందుకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా సహాయాన్ని న్యాయస్థానం కోరింది. తమ జిల్లా, రాష్ట్ర స్థాయి వినియోగదారుల కమిషన్లలో కేసులు చాలా స్వల్ప సంఖ్యలో పెండింగులో ఉన్నట్లు అరుణాచల్ ప్రదేశ్, మణిపుర్, గోవా, మిజోరం, నాగాలాండ్, హిమాచల్ ప్రదేశ్, అండమాన్ నికోబార్ దీవులు, మేఘాలయ రాష్ట్రాలు సుప్రీంకోర్టుకు నివేదించాయి.

బెయిలు కోరే నిందితులు.. తమ నేరచరిత్రను తప్పనిసరిగా తెలియజేయాలి

బెయిలు కోసం దరఖాస్తు చేసుకునే ప్రతి నిందితుడు/నిందితురాలు తమ నేరచరిత్రను కోర్టుకు ప్రమాణపత్రం రూపంలో తప్పనిసరిగా తెలియజేయాలని సుప్రీంకోర్టు బుధవారం ఆదేశించింది. బెయిలు మంజూరులో పారదర్శకత, ఏకరూపకతను ప్రోత్సహించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొంది. గతంలో నేరాలు చేసి ఉండటం, ప్రస్తుతం తమపై నాన్ బెయిలబుల్ వారెంట్లు ఉండటం వంటి వివరాలన్నీ నిందితులు ప్రమాణపత్రంలో వెల్లడించాల్సిందేనని స్పష్టం చేసింది. గత నేరాలకు సంబంధించి ఎఫ్ఐఆర్ నంబరు, కేసు నమోదైన పోలీసు స్టేషన్ వివరాలు, దర్యాప్తు అధికారి మోపిన సెక్షన్లు, వాటికి పడే గరిష్ఠ శిక్షలు తదితర వివరాలు అందులో తెలపాలని పేర్కొంది. న్యాయవాదులకు నకిలీ డిగ్రీ సర్టిఫికెట్లను జారీ చేసిన ఓ వ్యక్తికి అలహాబాద్ హైకోర్టు మంజూరు చేసిన బెయిలును రద్దు చేస్తూ.. జస్టిస్ అహ్సనుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది.


బ్రెయిన్ గేమ్స్‌తో మతిమరుపునకు చెక్!

- 65 ఏళ్లు పైబడిన వారిలో తగ్గించొచ్చు.. ఆలస్యం చేయవచ్చు
- తేల్చిన కొత్త పరిశోధన

మెదడుకు శిక్షణనిచ్చే బ్రెయిన్ గేమ్స్‌తో అల్జీమర్స్‌తో పాటు ఇతర మతిమరుపు ముప్పులను తగ్గించవచ్చని, ఆలస్యం చేయవచ్చని కొత్త అధ్యయనం తేల్చింది. మెదడుకు కొన్ని ప్రత్యేక శిక్షణలను ఇవ్వడం ద్వారా 65 ఏళ్ల పైబడిన 25 శాతం మందిలో డిమెన్షియా ముప్పును అడ్డుకోవడంగానీ, ఆలస్యంగా చేయడంగానీ చేయవచ్చని గుర్తించింది. జ్ఞాపక శక్తి, సమస్యల సాధన టాస్కుల ద్వారా కాకుండా ఇంటరాక్టివ్ కంప్యూటరైజ్డ్ స్పీడ్ గేమ్‌ల ద్వారా దీనిని సాధించవచ్చని వెల్లడైంది.

అధ్యయనం కోసం శాస్త్రవేత్తలు.. 2,800 మంది వాలంటీర్లను ఎంచుకున్నారు. వారి సగటు వయసు 74 ఏళ్లు. వారెవరికీ మతిమరుపు జబ్బు లేదు. వారంతా అమెరికాలోని 6 కమ్యూనిటీల్లో స్వతంత్రంగా జీవిస్తున్నారు. వారిని 3 గ్రూపులుగా విభజించారు.

- ఒక గ్రూపులోని వారికి జ్ఞాపక శక్తి, పదాల జాబితాను గుర్తుపెట్టుకునే లెర్నింగ్ టెక్నిక్‌లు, టెక్స్ట్ మెటీరియల్, కథల వివరాలపై శిక్షణ ఇచ్చారు.
- రెండో గ్రూపులోని వారికి రీజనింగ్ (సమస్యల సాధన), రోజువారీ జీవితంలో సహాయపడే వాటిని గుర్తించడంపై శిక్షణనిచ్చారు.
- మూడో గ్రూపులోని వారికి అలబామా, కెంటకీ ప్రొఫెసర్లు తయారుచేసిన స్పీడ్ బ్రెయిన్ గేమ్ ఆడటంలో శిక్షణనిచ్చారు. ఇది ఏం నేర్చుకుంటున్నామన్న స్పృహ లేకుండానే జ్ఞానాన్ని, నైపుణ్యాన్ని ఆటోమేటిక్‌గా సంపాదించేలా చేస్తుంది. షూ లేసులు కట్టుకోవడం, సామాజిక సంకేతాలకు స్పందించడం, బైక్ నడపడం వంటివి ఇందులో ఉంటాయి.



'25శాతం మతిమరుపు ముప్పు తగ్గిన వారంతా స్పీడ్ గేమ్ ఆడిన వారిలోనే ఉన్నారు. అందునా బూస్టర్ సెషన్స్ నిర్వహించినవారే ఉన్నారు. ఈ సెషన్స్ తీసుకోనివారిలో పెద్దగా మార్పులేదు' అని జాన్స్ హాప్‌కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ న్యూరాలజీ ప్రొఫెసర్, సహ అధ్యయనకర్త అయిన మార్లిన్ ఆల్బర్ట్ తెలిపారు.

– నేషనల్ డెస్క్

ఎండిన రేగుపండ్లతో దండిగా లాభాలు

రాజస్థాన్‌లోని జోధ్‌పుర్ జిల్లా ఝున్వర్ గ్రామానికి చెందిన రాజేంద్రకుమార్ పటేల్ అనే రైతు పొలాల్లో చెట్ల కింద వృథాగా పడున్న రేగుపండ్లను సేకరించి ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తూ మంచి ఆదాయాన్ని గడిస్తున్నారు. దీంతో స్థానిక రైతులకు కూడా ఎంతో కొంత ఆదాయం వస్తోంది. జోధ్‌పుర్ ప్రాంతంలో రేగు సాగు ఎక్కువ. ఏటా అక్టోబరు - ఫిబ్రవరి సీజనులో ఈ పంటను రైతులు విక్రయిస్తారు. కింద రాలిపడిన రేగుపండ్లను చాలామంది ఇళ్లకు తీసుకువెళ్లడమో.. అలాగే వదిలేయడమో చేస్తారు. ఎండు రేగుపండ్లకు బయటి మార్కెట్లో భారీ డిమాండు ఉందని గుర్తించిన రాజేంద్రకుమార్ చుట్టుపక్కలయాభై గ్రామాల నుంచి రోజుకు 300 - 400 బస్తాల పండ్లను కిలో రూ.20 - రూ.30 ధరకు కొంటున్నారు. వాటిని తన పొలంలో దాదాపు 10 రోజులపాటు ఎండబెట్టాక బస్తాల్లో ప్యాక్ చేసి దిల్లీతోపాటు దేశంలోని వివిధ మార్కెట్లకు, సిలిగుడి మీదుగా బంగ్లాదేశ్‌కు సరఫరా చేస్తున్నారు. సుగంధ ద్రవ్యాలతోపాటు ఆయుర్వేద మందుల తయారీలో ఈ రేగుపండ్లను వినియోగిస్తారు. ఖాళీగా ఉన్న సమయాల్లో బైక్ మెకానిక్‌గానూ రాజేంద్రకుమార్ పనిచేస్తున్నారు.



ఈటీవీ భారత్

యాప్ స్టోర్ & గూగుల్ ప్లే ద్వారా డౌన్‌లోడ్ చేసుకోండి


అమెరికన్ స్వీట్‌కార్న్ సాగుతో గుజరాత్ రైతులకు కాసుల వర్షం

గుజరాత్‌లోని భావ్‌నగర్ అంటే సాధారణంగా గుర్తుకొచ్చేది పత్తి పొలాలు, వేరుశనగ సాగు. ఇప్పుడు రైతులు పంథా మార్చారు. అమెరికన్ స్వీట్ కార్న్ (మొక్కజొన్న) సాగుతో లాభాల బాట పడుతున్నారు. గత అయిదేళ్లలో భావ్‌నగర్ జిల్లాలో అమెరికన్ మొక్కజొన్న సాగు విపరీతంగా పెరిగింది. 2024-25లో ఏకంగా 898 హెక్టార్లలో ఈ పంట సాగుతో రైతులు రికార్డు సృష్టించారు. మార్కెట్‌లో ఈ రకానికి ఉన్న విపరీతమైన డిమాండే ఇందుకు ప్రధాన కారణం. రెండు మూడు ఎకరాల్లో ఈ పంటను తాను సాగు చేస్తానని, ఎకరాకు రూ.లక్షకు పైగా మిగులుతుందని కిశోర్ భాయి అనే రైతు తెలిపారు. అమెరికా మొక్కజొన్నకు 'ఫాల్ ఆర్మీవార్మ్' అనే తెగులు సోకుతూ ఉంటుందని.. ఈ వ్యాధి రాకముందే వేపనూనె, రసాయన ఎరువులను చల్లి జాగ్రత్తలు తీసుకుంటే నివారించవచ్చని భావ్‌నగర్ జిల్లా వ్యవసాయ అధికారి ఎం.రిజ్వాన్ చెప్పారు. అకాల వర్షాలు, పురుగుల దాడి, తీవ్రమైన మంచు నుంచి పంటలను కాపాడటానికి గుజరాత్ ప్రభుత్వం ఎకో ఫ్రెండ్లీ నెట్‌హౌస్ పద్ధతిని తీసుకొచ్చి 65 శాతం సబ్సిడీ ఇస్తోంది.



నీటి అడుగున పనిచేసే డ్రోన్!

గుజరాత్‌లోని భావనగర్‌కు చెందిన జ్ఞానమంజరి ఇన్నోవేటివ్ యూనివర్సిటీ కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థులు నీటి అడుగున పనిచేసే డ్రోన్‌కు రూపకల్పన చేశారు. జాతీయ రక్షణ అవసరాలకు, పరిశ్రమల్లోనూ దీనిని ఉపయోగించవచ్చన్నారు. యూనివర్సిటీలో ఏర్పాటుచేసిన వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు దీనిని ప్రదర్శించారు. ఈ డ్రోన్ పనితీరును అశ్విన్ అనే విద్యార్థి వివరించారు. రసాయన పరిశ్రమలను దృష్టిలో పెట్టుకొని దీనిని రూపొందించినట్లు వెల్లడించారు. "ఈ పరిశ్రమల్లో రసాయనాల పైపుల్లో ఎటువంటి సమస్య తలెత్తినా మా డ్రోన్ పసిగట్టి పరిష్కరిస్తుంది. రష్యాపై యుద్ధంలో ఉక్రెయిన్ నీటిపై డ్రోన్‌లను ఉపయోగించడం చూశాము. నీటి అడుగున పనిచేసే డ్రోన్ ఇప్పటిదాకా ఎవరూ చూడలేదు" అన్నారు.



హరియాణా సిస్టర్స్.. నాన్‌చాక్‌లో స్వర్ణ విజేతలు

హరియాణాలోని నూహ్ జిల్లాకు చెందిన ఇద్దరు మైనర్ అక్కాచెల్లెళ్లు కాన్పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి నాన్‌చాక్ పోటీల్లో అద్భుతమైన ప్రతిభను ప్రదర్శించి స్వర్ణ పతకాలు గెలుచుకున్నారు. దీంతో పదకొండేళ్ల జియాఖాన్, ఆరేళ్ల జోయా ఖాన్ ఏషియన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో భారత్‌కు ప్రాతినిధ్యం వహించనున్నారు. కాన్పూర్ పోటీలకు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు 2,500 మంది బాల బాలికలు హాజరయ్యారు. ఇప్పటిదాకా రెండు డజన్లకు పైగా మెడళ్లు సాధించిన జియా, జోయా ఈ పోటీల్లోనూ అగ్రపథాన నిలిచారు. ఈ చిన్నారులు జూడో - కరాటే వంటి యుద్ధక్రీడల్లోనూ నిష్ణాతులు. వీరిని రోజూ శిక్షణ కేంద్రాల చుట్టూ తిప్పుతున్న తండ్రి జమీల్ ఖాన్ మాట్లాడుతూ.. తన కుమార్తెలు అంతర్జాతీయ పోటీల్లో రాణించి దేశం తరఫున పతకాలు సాధించడమే తమకున్న కలగా పేర్కొన్నారు.



న్యాయాధికారిపై హైకోర్టు తీవ్ర వ్యాఖ్యల కేసు విచారణకు స్వీకరించిన సర్వోన్నత న్యాయస్థానం

దిల్లీ: కుటుంబ న్యాయస్థానం జడ్జీ వ్యవహార శైలిని తీవ్రంగా తప్పుపట్టడంతో పాటు ఆయన వెలువరించిన తీర్పును రద్దు చేస్తూ హైకోర్టు చేసిన వ్యాఖ్యలపై విచారణకు సర్వోన్నత న్యాయస్థానం సమ్మతించింది. జిల్లా జడ్జి దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై నాలుగు వారాల తర్వాత విచారణ జరుపుతామని జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం బుధవారం వెల్లడించింది. హైకోర్టు ఆదేశాల నిలిపివేతకు నిరాకరించింది. వైవాహిక వివాదాల కేసుల్లో జిల్లా జడ్జి తీర్పులు న్యాయ నిబంధనలకు విరుద్ధంగా ఉంటున్నాయని, వివాహ చట్టాల్లో ఆయన శిక్షణ తీసుకోవాలని గత ఏడాది నవంబరులో దిల్లీ హైకోర్టు ఆదేశించింది.

వాంగ్‌చుక్ ఆరోగ్యంగానే ఉన్నారు: కేంద్రం

దిల్లీ: పర్యావరణ ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్‌కు 24 సార్లు వైద్య పరీక్షలు చేశామని, ఆయన ఆరోగ్యంగా ఉన్నారని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా బుధవారం సుప్రీంకోర్టుకు తెలిపారు. వాంగ్‌చుక్‌ను అరెస్టు చేసిన కారణాలు ఇప్పటికీ అలానే ఉన్నాయని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ పి.బి.వరాలే ధర్మాసనానికి వివరించారు. అందువల్ల ఆరోగ్య కారణాలతో వాంగ్‌చుక్‌ను విడుదల చేయలేమన్నారు. వాంగ్‌చుక్ అరెస్టు చట్ట విరుద్ధమంటూ ఆయన భార్య గీతాంజలి ఆంగ్మో దాఖలు చేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై కేంద్రం తన వాదన వినిపించింది.

మరమ్మతు శక్తిని కోల్పోతున్న ప్రకృతి

దిల్లీ: భూతాపం, జీవ వైవిధ్య క్షయం వల్ల జరిగే నష్టాన్ని ప్రకృతి వేగంగా భర్తీచేసుకుంటుందనే అంచనా తప్పని, ఈ భర్తీ ప్రక్రియ నిదానిస్తూ దీర్ఘకాలం నిలిచిపోయే ప్రమాదం ఉందని లండన్ క్వీన్ మేరీ విశ్వవిద్యాలయ పరిశోధకులు హెచ్చరించారు. తనకు జరుగుతున్న నష్టాలకు తానే మరమ్మతు చేసుకునే శక్తిని ప్రకృతి క్రమంగా కోల్పోతోందని పరిశోధకుడు ఎమాన్యుయేల్ ఎస్ వాల్కో వివరించారు.

కనక వర్షమంటూ వంచించిన తాంత్రికుడు

- ముగ్గురి హత్య కేసులో నకిలీ బాబా అరెస్టు

దిల్లీ: తాంత్రిక పూజ చేయించి ధన వర్షం కురిపిస్తానని మభ్యపెట్టి ముగ్గురు వ్యక్తులను హతమార్చిన కమ్రుద్దీన్ అనే నకిలీ బాబాను అరెస్టు చేసినట్లు దిల్లీ పోలీసులు బుధవారం వెల్లడించారు. కమ్రుద్దీన్ గతంలో రాజస్థాన్, ఉత్తర్‌ప్రదేశ్‌లో ఇలాంటి రెండు హత్య కేసులకు బాధ్యుడని విచారణలో తేలింది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫిరోజాబాద్‌కు చెందిన ఈ నకిలీ బాబా స్థానికంగా ఘజియాబాద్ సమీపంలోని లోని అనే చోట బాబాగా తంత్ర పూజల కేంద్రాలను నడుపుతున్నాడు. ఈ నెల 8 రాత్రి ముగ్గురు వ్యక్తులు ఒక కారులో అచేతన స్థితిలో ఉన్నారంటూ దిల్లీ పోలీసులకు ఫోన్ కాల్ వచ్చింది. వారిని ఆస్పత్రికి తరలించగా అప్పటికే ప్రాణాలు కోల్పోయారు. ఆ ముగ్గురిలో 40 ఏళ్ల మహిళ, 76 ఏళ్ల వృద్ధుడు, 42 ఏళ్ల పురుషుడు ఉన్నారు. ఆ కారులో కమ్రుద్దీన్ ఉన్నట్లు సీసీటీవీ కెమెరాలు చూపాయి. ధన వర్షం పూజ కోసం రెండు లక్షల రూపాయలను, కూల్ డ్రింకులు, మద్యం సీసాలు తీసుకురావాలని కమ్రుద్దీన్ పురమాయించాడు. లోని నుంచి దిల్లీకి వచ్చే దారిలో కారులోనే వారికి విషం కలిపిన లడ్డూలు తినిపించి పానీయాలు తాగించాడు. బాధితులు అపస్మారక స్థితిలోకి జారుకోగానే డబ్బుతో ఉడాయించాడు.

కొత్త సైనిక కార్యక్రమానికి నాటో శ్రీకారం

బ్రసెల్స్: ఆర్కిటిక్ వలయంలోని ప్రాంతాల్లో (హై నార్త్) భద్రతను మెరుగుపరచేందుకు 'ఆర్కిటిక్ సెంట్రీ' పేరుతో కొత్త సైనిక కార్యక్రమానికి నాటో బుధవారం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా నాటో తొలుత ఆర్కిటిక్ ఎండ్యూరెన్స్ (డెన్మార్క్), కోల్డ్ రెస్పాన్స్ డ్రిల్ (నార్వే) వంటి పలు సైనిక విన్యాసాల్లో పాల్గొననుంది. 'ఆర్కిటిక్ సెంట్రీ' మిలిటరీ ఆపరేషన్ కాదు. ఈ కార్యక్రమం కింద ఆర్కిటిక్ వలయంలో, దాని సమీప ప్రాంతాల్లో శాశ్వతంగా/దీర్ఘకాలం బలగాలను మోహరించే ఉద్దేశమేదీ నాటోకు లేదు. ఆర్కిటిక్‌లో తమ భాగస్వామ్యపక్షాలు కలిసికట్టుగా విన్యాసాల్లో పాల్గొనేందుకు వీలుగా 'ఆర్కిటిక్ సెంట్రీ'లో కొత్త విషయమని బ్రసెల్స్‌లో విలేకర్లతో మాట్లాడుతూ నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్ తెలిపారు.

సింగపూర్‌లో భారత సంతతి వ్యక్తికి 14 వారాల జైలు శిక్ష

సింగపూర్: భారత సంతతికి చెందిన ఓ వ్యక్తికి సింగపూర్ కోర్టు 14 వారాల జైలుశిక్ష విధించింది. ఇతరుల మత విశ్వాసాలను ఉద్దేశపూర్వకంగా గాయపరిచేలా వ్యవహరించడంతో పాటు పోలీసులను దూషించిన కేసులో ఈ మేరకు తీర్పునిచ్చింది. పొరుగింటి పిల్లల తరఫున వారందరిలో ఆడుకుంటూ అల్లరి చేస్తున్నారని నిందితుడు 36 ఏళ్ల విక్నేశ్వరన్ వి మోగనవల్(36) పోలీసులకు ఫిర్యాదు చేసేవాడు. గతేడాది దీపావళి రోజు కూడా వారి ఇల్లు తన ఇంట్లో వేడుకకు ఇబ్బంది ఎదురైందని ఆగ్రహించాడు. పొరుగింటి వారి మత విశ్వాసాలను కించపరిచేలా పలు మాటలన్నాడు. దీంతో ఆ కుటుంబం ఫిర్యాదు చేసింది. గతేడాది అక్టోబరులో అతణ్ని చికిత్స కోసం మానసిక చికిత్స కేంద్రంలో చేర్పించారు. ఈ కేసులో ఇటీవల జరిగిన విచారణ సందర్భంగా కోర్టులో విక్నేశ్వరన్ తన తప్పును క్షమించాలని కోరాడు.

వికటించిన నులిపురుగుల నివారణ మాత్రలు

- 120 మందికి పైగా విద్యార్థులు ఆసుపత్రిపాలు

ఫరూఖాబాద్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఫరూఖాబాద్, మెయిన్‌పురి జిల్లాల్లో ప్రభుత్వం సరఫరా చేసిన నులిపురుగుల నివారణ మాత్రలు మింగిన 120 మందికి పైగా విద్యార్థులు ఆసుపత్రిపాలయ్యారు. తమ పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాల్లో విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలు తీసుకున్న కొద్ది సమయానికే తలనొప్పి, వాంతులతో ఇబ్బందిపడ్డారు. ఫరూఖాబాద్ జిల్లాలోని రథోరా మొహమ్మద్‌నగర్ గ్రామంలోని ఓ పాఠశాలలో మంగళవారం 150 మంది విద్యార్థులకు మందులు ఇవ్వగా దాదాపు 100 మంది కడుపులో అసౌకర్యంగా ఉన్నట్లు తెలియజేశారు. వారిని వెంటనే ఆసుపత్రికి తరలించారు. ఇక మెయిన్‌పురి జిల్లాలో నగ్లా కీరత్ గ్రామంలోని ప్రభుత్వ కాంపోజిట్ పాఠశాలలో దాదాపు 20 మంది పిల్లలను ఆసుపత్రిలో చేర్చారు.

ఎప్‌స్టీన్ ద్వీపాన్ని సందర్శించా: లుట్నిక్

ఇంటర్నెట్ డెస్క్: ఎప్‌స్టీన్ ద్వీపాన్ని సందర్శించిన విషయం వాస్తవమేనని అమెరికా వాణిజ్య మంత్రి హోవర్డ్ లుట్నిక్ అంగీకరించారు. తాను ఎప్‌స్టీన్‌తో కలిసి అతడి ప్రైవేటు ద్వీపంలో విందులో పాల్గొన్నట్లు తెలిపారు. ఇటీవల అమెరికా కాంగ్రెస్ ఎదుట విచారణకు హాజరైన లుట్నిక్.. వాంగ్మూలం ఇచ్చారు. అయితే తాను ఎప్పుడో ఎప్‌స్టీన్‌తో సంబంధాలను తెగదెంపులు చేసుకున్నట్లు వివరించారు. మరోవైపు ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం కేసుపై 2018లో ఎఫ్‌బీఐ దర్యాప్తు మొదలు పెట్టిన రోజున ఎప్‌స్టీన్ 330 గ్యాలన్ల సల్ఫ్యూరిక్ యాసిడ్ కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. దర్యాప్తు అధికారులకు ఆధారాలు దొరక్కుండా జాగ్రత్త పడేందుకు ఎప్‌స్టీన్ సల్ఫ్యూరిక్ యాసిడ్‌ను కొనుగోలు చేసి ఉంటాడని అనుమానిస్తున్నారు.

27న వాయుసేన భారీ యుద్ధ విన్యాసాలు..

దిల్లీ: భారత వాయుసేన భారీ స్థాయిలో యుద్ధవిన్యాసాలను ప్రదర్శించడానికి సిద్ధమవుతోంది. ఈ నెల 27న రాజస్థాన్‌లోని పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద వాయుశక్తి-2026 పేరుతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది. భారత్-పాకిస్థాన్ సరిహద్దుకు సమీపంలో జరగనున్న ఈ విన్యాసాల్లో రఫేల్, సుఖోయ్-30, మిగ్-29, తేజస్, జాగ్వార్ లాంటి అత్యాధునిక యుద్ధ విమానాలు పాల్గొననున్నాయని భారత ఆర్మీ వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ మార్షల్ నగేశ్ కపూర్ వెల్లడించారు.

పంజాబ్‌లో 16 పాఠశాలలకు బాంబు బెదిరింపులు

చండీగఢ్: పంజాబ్‌లోని మొహాలీలో 16 పాఠశాలలకు బుధవారం బెదిరింపు ఈ-మెయిల్స్ వచ్చాయి. దీంతో అప్రమత్తమైన ఆయా స్కూల్ యాజమాన్యాలు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చాయి. విద్యార్థులు, సిబ్బందిని ఇంటికి పంపించి పాఠశాలలకు సెలవు ప్రకటించారు. పాఠశాలల్లో బాంబు నిర్వీర్య దళాలు తనిఖీలు చేపట్టాయి. అయితే ఎలాంటి అనుమానాస్పద వస్తువులు లభించలేదని పోలీసులు తెలిపారు. దీనిపై దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

అణ్వస్త్ర పరిమితి ఒప్పందం పొడిగింపునకు సిద్ధమే: రష్యా

మాస్కో: అణ్వాయుధాలను నిర్దిష్ట సంఖ్యకు పరిమితం చేసుకోవాలని 2010లో కుదుర్చుకున్న స్టార్ట్ ఒప్పందం గడువు ఈ నెల 5వ తేదీతో ముగిసినప్పటికీ... అమెరికా పాత పరిమితిని కొనసాగిస్తే తామూ దాన్ని పాటిస్తామని రష్యా విదేశాంగ మంత్రి సెర్గెయ్ లావ్రోవ్ బుధవారం దేశ పార్లమెంటుకు తెలిపారు.

నిరసనకారులపై ఉక్కుపాదం మోపినందుకు
ఇరాన్ అధ్యక్షుడి క్షమాపణలు

- తాము అణ్వాయుధాలను కోరుకోవడం లేదని స్పష్టీకరణ
- తనిఖీలకు సిద్ధమేనని వెల్లడి

దుబాయ్: ఇరాన్‌లో ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టిన నిరసనకారులపై గత నెలలో ఉక్కుపాదం మోపినందుకు ఆ దేశాధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్ క్షమాపణలు చెప్పారు. ప్రజలతో ఘర్షణలను తాము ఎంత మాత్రమూ కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. కొన్ని పాశ్చాత్య దేశాల విషప్రచారమే ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలకు దారితీసిందని ఆరోపించారు. ఇరాన్‌లో 1979 నాటి ఇస్లామిక్ విప్లవం 47వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం ఏర్పాటుచేసిన



పెజెష్కియాన్

కార్యక్రమంలో పెజెష్కియాన్ ఈ మేరకు ప్రసంగించారు. "ఇటీవల దేశవ్యాప్త నిరసనల వల్ల, అనంతరం భద్రతా బలగాలు చేపట్టిన అణచివేత చర్యల కారణంగా కుటుంబసభ్యులను కోల్పోయినవారు, గాయపడినవారు తీవ్ర వేదన అనుభవించారు. ఈ విషయంలో మేం సిగ్గుపడుతున్నాం. దేశంలో ఆర్థిక సంక్షోభాన్ని కట్టడి చేయలేకపోయాం. నిరసనకారులను హింసాత్మక రీతిలో అణచివేసినందుకు క్షమాపణలు చెబుతున్నాం" అని పేర్కొన్నారు. ఇరాన్ పెద్దమొత్తంలో అణ్వాయుధాలు తయారుచేస్తోందంటూ ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని పెజెష్కియాన్ అన్నారు. "మేం అణ్వాయుధాలను కోరుకోవడం లేదు. కావాలంటే దేశంలో తనిఖీలు చేసుకోండి. అందుకు మేం సిద్ధమే" అని స్పష్టంచేశారు. అమెరికాతో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకునేందుకు కూడా తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఇస్లామిక్ విప్లవం వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఇరాన్వ్యాప్తంగా పలువురు ప్రభుత్వ అనుకూల ర్యాలీలు నిర్వహించగా.. మరికొందరు నిరంకుశ పాలన అంతమవ్వాలంటూ ప్రభుత్వ వ్యతిరేక ఆందోళనలు చేపట్టారు.

పశ్చిమాసియాకు మరో విమానవాహక నౌక!

ఇరాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇప్పటికే విమానవాహక నౌక ఐఎస్ఎస్ అబ్రహం లింకన్‌తో పాటు పలు నౌకలు, యుద్ధవిమానాలను పశ్చిమాసియాలో మోహరించిన అమెరికా.. మరో విమానవాహక నౌకనూ అక్కడికి పంపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తాజాగా ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఈ మేరకు ప్రతిపాదన తమ పరిశీలనలో ఉందన్నారు.

రెండో రౌండ్ చర్చలకు సిద్ధం?

అణు కార్యక్రమంపై అమెరికా, ఇరాన్ మధ్య రెండో రౌండ్ చర్చలకు సర్వం సిద్ధమవుతున్న సంకేతాలు కనిపిస్తున్నాయి! ఆ రెండు దేశాల మధ్య తొలి విడత పరోక్ష చర్చలకు వేదికగా నిలిచిన ఒమన్‌లో ఈ వారంలోనే పర్యటించిన ఇరాన్ అగ్ర భద్రతాధికారి అలీ లారిజాని తాజాగా ఖతర్‌కు వెళ్లారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఖతర్ ఎమిర్‌తో ఫోన్‌లో మాట్లాడిన అనంతరం లారిజాని ఆ దేశానికి చేరుకోవడం గమనార్హం.



సోమాలియా రాజధాని మొగదిషులో ల్యాండింగ్ సమయంలో రన్‌వేపై నుంచి పక్కనున్న సముద్ర తీరంలోకి దూసుకెళ్లి ఆగిన విమానం. అందులోని 50 మంది ప్రయాణికులు, ఐదుగురు సిబ్బంది సురక్షితమని అధికారులు తెలిపారు.

10 విమానాలు కూలాయ్

భారత్, పాక్‌ల మధ్య అణు యుద్ధం జరిగేది: ట్రంప్

న్యూయార్క్, వాషింగ్టన్: భారత్, పాకిస్థాన్‌ల మధ్య అణు యుద్ధం జరిగేదని, సుంకాల హెచ్చరికల ద్వారా తాను దానిని ఆపానని, ఆ ఘర్షణలో 10 విమానాలు నేల కూలాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. 'నేను 8 యుద్ధాలను ఆపేశా. సుంకాల హెచ్చరికల వల్ల 6 యుద్ధాలు ఆగిపోయాయి. యుద్ధాలను ఆపకపోతే అధిక సుంకాలను విధిస్తానని హెచ్చరించా. ఎందుకంటే ప్రజలు చనిపోవడం నాకు ఇష్టం లేదు' అని మంగళవారం 'ఫాక్స్ బిజినెస్'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన పేర్కొన్నారు. కోటి మంది ప్రాణాలను కాపాడారని పాకిస్థాన్ ప్రధాని తనను ప్రశంసించారని వెల్లడించారు. భారత్, పాక్ యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ ఇప్పటి దాకా 80సార్లకుపైగా చెప్పారు.



మా దేశాన్ని టాయిలెట్ పేపర్ కంటే ఘోరంగా చూస్తోంది


అమెరికాపై పాక్ రక్షణమంత్రి ఆసిఫ్ ఖవాజా వ్యాఖ్యలు

ఇంటర్నెట్ డెస్క్: అమెరికా తన రాజకీయ ప్రాధాన్యాలు, అవసరాలు, వ్యూహాత్మక ప్రయోజనాల కోసం తమ దేశాన్ని వాడుకొందని పాకిస్థాన్ రక్షణమంత్రి ఆసిఫ్ ఖవాజా తీవ్ర ఆరోపణలు చేశారు. ఆయన పాక్ జాతీయ అసెంబ్లీలో మాట్లాడుతూ.. "మా దేశాన్ని టాయిలెట్ పేపర్ కంటే ఘోరంగా అమెరికా తీసిపారేస్తోంది. అఫ్గానిస్థాన్ విషయంలో 1999 తర్వాత అమెరికాతో చేతులు కలపడం మేం చేసిన పెద్ద తప్పిదం. దీనివల్ల దేశం చాలా నష్టపోయింది. దాని పర్యవసానాలను ఇప్పటికీ అనుభవిస్తున్నాం. 1999లో అప్పటి పాక్ సైన్యాధిపతి జనరల్ పర్వేజ్ ముషారఫ్ నేతృత్వంలోని సైన్యం.. ప్రధాన మంత్రి నవాజ్ షరీఫ్ ప్రభుత్వాన్ని కూల్చేసి అధికారాన్ని చేజిక్కించుకుంది. 2001 తర్వాత అమెరికా మద్దతుతో ఉగ్రవాదాన్ని నిర్మూలించడానికి తాలిబన్లకు వ్యతిరేకంగా మా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. తిరిగి మాపైనే తాలిబన్లు హింసకు పాల్పడ్డారు. మేము ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు అగ్రరాజ్యం ఎటువంటి సహాయం చేయలేదు" అని ఆసిఫ్ పేర్కొన్నారు.



రష్యా చమురును భారత్ కొనబోదన్నది ట్రంప్ ఒక్కరే

- మోదీ సహా భారతీయ నేతలెవరూ ఆ మాట చెప్పలేదు
- పార్లమెంటులో రష్యా విదేశాంగ మంత్రి లవ్రోవ్ వ్యాఖ్యలు



మాస్కో: అమెరికాతో వాణిజ్య ఒప్పందం నేపథ్యంలో రష్యా నుంచి చమురు కొనుగోళ్లను భారత్ నిలిపివేయనుందంటూ వార్తలొస్తున్న వేళ.. రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ తమ దేశ పార్లమెంటులో కీలక వ్యాఖ్యలు చేశారు. మాస్కో నుంచి చమురు కొనుగోలును దిల్లీ ఆపేస్తుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మినహా మరెవరూ చెప్పలేదన్నారు. పార్లమెంటు దిగువ సభలో ఓ సభ్యుడు అడిగిన ప్రశ్నకు లావ్రోవ్ బుధవారం ఈ మేరకు సమాధానమిచ్చారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయబోమని ప్రధాని మోదీ సహా ఇతర భారతీయ నేతలెవరూ ప్రకటించలేదన్నారు. భారత్ వేదికగా ఈ ఏడాది జరగబోయే బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సులో 'ఇంధన భద్రత' ఓ కీలకాంశంగా ఉండబోతోందని విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ ఇటీవల వ్యాఖ్యానించిన సంగతిని లావ్రోవ్ గుర్తుచేశారు. ఆ సదస్సు సందర్భంగా మోదీతో రష్యా అధ్యక్షుడు పుతిన్ భేటీ అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. దిల్లీతో సంబంధాల విషయంలో మాస్కో ఆకాశమే హద్దుగా ఎంత దూరమైనా వెళ్తుందని ఉద్ఘాటించారు.

■ ఉక్రెయిన్‌పై రష్యా దాడులు కొనసాగుతున్నాయి. ఖర్కీవ్ ప్రాంతంలో మాస్కో బలగాలు మంగళవారం రాత్రి జరిపిన డ్రోన్ దాడిలో ఓ ఇల్లు ధ్వంసమైంది. ఈ ఘటనలో 34 ఏళ్ల ఓ వ్యక్తి, అతడి ముగ్గురు పిల్లలు మృత్యువాతపడ్డారు. మృతుల్లో ఇద్దరు రెండేళ్ల వయసున్న కవల బాలురు కాగా, మరొకరు ఏడాది వయసున్న పాప. దాడిలో ఆ పిల్లల తల్లి (35 వారాల గర్భిణి) తీవ్రంగా గాయపడింది.



మన డేటాను విదేశీయులకు అప్పగిస్తున్నారు: రాహుల్

దిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) ఇంజిన్‌కు పెట్రోల్ వంటి డేటాను విదేశీ శక్తికి అమ్మేసేలా ప్రధాని నరేంద్రమోదీపై ఒత్తిడి తెచ్చారని లోక్‌సభ విపక్షనేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఇది సిగ్గుచేటైన విషయమన్నారు. 140 కోట్ల మంది భారతీయుల డేటాను సురక్షితంగా భద్రపరచడానికి దేశం తంటాలు పడుతుందని చెప్పారు. ఏఐ వల్ల అవకాశాలతో పాటు ముప్పు సయితం ఉంటుందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. "మన ఆర్థిక రంగానికి కీలకమైన ఐటీ, సేవల రంగానికి ఇప్పుడు ముప్పు పొంచి ఉంది. రాబోయే ప్రభంజనాన్ని ఎదుర్కొనేందుకు మనం సిద్ధం కాకపోతే వేలమంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, వృత్తినిపుణులు తమ జీవనోపాధి కోల్పోవాల్సి వస్తుంది. తెలివైన మన ప్రజలు, మనం సృష్టించిన అపారమైన డేటా మనకు గొప్ప ఆస్తి. ఇలాంటిదానిని అమెరికా ఒత్తిడికి తలొగ్గి.. డిజిటల్ వాణిజ్యానికి అడ్డంకులు తొలగించే పేరుతో అగ్రరాజ్యానికి మోదీ నిస్సహాయంగా అప్పగిస్తున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం, వాట్సప్, యూట్యూబ్, అమెజాన్, ఆండ్రాయిడ్ వంటివాటి ద్వారా ఇప్పటికే మన డేటాపై విదేశీ కంపెనీల గుత్తాధిపత్యం ఉంది. కొత్త ఒప్పందంతో డేటాను భద్రంగా దాచడానికి ఇబ్బందిపడాల్సి వస్తుంది" అని ఆందోళన వ్యక్తంచేశారు.

నరవణె పుస్తకంపై వివాదం..


పెంగ్విన్ ఇండియాకు దిల్లీ పోలీసుల నోటీసులు

దిల్లీ: భారత సైన్యం మాజీ అధిపతి జనరల్ మనోజ్ ముకుంద్ నరవణె రచించిన 'ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ' పుస్తకంపై రాజకీయ దుమారం రేగుతున్న వేళ.. ప్రచురణ సంస్థ పెంగ్విన్ ర్యాండమ్ హౌజ్ ఇండియా(పీఆర్‌హెచ్‌ఐ)కు దిల్లీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ఇంకా ప్రచురితం కాని ఆ పుస్తకానికి సంబంధించిన అనధికారిక డిజిటల్ కాపీలు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో ఈ చర్య చేపట్టారు. పెంగ్విన్ సంస్థ యాజమాన్యం దీనిపై స్పష్టత ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. ఆ పుస్తకానికి సంబంధించిన పలు ప్రశ్నలను సంధించి.. వాటికి వివరణ కోరారు. ఆ పుస్తకం ప్రచురితం కాలేదని, అది మార్కెట్‌లో అందుబాటులో లేదని పీఆర్‌హెచ్‌ఐ పేర్కొంది. అధికారికంగా విడుదల చేసి, రిటైల్ వేదికల్లో విక్రయానికి సిద్ధంగా ఉంచిన పుస్తకాలనే ప్రచురితమైనవిగా పరిగణిస్తారని వెల్లడించింది.

'సీనియర్ న్యాయవాది' హోదాకు కొత్త మార్గదర్శకాలు జారీ

పాత నిబంధనలను సవరించిన సుప్రీంకోర్టు

దిల్లీ: లాయర్లకు 'సీనియర్ న్యాయవాది' హోదా కల్పించటానికి పాటించే కొత్త మార్గదర్శకాలను సుప్రీంకోర్టు బుధవారం నోటిఫై చేసింది. గతం (2023)లో రూపొందించిన నిబంధనల్లో మార్పులు చేస్తూ కొత్త ప్రమాణాలను రూపొందించింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం...సీనియర్ న్యాయవాది హోదాకు సంబంధించిన వ్యవహారాల కోసం శాశ్వత కమిటీ ఏర్పాటు కానుంది. దీనికి సీజేఐ ఛైర్‌పర్సన్‌గా, ఇద్దరు సీనియర్ జడ్జిలు కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారు. కమిటీకి శాశ్వత సచివాలయం ఏర్పాటవుతుంది. ప్రతి ఏడాది న్యాయవాదుల నుంచి దరఖాస్తులను ఆహ్వానించి సీనియర్ హోదా కల్పించడంపై నిర్ణయం తీసుకుంటుంది.



తలాక్ వివాదం పరిష్కారానికి మధ్యవర్తిగా జస్టిస్ కురియన్ జోసెఫ్

దిల్లీ: భార్యాభర్తల మధ్య తలెత్తిన వైవాహిక వివాదాన్ని సామరస్యంగా పరిష్కరించటానికి గాను మాజీ న్యాయమూర్తి జస్టిస్ కురియన్ జోసెఫ్‌ను మధ్యవర్తిగా సుప్రీంకోర్టు నియమించింది. తన భర్త పంపిన ముమ్మారు తలాక్ నోటీసుల చెల్లుబాటును ప్రశ్నిస్తూ పాత్రికేయురాలు బెనజీర్ హీనా ఈ పిటిషన్ దాఖలు చేశారు. మధ్యవర్తిత్వం ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని భావిస్తున్నట్లు హీనా తరఫు న్యాయవాది తెలిపారు. దీంతో మధ్యవర్తిత్వ న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిందిగా భార్యాభర్తలకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మల్యా బాగ్చి ధర్మాసనం సూచించింది.

బెంగాల్‌లో బాబ్రీ తరహా మసీదు నిర్మాణం ప్రారంభం

రెజినగర్: తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) బహిష్కృత ఎమ్మెల్యే హుమయూన్ కబీర్ నేతృత్వంలో అయోధ్య బాబ్రీ మసీదు తరహా నిర్మాణం ప్రారంభమైంది. పశ్చిమ బెంగాల్‌లోని ముర్షిదాబాద్ జిల్లా రెజినగర్‌లో బుధవారం మధ్యాహ్నం దీనికి శంకుస్థాపన జరిగింది. రూ.55 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ నిర్మాణం రెండేళ్లలో పూర్తవుతుందని కబీర్ తెలిపారు. టీఎంసీ తరఫున ఎమ్మెల్యేగా ఎన్నికయిన కబీర్‌ను మసీదు నిర్మాణం ప్రకటన నేపథ్యంలో ఆ పార్టీ బహిష్కరించింది. అనంతరం ఆయన జనతా ఉన్నాయన్ పార్టీ (జేయూపీ)ని నెలకొల్పారు.

పంచాయతీరాజ్ బిల్లు ముసాయిదాకు ఆమోదం

- మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పంచాయతీరాజ్ (రెండో సవరణ) బిల్లు -2026 ముసాయిదాకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ సవరణలో భాగంగా 1994 నాటి పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేసి, ఓటర్ల జాబితా తయారీ, ప్రచురణకు ప్రస్తుత జనవరి 1తో పాటు ఏప్రిల్ 1, జులై 1, అక్టోబర్ 1 తేదీలను కూడా అర్హత తేదీలుగా గుర్తించనున్నారు. సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో దీంతోపాటు పలు కీలక నిర్ణయాల్ని ఆమోదించారు.

మరిన్ని ప్రతిపాదనలకు ఆమోదం

- 2025-26కిగాను భారీ, మధ్య, చిన్న తరహా జలవనరులకు సంబంధించిన 7,189 పనుల నిర్వహణ వ్యయాన్ని రూ.344 కోట్లుగా సవరించిన అంచనాలకు ఆమోదం. పనుల ప్రాధాన్యానికి అనుగుణంగా గతంలో ఉన్న పనుల సంఖ్యను 7,174 నుంచి 7,189కి పెంచారు.
- ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం తోటపల్లి గ్రామంలో కంప్రెస్డ్ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు 45.60 ఎకరాల్ని రాష్ట్ర నూతన పునరుత్పాదక ఇంధన అభివృద్ధి సంస్థకు కేటాయించే ప్రతిపాదనకు ఆమోదం.
- నంద్యాల జిల్లా సంజామల మండలంలోని నొస్సం గ్రామంలో 250 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్టు కోసం 1,500 ఎకరాల్ని ఎన్ఆర్ఈడీసీఏపీకి లీజుకు ఇవ్వాలనే ప్రతిపాదనకు ఆమోదం. ఇది 30 ఏళ్లపాటు అమల్లో ఉండనుంది. ఎకరాకు ఏడాదికి రూ.31,000 లీజు రుసుము చెల్లించనున్నారు. ప్రతి రెండేళ్లకు 5% పెంపునకు అనుమతి
- విశాఖ జిల్లా ఆనందపురం మండలం గుడిలోవ గ్రామంలోని 18.57 ఎకరాల ప్రభుత్వ భూమిని రాష్ట్ర సేవా సమితికి బదిలీ చేయాలనే ప్రతిపాదనకు ఆమోదం
- విశాఖ జిల్లా గాజువాక రెవెన్యూ గ్రామ పరిధిలోని ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు లేదా నిర్మాణాల (1000 చ.గ. వరకు) క్రమబద్ధీకరణకు దరఖాస్తుల సమర్పణ గడువును జూన్ 30 వరకు పొడిగించేందుకు ఆమోదం
- గృహాల క్రమబద్ధీకరణ పథకం-2025 కింద రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ భూముల్లో నిర్మించిన గృహాల క్రమబద్ధీకరణ దరఖాస్తుల సమర్పణ గడువును జూన్ 30 వరకు పొడిగించేందుకు ఆమోదం
- రామాయపట్నం పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థకు సంబంధించి ఉన్న ప్రస్తుత పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ) రుణాన్ని సాగర్‌మాల ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎస్ఎంఎఫ్‌సీఎల్) ద్వారా రీఫైనాన్స్ చేయడానికి ఆమోదం. ఇందులో భాగంగా పీఎఫ్‌సీ రుణాన్ని ముందుగానే ముగించి రూ.3,938.10 కోట్ల రుణానికి సంబంధించి ఎస్ఎంఎఫ్‌సీఎల్‌కు రాష్ట్ర ప్రభుత్వం గ్యారంటీ ఇవ్వనుంది. దీని వల్ల ప్రభుత్వంపై వడ్డీ భారం తగ్గనుంది.
- ఎన్ఆర్ఈడీసీఏపీ ఎండీ ప్రతిపాదన, సుజలాన్ ఎనర్జీ, యాక్సెస్ ఎనర్జీ సంస్థల అభ్యర్థన మేరకు పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల గడువును మరో రెండేళ్లు పొడిగించేందుకు ఆమోదం.. దీని వల్ల పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి నిరంతరం కొనసాగనుంది.
- కృష్ణా జిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో విజయవాడ కస్టమ్స్ (ప్రివెంటివ్) కమిషనరేట్‌కు కేటాయించిన 3.84 ఎకరాల్లో సిబ్బంది కార్యాలయ భవనం, రెసిడెన్షియల్ క్వార్టర్స్ నిర్మాణానికి ఉపయోగించుకునే ప్రతిపాదనకు ఆమోదం. గతంలో ఈ స్థలాన్ని కేవలం కార్యాలయ నిర్మాణానికి కేటాయించారు. ఇప్పుడు దాంతోపాటు సిబ్బందికి నివాసగృహాలు కూడా నిర్మించుకోవడానికి అనుమతి
- ఏపీ ట్రాన్స్‌కో కడప జోన్ రోజువారీ పరిపాలన విధుల కోసం ఒక అసిస్టెంట్ సెక్రటరీ (రూ.1,17,495-2,28,995 పే స్కేల్) పోస్టును సృష్టించేందుకు ఏపీ ట్రాన్స్‌కో సీఎండీకి మంత్రిమండలి అనుమతి. ప్రస్తుతం అక్కడ ఖాళీగా ఉన్న నాలుగు బ్లూ ప్రింట్ ఆపరేటర్ పోస్టుల రద్దు
- ఏపీజెన్‌కో- ఎన్‌హెచ్‌పీసీ జాయింట్ వెంచర్ నుంచి నంద్యాల జిల్లా యాగంటి, ప్రకాశం జిల్లా రాజుపాలెం పీఎస్‌పీ ప్రాజెక్టుల్ని మినహాయిస్తూ నిర్ణయం. ఇక ఏపీజెన్‌కో స్వతంత్రంగా ఈ ప్రాజెక్టుల్ని నిర్వహించనుంది.
- హైకోర్టు ఆదేశాల మేరకు.. కడప కేంద్ర కారాగారంలో జీవితఖైదు అనుభవిస్తున్న లియాఖత్ అలీఖాన్ అనే ఖైదీ శిక్ష కాలాన్ని తగ్గిస్తూ నిర్ణయం.

పోలవరం నల్లమలసాగర్ అనుసంధాన సన్నద్ధ పనులకు రూ.14.37 కోట్లు

- జలవనరులశాఖ నిర్ణయాలకు మంత్రిమండలి ఆమోదం

ఈనాడు, అమరావతి: పోలవరం ప్రాజెక్టు నుంచి నల్లమలసాగర్ అనుసంధానం కోసం డీపీఆర్ తయారీ, ఇతర సాంకేతిక అంశాల అధ్యయనం, సర్వేలు, ఇతర కార్యక్రమాల కోసం రూ.14.37 కోట్లు కేటాయిస్తూ జలవనరులశాఖ గతంలో తీసుకున్న నిర్ణయాలను రాష్ట్ర మంత్రివర్గం ర్యాటిఫై చేసింది. వెలగపూడి సచివాలయంలో బుధవారం నిర్వహించిన మంత్రివర్గ సమావేశంలో ఈ తీర్మానం చేశారు. తొలుత పోలవరం నుంచి బనకచర్ల అనుసంధానం కోసం అవసరమైన డీపీఆర్ తయారుచేసేందుకు కృష్ణా డెల్టా చీఫ్ ఇంజినీర్ ఆదేశాల మేరకు టెండర్లు పిలిచారు. తర్వాత ఈ ప్రాజెక్టును పోలవరం నల్లమలసాగర్ వరకు పరిమితం చేయాలని నిర్ణయించారు. పోలవరం నుంచి ప్రకాశం బ్యారేజికి, ప్రకాశం బ్యారేజి నుంచి బొల్లాపల్లి జలాశయం వరకు నీళ్లు తీసుకువెళ్లడం మొదటి ప్రణాళిక ప్రకారమే. మూడో భాగంలో బనకచర్ల వరకు తీసుకువెళ్లకుండా నల్లమలసాగర్ జలాశయం వరకు మళ్లింపునకు పరిమితం చేశారు. ఆ మేరకు డీపీఆర్ తయారీకి టెండర్లు మార్చి ఆహ్వానించారు.

గోదావరి పెన్నా తొలిదశ పనుల్లో భాగంగా మొదటి ప్యాకేజీ కోసం కేటాయించిన నిధుల నుంచి పోలవరం నల్లమలసాగర్ అనుసంధానానికి రూ.14.37 కోట్లు ఖర్చు పెట్టేందుకు గతంలోనే ఈఎన్‌సీ నిధులు మంజూరుచేశారు. ఆ నిర్ణయాన్ని ఇప్పుడు మంత్రిమండలి ఆమోదించింది.

- పోలవరం నల్లమలసాగర్ అనుసంధానం ప్రాజెక్టుకు డీపీఆర్ రూపొందించాలి. కేంద్ర జలసంఘం మార్గదర్శకాల ప్రకారం అవసరమైన పరిశోధన సాగించి రూపొందించాలి. కేంద్రం నుంచి ఇతర అనుమతులు పొందేందుకు అవసరమైన సర్వేలు చేయాలి. ఇందుకోసం రూ.9.20 కోట్లు కేటాయించారు.
- అటవీ ప్రాంతం ఎంత ముంపులో ఉంటుందో తేల్చేందుకు డీజీపీఎస్ సర్వే చేయాలి. ప్రత్యామ్నాయంగా ఆ అడవిని ఎక్కడ పెంచవచ్చో ఆ ప్రదేశాలపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలి. ఇందుకోసం రూ.1.28 కోట్లు
- ప్రతిపాదిత బొల్లాపల్లి జలాశయం వల్ల ముంపులో చిక్కుకునే గ్రామాలు, పునరావాస అనుమతులు సాధించేందుకు అవసరమైన సమాచారం, సాంఘిక ఆర్థికసర్వే నిర్వహణతో పాటు సమగ్ర పునరావాస ప్రణాళిక తయారుచేయాలి. ఇందుకోసం రూ.0.49 కోట్లు కేటాయించారు. పర్యావరణ మదింపు సర్వేలు, ఇతర అంశాలకు రూ.3.50 కోట్లు కేటాయించారు.

7189 నిర్వహణ పనులకూ ఆమోదం

రాష్ట్రంలో రూ.344.39 కోట్ల అంచనా వ్యయంతో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారీ, మధ్యతరహా, చిన్నతరహా నీటిపారుదల కింద 7,189 పనులు చేపట్టేందుకు వీలుగా రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలియజేసింది. జలవనరులశాఖ ఇప్పటికే ఇచ్చిన ఆదేశాల మేరకు మంత్రిమండలి ముందుంచి ఆమోదం పొందారు. తొలుత ఆ నిధులతో 7,174 పనులు చేపట్టేందుకు జలవనరులశాఖ ఉత్తర్వులు ఇచ్చింది. తర్వాత అదే మొత్తంతో 7,189 పనులు చేపడుతున్నారు.

అసెంబ్లీ మీడియా పాయింట్

శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాలకు కల్తీ నెయ్యి సరఫరాపై విచారణ చేయించాలి

- బొజ్జల సుధీర్‌రెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

ఈనాడు-అమరావతి: "శ్రీకాళహస్తి, కాణిపాకం ఆలయాలకూ గత వైకాపా ప్రభుత్వంలో కల్తీ నెయ్యి సరఫరా అయ్యింది. దీనిపై విచారణ జరిపి, నిందితుల్ని కఠినంగా శిక్షించాలి. తితిదేకు రసాయనాలతో కూడిన కల్తీ నెయ్యి సరఫరా చేసిన ముఠానే ఈ పాపానికీ ఒడిగట్టింది. ఈ ఘటనపై హిందువులతో పాటు బీబీ నాంచారమ్మను తమ ఆడపడుచుగా భావించే ముస్లింలు కూడా బాధపడ్డారు. వారి మనోభావాలూ దెబ్బతిన్నాయి. గవర్నర్ ప్రసంగానికి అడ్డుతగలాలని వైకాపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జగన్, బొత్స సత్యనారాయణ సూచించడం వారి వికృత చేష్టలకు అద్దం పడుతోంది. ఆ పార్టీ ఎమ్మెల్యేల్ని ప్రజలు గెలిపించింది ప్లకార్డులు చింపి గవర్నర్ మీద వేయడానికా? సభకు రాని వారి జీతాలు, అలవెన్సులు రద్దు చేయాలి."

రసాయనాలతో కల్తీ చేసినా పర్లేదా..?

–మురళీమోహన్, పూతలపట్టు ఎమ్మెల్యే

"శ్రీవారి లడ్డూ తయారీకి వాడిన నెయ్యిలో జంతువుల కొవ్వు కలవలేదని వైకాపా వాళ్లు అబద్ధాలు చెబుతున్నారు. మరి రసాయనాలతో కల్తీ చేస్తే ఫరవాలేదా? ఈసారి అసెంబ్లీలో ఏఐ ఆధారిత డిజిటల్ అటెండెన్స్ పెట్టారు. ఇక దొంగతనంగా వచ్చి వైకాపా ఎమ్మెల్యేలు సంతకాలు చేసి వెళ్లడం కుదరదు. అసెంబ్లీలో అరగంట కూర్చొని గవర్నర్ చెప్పేది వినలేని వైకాపా వాళ్లను చూసి.. వీళ్లనా మనం గెలిపించిందని ప్రజలు నవ్వుకుంటున్నారు."

గవర్నర్ ప్రసంగంలో చెప్పినవన్నీ అబద్ధాలే

- వైకాపా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల విమర్శ

ఈనాడు, అమరావతి: గవర్నర్ ప్రసంగంలో చదివినవన్నీ అబద్ధాలేనని, ఎన్టీఆర్ భవన్ నుంచి వచ్చిన స్క్రిప్టునే ఆయన వినిపించారని వైకాపా నాయకులు విమర్శించారు. మాయమాటలతో కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్ష హోదా వైకాపా హక్కు అని.. ప్రజా సమస్యలపై శాసన మండలిలో ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల తొలి రోజున సభ నుంచి వాకౌట్ చేసిన తర్వాత ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు విలేకర్లతో మాట్లాడారు.

ప్రతిపక్ష హోదా వైకాపా హక్కు – తాటిపర్తి చంద్రశేఖర్, ఎమ్మెల్యే

అసెంబ్లీలో మాట్లాడడానికి ఎమ్మెల్యేలతో సమానంగా జగన్‌కు నిమిషం, రెండు నిమిషాలు సమయం ఇస్తామంటే ఒప్పుకోం. ప్రతిపక్ష హోదా వైకాపా హక్కు. ప్రజాసమస్యలు ప్రస్తావించే అవకాశం ఇవ్వకపోవడం వల్లే నిరసన తెలిపాం. ప్రభుత్వం హామీల అమలులో విఫలమయ్యింది.

సమ్మెకు ఏపీ ఐకాస మద్దతు: బొప్పరాజు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈనెల 12న దేశ వ్యాప్తంగా నిర్వహించనున్న జాతీయ సార్వత్రిక సమ్మెకు ఏపీ ఐకాస అమరావతి మద్దతు తెలుపుతున్నట్లు ఐకాస ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 12న ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు కావాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు.

మావోయిస్టు అగ్రనేత సంగ్రామ్ భార్య సుగుణ మృతి

ఈనాడు, హైదరాబాద్: మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మల్లా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్ భార్య బిచ్చె సుగుణ అనారోగ్య కారణాలతో మరణించారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ముజ్జిమేండ్రి గ్రామంలో మృతిచెందారు. బస్తర్ అడవుల కేంద్రంగా ఆమె విప్లవోద్యమంలోకి వచ్చారు.

ఉప ముఖ్యమంత్రితో ఎమ్మెల్యేల భేటీ

- రోడ్లు మంజూరు చేసినందుకు కొందరు
- నిధులు కావాలంటూ మరికొందరు

ఈనాడు, అమరావతి: ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసి వారి నియోజకవర్గాల్లో గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. శాసనసభలో బుధవారం ఎన్డీయే శాసనసభాపక్ష సమావేశం అనంతరం వారంతా ఉప ముఖ్యమంత్రిని కలిశారు. ఎమ్మెల్యేలు బండారు సత్యానందరావు (కొత్తపేట), వేగుళ్ల జోగేశ్వరరావు (మండపేట), దాట్ల సుబ్బరాజు (ముమ్మిడివరం), అయితాబత్తుల ఆనందరావు (అమలాపురం), ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం తదితరులు ఉప ముఖ్యమంత్రిని కలిశారు. నాలుగు నియోజకవర్గాల్లో సాస్కీ నిధులు రూ.65.14 కోట్లతో 40 రోడ్లు అభివృద్ధి చేస్తున్నారు. మండపేటకు రూ.22.75 కోట్లు, అమలాపురానికి రూ.16.18 కోట్లు, కొత్తపేటకు రూ.14.93 కోట్లు, ముమ్మిడివరానికి రూ.11.28 కోట్లు కేటాయించారు. వాడపల్లి వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లే కరకట్ట రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సత్యానందరావు అభ్యర్థన మేరకు రూ.6 కోట్లు కేటాయించారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావులు కలిసి తమ నియోజకవర్గాల్లోని సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. శ్రీకాళహస్తిలో శివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని అక్కడి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆహ్వానపత్రం అందజేశారు.

సభకు రాకుండా దొంగచాటుగా సంతకాలు పెట్టి వెళ్లడం ఇక కుదరదు

- ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు

ఈనాడు, అమరావతి : సభకు రాకుండా, ప్రజాసమస్యలు ప్రస్తావించకుండా వైకాపా ఎమ్మెల్యేలు దొంగచాటుగా అసెంబ్లీ రిజిస్టర్‌లో సంతకాలు పెట్టి వెళ్లిపోవడానికి ఇక వీల్లేదని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. గురువారం నుంచి ఏఐ ఆధారిత ముఖ గుర్తింపు విధానంలో ఎమ్మెల్యేల హాజరు తీసుకోనున్నట్లు వెల్లడించారు. అసభ్యతకు బయపడి వైకాపా అధినేత జగన్ సహా ఆ పార్టీ ఎమ్మెల్యేలు గవర్నర్ ప్రసంగానికి వచ్చి 11 నిమిషాల్లో వెళ్లిపోయారని ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ప్రాంగణంలో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. "అసెంబ్లీకి హాజరయ్యే తీరిక, చర్చల్లో పాల్గొనే ఓపిక వైకాపా వాళ్లకు లేవు. సభా సంప్రదాయాలకు విరుద్ధంగా ప్లకార్డులు చించి గవర్నర్ మీదకు విసరడం సిగ్గుచేటు" అని జీవీ ఆంజనేయులు తెలిపారు.

పెద్దపాడులో దామోదరం సంజీవయ్య స్మృతిభవనం ఏర్పాటు చేయండి

చంద్రబాబునాయుడు, పవన్‌కల్యాణ్‌లకు వీహెచ్ లేఖలు

హైదరాబాద్, న్యూస్‌టుడే: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య స్వగ్రామం కర్నూల్ జిల్లా పెద్దపాడులో ఆయన పేరిట స్మృతి భవనం ఏర్పాటు చేయాలని ఏపీ ప్రభుత్వానికి దామోదరం సంజీవయ్య ట్రస్ట్ ఛైర్మన్, పీసీసీ మాజీ అధ్యక్షుడు వి.హనుమంతరావు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు బుధవారం లేఖలు రాశారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో మాట్లాడుతూ.. 'వైసీపీ ప్రభుత్వం స్మృతిభవనం కోసం రూ.2కోట్లు ఇస్తానని హామీ ఇచ్చినా కార్యరూపం దాల్చలేదు. పవన్‌కల్యాణ్ కూడా రూ.కోటి ఇస్తామని గతంలో హామీ ఇచ్చారు. చంద్రబాబు ప్రభుత్వం చొరవ తీసుకొని సంజీవయ్య జయంతి వచ్చే ఏడాది ఫిబ్రవరి 14 వరకైనా స్మృతిభవనం అందుబాటులోకి తీసుకురావాలి" అని ఆయన కోరారు.

జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులతో మంత్రి లోకేశ్ ఆత్మీయ సమావేశాలు

- నేడు మచిలీపట్నం లోక్‌సభ పరిధిలోని ప్రజాప్రతినిధులతో భేటీ

ఈనాడు, అమరావతి: అసెంబ్లీ సమావేశాల సమయంలో జిల్లాల వారీగా ప్రజాప్రతినిధులకు సమయం కేటాయించేందుకు మంత్రి నారా లోకేశ్ కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. లోక్‌సభ నియోజకవర్గాల (జిల్లాల) వారీగా వాటి పరిధిలోని తెదేపా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో ఆత్మీయ విందు సమావేశాలు చేపట్టనున్నారు. వారి యోగక్షేమాలను కనుక్కోవడం, వారి సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కారం చూపే దిశగా ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. ఆయా ప్రజాప్రతినిధుల కుటుంబ సభ్యులనూ ఈ విందుకు ఆహ్వానిస్తారు. గురువారం నుంచి ప్రారంభించే ఈ కార్యక్రమంలో తొలిరోజు మచిలీపట్నం లోక్‌సభ (కృష్ణా జిల్లా) పరిధిలోని తెదేపా ప్రజాప్రతినిధులతో మంత్రి లోకేశ్ సమావేశం అవుతారు.

సెలవుపై ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్

ఈనాడు, అమరావతి: ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని వైద్య సేవల కోసం సెలవుపై వెళ్లేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సెలవు కాలానికి పూర్తి జీతాన్ని చెల్లించేందుకు అనుమతించింది. ఆయన సెలవు నుంచి తిరిగి వచ్చిన తర్వాత అదే పోస్టులో కొనసాగుతారని పేర్కొంది. అప్పటి వరకు ఆయన పర్యవేక్షించే బాధ్యతలను పలువురు అధికారులకు అప్పగించింది. ఐటీ శాఖ కార్యదర్శిగా వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్‌కు పూర్తి అదనపు బాధ్యతలు ప్రభుత్వం అప్పగించింది. ఏపీ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్‌గా సీఎం కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, ఆర్టీజీఎస్, గ్రామ/వార్డు సచివాలయ కార్యదర్శిగా మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్‌కుమార్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది.

ఏపీటీడీసీ స్వర్ణోత్సవాలకు లోగో తయారీకి ఆహ్వానం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ(ఏపీటీడీసీ) స్వర్ణోత్సవ వేడుకలకు లోగో తయారీకి ప్రతిభావంతుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ కార్యనిర్వాహక సంచాలకులు(ఈడీ) ఏఎల్ పద్మావతి తెలిపారు. రాష్ట్ర పర్యాటక వైభవాన్ని చాటిచెప్పేలా 50 ఏళ్ల వేడుకల లోగో ఉండాలని బుధవారం ఒక ప్రకటనలో ఆమె సూచించారు. నిపుణుల కమిటీ ద్వారా ఎంపికైన ఉత్తమ లోగోకు రూ.20 వేల నగదు పారితోషికంతోపాటు సత్కారం ఉంటుందని అన్నారు. ఆసక్తిగల వారు తమ డిజైన్లు ఈ నెల 14 సాయంత్రం5 గంటల్లోగా (??gmmktg@aptdc.in, jayahobharathiyam@gmail.com) మెయిల్‌కి పంపాలని ఈడీ సూచించారు.

మున్సిపల్ షేర్డ్ సర్వీస్ సెంటర్ల ఏర్పాటుకు ఆదేశాలు

ఈనాడు, అమరావతి: పురపాలక సంఘాలు, నగర పంచాయతీల ఆర్థిక బలోపేతానికి, వాటికి సంబంధించిన ఆస్తుల నిర్వహణ, ప్రజలకు సాంకేతికత ఆధారిత సమగ్ర సేవలు అందించేందుకు మున్సిపల్ షేర్డ్ సర్వీస్ సెంటర్ల (ఎంఎస్ఎస్‌సీ) ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించింది. వీటి ఏర్పాటు, నిర్వహణను రాష్ట్ర పట్టణ మౌలిక వసతులు, ఆస్తుల నిర్వహణ సంస్థ (ఏపీయూఐఏఎంఎల్) చేపట్టనుంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ ఆస్తుల నిర్వహణ, శుద్ధి చేసిన మురుగునీటిని పరిశ్రమలు, సాగునీటి అవసరాలకు పంపిణీ, పన్నులు, పన్నేతర వసూళ్ల కోసం ఉత్తమ విధానాల అమలులో మున్సిపల్ షేర్డ్ సర్వీస్ సెంటర్లు క్రియాశీలకంగా వ్యవహరించనున్నాయి.

జోగి రమేష్‌కు నోటీసు ఇచ్చి వివరణ తీసుకోండి

ఇబ్రహీంపట్నం పోలీసులకు హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వైకాపా అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటన సందర్భంగా చోటు చేసుకున్న పరిణామాలపై ఇబ్రహీంపట్నం పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ వైకాపా నేత జోగి రమేష్ దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టు బుధవారం విచారణ జరిపింది. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లు ఏడేళ్లలోపు జైలు శిక్షకు వీలున్న నేపథ్యంలో బీఎన్ఎస్ సెక్షన్ 35(3) ప్రకారం రమేష్‌కు నోటీసులిచ్చి వివరణ తీసుకోవాలని పోలీసులను ఆదేశించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చారు.

ముసాయిదాపై రిజిస్టర్డ్ సంఘాల అభిప్రాయాలు తీసుకోవాలి: ఏపీఎస్ఈఏ

ఈనాడు, అమరావతి: పెన్షన్ విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం తీసుకొస్తున్న 'ఏపీ సివిల్ సర్వీసెస్ పెన్షన్ రూల్స్-2026' ముసాయిదాపై రిజిస్టర్డ్ సంఘాల అభిప్రాయాలను సైతం తీసుకోవాలని ఏపీ రాష్ట్ర ఎంప్లాయీస్ అసోసియేషన్(ఏపీఎస్ఈఏ) అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నల్లపల్లి విజయ్ భాస్కర్, నాగముసెయ్య కోరారు. "ముసాయిదాలో కొన్ని అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. 33ఏళ్ల గరిష్ఠ అర్హత సేవ అనే పరిమితి విధించడం వల్ల ఉద్యోగి ఎంతకాలం పని చేసినా అదనపు సేవకు పెన్షన్‌లో ఎలాంటి ప్రయోజనం లేదని పేర్కొన్నారు. 33ఏళ్ల సర్వీసు పూర్తయిన తర్వాత తప్పనిసరిగా పదవీ విరమణ చేయాల్సిన అవసరం లేదని చెబుతున్నా ప్రజాప్రయోజనం పేరిట ఉద్యోగిని పదవీ విరమణ చేయించే అధికారం నియామక అధికారికి కట్టబెట్టారు" అని పేర్కొన్నారు.

పురపాలకశాఖ విభాగాల్లో విజిలెన్స్ అధికారులు

ఈనాడు, అమరావతి: పురపాలక, పట్టణాభివృద్ధిశాఖలోని కీలక విభాగాల్లో అవినీతి కట్టడికి, ఫిర్యాదులు, అనుచిత ప్రవర్తనపై చర్యల కోసం శాఖాపరంగా విజిలెన్స్ అధికారులను ఏర్పాటు చేస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రజారోగ్య ఇంజినీరింగ్ ఈఎన్‌సీ కార్యాలయంలో చీఫ్ ఇంజినీర్ ఎ.సుధాకర్, సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ (హెచ్‌ఆర్) మల్లికార్జునరెడ్డి, పట్టణ ప్రణాళిక డైరెక్టర్ కార్యాలయంలో డైరెక్టర్ (జీఈవో) బి.శ్రీనివాసులు, విశాఖ మెట్రోపాలిటన్ రీజియన్ డెవలప్‌మెంట్ అథారిటీ (వీఎంఆర్‌డీఏ)లో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (ఎస్టేట్ విభాగం) బి.దయానిధి విజిలెన్స్ అధికారులుగా వ్యవహరిస్తారని పేర్కొన్నారు.

ఎయిడెడ్‌లో పోస్టుల విలీనానికి అనుమతి లేదు

- నియామకాలకు అనుమతించిన నెలలోనే ప్రక్రియ పూర్తి
- 40 మంది లోపు పిల్లలుంటే సంఖ్య పెంచుకునేందుకు రెండేళ్ల వరకు అవకాశం
- ఎయిడెడ్ పాఠశాలల నిర్వహణపై మార్గదర్శకాలు విడుదల చేసిన విద్యాశాఖ

ఈనాడు, అమరావతి: ఎయిడెడ్ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి అనుమతి, నియామక ప్రక్రియపై పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు విడుదల చేసింది. పోస్టుల భర్తీకి అనుమతించేటప్పుడు న్యాయస్థానం ఆదేశాలు, విద్యార్థి- ఉపాధ్యాయుల నిష్పత్తి, పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పాఠశాలలో మిగులు ఉపాధ్యాయులు లాంటి అంశాలను పరిశీలించాలని జిల్లా విద్యాధికారులకు సూచించింది. ఎయిడెడ్‌లో నియామకాలకు అనుమతి ఇచ్చిన ఒక నెలలో నియామకాలు పూర్తిచేయాలని, మైనారిటీయేతర విద్యాసంస్థల్లో పోస్టుల భర్తీకి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ, పరిశీలన చేయాలని ఆదేశించింది. కంప్యూటర్ ఆధారిత పరీక్షల నిర్వహించాలని, సర్టిఫికెట్ల పరిశీలన, ఫలితాల విడుదల పారదర్శకంగా సాగాలని సూచించింది. మైనారిటీ విద్యాసంస్థల్లో పరీక్షను మేనేజ్‌మెంట్ నిర్వహించుకునే వెసులుబాటు కల్పించింది.

◆ అన్-ఎయిడెడ్ నుంచి ఎయిడెడ్‌లో పోస్టుల విలీనానికి అనుమతి లేదు.

◆ ఎయిడెడ్ విద్యాసంస్థలకు నిర్వహణ నిధులు, బకాయిల చెల్లింపులకు యాజమాన్యాలు ప్రతి ఆర్థిక సంవత్సరంలో సెప్టెంబరు 30లోపు ఆడిట్ నివేదికలు సమర్పించాలి

◆ ప్రస్తుతం నిర్వహణకు 2% నిధులిస్తారు. బకాయిల క్లెయిమ్ కాలపరిమితి మూడేళ్లే ఉంటుంది.

◆ నిబంధనలు పాటించని విద్యాసంస్థల నిర్వహణ నిధుల బకాయిల చెల్లింపునకు అనుమతించరు.

◆ వైకాపా హయాంలో ఎయిడెడ్ పాఠశాలల విలీనానికి జారీచేసిన ఉత్తర్వుల ప్రకారం ఆస్తులతో ప్రభుత్వానికి అప్పగించడం, సిబ్బందినే ఇవ్వడం, యథాతథంగా నిర్వహించుకోవడం, గతంలో ఇచ్చిన సమ్మతిని వెనక్కి తీసుకునే అవకాశం ఉంటుంది.

◆ 40 మంది కంటే తక్కువ విద్యార్థులుంటే పిల్లల సంఖ్యను పెంచుకోవడానికి రెండేళ్లు అవకాశం కల్పిస్తారు. విద్యార్థుల సంఖ్య తగ్గిపోతుంటే నోటీసులు జారీచేస్తారు. ◆ పాఠశాల మూసివేత, విద్యార్థుల సంఖ్య తగ్గుదల, రేషనలైజేషన్ లాంటి కారణాలతో టీచర్లు, బోధనేతర సిబ్బందిని ఇతర ఎయిడెడ్ లేదా ప్రభుత్వ పాఠశాలలకు బదిలీ చేస్తారు.

◆ పోస్టులు మిగులుగా తేలితే ఆ టీచర్లను బదిలీ చేసినప్పటి నుంచి పాత పోస్టును రద్దు చేస్తారు.

◆ విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రాథమిక పాఠశాలల్లో 60 మందికి ఇద్దరు, 61-90 మందికి ముగ్గురు, 200 లోపు ఉంటే 40 మందికి ఒక్క టీచర్ చొప్పున ఇస్తారు.

◆ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 35మంది విద్యార్థులకు సైన్సు/గణితం, సాంఘికశాస్త్రం, భాష సబ్జెక్టుకు ఒక్కొక్కర్ని నియమిస్తారు.

◆ ఎయిడెడ్ పాఠశాలల్లో భవనాలు, ఒక టీచర్‌కు ఒక తరగతి గది, తాగునీరు, మరుగుదొడ్లు, ఆటస్థలం, గ్రంథాలయం, ప్రహరీ, వారానికి 45 పనిగంటలు లాంటి మౌలిక సదుపాయాలు ఉండాలి.

పాఠశాలలు ఇలా..

ప్రాథమిక పాఠశాలలు: 378
ప్రాథమికోన్నత: 118
ఉన్నత: 243
మొత్తం ఎయిడెడ్ పాఠశాలలు: 739
విద్యార్థులు: 80,817
మంజూరైన పోస్టులు: 7,532
పనిచేస్తున్న వారు: 2,813

హంద్రీనీవాకు కేంద్రం సాయమందించాలి

- 60 టీఎంసీల సామర్థ్యానికి పెంచాలి
- కేంద్రానికి లోక్‌సభలో తెదేపా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ వినతి



ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు ప్రాణాధారమైన పోలవరం ప్రాజెక్టును, రాయలసీమకు ముఖ్యమైన రాయలసీమ ఎత్తిపోతల పథకాలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి రాష్ట్రానికి తీవ్ర అన్యాయం చేసిన ఘనత గత వైకాపాదేనని అనంతపురం తెదేపా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ ఆరోపించారు. నాడు జరిగిన అన్యాయాన్ని నేటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సరిదిద్దుతున్నారన్నారు. హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా కుప్పం వరకు కృష్ణా నీటిని తీసుకెళ్లి కరవు ప్రాంతాన్ని పచ్చగా మార్చారని పేర్కొన్నారు. రాయలసీమకు వరప్రదాయిని అయిన ఈ ప్రాజెక్టు ప్రస్తుతం 40 టీఎంసీల నీరు మాత్రమే అందించగలుగుతోందని, దీన్ని 60 టీఎంసీల సామర్థ్యానికి విస్తరించేలా కేంద్ర ప్రభుత్వం ఆర్థికంగా చేయూతనివ్వాలని కోరారు. ఆయన బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై జరిగిన చర్చలో తెదేపా తరఫున మాట్లాడారు. 'వైకాపా ప్రభుత్వ హయాంలో రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని అనుమతులు లేకుండానే మొదలుపెట్టి అటకెక్కించారు. దానికోసం పార్లమెంటులో ఎప్పుడూ మాట్లాడిన పాపాన కూడా పోలేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీ సహకారంతో పోలవరం పనులను పరుగులు పెట్టిస్తున్నారు. రాయలసీమకు ప్రాణదాత అయిన హంద్రీనీవా సుజలస్రవంతి పథకాన్ని ఒక్క ఏడాదిలోనే దాదాపు రూ.1,600 ఖర్చు పెట్టి పూర్తి చేశారు' అని పేర్కొన్నారు. 'రాయలసీమలోని శ్రీసిటీ, హిందూపురం, కొప్పర్తి పారిశ్రామికవాడల్లో ఎలక్ట్రానిక్ వస్తువుల తయారీ పరిశ్రమలను ప్రోత్సహించాలి. అనంతపురంలో మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్‌ను అభివృద్ధి చేయాలి. దేశానికి హార్టీకల్చర్ హబ్‌గా అవతరిస్తున్న అనంతపురం జిల్లాలో ఆహారశుద్ధి పరిశ్రమలు ఏర్పాటు చేయాలి. వస్త్రపరిశ్రమను ప్రోత్సహించడానికి గుంతకల్లు పాత స్పిన్నింగ్ మిల్లు స్థలంలో టెక్స్‌టైల్ పార్క్ నెలకొల్పాలి. దేశవ్యాప్తంగా అభివృద్ధి చేయబోతున్న సాంస్కృతిక స్థలాల్లో గుత్తికోటను చేర్చాలి' అని లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

ఏపీకి పీఎంజీఎస్‌వై నిధులు పెంచండి

జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్



ఈనాడు, దిల్లీ: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నేతృత్వంలో గ్రామీణ రహదారుల అనుసంధానానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నందున పీఎంజీఎస్‌వై కింద కేంద్ర ప్రభుత్వం ఎక్కువ నిధులు కేటాయించాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ కోరారు. బుధవారం లోక్‌సభలో బడ్జెట్‌పై జరిగిన చర్చలో ఆయన జనసేన తరఫున ప్రసంగించారు. పీఎంజీఎస్‌వై కింద రాష్ట్రానికి 3,200 రోడ్లు, 77 వంతెనలను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిందని గుర్తుచేశారు. ఈ బడ్జెట్‌లో ఆ పథకానికి కేటాయించిన రూ.19వేల కోట్లలో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నిధులు ఇవ్వాలని కోరారు. ఐరోపా యూనియన్‌తో భారత ప్రభుత్వం చేసుకున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందంతో ఆహారం, సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు పెరుగుతాయని పేర్కొన్నారు. ముఖ్యంగా కాకినాడ లాంటి సాగర తీర నగరాలకు మేలు జరుగుతుందన్నారు. ఈ పరిస్థితుల్లో కాకినాడలో షిప్ బిల్డింగ్‌కు కేంద్రం చేయూతనివ్వాలని కోరారు.

26 మంది ఉపాధ్యాయులకు అంతర జిల్లా బదిలీలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 26మంది ఉపాధ్యాయుల అంతర జిల్లా బదిలీలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్పౌజ్ కోటాలో 22, పరస్పర అంగీకార విధానంలో మరో నలుగురికి అంతర జిల్లా బదిలీలు చేసింది. వీరిని అవసరాన్ని అనుసరించి కేటగిరి-3, 4 పాఠశాలల్లో నియమించాలని సూచించింది.

విద్యుత్ ముసాయిదా సవరణ బిల్లుపై నిరసన

ఈనాడు-అమరావతి: ముసాయిదా విద్యుత్ సవరణ బిల్లు, జాతీయ విద్యుత్ విధానం 2026 పేరిట కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సంస్కరణలను వ్యతిరేకిస్తూ గురువారం మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్లు రాష్ట్ర విద్యుత్ ఉద్యోగుల ఐకాస ఒక ప్రకటనలో తెలిపింది. అన్ని డిస్కంలు, ట్రాన్స్‌కో, సంస్థ ప్రధాన కార్యాలయాలు, జెన్‌కో థర్మల్ ప్లాంట్లలో పనిచేస్తున్న సిబ్బంది నిరసన కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించింది.

విద్యుత్తు ఉద్యోగుల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి

- మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడి
- విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంఘం డైరీ ఆవిష్కరణ



ఎమ్మెల్యే కూన రవికుమార్, ఉద్యోగులతో కలిసి ఏపీ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ ఆవిష్కరిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

ఈనాడు, అమరావతి: ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు. ఏపీ విద్యుత్తు బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డైరీ, క్యాలెండర్‌ను బుధవారం మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "ప్రజల్లో సంతృప్త స్థాయి పెంచేలా ఉద్యోగులు విధులు నిర్వహించాలి. ఉద్యోగులపై ఉన్న ఒత్తిడిని తగ్గించేందుకు ముఖ్యమంత్రి అనుమతితో త్వరలో పోస్టులు భర్తీ చేస్తాం. మెడికల్ ఇన్సూరెన్స్ పరిమితికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తాం. విద్యుత్తు ఉద్యోగుల డిమాండ్లలో 90 శాతానికి పైగా పరిష్కరించాం. గత వైకాపా ప్రభుత్వం ధ్వంసం చేసిన విద్యుత్తు వ్యవస్థను గాడిలో పెడుతున్నాం. తొలిసారిగా ట్రూడౌన్ చేసి.. విద్యుత్తు ఛార్జీలు తగ్గించాం. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న వనరుల ద్వారా పూర్తి స్థాయిలో విద్యుత్తు ఉత్పత్తి చేసేలా చర్యలు చేపట్టాం. దీనివల్ల బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విద్యుత్తు కొనుగోళ్లు తగ్గాయి" అని పేర్కొన్నారు. సీఎం ప్రవేశపెట్టిన విద్యుత్తు సంస్కరణలను దేశంలోని అనేక రాష్ట్రాలు ఇప్పుడు అమలు చేస్తున్నాయని ప్రభుత్వరంగ సంస్థల కమిటీ ఛైర్మన్, ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. తెదేపాతో బీసీ వర్గాలకు విడదీయరాని అనుబంధం ఉందని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఉద్యోగులు కీలక పాత్ర పోషిస్తున్నారని ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పోలాకి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

లులు కేసులో కౌంటర్ ఎందుకు వేయలేదు?

- రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు
- సిద్ధంగా ఉందన్న ఏజీ

ఈనాడు, అమరావతి: లులు షాపింగ్‌మాల్ సంస్థకు విశాఖలో భూకేటాయింపును సవాలు చేస్తూ దాఖలైన పిల్‌లో ప్రభుత్వం సకాలంలో కౌంటర్ వేయకపోవడాన్ని హైకోర్టు ఆక్షేపించింది. పిల్ దాఖలై ఏడాది కావస్తున్నా ఎందుకు కౌంటర్ వేయలేదని ప్రశ్నించింది. కౌంటర్ సిద్ధంగా ఉందని, ఒకటి రెండు రోజుల్లో దాఖలు చేస్తామని ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) ప్రణతి చెప్పడంతో విచారణను మార్చి 11కు వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. విశాఖ, విజయవాడలలో లులు సంస్థకు నామమాత్రపు ధరకు భూములు కేటాయించారని పేర్కొంటూ విశాఖకు చెందిన పాకా సత్యనారాయణ, మాజీమంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, విజయవాడకు చెందిన న్యాయవాది సీహెచ్ వెంకటేశ్వరరావు దాఖలు చేసిన పిల్స్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చాయి. పాకా సత్యనారాయణ తరఫు న్యాయవాది అశోక్‌రామ్ వాదనలు వినిపించారు. దురుద్దేశంతో లులు సంస్థకు భూములు కేటాయించారన్నారు. పలుమార్లు సమయం ఇచ్చినా ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయలేదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు.

భావితరాలకు స్ఫూర్తి దురై నిజాయతీ

ప్రధానికి ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు లేఖ



దురైతో వీడియోకాల్‌లో మాట్లాడుతున్న ఎంపీ అప్పలనాయుడు

చెన్నై (ఆర్కేనగర్), న్యూస్‌టుడే: తనకు దొరికిన 20 సవర్ల బంగారం, కిలో వెండి వస్తువులను నిజాయతీగా పోలీసులకు అందించిన తమిళనాడు తిరుప్పూర్‌కు చెందిన పారిశుద్ధ్య కార్మికుడు దురైని కేంద్ర ప్రభుత్వం గుర్తించాలని కోరుతూ విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు బుధవారం ప్రధాని మోదీకి లేఖ అందజేశారు. కుమారుడి శస్త్రచికిత్సకు డబ్బు అవసరమున్నా.. ఆ ఆభరణాల్ని ఆశించకుండా పోలీసులకు అప్పగించిన తీరుపై ఈనెల 9న 'పారిశుద్ధ్య కార్మికుడు.. నిజాయతీలో కుబేరుడు' శీర్షికన 'ఈనాడు' వార్త ప్రచురించింది. ఆ ప్రతిని లేఖకు జత చేస్తూ.. దురై సమాజానికి ఆదర్శమని ప్రధానికి తెలిపారు. ఆయన సేవల్ని కేంద్రం గుర్తించాలని కోరారు. కుటుంబీకులకు అవసరమైన వైద్య చికిత్స ప్రభుత్వం అందించి, ఆదుకోవాలని కోరారు. పార్లమెంటు సమావేశాల్లో ఉన్న అప్పలనాయుడు బుధవారం దురై కుటుంబీకులతో వీడియోకాల్‌లో మాట్లాడారు. త్వరలో కలుస్తానని వారికి తెలిపారు.

బీసీలకు చట్టసభల్లో 50% రిజర్వేషన్లు కల్పించాలి

వివిధ పార్టీల ఎంపీల డిమాండ్



సదస్సులో పాల్గొన్న ఎంపీలు ఆర్.కృష్ణయ్య, పాకా సత్యనారాయణ, బీద మస్తాన్‌రావు, ఇతర బీసీ సంఘాల ప్రతినిధులు

ఈనాడు, దిల్లీ: బీసీలకు చట్టసభల్లో 50% రిజర్వేషన్లు కల్పించాలని వివిధ పార్టీల ఓబీసీ ఎంపీలు డిమాండ్ చేశారు. బీసీ సమస్యలపై తెలుగు రాష్ట్రాల బీసీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం దిల్లీలోని ఆంధ్రప్రదేశ్-తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సదస్సులో భాజపా ఎంపీలు ఆర్.కృష్ణయ్య, పాకా సత్యనారాయణ, తెదేపా ఎంపీలు బీద మస్తాన్‌రావు, బస్తిపాటి నాగరాజు, అప్పలనాయుడులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. జనాభా ప్రాతిపదికన చట్టసభలు, స్థానిక సంస్థల్లో బీసీలకు 50% రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. ఉద్యోగాల్లో రిజర్వేషన్లను 27% నుంచి 56%కి పెంచడంతోపాటు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. విద్య, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లపై ఉన్న క్రీమీలేయర్ తొలగించాలని కోరారు. కేంద్రంలో బీసీల సంక్షేమం కోసం ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని అన్నారు. ఆంధ్రప్రదేశ్ బీసీ సంఘం అధ్యక్షుడు ఎన్.మారేష్, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గవ్వల భరత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలే తప్ప ప్రజాక్షేమం పట్టని వైకాపా

తెదేపా ఎంపీ కలిశెట్టి

ఈనాడు, దిల్లీ: రాష్ట్ర ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి ఆలోచించకుండా కేవలం రాజకీయాలు చేయడానికే వైకాపా పరిమితమైందని తెదేపా ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. బుధవారం ఆయన ఇక్కడ ఏపీభవన్‌లో విలేకర్లతో మాట్లాడారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా గవర్నర్ చేస్తున్న ప్రసంగం వినకుండా బయటికెళ్లిపోవడం జగన్‌మోహన్ రెడ్డి సంకుచిత మనస్తత్వానికి అద్దం పట్టిందన్నారు. వైకాపా హయాంలో అప్పులు చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన నాయకులు ఇప్పుడు కూటమి ప్రభుత్వం పేదలు, రైతుల సంక్షేమం కోసం తీసుకుంటున్న రుణాలపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. పార్లమెంటులో ఆ పార్టీ ఎంపీ అవినాష్‌రెడ్డి రాష్ట్ర అప్పులపై చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అబద్ధమన్నారు.

వైకాపా నేతల ఒత్తిడికి తలొగ్గి పోలీసులు అన్యాయం చేశారు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో తన ఇంట్లో చోరీకి గురైన బంగారం, వెండి ఆభరణాల్ని దొంగ నుంచి రికవరీ చేసిన పోలీసులు... అవి అప్పగించకుండా వేధిస్తున్నారని పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన పూర్ణచంద్రరావు వాపోయారు. వైకాపా ముఖ్యనాయకుల అనుచరుల ఒత్తిడితో వారిలా చేశారని మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి తెదేపా జాతీయ ఉపాధ్యక్షురాలు కావలి ప్రతిభా భారతి, ఏపీ కల్చరల్ కమిషన్ ఛైర్మన్ తేజస్వి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు.



ఏపీ నుంచి 116 కిసాన్ రైళ్ల ద్వారా 34వేల టన్నుల సరకు రవాణా

లోక్‌సభలో వెల్లడించిన కేంద్ర ప్రభుత్వం

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన కిసాన్ రైల్ ద్వారా ఆంధ్రప్రదేశ్ నుంచి 116 సర్వీసులతో 34వేల టన్నుల పంట ఉత్పత్తులను వివిధ రాష్ట్రాలకు రవాణా చేసినట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. బుధవారం లోక్‌సభలో తెదేపా ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. 2020 ఆగస్టు 7న కిసాన్ రైలు ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటి వరకూ 2,364 రైళ్ల ద్వారా 7.9 లక్షల టన్నుల పండ్లు, కూరగాయల రవాణా జరిగిందని చెప్పారు. దీనిద్వారా రూ.318.68 కోట్ల ఆదాయం వచ్చినట్లు వెల్లడించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అరటి, మామిడి, ఉల్లి తదితర ఉద్యానవన ఉత్పత్తులను అస్సాం, బిహార్, పశ్చిమబెంగాల్, దిల్లీ, త్రిపురలకు రవాణా చేసినట్లు చెప్పారు. రైతు సంఘాలు, సంబంధిత మంత్రిత్వశాఖలు, రాష్ట్ర ప్రభుత్వాలు, స్థానిక సంస్థలు, వ్యవసాయ మండీలతో సంప్రదించి కిసాన్ రైల్ సర్క్యూట్‌ను ఖరారు చేయనున్నట్లు వెల్లడించారు.

గుంటూరు-విజయవాడ మధ్య రైల్వే రద్దీ నియంత్రణకు 4లైన్లపై సర్వే

గుంటూరు-విజయవాడ మధ్య రైల్వే రద్దీ నియంత్రణకు కొత్తగా నాలుగు లైన్లకు సంబంధించి డీపీఆర్ తయారీకి సర్వే పనులు మంజూరు చేసినట్లు అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. తెదేపా ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు ఆయన సమాధానం ఇచ్చారు. ఇందులో బల్లార్షా-గూడూరు వయా విజయవాడ 4వలైన్ (745 కిమీ), విజయవాడ-ఏలూరు 3, 4వ లైను (120 కిమీ), గుడివాడ-తెనాలి బైపాసింగ్ విజయవాడ (49 కిమీ), నల్లపాడు రైల్ ఓవర్ రైల్ ఫ్లైఓవర్ (31 కిమీ) ప్రాజెక్టులు ఉన్నట్లు చెప్పారు. డీపీఆర్ తయారీ పూర్తయిన తర్వాత వివిధ భాగస్వామ్యపక్షాలతో సంప్రదించి ఈ లైన్లను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.

గ్రీన్ ఎనర్జీ కారిడార్ కింద ఏపీకి అయిదేళ్లలో రూ.361 కోట్లు మంజూరు

గ్రీన్ ఎనర్జీ కారిడార్ నిర్మాణం కోసం గత అయిదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.361 కోట్లు మంజూరుచేసినట్లు కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖ సహాయ మంత్రి శ్రీపాద యశోనాయక్ తెలిపారు. బుధవారం ఆయన లోక్‌సభలో తెదేపా సభ్యులు కేశినేని శివనాథ్, బీకే పార్థసారథి, అంబికా లక్ష్మీనారాయణలు అడిగిన ప్రశ్నకు ఈ మేరకు సమాధానం ఇచ్చారు. దీని కింద 1,073 కిలోమీటర్ల ట్రాన్స్‌మిషన్ లైన్లకు గాను 888 కిలోమీటర్లు పూర్తయినట్లు చెప్పారు. అలాగే 2,157 సబ్‌స్టేషన్లకు గాను 1,968 ఏర్పాటైనట్లు వెల్లడించారు.

నవోదయ విద్యాలయాల్లో 7,454 మంది విద్యార్థులు

ఆంధ్రప్రదేశ్‌లోని 15 ప్రాంతాల్లో నడుస్తున్న నవోదయ విద్యాలయాల్లో 7,454 మంది విద్యార్థులు చదువుకుంటున్నట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. ఇక్కడ టీచర్: విద్యార్థి నిష్పత్తి 1:17 నుంచి 1:19 వరకు ఉన్నట్లు చెప్పారు. రాజ్యసభలో తెదేపా సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు.

ఏపీకి మంజూరుచేసిన పీసీ కల్చర్ యూనిట్లలో 61% ఏర్పాటు

ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద ఆంధ్రప్రదేశ్‌కు గత అయిదేళ్లలో మొత్తం 2,038 పీసీ కల్చర్ యూనిట్లు మంజూరుచేయగా అందులో ఇప్పటివరకు 1,240 యూనిట్లు (61%)మాత్రమే ఏర్పాటైనట్లు కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ తెలిపారు. రాజ్యసభలో తెదేపా సభ్యుడు సానా సతీష్‌బాబు అడిగిన ప్రశ్నకు ఆయన ఈమేరకు సమాధానం ఇచ్చారు. ఈ యూనిట్ల కోసం మొత్తం రూ.50.49 కోట్ల నిధులు మంజూరుకాగా, అందులో రూ.17.19 కోట్లు (34%) మాత్రమే వినియోగమైనట్లు వెల్లడించారు. ఇప్పటివరకు ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన కింద ఆంధ్రప్రదేశ్‌కు కేంద్ర వాటా కింద రూ.482.55 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు.

5 ఏళ్లలో 800% పెరిగిన సైబర్ మోసాల ఫిర్యాదులు

సైబర్ మోసాల గణాంకాలు ఇలా..

సంవత్సరం	ఫిర్యాదుల సంఖ్య	మోసపోయిన మొత్తం రూ.కోట్లలో
2021	2,62,846	551
2022	6,94,446	2,290
2023	13,10,357	7,465
2024	19,18,835	22,848
2025	24,02,579	22,495

గత 5 ఏళ్లలో సైబర్ నేరాల ఫిర్యాదులు 800%, అందులో మోసపోయిన మొత్తం విలువ 3,982% మేర పెరిగాయి. 2021లో 2,62,846 ఫిర్యాదులు రాగా, 2025 నాటికి ఆ సంఖ్య 24,02,579కి చేరినట్లు కేంద్ర హోం శాఖ సహాయమంత్రి బండి సంజయ్ తెలిపారు. రాజ్యసభలో వైకాపా ఎంపీ గొల్ల బాబూరావు అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు. ఇందులో బాధితులు పోగొట్టుకున్న మొత్తం కూడా రూ.551 కోట్ల నుంచి రూ.22,495 కోట్లకు (3,982%) పెరిగినట్లు చెప్పారు.

ఐటీ స్పేస్ విస్తరణపై ఐ-స్ప్రౌట్ దృష్టి

ప్రకటనలో వెల్లడించిన సంస్థ

ఈనాడు, అమరావతి: ఐటీ, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలకు 25 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని అందిస్తున్నామని 'ఐ-స్ప్రౌట్' సంస్థ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. అందులో భాగంగా రాష్ట్రంలోనే 1.20 లక్షల చదరపు అడుగుల స్పేస్ కల్పించినట్లు పేర్కొంది. విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో స్పేస్ అవసరాలకు అనుగుణంగా కార్యకలాపాల విస్తరణ చర్యలు చేపట్టినట్లు వెల్లడించింది. 'ఏపీలోని 'ఐ-స్ప్రౌట్' కేంద్రాల్లో 25కు పైగా దిగ్గజ బహుళ జాతి కంపెనీలు కార్యకలాపాలు కొనసాగిస్తున్నాయి. గత ఏడాది 14 వేల సీట్ల సామర్థ్యం ఉండగా.. ఇప్పుడు అది 43 వేలకు చేరింది. కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా టైర్-1, 2 నగరాలకు కార్యకలాపాలను విస్తరించాం. ఇది రాష్ట్రంలో ఐటీ రంగం అభివృద్ధి, స్థానిక యువతకు ఉపాధి కల్పించడంలో దోహదపడుతుంది' అని ప్రకటించింది. రాబోయే రోజుల్లో గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల అవసరాలకు అనుగుణంగా అత్యాధునిక మౌలిక సదుపాయాలతో ఆఫీస్ స్పేస్ అందించడమే లక్ష్యమని సంస్థ స్ట్రాటజీ అధికారి శ్రీనివాస్ తెలిపారు. విజయవాడ, విశాఖపట్నం నగరాల్లో నైపుణ్యం కలిగిన మానవ వనరులు, తక్కువ నిర్వహణ వ్యయం ఉండటం కంపెనీలకు కలిసొచ్చే అంశమని ఐటీశాఖ కార్యదర్శి కాటమనేని భాస్కర్ పేర్కొన్నారు.

నిరాశాజనకంగా గవర్నర్ ప్రసంగం: సీపీఎం

ఈనాడు, అమరావతి: అసెంబ్లీలో ఉభయసభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం నిరాశాజనకంగా సాగిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. "కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, హక్కులు, రాష్ట్రానికి తలమానికంగా ఉన్న విశాఖ ఉక్కు గురించి ప్రస్తావనే లేదు. పోలవరం నిర్వాసితుల్ని గవర్నర్ పట్టించుకోలేదు. రాష్ట్రాల హక్కులను లాక్కొని సమాఖ్య రాజ్యాంగానికి తూట్లు పొడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాట్లాడకపోవడం దారుణం. 19నెలల్లో ప్రజలపై వేసిన అదనపు భారాలు, బలవంతపు భూసేకరణ, హామీల అమల్లో వైఫల్యాలు, నిరుద్యోగం గురించి ప్రస్తావన లేదు. కౌలు రైతుల, అన్నదాత సుఖీభవ గురించి మాట్లాడలేదు. రాజకీయ అవినీతి విచ్చలవిడిగా పెరిగింది" అని విమర్శించారు.

ఆ ఎస్సీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తింపు

ఈనాడు, అమరావతి: ప్రైవేటు విశ్వవిద్యాలయాల్లో 35% కన్వీనర్ కోటా కింద సీట్లు పొందిన ఎస్సీ విద్యార్థులకు 2024-25, 2025-26 విద్యా సంవత్సరాలకుగాను ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలను ప్రభుత్వం వర్తింపజేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

22న ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల మహాసభ

ఈనాడు, అమరావతి: ఏపీఎస్ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల 36వ రాష్ట్ర మహాసభ విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఈ నెల 22న నిర్వహించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి ఏవీ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సభకు హాజరుకావాలంటూ రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి బుధవారం ఆహ్వానపత్రం అందజేసినట్లు పేర్కొన్నారు.